maj Foundation Che

రామాయణ స్నేహము - చల్లా రాధాకృష్ణశర్మ

in. Gurukul Kangri

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామాయణ
స్వసాచ

చల్లా
రాధాకృష్ణశర్మ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

8272

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామాయణ వ్యాసాలు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామాయణ వ్యాసాలు

(సమీక్షా వ్యాస సంకలనం)

DONATION
8272
पुस्तकालय
गुरुकुल कांगड़ी विश्वविद्यालय

రచన
చల్లా రాధాకృష్ణ శర్మ

లక్ష్మీ నారాయణ గ్రంథమాల
మధుర - 625020

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

Ramayana Vyasalu
(A collection of 22 Essays on the Ramayana) by
Prof. Challa Radhakrishna Sarma

© C. Suseela
First Edition : 1992

ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4-1-435, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాదు 500 001
విశాలాంధ్ర బుక్ హౌస్
హన్మకొండ, విజయవాడ, హైదరాబాదు,
విశాఖపట్టణం, కాకినాడ, గుంటూరు,
తిరుపతి, అనంతపురం

Price : Rs. 35/-

VPH SOLE

Laser Typesetting by:
Gee Bee Graphics
40/3 Mint Subbarayalu Naidu st,
Madras - 600 021.
Call: 555542
Printing by:
Weldun Press
No 2, Ist st., Dr. Radhakrishna Nagar,
Madras - 600 021
Call: 551658

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యావత్ స్థాస్యంతి గిరయః
సరితశ్చ మహీతలే
తావద్రామాయణ కథా
లోకేషు ప్రచరిష్యతి

— వాల్మీకి

భువని కెయ్యది సేవ్యమై పరగె, వనధి
తనయ నిదుపేళ దేని క్షాళనము చేసె,
గంగ కెయ్యది జనకమై క్రాలె, నట్టి
రామపదపంకజమ్ము తారకము నాకు.

— చల్లా లక్ష్మీనారాయణ శాస్త్రి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కృతజ్ఞతాంజలి

ఈ సమీక్షా వ్యాస సంకలనం
వెలుగు చూడడానికి కారణం
తిరుమల తిరుపతి దేవస్థానం
ఉదారంగా చేసిన ఆర్థిక సహాయం
వారి సహాయం చిరస్మరణీయం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మనవి మాటలు

కట్టె, కొట్టె, తెచ్చె - అని ముక్తసరిగా మూడు ముక్కలలో రామ కథను చెప్పవచ్చు. రామకథా సాహిత్యాన్ని మాత్రం అలా చెప్పలేము. ఒక్క భారతదేశంలోనే కాదు, ఆగ్నేయాసియాదేశా లన్నిటిలోనూ ప్రచారంలో ఉన్న రసవత్కథ రామకథ! వివిధ సాహిత్య ప్రక్రియలలోనే కాక విభిన్న కళారూపాలలోనూ పెరిగి పెద్దదైన కథ రామకథ. అలాంటి రామకథా సాహిత్యాన్ని స్థూలారుంధతీ న్యాయంగా నైనా తెలుసుకోడానికి ఈ పుస్తకంలోని 22 సమీక్షా వ్యాసాలు తోడ్పడగలవని నా నమ్మకం.

తెలుగు, తమిళం, ఆంగ్లం మొదలైన భాషలలో వెలువడిన రామకథా సంబంధి రచనలు ప్రధానమైన వాటిని, ప్రసిద్ధ పత్రికలలో వచ్చిన వ్యాసాలను సంప్రదించాను. కేంద్రసాహిత్య అకాదెమీ ప్రకటించిన సాహిత్య చరిత్రలు పరిశీలించాను. ఆయా గ్రంథకర్తలకూ రచయితలకూ నేను సర్వదా కృతజ్ఞుణ్ణి. నా దృష్టికి రాని రామకథా సంబంధి రచనలు ఎన్నో! అయినా నా కృషిని సహృదయులు మన్నించగలరు. సూచిని చేర్చలేక పోయినందుకు విచారిస్తున్నాను.

బహూకార్య నిమగ్నులైనా, ముద్దులు మూటగట్టే ముఖపత్రం రచించి యిచ్చిన శ్రీ బాపు గారి సహృదయతను సౌజన్యాన్ని ఎంతని కొనియాడను! ఆయన జగ మెరిగిన చిత్రకారులు!

సర్వాంగ సుందరంగా ఈ వ్యాస సంకలనాన్ని ముద్రించిన జీ. బీ. గ్రాఫిక్స్, వెల్డన్ ప్రెస్ అధిపతులకు కృతజ్ఞుణ్ణి.

—చల్లా రాధాకృష్ణ శర్మ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విషయ సూచిక

1. భారతీయ సాహిత్యంలో రామాయణం ... 1
2. సంస్కృతం ... 16
3. అస్సామీ ... 20
4. ఆంగ్లం ... 27
5. ఉర్దూ ... 34
6. ఒడి(రి)యా ... 37
7. కన్నడం ... 43
8. కాశ్మీరీ ... 49
9. గుజరాతీ ... 55
10. డోగ్రీ ... 62
11. తమిళం ... 65
12. తెలుగు ... 79
13. పంజాబీ ... 90
14. బెంగాలీ ... 93
15. మలయాళం ... 101
16. మరాఠీ ... 111
17. మైథిలి ... 118
18. రాజస్థానీ ... 122
19. హిందీ ... 129
20. సౌరాష్ట్రం ... 136
21. విదేశాలలో రామకథ ... 141
22. అవీ - ఇవీ ... 158

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

1
భారతీయ సాహిత్యంలో రామాయణం

భారతీయ సాహిత్య సుందరోద్యానంలో వికసించిన రెండు ప్రసూనాలు రామాయణ మహాభారతాలు. మొదటిది వేద సమం ; రెండవది పంచమ వేదం. 'ఈ గ్రంథద్వయం భారతదేశం' అని సుప్రసిద్ధ విద్వాంసులు సునీతికుమార్ చటర్జీగారి అభిప్రాయం. రామాయణ భారతాలను విస్మరించిన నాడు ఇండియా ఇండియాగా ఉండదని నెహ్రూ పండితుని అమూల్యాభిప్రాయం. ఇది సత్య సన్నిహితం. నిజానికి బహూ ప్రాచీనకాలం నుంచీ ఇవి భారతీయుల్ని అలరిస్తూనే ఉన్నాయి. కాలక్రమాన వివిధ దేశాలలోని రసహృదయుల్ని ఆకర్షిస్తూ, వారి మన్ననలు పొందుతున్నాయి. కాలదోషం పట్టని కమనీయ రచనలు అవి!

రామకథ అనగానే వాల్మీకి ప్రసాదించిన రామాయణం మనఃఫలకాన ద్యోతించడం పరిపాటి. ఆ ఆదికావ్యం ఎప్పుడు వెలుగు చూసిందో స్పష్టంగా తెలియరావడంలేదు కాని, చరిత్రకు తెలియవచ్చినప్పటినుంచీ ఆ కావ్యం మనదేశంలో వెలసిన సాహిత్యాన్ని వివిధ కళల్నీ, చివరికి మన ఆలోచనా ధోరణుల్నీ ప్రభావితం చేస్తూనే ఉన్నది. నేటికీ రామకథాసంబంధి రచనలు పరశ్శతంగా వెలువడుతున్నాయి. వీటిలో కొన్ని విమర్శనాత్మకాలు. ఏది ఎలా వున్నా, ఇలా ఒక కావ్యం బహూ ప్రాచీన కాలం నుంచి ఒక జాతిని ప్రభావితం చెయ్యడమన్నది విశ్వ సాహిత్య చరిత్రలోనే ఒక అపూర్వాంశం. అందువల్ల వాల్మీకాన్ని సజీవ రచన అనడం అతిశయోక్తి కాదు. రైట్ ఆనరబుల్ వి. యస్. శ్రీనివాస శాస్త్రిగారి దృష్టిలో రామాయణం మానవజాతికి చెందిన దస్తావేజు. వివిధ వ్యక్తుల మధ్యగల సంబంధాలను తెలియజేసే ఒక పత్రం.

రామాయణం పండిత లోకాన్నే కాదు, పామరుల్ని సైతం బహుధా ఆకర్షించింది. రామకథా సంబంధి లోకోక్తులు, జానపద గేయాలు మొద

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లైనవాటిని అలవోకగా పరిశీలించినా ఈ విషయం వ్యక్త మవుతుంది. శిష్ట సాహిత్యంలోవలె జానపద వాఙ్మయంలోనూ రామకథాసంబంధి రచనలు బహుళంగా వెలువడినట్లు పేర్కొనవచ్చు.

రామకథ పండిత పామరుల్ని సరిసమానంగా ఆకట్టుకున్నట్లే, వివిధ మతానుయాయుల్ని కూడా ఆకట్టుకుని మతపరమైన ప్రచారం కూడా గడించింది. విష్ణువు అవతారంగా భావించి హిందువులు రాముణ్ణి ఆరాధిస్తే, బౌద్ధులు బోధిసత్త్వుడని వ్యవహరించి ఆదరించారు. బలదేవుడని జైనులు ప్రస్తుతించారు. అలాగే సీతను హిందువులు జనక మహారాజు పెంపుడు కూతురుగా భావించగా, బౌద్ధులు దశరథుని తనయగా భావించారు. జైనుల రామకథలో మార్పులు కానవచ్చినా, జైన రామాయణానికి వాల్మీకమే ఆధారమని విద్వల్లోకం విశ్వసిస్తున్నది. దశరథ జాతకంలోని రామకథయే వాల్మీకికి మాతృక అని పేర్కొన్నవారూ కొందరు లేకపోలేదు.

జైన బౌద్ధులే కాదు, భాస కాళిదాస భవభూతులు సైతం రామకథకు రూపాంతరాలు సంతరించారు. అధ్యాత్మ, అద్భుతాది సంస్కృత రామాయణాలలోనూ రూపభేదం కానవస్తున్నది. రామ కథలో ఇలా భేదాలు ఒక్క సంస్కృత సాహిత్యంలోనే కాదు, వివిధ దేశ భాషా రామాయణాలలోనూ కనిపిస్తున్నాయి. అయినప్పటికీ రామ కథ అనగానే వాల్మీకి చెప్పిందే ప్రామాణికమైనదనే ప్రశస్తి లభించింది. అదీకాక మన పూర్వకవులు చేసిన మార్పులూ చేర్పులూ వాల్మీకి చెప్పిన కథను ఇంకా రమణీయంగా తీర్చిదిద్దాలన్న సదుద్దేశంతో చేసినవని చెప్పవచ్చు.

రామాయణ కవులందరికీ వాల్మీకి పట్ల ఆదరాభిమానములు ప్రగాఢంగా ఉన్నాయి. ఇతర సంస్కృత రామాయణ కవులూ కావ్యనిర్మాతలూ ఆ మహర్షిని ప్రస్తుతించారు. దేశభాషా కవులలో కూడా కొందరు ప్రశంసించారు. ఇక రామాయణ కవులైతే వేనోళ్ళ కీర్తించారు. దేశభాషలలో తొలి రామాయణ కవి అయిన కంబన్ వాల్మీకిని బహుధా ప్రశంసించాడు. దేవభాషలో వసిష్ఠుడు, బోధాయనుడు, వాల్మీకి ప్రభృతులు రామకథను రచించినా, తాను వాల్మీకి కృతినే అనుసరిస్తున్నాననీ, వాల్మీకం ప్రచారంలో ఉండగా తనవంటివాడు రామాయణ రచనకు పూనుకోవడం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పాలకడలిని తాగివేయాలన్న పిల్లి ఆశ వంటిదే అని ఆ కవి చక్రవర్తి పేర్కొనడం గమనించదగిన అంశం; ఆయన వినయభూషణుడు !

భారతీయ సాహిత్యంలో ఆదికావ్యమనే పేరు గడించిన కావ్యరాజం రామాయణం. అది ఆ కావ్యానికి లభించిన ప్రత్యేక గౌరవం. రామాయణ సంహిత అని కూడా మన పెద్దలు వ్యవహరిస్తారు. వేదాలలోని పూర్వభాగాలకు సంహితలని పేరు. కనుకనే కాబోలు రామాయణం వేదసమం అయింది. వివిధ వాఙ్మయ ప్రక్రియలలోనూ అది స్థానం సంపాదించింది. అంతేకాక శిల్పం, చిత్రలేఖనం, వర్ణచిత్రం, సంగీతం, నాట్యం మొదలైన కళారూపములలో కూడా ప్రాముఖ్యం వహించింది. రామాయణానికి లభించిన మరొక విశిష్ట గౌరవ మది! రామ కథాగత సన్నివేశాలను ఎందరో శిల్పాచార్యులు కమనీయ కళాఖండాలుగా మలిచారు. అలాగే రామకథను వాగ్గేయకారులు ఎంద రెందరో తమ కీర్తనలలో నిబద్ధం చేశారు. రామకథాగానం చేసిన వాగ్గేయకారులలో త్యాగరాజు సర్వోన్నతుడు. ఆయనలా రామకథా సంబంధి కీర్తనలు అన్ని వెలయించినవారు మరొకరు లేకపోవడం తెలుగు భాష చేసుకున్న భాగ్యవిశేషం. రమారమి 600 కీర్తనలలో ఆయన రామ కథను అభివర్ణించాడు. సాహిత్యంలో రామకథ ప్రవృద్ధమైన తీరుని పరిశీలించేందుకు ముందు శిల్ప, చిత్రలేఖనాలలో అది తిష్ఠ వేసిన వైనం పరికిద్దాము.

దశరథ జాతకం ప్రకారం, రామలక్ష్మణ సోదరులు, వారి సోదరి సీత బౌద్ధ భిక్షువులై జీవిస్తున్నట్లు బౌద్ధ శిల్పాలలో కనిపిస్తున్నది. నాగార్జునకొండ శిల్పాలలో కూడా ఇలాంటి శిల్పం ఉంది. 6వ శతాబ్దిలో విష్ణుకుండినుల కాలంలో విజయవాడలోని మొగ్గలాజపురం గుహలోని శిల్పంలో హనుమంతుడు సీతను కలుసుకున్న దృశ్యం గోచరిస్తుంది. 9వ శతాబ్దిలో చోళులు పరిపాలించే రోజుల్లో కుంభకోణంలోని నాగేశ్వ రాలయంలో రామకథ పుత్రకామేష్టి మొదలుకొని యుద్ధకాండ వరకు శిల్పాలలో కనుల పండువు చేస్తుంది. రావణుడు కైలాస పర్వతాన్ని పైకెత్తే దృశ్యం పల్లవుల ఆలయంలో శిల్పంగా మలచబడింది. మామల్లపురంలో ఆదివరాహగుహలో పల్లవ గ్రంథాక్షరాలలో (8 వ శతాబ్ది) ఒక శాసనంలో ఈ క్రింది శ్లోకం కనిపిస్తుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహశ్చ వామనః
రామో రామశ్చ రామశ్చ బుద్ధః కల్కి దశస్మృతాః.

విజయనగరాధీశ్వరుల కాలంలో రామ కథకు ఎక్కడలేని ప్రచారం లభించింది. తమిళనాడులో దక్షిణార్కాడు జిల్లాలోని చెంగంలో అర్జున సారధి ఆలయంలో వర్ణచిత్రాలలో రామకథ అంతా చిత్రించబడింది. వాల్మీకంలోగాని, కంబరామాయణంలోగాని కనిపించని రావణుని పాతాళ హోమ వృత్తాంతం ఈ చిత్రాలలో కనిపిస్తుంది. కొన్ని చిత్రాల శీర్షికలు తెలుగులో ఉన్నాయి. చిత్రకథనం ఎలా సాగింటంటే : రాముడితో యుద్ధం చెయ్యలేక రావణుడు పాతాళహోమం చేస్తాడు. అంగదుడు అందుకు అంతరాయం కలిగిస్తాడు. హనుమంతుడు మందోదరిని కొడ తాడు. అంగదు డామెను రావణుని సమక్షానికి ఈడ్చి తెస్తాడు. అలా హోమానికి అంతరాయం కలగడంతో రావణుడు అంగదుడితో యుద్ధం చేస్తాడు. ఈ వృత్తాంతం ప్రాచీన సంస్కృత నాటకం కృత్యారావణలో ఉన్నట్లు అభిజ్ఞులు చెబుతారు. ఈ వృత్తాంతాన్ని ఆ చిత్రకారులు రంగ నాథ రామాయణం పురస్కరించుకొని చిత్రించి ఉండవచ్చు. చిత్రకారులు తెలుగువారై ఉండవచ్చు కూడా. అయితే హనుమంతుడు మందోదరిని కొట్టినట్లు లేదు, రంగనాథ రామాయణంలో. రావణుడు సీతాపహరణం చేసినందుకుగాను, మందోదరిని అలా పరాభవం చేసినట్లుగా తరువాతి వారెవరో పేర్కొని వుండవచ్చు.

శ్రీ విల్లిపుత్తూరులోని ఆండాళ్ ఆలయం లోకప్పులో రామాయణ వర్ణచిత్రా లున్నాయి. కాని వాటిని సరిగా సంరక్షిస్తున్నట్లు తోచదు. పుదుక్కోటకు (కొత్తకోట అని మధుర తెలుగువారి వ్యవహారం) సమీపం లోని గోకర్ణేశ్వరాలయంలోని లోకప్పులో రామాయణ వర్ణచి త్రాలు కనుల పండువు చేస్తాయి. ఇది శివాలయం. చిత్రాల శీర్షికలు తెలుగులో ఉండడం గమనించదగిన విషయం. కొన్నిటికి తమిళ సేత కనిపిస్తుంది.

మధుర నేలిన తెలుగు నాయక రాజుల కాలంలో రామకథ బాగా వ్యాప్తిలోకి వచ్చింది. 15 వ శతాబ్ది దాకా దక్షిణాపథంలో రామాలయం ఎక్కడా వెలసినట్లు కనిపించదు. నాయక రాజుల కాలంలో హనుమం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తుని గుళ్ళు కొన్ని మధురలో వెలిశాయి. మధురకు దగ్గరలో ఉన్న అళగర్ కోయిల్ ఆలయంలో రామాయణ వర్ణచిత్రాలు ఉన్నాయి. అవి చూడ చక్కనివి. విద్యాభ్యాసానికి ముందు, వసిష్ఠుడు రాముని చేత 'శ్రీరామ జయం' అని వ్రాయించినట్లు ఒక వర్ణచిత్రం. తెప్పమీద కూర్చున్న సీతను రామలక్ష్మణులు తెప్పను నడుపుతూ యమునానదిని దాటినట్లుగా మరొక చిత్రం. ఈ చిత్రాల శీర్షికలు తమిళంలో ఉన్నా, రాముడు, రామరు అవర్‌గళు అని చిత్రకారులు అక్కడక్కడా ప్రయోగించారు. బహుశః వారు తెలుగు భాషాభిజ్ఞులై ఉండవచ్చు. మధురలోని కూడల్ అళగర్ ఆలయంలో కూడా రామాయణ శిల్పాలు కొన్ని కనిపిస్తాయి. వెయ్యి కాళ్ళ మండపాలలో రాముడు సుగ్రీవుణ్ణి, హనుమంతుణ్ణి కౌగిలించుకున్నట్లుగా ఉన్న శిల్పాలు కళ్ళకి విందు చేస్తాయి. వాటిద్వారా రాముని ప్రేమైక దృష్టినీ, సౌభ్రాతృ భావాన్ని శిల్పులు వ్యక్తం చేశారు.

విజయనగర రాజుల కాలంలో సీతారామ హనుమల చిత్రాలుగల రామ టంకాలు వాడుకలోకి వచ్చాయి. మహారాష్ట్ర నృపతుల కాలంలో రామ పట్టాభిషేక వర్ణచిత్రాలు వ్యాప్తిలోకి వచ్చాయి. వీటన్నిటినీ సునిశితంగా పరిశీలిస్తే, వాల్మీకి చెప్పని విషయాలు కొన్ని తెలియవస్తాయి. అవి స్థానికుల వాడుకలోనివి కావచ్చు. లేదా స్థానికుల ఆచార వ్యవహారాలకు అనుగుణంగా అవి రూపు దాల్చి ఉండవచ్చు.

కుంభకోణంలోని కోదండరామస్వామి ఆలయంలో రామకథను పూర్తిగా మనోహరములైన వర్ణచిత్రాలలో చిత్రించిన విషయాన్ని పేర్కొనక తప్పదు. ఈ చిత్రాల రంగులు అక్కడక్కడ ప్రస్తుతం మాసిపోయినా, ఇంకా ముద్దులు మూట గడుతూ కనిపించడం గమనించవలసిన అంశం. వీటిని పూర్వస్థితికి తీసుకురావడానికి కొన్ని లక్షలు పడుతుందని ఆలయాధికారుల అంచనా.

వాల్మీకం బహు ప్రాచీనమైనదైనా, 12వ శతాబ్దినుంచీ ఆ కావ్యం భారతీయ భాషాకవుల్ని బాగా ఆకర్షించినట్లు పేర్కొనవచ్చు. మనదేశ భాషలలో ఓం ప్రథమంగా వెలువడిన రామాయణం తమిళంలో కంబ మహాకవి రచించిన రామావతారం అనే నామాంతరం గల రామాయణం. ఆయన 12వ శతాబ్దివాడని కొందరూ, 9 వ శతాబ్దివాడని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మరికొందరూ భావిస్తున్నారు. కంబనికి ముందే తమిళంలో రామాయణ రచన జరిగిందనీ, అతి ప్రాచీనమైన సంగయుగంలోనే రామాయణ కథలు తమిళనాడులో ప్రచారంలో ఉండేవనీ పండితులు విశ్వసిస్తున్నారు. ఆ తర్వాత 13వ శతాబ్దిలో అభినవ పంప బిరుదాంకితుడైన నాగచంద్రుని రామచరిత్ర పురాణం కన్నడంలో వెలిసింది. ఇది జైన రామాయణం. 16వ శతాబ్దిలో వాల్మీకం అనుసరించి కుమారవాల్మీకి బిరుదాంకితుడైన నరహరి తొరవె రామాయణం రచించాడు. కాని అంతకుముందే కన్నడంలో రామాయణాలు చాలా వెలువడినట్లు భావిస్తున్నారు. 15 వ శతాబ్దివాడైన కుమారవ్యాసుడు 'తిణికిదను ఫణిరాయ రామాయణ కవిగళ భారదలి' అని పేర్కొన్నాడు. రామాయణ కవుల భారం మోయలేక ఆదిశేషుడు సతమతమై పోతున్నాడని యిందులోని భావం. 13 వ శతాబ్దిలో వెలుగు చూసిన రంగనాథ, భాస్కర రామాయణాలు తెలుగులో వెలసిన తొలి రామాయణాలు. ఆతర్వాత మొల్ల, కట్టా వరదరాజు ప్రభృతులు రామాయణ కవులుగా విఖ్యాతు లయ్యారు. మలయాళంలో కూడా 13 వ శతాబ్దిలో రామచరితం అనే ఒక రామాయణం వెలువడింది. కాని 16వ శతాబ్దివాడైన ఎళుత్తచ్చన్ రచించిన అధ్యాత్మ రామాయణానికి లభించినంత ప్రచారం ఇతర అధ్యాత్మరామాయణాలకే కాదు, ఆయన భారతానికి కూడా లభించలేదు. కణ్ణశ్శ రామాయణం, రామకథా పాట్టు మొదలైనవి యితర రామాయణాలు.

ఇక ఉత్తరాది భాషలలో వెలువడిన రామాయణాలలో మాధవ కందలి 14వ శతాబ్దిలో అస్సామీలో వ్రాసిన రామాయణమే ప్రాచీన మైనది. 15వ శతాబ్దిలో సరళదాసు ఒరియాలో రామాయణం వెలయించాడు. 15వ శతాబ్దిలో బెంగాలీలో కృత్తివాస ఓఝు, 16వ శతాబ్దిలో మరాఠీలో ఏకనాథ్, హిందీలో తులసీదాసు ప్రభృతులు రామాయణాలు సంతరించారు. రామకథా వాఙ్మయాన్నే కాక తమ రామాయణాల ద్వారా వారు తమ భాషా సాహిత్యాలనే సుసంపన్నం చేశారు. ఇంకా చాలామంది రామాయణ కవులున్నారు. బెంగాలీలో పధ్నాలుగు మంది రామకథను కావ్యరూపంలో తీర్చి దిద్దినట్లుగా తెలియవస్తున్నది. అధ్యాత్మ రామాయణానువాదాలు వివిధ భాషలలోనూ ఎన్నో వెలువడినట్లు చెప్పవచ్చు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పైన పేర్కొన్న రామాయణాలు ఆయా భాషలలో సుప్రసిద్ధ రచనలు. తమిళంలో కంబ రామాయణానికీ, కన్నడంలో తొరవె రామాయణానికీ, హిందీలో తులసీదాసు రామచరిత మానస్‌కీ, తెలుగులో రంగనాథ భాస్కర రామాయణాలకీ ప్రచుర ప్రచారం కలదని పేర్కొనడం సత్యసన్నిహితం. ఆధునికులు చాలామంది తమతమ భాషలలో రామాయణాన్ని పూర్తిగానో లేక రామకథాత్మకములైన రచనలో వెలయించి ప్రసిద్ధి కెక్కిన విషయం సర్వవిదితం. తెలుగులో విశ్వనాథ సత్యనారాయణగారి రామాయణ కల్పవృక్షం, కన్నడంలో కు. వెం. పు. గా ప్రసిద్ధులైన కె. వి. పుట్టప్పగారి రామాయణ దర్శనం పేర్కొనదగినవి. ఈ మహాకావ్యద్వయానికి భారతీయ జ్ఞానపీఠం వారి బహుమతి లభించడం కూడా పేర్కొనదగిన అంశమే.

ఇక ఈ వివిధ రామాయణాలను స్థూలంగా పరిశీలిద్దాము.

కొన్ని భాషలలో వెలసిన రామాయణాలు మూలంలా బృహద్రచనలు. కంబరామాయణం 10, 569 పద్యాల కమనీయ కావ్యం. కృత్తివాసుని రామాయణం 17,670 పద్యాల బృహద్గ్రంథం. అలాగే కట్టా వరదరాజు ద్విపద రామాయణంలో 46, 340 పాదాలు. రంగనాథ రామాయణం 17,290 ద్విపదల గ్రంథం. కేవలం రామకథా కావ్యాలుగానే కాక ప్రశస్త రచనలుగా కూడా ఇవి సాహిత్యోపాసకుల ఆదరానికీ అభిమానానికీ పాత్రమైనాయి. తులసీదాసు రచనకు గల ప్రజాదరణ నిరుపమానం. నేటికీ అది ప్రచుర ప్రచారంలో ఉన్నది. 1965 లో ముద్రితమైన యునెస్కోవారి బులెటిన్ ఇలా పేర్కొన్నది. 'రామచరితమానస్ కృతికర్త అయిన గోస్వామి తులసీదాస్ అతి ప్రసిద్ధుడైన రచయిత. తమకు అభిమాన పాత్రమైన పుస్తకం పేరు సూచించమనగా, చాలామంది (హిందీ పాఠకులు) రామచరిత మానస్‌నే సూచించారు.'

వాల్మీకి అంటే వల్లమాలిన ఆదరభావ మున్నా, రామాయణ కవులు పలువురు తమ రచనలలో అవాల్మీక విషయాలు చాలా చేర్చారు. వాల్మీకి చిత్రించిన రాముడు ప్రధానంగా పురుషోత్తముడు; ఆదర్శ మానవుడు. కాని దేశభాషా కవులు రామకథను రచించే నాటికి రాముడు విష్ణుమూర్తి అవతారమని భావించసాగారు. కాగా ప్రజల విశ్వాసానికి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనుగుణంగా రాముడు ధేవుడని కవులు అభివర్ణించారు. అలాగే వారు తమతమ ఆచార వ్యవహారాలను కూడా రామకథలో చొప్పించారు. రాముని పట్టాభిషేక సందర్భంగా జరిగిన విందుని పురస్కరించుకొని రంగనాథ రామాయణ కర్త పచ్చళ్ళు, ఊరుగాయలు మొదలైన తెలుగు వారి వంటవార్పులకు ప్రాధాన్య మిచ్చాడు. కంబకవి అయోధ్యా నగర వర్ణన కావేరీ తీరపు పట్టణాన్ని స్ఫురణకు తెస్తుంది. పట్టాభిషేకం అభి వర్ణిస్తూ, కంబకవి ఒక మార్పు చేశాడు. వసిష్ఠుడు, జాబాలి ప్రభృతుల ఆధ్వర్యవంలో రామపట్టాభిషేకం జరిగినట్లు గోన బుద్ధారెడ్డి మొదలైన వారు చెప్పగా, శడయప్ప మొదలి పూర్వులు సమర్పించిన కిరీటాన్ని వసిష్ఠుడు రాముని శిరమున ఉంచినట్లు తమిళకవి పేర్కొన్నాడు. శడ యప్ప మొదలి కంబకవిని ఎంతగానో ఆదరించిన సహృదయుడు.

వాల్మీకిపట్ల ఎనలేని గౌరవభావమున్నా, రామాయణ కవులు తమ ప్రాంతాలలోనో, జానపదుల వ్యవహారంలోనో నిలిచిపోయిన కథలను రామక థలో చొప్పించి, ఆ విధంగా ప్రజాభిప్రాయాన్ని మన్నించినారని పేర్కొన వచ్చు. కాని ప్రధాన కథాంశములను మాత్రం వాల్మీకి వివరించినట్లుగానే తెలియజేయడం కథపట్ల, ఆ కవి పట్ల వారికి గల ఆదరభావాన్ని స్పష్టం చేస్తున్నది.

ఇక అవాల్మీకాంశాల విషయం. రామాయణ కవులందరూ కొద్దిగానో, గొప్పగానో కొత్త విషయాలు చేర్చినవారే. అస్సామీ రామాయణకర్త మాధవకందలి మహాకవిగా భావించబడుతున్నాడు. తరువాతి అస్సామీ కవులకు ఆయన మార్గదర్శకుడు. రాముడిలో ఆయన దివ్యత్వం ఆపా దించలేదు. అస్సామీల ఉపయోగంకోసం తాను రామాయణం వెలయించి నట్లు ఆయన పేర్కొన్నాడు. కనుక ప్రజాభిరుచుల్ని కొంతవరకు ఆయన తన రచనలో చొప్పించడం సమంజసమే. కాని ఉత్తమాభిరుచిని వ్యక్తం చెయ్యని కుంజి (మంథర) కథను చేర్చడం అంత సమంజసంగా లేదని తద్భాషా పండితుల అభిప్రాయం. కుంజి కురూపి. దానికి తోడు గూని; వృద్ధ. ఆమె భరతుణ్ణి కామించిందని చెప్పడం, కామోద్రేకంలో అసభ్యంగా ప్రవర్తించిందనడం సరసంగా లేవు.

కంబకవి, గోన బుద్ధారెడ్డి ప్రభృతులు కూడా అవాల్మీకాంశాలు చేర్చిన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వారే. కాని వారి మార్పులు కథా గౌరవాన్ని ఇనుమడింప జేస్తున్నాయి. అందువల్ల ఆ మార్పులు సహృదయ రంజకంగా కనిపించడంలో వింత లేదు. ఉదాహరణకి తార పాత్రచిత్రణని పరిశీలిద్దాము.

వాలి మరణానంతరం తార సుగ్రీవుని వలపు నేస్తమైనట్లు వాల్మీకం, ఇతర రామాయణాలు చెపుతున్నాయి. కాని కంబకవి అభివర్ణించిన తార వితంతువుగానే ఉండిపోయి తన పతిభక్తిని నిరూపించుకుంది. వాలి మరణానంతరం, ఆమె మాంగల్య చిహ్నాల నన్నింటిని విసర్జించింది. శ్వేత వస్త్రధారిణిగా దర్శన మిస్తుంది. ఆమెను చూడగానే లక్ష్మణుడు, అయోధ్యా నగరంలో ఆమెలా ఉన్న తన తల్లుల్ని స్ఫురణకు తెచ్చుకుంటాడు. తార పంచకన్యలలో ఒకతె. కనుక భర్త్రృ మరణానంతరం ఆమెను అలా విరక్త మనస్కగా చిత్రించడం సముచితమని తోస్తుంది. కల్పనలు మొదలైన వాటిలో కవి స్వాతంత్ర్యం వహించవచ్చును గాని, కథాంశములను మార్చటం అసమంజసమని కొందరి అభిప్రాయం.

ఇక రంగనాథ రామాయణంలో చెప్పబడిన ఉడుతకథ అవాల్మీకమే. అయితే యేం? ఆ కథ ద్వారా రామాయణ సందేశాన్ని బుద్ధారెడ్డి అందించి నట్లుగా భావించవచ్చు. సముద్ర జలాలలో మునిగి, తర్వాత ఇసుకలో పొర్లాడి, ఒంటికి అంటుకున్న ఆ యిసుకను కొండల సందున రాల్చి ఆ విధంగా రాముడికి సహాయపడుతున్న ఉడుత రాముని దృష్టిని ఆకర్షించింది. అప్పుడు రాముడు ఆ దృశ్యం చూడమని లక్ష్మణుని కోరుతాడు. ఆ ఉడుతను చూసి మెచ్చుకుంటూ రామానుజుడు అంటాడు గదా :-

"………. కమలాప్తవంశ్య!

కనుగొంటి భవదంఘ్రి కమలముల్ భక్తి
నెవ్వడు మది నిల్పి యొనగఁ దృణంబు
నవ్వేల్పుగిరిఁ బోలు ననిన గాకున్నె?
కావున భక్తియే కారణం బనఘ!"

లక్ష్మణుని యీ మాటలు రామునికి తృప్తి నిచ్చాయి.

రామాయణం శరణాగతి శాస్త్రమని లోక వ్యవహారం. ఇది నిజమే.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అయినా, ఉడుత కథను పురస్కరించుకుని చూస్తే, రంగనాథ రామాయణకర్త రామాయణాన్ని ఒక భక్తికావ్యంగా కూడా భావించాడనవచ్చు. ఇంత చక్కని ఈ ఉడుత కథ శిష్టుల రామాయణాలలో లేకపోయినా, తమిళ జానపద వాఙ్మయంలో చోటు చేసుకున్నట్లు పండితులు చెపుతారు. విప్రనారాయణుడుగా తెలుగువారికి చిరపరిచితుడైన తొండరడిప్పొడి ఆళ్వారు (పన్నిద్దరు ఆళ్వారులలో ఈయన కూడా ఒకడు) ఈ కథను ఒక పాశురంలో నిబద్ధం చేశాడు.

ఈ సందర్భంగా పెక్కు అవాల్మీకాంశాలకు నెలవుగా ఉన్న భుశుండి రామాయణం గురించి ప్రస్తావించడం సమంజసం. ఈ సంస్కృత రామాయణానికి ఆది రామాయణం, బృహద్రామాయణం, మహా రామాయణం అనే నామాంతరాలున్నాయి. బ్రహ్మ భుశుండికి చెప్పినట్లుగా భావించబడుతున్న యీ రామాయణ రచనాకాలం 14వ శతాబ్ది అని సంస్కృత విద్వాంసులు రాఘవన్‌గారి అభిప్రాయం. మధుర భక్తి ప్రధానంగా సంతరించబడిన యీ రామాయణం తులసీదాసు రామాయణానికి మార్గదర్శక మయింది.

భుశుండి రామాయణంలో కానవచ్చే కొన్ని అవాల్మీకాంశాలు ఇతర దేశ భాషా రామాయణాలలోనూ కనిపిస్తున్నాయి. శివధనుర్భంగానికి ముందే రాముడు సీతను కలుసుకోవడం, రావణుడు సీతా స్వయంవరంలో పాల్గొనడం, పంచవటిలో సీతను బాధించిన కాకి మరెవ్వరో కాదు జయంతుడే అని చెప్పడం, పంచవటిలోనే పన్నెండేళ్ళపాటు నివసించి రాముడు మహాదేవాలయంలో భగవంతుణ్ణి ఆరాధించడం, పర్ణశాలను విడిచి వెళ్ళేముందు లక్ష్మణుడు ఒక రేఖ గీయడం ధాన్ని సీత దాటి వెళ్ళకూడదని చెప్పడం, రావణుడు తనను అపహరించేందుకు ముందు సీత తన నిజరూపాన్ని అగ్నిదేవుని వద్ద ఉంచడం, రావణుడు సీతను తన బుజాలమీద ఉంచుకుని లంకకు తరలి వెళ్ళడం, తాను తొలుత చవి చూసిన పండ్లనే శబరి రాముడికి సమర్పించడం, సాల వృక్షాలనేకాక వాటికింద ఉన్న సర్పాల మీద కూడా బాణప్రయోగం చెయ్యమని సుగ్రీవుడు రాముణ్ణి అర్థించటం, వాటిని వధించినందుకు రాముడు పలుమార్లు పశ్చాత్తాపం చెందడం, అంతఃపురంలో ఉన్న రావణుణ్ణి చూసిన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ తొలిచూపులోనే రాముడు అతని ఛత్ర చామరాలను బాణప్రయోగం చేసి నేల కూల్చడం, విభీషణుడికి లంకారాజ్యం ఇస్తానన్నావు గదా రావణుడు కనక శరణు వేడితే అతనికేమి యిస్తావని సుగ్రీవుడు అడుగగా అందుకు అయోధ్యనే యిస్తానని రాముడు బదులు చెప్పడం, రాముడికి సహాయంగా కుబేరుడు పుష్పక విమానం పంపించడం మొదలైనవి భుశుండి రామాయణంలో కనిపించే కొన్ని అంశాలు.

రామాయణ కవులు వివిధ వర్ణాలకు చెందినవారై ఉండడం, వారిలో బ్రాహ్మణేతరులు పలువురు ఉండడం గమనించదగిన మరో అంశం. కవి చక్రవర్తి కంబన్, మలయాళ సాహిత్యంలో నవయుగ ప్రవక్తగా భావించబడుతున్న ఎళుత్తచ్చన్, సర్వపురాణ విచారతత్పరుడూ రామాయణ మర్మజ్ఞుడూ అయిన గోన బుద్ధారెడ్డి, ఒరియా మహాకవి సరళదాసు, కవయిత్రులు మొల్ల, చంద్రావతులు మొదలైనవారు బ్రాహ్మణేతరులే. నిజానికి కంబన్, ఎళుత్తచ్చన్, బుద్ధారెడ్డి వంటి కవులవల్ల ఆయా భాషలలో రామకథకు బహుళ ప్రచారం లభించింది. ఎళుత్తచ్చన్ వ్రాసింది అధ్యాత్మ రామాయణమే అయినా, అది నేటికీ మలయాళీలకు పారాయణ గ్రంథంగా నిలిచిపోయింది. సందెవేళ దీపాలు పెట్టిన తర్వాత ఎళుత్తచ్చన్ రామాయణం నుంచి కొన్ని శ్లోకాలు (పద్యాలు) చదవడం కేరళలో (పల్లెలలో) కనిపిస్తున్న ఒక ఆచారం. ఈ గౌరవం తులసీదాసు రామాయణానికి కూడా లభించింది. వివిధ వర్గాలవారు ఆ మధురమోహనకృతిని సభక్తికంగా చదువుతారు; కొందరైతే చక్కగా గానం చేస్తారు. పాఠ్యంగేయే చ మధురం అన్న మాట తులసీదాసు రచనకు బాగా వర్తిస్తుంది. తోలు బొమ్మలాట ప్రదర్శించేవారు రంగనాథ రామాయణాన్ని సాహిత్యంగా ఉపయోగిస్తారు. ఇక రామాయణ రచనవల్ల ఎళుత్తచ్చన్ యింటి ఆవరణలోని మట్టి అక్షరాభ్యాసానికి మంచిదనే ప్రశస్తి పొందింది. (తుంజన్ పరంబిలె మణ్ణు విద్యారంభత్తినె విశేషం.) ఇక్కడ మరొక విషయం కూడా ఉదాహరించడం ఉచితం. తెలుగు లిపిలో ఉన్న అధ్యాత్మ రామాయణాన్ని ఆధారం చేసుకుని ఎళుత్తచ్చన్ రామాయణం వెలయించినట్లు చేల్నాట్ అచ్యుత మీనన్ వంటి పరిశోధక విద్వాంసుడు అభిప్రాయం వ్యక్తం చేశారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామకథా సంబంధి సామెతలు ప్రతిభాషలోనూ కనిపిస్తున్నవి. హనుమంతుని తోక, రామరావణ కాష్ఠం, సుగ్రీవాజ్ఞ, సీతచెర వంటి పద బంధాలు కూడా వాడుకలో లేకపోలేదు. అలాగే రామాయణానికి సంబంధించిన కొన్ని నమ్మకాలు వాడుకలో ఉన్నాయి. మలయాళీలు 'భారతం కలహ కారణం', రామాయణం స్నేహకారణం అంటారు. అనగా, భారత పఠనం కలహానికి దారి తీస్తే, రామాయణ పఠనం వల్ల స్నేహం వర్ధిల్లుతుందనీ వారి విశ్వాసం. అంతేకాదు. 'భారతం వాయిచ్చాల్ తర వాడి కెడుం, రామాయణం వాయిచ్చాల్ మోక్షం కిట్టుం' అని కూడా కేరళీయుల విశ్వాసం. భారత పఠనం వల్ల ఉమ్మడి కుటుంబం నశిస్తుందనీ, రామాయణ పఠనం వల్ల మోక్షప్రాప్తి సులభ మవుతుందనీ దీని అర్థం. కర్కాటక మాసంలో (జూను-జూలై) రామాయణ పఠనం ఐశ్వర్య ప్రాప్తికి హేతు వవుతుందని వారి నమ్మకం. కర్కాటక మాసాన్ని రామాయణ మాసమనీ వ్యవహరించడం వారి సంప్రదాయం. అయితే అస్సాములో కొందరి అభిప్రాయం ప్రకారం రాత్రిపూట రామాయణ పారాయణం దుఃఖప్రాప్తికి హేతువు అవుతుంది.

....జానకీ జాని కథల్ రచింపక యసత్కథ లెన్ని రచించె నేనియున్, వాని వివేక మేమిటికి, వాని కవిత్వమహత్త్వమేమిటికిన్' అన్నది తెలుగుకవి కంకంటి పాపరాజు విశ్వాసం.

హేతువాద దృక్పథంతో పరికించినప్పుడు రామాయణంలోని కొన్ని సన్నివేశాలు కొందరికి రుచికరంగా తోచవు. మరొక దృష్టితో చూసినప్పుడు మరికొన్ని సన్నివేశాలు రుచించక పోవచ్చు. వాలి వధ అలాంటి వాటిలో ఒకటి. రాజాజీ (చక్రవర్తి రాజగోపాలాచారి) వంటి రామాయణ ప్రియులు కొందరు వాలి వధను సమర్థించలేదు. అయినా ప్రధాన కథ పట్ల ఆయనకి గల ఆదరభావం నిరుపమానం. ఈ సందర్భంలో రాజాజీ చెప్పిన మాటల్ని యథాతథంగా ఉదాహరించడం సముచితం. 'దేశానికి నేను చాలా సేవ చేసినట్లు మిత్రులు నన్ను ప్రశంసిస్తారు. వ్యాసర్ విరున్దు (మహా భారతం), చక్రవర్తి త్తిరుమగన్ (చక్రవర్తి తనూజుడు, రామాయణం) - ఈ రెండూ వ్రాసి ముగించడం నేను మిన్నగా భావిస్తున్నాను. అన్నిటికంటె ఇదే నా మనస్సుకి సంతోషమూ ప్రశాం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తత ప్రసాదించింది.' మనదేశంలో జన్మించిన మేధావులలో ప్రముఖులైన రాజాజీ మాటలు పరిశీలించదగినవి.

జైనులు రామకథను వక్రంగా చిత్రించి వుండవచ్చు. కన్నడ వీరశైవకవులు తమ వచనాలలో రామకథను విమర్శించి వుండవచ్చు. తెలుగు కవులు కొందరు యథామాతృకంగా రామాయణాన్ని వ్రాసి వుండవచ్చు. రావణుని కుమార్తెగా సీతను కాశ్మీరీ రామాయణం అభివర్ణించి వుండవచ్చు. ఆమె కాళికాదేవి అవతారమని వంగదేశీయులు భావించవచ్చు. సీతారాములు సాక్షాత్తు లక్ష్మీనారాయణులని కంబన్ పేర్కొనవచ్చు. రామకథను కొందరు ఆధ్యాత్మిక దృష్టితో సంతరించి వుండవచ్చు. కథా కథనంలో మార్పులెన్నో కనిపించవచ్చు. ఏమైనప్పటికీ రామాయణం భారతీయ సాహిత్యంలో ఆదికావ్యం, వేద సంహిత. దక్షిణ ఉత్తర భారతాలను సాంస్కృతికంగా కలిపి ఆసేతు హిమాచలం వంటి రమణీయ పదబంధాన్ని సృష్టించిన కావ్యం! వివిధ భాషలవారినీ, వివిధ ప్రాంతాల వారినీ సాహిత్యపరంగా ఏకం చేసింది. రామకథ కుటుంబ కథ; మానవుని కథ. అందుకే అది రసవత్కథ కాగలిగింది. అభినవ పంప బిరుదాంకితుడయిన నాగచంద్రుడు రాముణ్ణి ధర్మనాయకుడిగా చిత్రించాడు.

ఈ శాస్త్ర సాంకేతిక యుగంలో కూడా ఎప్పుడో జరిగిన రామకథను పరమ ప్రమాణంగా విశ్వసించే వారున్నారు; విశ్వసించని వారూ ఉన్నారు. పైపెచ్చు రామకథ కల్పిత కథ అని వారు పేర్కొంటారు. రామాయణంలోని సుందరకాండను భక్తి విశ్వాసాలతో ప్రతినిత్యమూ పారాయణం చేసే వారున్నారు. రామకథా గత విషయాలు కొన్నింటిని హేతువాద దృష్టితో తూర్పార పట్టేవారు ఉన్నారు. ఎవరు ఏవిధంగా భావించినా, వాల్మీకి విశ్వసాహిత్యంలోనే మహాకవి ; ఆదికవి. రామకథ కల్పిత మనుకుంటే, అప్పుడు వాల్మీకి ప్రముఖ నవలా రచయిత అవుతాడు. ఆయన రచన శ్లోకరూపంలో వెలువడిన మొదటి నవలగా భావించబడుతుంది. కథ జరిగిందనుకున్నా, జరగలేదనుకున్నా, వాల్మీకి రామాయణం రమణీయ రచన, కమనీయ కావ్యమూను. ఆ మహర్షికి వచ్చిన నష్టమేమీ లేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒక్క మాటలో చెప్పాలంటే, భారతీయ సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన రసవత్కావ్యం రామాయణం. ఆ ఆదికావ్యం అత్యుత్తమ కావ్యంగా కూడా ప్రతిభాసించడం రసహృదయుల భాగ్య విశేషం. పాశ్చాత్య పండితుల్ని సైతం అలరిస్తున్న ఈ కావ్యం భారతదేశం ప్రపంచ సాహిత్యానికి ప్రసాదించిన పరమోదాత్త రచన!

అతి ప్రాచీన కాలంలోనే రామకథ ఎలా వెలుగుదివ్వె కాగలిగిందో ఆ విషయాన్ని హాలుని గాథా సప్తశతిలోని ఒక గాథ పరమ రమణీయంగా తెలియజేస్తున్నది. రామాయణం భారతీయుల్ని ఎలా ప్రభావితుల్ని చేసిందో కూడా ఆ గాథ స్పష్టం చేసింది. ఆ ప్రాకృత కావ్యంలోని గాథను పరికిద్దాము.

దిఅరస్స అసుద్ధ మణస్సకుల
వహూ ణిఅకుడ్డ లిహిఆఇం
దిఅహం కహేఇ రామాణులగ్గ
సోమిత్తి చరి ఆఇం.

హాలస్స - 35 ప్రథమం శతకమ్

సంస్కృత ఛాయ

దేవరస్య అశుద్ధ మనసః కుల
వధూః నిజక కుడ్య లిఖితాని
దివసం కథయతి రామానులగ్న
సౌమిత్రి చరితాని.

గాథలోని విషయం ఎప్పటిదైనా, అది సర్వకాలాలకు వర్తించే విషయం. ఇందులో వదినె మరదుల వ్యవహారం అభివర్ణితం.

మరది మలిన మనస్కుడు. అతని మనస్సులోని మలిన వాంఛను జాణ అయిన అతని వదినె గ్రహించింది. అయినా ఆమె అతనిని దుయ్యబట్టలేదు. పై పెచ్చు మందహాసం చేసింది. తమ యింటి గోడమీద ఉన్న చిత్రం వైపు తన దృష్టిని ఆమె మరల్చింది. ఆ చిత్రంలో రాముని వెంట లక్ష్మణుడు తిరుగుతున్నట్లు చిత్రించబడింది. అన్న వెంట తిరిగే ఆ తమ్ముని కథను చెప్పసాగింది. ఆ అన్నదమ్ముల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరస్పర ఆదరాభిమానములను వివరించింది. అన్నతో పాటు అడవులకు సహర్షంగా వెళ్ళిన లక్ష్మణుని భ్రాతృగౌరవాన్ని, అతని నిష్కల్మషమైన మనస్సుని వివరించింది. మరదీ, నీవు కూడా రామానుజునివలె సంచరించాలన్నది ఆమె అభిప్రాయం. ఇక రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు ఆ గాథకు చేసిన తియ్యని తెలుగు సేతను చదివి ఆనందిద్దాము.

'మలిన చిత్తుడైన మరదికి నిల్లాలు
చిన్న నవ్వు దోఁప జెప్పుచుండు
రాము వెంటఁ దిరుగు సౌమిత్రి చరితంబు
గోడమీద వ్రాసికొన్న దానిః'

(శాలివాహన గాథాసప్తశతీసారము, 1964)

రామునివలె సంచరించు; రావణునివలె సంచరించకు - ఇదే రామకథ మనకిచ్చే సందేశం. అది సార్వకాలికం ! ఉత్తమ సందేశాన్ని ప్రసాదించే రామాయణం రసవత్కావ్యం కాక మరేమవుతుంది? అది రసవత్కావ్యం కాకపోతే, మరొక రసవత్కావ్యం మన కేది?

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

2
సంస్కృతం

వాల్మీకి వంటి మహర్షి మహాకవీ సంస్కృతంలో రమ్యాతి రమ్యమైన రామకథను రచించడం ఆ భాషే కాదు భారతీయ సాహిత్యం చేసుకున్న భాగ్య విశేషం. సత్కావుల రసవద్రచనల వల్లనే ఒక భాషకు వన్నెచిన్నెలు సమకూరుతాయి; ప్రచుర ప్రచారమూ లభిస్తుంది. రామాయణ రచన వల్ల సంస్కృత భాషా సాహిత్యాలకు పేరు పెంపులు లభించినవనడం సత్యోక్తి.

వైదిక ఋషులు అమూల్యములైన గీతాలు వెలయించినా, వాల్మీకి రామాయణం సంస్కృతంలోనే కాక భారతీయ సాహిత్యంలోనే ఆదికావ్య యశస్సు సముపార్జించింది. వాల్మీకి ఆదికవిగా యశోవిశాలు డయ్యాడు. అంతేకాదు. కవితా రచనకు మార్గదర్శకు డయ్యాడు. ఆ మహర్షిని ప్రశంసించని ప్రముఖ సంస్కృత కవి లేడనడం అతిశయోక్తి కాదు. వివిధ భాషాకవులు కూడా, ఆ గరీయః ప్రతిభునికి జేజేలు పలికారు.

ఇరవైనాలుగు వేల శ్లోకాల గ్రంథరాజం వాల్మీకం. అందులోని పాత్ర పోషణం పరమాద్భుతం. వర్ణనలు సహజ సుందరములు. కథాసంవి ధానం కమనీయం. భూమిమీద ఎంతవరకు కొండలూ నదులూ నెలకొని వుంటాయో, అంతవరకూ రామాయణ కథ ప్రచారంలో ఉండగలదని క్రాంతదర్శి అయిన ఆ మహర్షి భావించాడు.

కవికుల గురువుగా కీర్తి గడించిన కాళిదాసు వాల్మీకి అనుయాయులలో ప్రముఖుడు. ఆయన రఘువంశ కావ్యం సుప్రసిద్ధ మయింది. రామ శబ్దానికి తర్వాత రాఘవ శబ్దంతోనే ఆయన ఎక్కువగా వాల్మీకి రాముణ్ణి సంబోధించాడు. కనుక కాళిదాసు తన కావ్యాన్ని రఘువు పేరు మీద కూడా వ్యవహరించినట్లు భావించవచ్చు. ఏడు ఆశ్వాసాలలో ఆయన రామాయణ కథను అభివర్ణించాడు. తత్ఫలితంగా కాళిదాసు రామాయణ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవులలో ఒకడు కాగలిగాడు. ఆయన తన కావ్య నాటకాలలో వాల్మీకి భావాలు, పదబంధాలు, ఉపమలు మొదలైన వాటిని నిక్షిప్తం చేసినట్లు అభిజ్ఞులు చెపుతారు.

ఆ తర్వాత పేర్కొనదగిన కావ్యం భట్టి రచించిన రావణవధ. దీనికి భట్టి కావ్యమని నామాంతరం. శ్రీలంకలో వర్ధిల్లిన కుమారదాసకవి జానకీహరణ కావ్యం వెలయించాడు. అభినందుని రామచరిత కూడా ఎన్నదగిందే. ఆయనే యోగవాసిష్ఠ కావ్య కర్త. దీన్ని మహారామాయణ మని కూడా అంటారు. వాల్మీకిని అనుసరించి క్షేమేంద్రుడు 6,400 శ్లోకాలలో రామాయణమంజరి రచించాడు. క్షేమేంద్రుని దశావతార చరితలో 293 శ్లోకాలలో రామకథ అందాలు దిద్దుకుంది. ధారాధీశుడైన భోజుడు రామాయణ చంపు రచించి విఖ్యాతు డయ్యాడు. సుందరకాండం వరకే ఆయన రచన లభ్యమయింది. అనంతరం పలువురు యుద్ధకాండను రచించి భోజుని చంపూ కావ్యాన్ని పూర్తి చేసినట్లు రాఘవన్ గారి అభిప్రాయం. రామకథా కావ్యాలు మరికొన్ని సంస్కృత సాహిత్యంలోని ప్రాచీన యుగంలో వెలువడినట్లు పండితులు విశ్వసిస్తున్నారు.

రాముడు దేవుడనే విశ్వాసం ప్రబలినకొద్దీ, రామకథకు సంబంధించిన మహాకావ్యాలు, ఖండకావ్యాలు, స్తోత్రాలు మొదలైనవి ఎన్నో వెలుగులోకి వచ్చాయి. 13వ శతాబ్ది వాడైన వేదాంతదేశికులవారు 1000 శ్లోకాలలో పాదుకా సహస్ర వచనంలో రఘువీర గద్య మొదలైనవి సంత రించారు. తంజావూరు రాజాస్థానంలో ఉండిన రామభద్ర దీక్షితులు రాముని ధనుర్బాణాలపై స్తోత్రాలు రచించారు. అముద్రితాలుగా ఉన్నవి కూడా బహుళంగా ఉన్నట్లు చెపుతారు.

ఈ సందర్భంగా ప్రాకృతంలో వెలువడిన రామకథా కావ్యాలు గురించి రెండు మాటలు. ప్రాకృత కావ్యనాటకాలు సంస్కృత వాఙ్మయపు అంతర్భాగాలు. క్రీ.శ. 5వ శతాబ్దివాడైన ప్రవరసేనుడు రచించినట్లుగా చెప్పబడుతున్న సేతుబంధ కావ్యం పేర్కొనదగింది. దీని మరో పేరు రావణ వధ. హాలుని గాథా సప్తశతిలో రామకథా ప్రశంస కానవస్తుంది. రావణ విజయ, మారీచవధ మొదలైనవి కూడా వెలిశాయి.

రామకథా సంబంధి నాటకాలు సంస్కృతంలో చాలా ఉన్నాయి. కాళి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దాసుకి పూర్వుడైన భాసమహాకవి ప్రతిమ, అభిషేకనాటకాలు వ్రాశాడు. ఎన్నో ప్రాచీన రామనాటకాలు ప్రస్తుతం అలభ్యమని విజ్ఞుల అభిప్రాయం. (అణ్ణామలై విశ్వవిద్యాలయం వారు 1961 లో ప్రచురించిన రాఘవన్ గారి 'సమ్ ఓల్డ్ లాస్ట్ రామ ప్లేస్' పుస్తకం చూడవచ్చు.) కృత్యా రావణ, చరిత రామ, రామాభ్యుదయ, ఉదాత్త రాఘవ మొదలైనవి కొన్ని ప్రాచీన రామనాటకాలు. లభించిన ప్రాచీన నాటకాలలో భవభూతి రచించిన మహావీర చరిత, ఉత్తరరామ చరిత పేర్కొనదగినవి. ఆ తర్వాత పేర్కొనదగిన నాటకాలు; బాల వాల్మీకి బిరుదాంచితుడైన మురారి రచించిన అనర్ఘరాఘవ, రాజశేఖరుని బాల రామాయణ మొదలైనవి. శక్తి భద్రుని ఆశ్చర్య చూడామణి, ధీరనాగుని కుందమాల, కనక జానకి, జానకీ పరిణయ మొదలైనవి కూడా గమనించదగిన రచనలు. వీటిలో కొన్ని దక్షిణా పథంలో వెలిసినవి.

భోజుడు సంకలనం చేసినట్లుగా చెప్పబడుతున్న మహానాటిక కూడా రామకథా సంబంధి రచనయే. వివిధ రామాయణ నాటకాల నుంచి గ్రహించబడిన శ్లోకాలు ఈ సంకలన కృతిలో చోటు చేసుకున్నవి.

రామాయణ వ్యాఖ్యానాలు కూడా పరిశీలించదగినవే. రామాయణం వివిధ ప్రాంతాలలోనూ ప్రచారంలో ఉన్నా, రామాయణ వ్యాఖ్యలు దక్షిణాపథంలోనే ఎక్కువగా వెలువడినాయి.

వాల్మీకం ఒక్క భారతావనిలోనే కాక ఆగ్నేయాసియా దేశాలలోనూ ప్రచారం గడిచి అయా దేశాల ప్రజల మన్ననలు పొందింది.

1955 లో కనుగొనబడిన భుశుండి రామాయణం గురించి ప్రస్తావించడం సముచితం. దీనికి ఆది రామాయణ, బ్రహ్మ రామాయణ అనే నామాంతరాలు ఉన్నాయి. ఈ రామాయణ కర్త ఎవరో తెలియరాకపోవడం శోచనీయం. భుశుండి రామాయణం రాముణ్ణి కృష్ణుడితో సమానంగా భావించడం వల్ల, ఇందులో మధురభక్తి తత్త్వం ప్రవేశించింది. కనుక ఈ రామాయణంలో భాగవతం తొంగి చూస్తుంది. తులసీదాసుని ప్రభావితుణ్ణి చేసిన రచనలలో ఇది ప్రముఖ మైనది. అవాల్మీకాంశాలు ఎన్నో ఈ రామాయణంలో కానవస్తాయి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అధ్యాత్మరామాయణం పురాణోత్తమం అని ప్రసిద్ధి. దీన్ని రామోపనిషత్తు అని కూడా వ్యవహరిస్తారు. ఈ రామాయణంలో కథ పేరుకి మాత్రమే. సీతారామ తత్త్వం ఇందులోని ప్రధాన విషయం. వాల్మీకంలో కథ ప్రధానం; ఆధ్యాత్మిక విషయం గౌణం. రామభక్తి తత్త్వంలోకి పరమశివుణ్ణి కూడా చేర్చడం ఇందులో కానవస్తుంది. సంస్కృత రామాయణాలలో వాల్మీకం తర్వాత ప్రసిద్ధి కెక్కిన రామాయణం అధ్యాత్మరామాయణమనడం నిర్వివాదం.

అద్భుత రామాయణం రమారమి వెయ్యి శ్లోకాల గ్రంథం. సీతను దుర్గాదేవిగా భావించడం జరిగింది. శతకంఠుడైన రావణుణ్ణి సీత సంహరించడం ఇందులోని ప్రధాన విషయం. ఆమె రావణుని కుమార్తెగా అభివర్ణిస్తుంది యీ రామాయణం.

ఆనంద రామాయణంలో కథ లెన్నో ప్రాధాన్యం వహించాయి. రాజ్య పరిపాలకునిగా రాముణ్ణి గురించి యీ రామాయణం చెపుతుంది. ఇది సమర్థ రామదాసు కృతమని పండితలోకం విశ్వసిస్తున్నది.

భుశుండి రామాయణం పేర్కొన్నట్లుగా, రామాయణం అనంతకం. అనగా రామాయణ సాహిత్యం అపారమని అర్థం.

ఎన్ని రామాయణాలు వెలసినా, రామకథ అనగానే నలుగురికి గుర్తుకి వచ్చేది వాల్మీకి వివరించిన రామకథే. కనుకనే వాల్మీకి రామాయణాన్ని పలువురు ప్రకాశకులు ప్రచురించారు. కొందరు వ్యాఖ్యానాలను కూడా ముద్రించారు. ఈ సందర్భంగా, బరోడాలోని ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్ వారు పండితులచే పరిష్కరింపజేసి వాల్మీకి రామాయణాన్ని ఏడు సంపుటాలలో చక్కగా ప్రచురించిన విషయం ఉదాహరించదగింది. ఇందుకు ఇన్‌స్టిట్యూట్ వారు అభినందనీయులు.

మహామహోపాధ్యాయ విద్యావాచస్పతి బిరుదాంకితులైన యస్. కుప్పుస్వామి శాస్త్రిగారు మరి కొందరు పండితులు పరిష్కరించిన వాల్మీకి రామాయణాన్ని మదరాసులోని యం.యల్.జె.ప్రెస్సు వారు సర్వాంగ సుందరంగా ప్రచురించారు. దీనికి శాస్త్రిగారు చక్కని ఉపోద్ఘాతం వ్రాశారు. వావిళ్ల వారు కూడా ప్రచురించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

3
అస్సామీ

అస్సామీలో వెలసిన రామాయణానికి ఒక విశిష్టత ఉంది. అది 14వ శతాబ్ది మధ్యభాగంలో వెలుగు చూసింది. తత్కర్త మాధవ కందలి అనే మహాకవి. ఒక ఉత్తరదేశ భాషలో వెలువడిన తొలి రామాయణం మాధవ కందలిదే అనడం నిర్వివాదం. ఆ తర్వాతనే హిందీ, బెంగాలీ మొదలైన భాషలలో రామకథ గ్రంథరూపం దాల్చింది.

అస్సామీ రామాయణానికి ఈ విశిష్టగౌరవం లభించినా, ఒకటి రెండు విచిత్రాలను కూడా ఉదాహరించడం అవసరం. మనదేశంలో వివిధ ప్రాంతాలలో రామమందిరాలు, రామాలయాలు చిన్నవీ పెద్దవీ ఎన్నో కనిపిస్తాయి. కాని అస్సాములో ఒక్క రామమందిర మైనా కని పించదు. చివరికి శిథిలావస్థలో ఉన్న రామమందిర మైనా కనిపించదని అభిజ్ఞుల అభిప్రాయం. అలాగే హనుమంతుని మందిరమూ కనిపించదు. ఉత్తర భారతంలో చాలా చోట్ల హనుమంతుని మందిరాలు కళ్లకి విందు చేస్తాయి. అస్సాములో హనుమంతుని మందిరం కనిపించదు సరికదా, అస్సామీయులు అసలు హనుమంతుణ్ణి దేవుడిగా కూడా భావించరు. అటువంటప్పుడు శిల్పాలలో రాముడు దర్శన మిస్తాడనుకోవడం కేవలం భ్రమ. కాని లభించిన అస్సామీ రామాయణ వ్రాతప్రతులలో సీతారా ములు మొదలైనవారి చిత్రపటాలు అందాలు దిద్దుకున్నాయి. రాత్రిపూట రామాయణం పారాయణం చెయ్యకూడదనీ, అలా చెయ్యడం దుఃఖప్రా ప్తికి హేతువవుతుందనీ అస్సాములో కొందరి విశ్వాసం.

ఏది యెలా ఉన్నా, అస్సామీ సాహిత్యం మీద రామకథా ప్రభావం కానవస్తుంది. అలాగే అస్సామీయుల గుండెలలో రాముడు నెలకొనక పోలేదు. వారి పెళ్లిపాటలు, లాలిపాటలు, జానపదగేయాలు మొదలైన వాటిలో రామకథకు సముచిత స్థానం లభించింది. అస్సాములో దొరి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కిన అతి ప్రాచీనమైన తామ్రపత్రాలు 7వ శతాబ్దికి సంబంధించినవి. వాటిలో రాముడికి సంబంధించిన వివరాలు తక్కువ ; కృష్ణకథాత్మకములు ఎక్కువ.

మాధవకందలి కవిరాజ బిరుద విరాజితుడు. వాల్మీకాన్ని మాతృకగా చేసుకున్నా, యథానువాదం మాత్రం చెయ్యలేదు. మూలంలోని భావాన్ని అస్సామీయులకు ప్రస్ఫుటం చేశాడు. కందలి కొన్ని చోట్ల వర్ణనలు పెంచి వ్రాశాడు; మరికొన్ని చోట్ల కుదించాడు. కొన్ని విషయాలకు స్థానిక స్వరూపం కల్పించాడు. ఈ సందర్భంగా ఆ మహాకవి చెప్పిన మాటలను గుర్తు చేసుకోవడం సమంజసం. 'వరాహీ రాజయిన శ్రీ మహామాణిక్యుడి కోరికను పురస్కరించుకుని ప్రజల ఉపయోగం కోసం నేను మధురమైన రామాయణాన్ని అనువదించాను. పాల లోంచి నేతిని గ్రహించినట్లుగా, వివరాలు పరిహరించి సారమును తెలియజేశాను. మహామాణిక్యుడి ఆదేశం అనుసరించి కొంత కావ్యరసమూ చేర్చాను.'

మరోచోట మాధవ కందలి తన అనువాద విధానాన్ని ఇలా స్పష్టం చేశాడు. 'ఛందో బద్ధమైన పద్యంలోనూ గద్యంలోనూ వాల్మీకి రామాయణం వెలయించాడు. ఎంతో శ్రమపడి, నేను గ్రహించిన విధంగా సంగ్రహంగా, ఆ కావ్యానికి ప్రబంధరూపం కల్పించాను. లోక వ్యవహారం బట్టి కవులు కావ్యరచన సాగిస్తారు కనుక, కొన్ని విషయాలేమో మాతృకానుసారాలు; మరికొన్ని కల్పితాలు. పైగా ఇది దైవ వాణి (వేదం) కాదు; ప్రచారంలో ఉన్న కథ (లోక కహె కథా — లోకులు వాకొనే కథ). అందువల్ల, నా అనువాదంలో దోషాల్ని ఎన్నడానికి ప్రయత్నించ కూడదు.'

8272

పైమాటలు పరిశీలించదగినవి. రామాయణం దైవవాణి - అనగా - వేదం కాదు. ప్రచారంలో ఉన్న కథ. రామాయణం ఒక పురుషోత్తముని కథ కాబట్టి, కొన్ని విషయాలు పరిహరించడమో కొన్ని చేర్చడమో దోషం కాదని మాధవకందలి అభిప్రాయం. ఆ దృష్టితో ఆయన స్థానికుల ఆచారవ్యవహారాలు, అభిరుచులు మొదలైనవి తన కృతిలో చొప్పించాడు. కాగా కందలి రామాయణం ఆనాటి అస్సామీ సమాజానికి దర్పణంగా ఉన్నదనడం అతిశయోక్తి కాదు. రామ పట్టాభిషేక సంద

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ర్భంలో అయోధ్యానగరం నవ్వుతూ ఉన్నట్లు కనిపించిందట! నృత్యగీత వాద్య ఘోషతో విరాజిల్లే అమరావతిని తలపించిందట!

మాధవకందలి రాముడిలో దివ్యత్వం ఆపాదించ లేదు. రాముడు చతుర్భుజుడుగా ప్రభవించినట్లు కృత్తివాసుని బెంగాలీ రామాయణం చెపుతున్నది. ఒకటి రెండు అంశాలు తప్ప పురాణాలనుంచి కందలి మరేమీ గ్రహించలేదు. సీతను బాధించిన కాకిని రాముడు ఐశికాస్త్రంతో (రెల్లు బాణం) వధించినట్లు అన్ని పురాణాలలోనూ ఉంది. ఈ విషయాన్ని అస్సామీ రామాయణం పేర్కొన్నది.

అస్సామీల ఉపయోగంకోసం రామాయణం తాను వ్రాశానని మాధవకందలి పేర్కొన్నాడు. కాగా ప్రజాభిరుచుల్ని ఆయన తన కృతిలో కొంతవరకూ చొప్పించడం సమంజసమే. అయినా ఉత్తమాభిరుచిని వ్యక్తం చెయ్యని కుంజికథను ఆయన వివరించడం సమంజసంగా లేదని పండితుల అభిప్రాయం. ఈ అవాల్మీక కథను పరిశీలిస్తే, అటువంటి అభిప్రాయమే ఎవరికైనా కలుగుతుంది.

కుంజి కురూపి. దానికి తోడు గూని. పైపెచ్చు వృద్ధ. ఆమె భరతుణ్ణి కామించింది. ఆ కామోద్రేకంతో సభ్యతను కూడా విస్మరించింది. మేనమామగారి యింటినుంచి భరతుడు వచ్చినట్లు వినగానే, ఆమె మనస్సు కల్లు తాగిన కోతిగా మారింది. ముప్పయిరకాల నగలు ధరించింది. చక్కగా సింగారించుకుంది. భరతుణ్ణి సమీపించడానికి ముందు తనలో తాను అనుకుంది గదా: 'నేను భరతుని కంటె పెద్దదాన్ని. అయితే మాత్రం యేం? ప్రేమికులకు వయస్సుతో పనేముంది? నన్ను భరతుడు బాహాటంగా స్వీకరించడానికి తటపటాయించవచ్చు. పోనీ రహస్యంగానే నేనతని ప్రేయసిగా ఉంటాను!' చివరికి భరతుణ్ణి సమీపించింది. అయితే శత్రుఘ్నుడి చేతిలో ఆమెకు తగిన పరాభవమే జరిగింది.!

రాముడి పట్టభంగం, వనవాసం వంటి దుర్వార్తలు విని శోకతప్తులయ్యే శ్రోతల్ని ఉద్దేశించి, వారికి కొంచెం మనోల్లాసం కలిగించాలని కవి యీ కథను చొప్పించి ఉండవచ్చునని కొందరు భావించవచ్చు. అయినా వాల్మీకి ప్రసన్న గంభీరమైన కథాకథనం ముందు ఈ కోవకు చెందిన కథలు అసంగతంగానే కాక అసభ్యంగా కూడా కనిపించడంలో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆశ్చర్య మేమీ ఉండదు.

మాధవ కందలి మహాకవి అనడం నిర్వివాదం. ఆయన కవిసార్వభౌముడు. కనుకనే మహామాణిక్యుని వంటి మహారాజు మన్నన లభించింది. ఆయన కఛారీవంశీయు డని కొందరి మతం. తరువాతి అస్సామీ కవులకు కందలి పథ ప్రదర్శకు డయ్యాడు. భాషా సౌందర్యానికి ఆయన పెద్ద పీట వేశాడు. ధర్మోపదేశానికి అంత ప్రాధాన్యం ఇవ్వలేదు.

ఈ సందర్భంలో అనంత కందలి అనే ప్రసిద్ధ కవి చెప్పిన మాటలు గమనించదగినవి : 'మాధవ కందలి రామాయణం రచించాడు. అది విని నేను ప్రభావితుణ్ణి అయ్యాను. ఆయన రాముడి జీవిత కథను వివరించాడే కాని ఆధ్యాత్మిక విషయాలు వ్రాయలేదు. కనుక భక్తిభావం దృష్టిలో ఉంచుకొని నేను వ్రాయడానికి పూనుకున్నాను. శ్రీరాముడు పరబ్రహ్మమని మనం గ్రహించాలి'. అనంత కందలి అస్సామీ భాగవత కర్తలలో ఒకడు. కాలక్రమాన రామాయణం భాగవతంలో ఒక భాగమైపోయింది. భాగవత కర్తా ప్రముఖకవీ అయిన శంకరదేవుని దృష్టిలో రాముడూ కృష్ణుడూ ఒక్కరే. ఆవిధంగా అప్పటికి, అనగా శంకరదేవుని (1449-1569) కాలం నాటికి, కృష్ణతత్త్వ ప్రచారానికి రామకథ తోడ్పడిందనవచ్చు.

కాగా మాధవకందలి రామాయణ రచన అస్సామీ కవుల్ని బహుధా ఆకర్షించిందనడం చర్విత చర్వణం. ఆయన కవితా స్వరూపాన్ని ఇలా ప్రస్తుతించారు.

"గంభీరమైనా ప్రసన్నము
సౌమ్యమైనా రమ్యము
సాంద్రమైనా నిరాటోపము
పూర్ణమైనా నిరుద్వేలము."

మాధవ కందలి సప్తకాండలూ వ్రాసినట్లు అభిజ్ఞుల విశ్వాసం. కాని ప్రస్తుతం అయిదు కాండలే లభ్య మైనాయి; బాలోత్తర కాండలు లభ్యం కాలేదు. నూరేళ్లకు తర్వాత శంకరదేవుడు ఉత్తర కాండనూ, ఆయన శిష్యుడు మాధవ దేవుడు బాల (ఆది) కాండనూ వ్రాసినట్లు చెపుతారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బాల కాండలో అహల్యా వృత్తాంతం విపులంగా చెప్పబడింది.

16వ శతాబ్దిలో దుర్గావర్ రచించిన గీతి రామాయణం ప్రచారంలోకి వచ్చింది. దీనికి మాతృక మాధవకందలి రామాయణం. దశరథుడికి సీత పిండ ప్రదానం చెయ్యడం, దండకారణ్యంలో కుహనా అయోధ్యా నగరం సృష్టించడం, సీతను మందోదరి తనయగా వర్ణించడం, రాముని కోసం బయలుదేరే ముందు లక్ష్మణుడు పర్ణశాలకు ముందు మూడు గీతలు గీయడం మొదలైనవి ఈ గీతి రామాయణంలో కనిపించే కొన్ని అవాల్మీకాంశాలు. ఇది గేయాంశం కలిగిన రచన కావడం వల్ల, బహుళ ప్రచారం గడించింది. పైగా దుర్గావర్ మానవ హృదయంలో అణగి ఉన్న దుఃఖ తీవ్రతను వర్ణించడానికి ప్రయత్నించాడు. కాని దురదృష్టం, ఈ రామాయణం పూర్తిగా లభించలేదు.

వైష్ణవ భక్త కవి అయిన శంకరదేవుని శిష్యుడు అనంత కందలి రామాయణం వ్రాశాడు. ఇది భక్తి ప్రధానంగా సాగింది. ఆయన రాముణ్ణి పరబ్రహ్మమని భావించాడు. ఈ రామాయణం భక్తి రసపు ముద్ద అనవచ్చు. అనంతకందలి కూడా బాలోత్తర కాండలు పరిహరించి అయిదుకాండల రామాయణమే వెలయించాడు.

16వ శతాబ్దంలో రామాయణచంద్రిక అనే సంగ్రహ రామాయణం వెలసింది. కలాపచంద్ర ద్విజుడు దీని కర్త. 17వ శతాబ్దిలో అనంతకాయస్థ అనే కవి రామకథను 'రామకీర్తన' అనే పేరుతో వెలయించాడు. ఇది పారాయణ గ్రంథంగా వినుతి కెక్కింది. ఇతర కవులవలె, ఆయన కూడా రాముణ్ణి గురించి చెపుతూ కృష్ణ సంకీర్తనం చేశాడు. ఆ విధంగా అస్సామీ కవులు రామకృష్ణులకు అభేదం పాటించారు.

వైష్ణవ కవుల యుగంలో అస్సామీ భాషలో వచన రచనలు వెలువడడం గమనించదగిన అంశం. శంకరదేవుడూ, మాధవదేవుడూ తమ ఏకాంక నాటికలకు వచనం ఉపయోగించారు. ఆ తర్వాత భట్టదేవుడనే ఒక ఆచార్యుడు సరళమైన శైలిలో భాగవత పురాణం మొదలైనవి వ్రాశాడు. 18వ శతాబ్ది ప్రథమ పాదంలో ప్రముఖ మతాచార్యుడైన రఘునాథ మొహంత రామకథను చక్కని వచనంలో సంతరించాడు. భక్తి భావంతో కథాకథనం కావించాడు. ఇటీవలి కాలంలో (1963-1971)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గౌహతి విశ్వవిద్యాలయం వారు వాల్మీకి రామాయణానికి వచనానువాదం అయిదు సంపుటాలలో ప్రచురించారు.

శంకరదేవుడు నాటికారచన చేసినట్లు ఇంతకుముందు పేర్కొనబడింది. ఆయన రామ విజయ అనే నాటిక వ్రాశాడు. దీనికి సీతాస్వయంవర మనే నామాంతరం ఉంది. ఇందులో రాముడు విష్ణ్వంశ సంభూతుడుగా వర్ణించబడ్డాడు.

అనంతకందలి మహిరావణవధ అనే లఘుకావ్యం వెలయించాడు. రావణుని కుమారుడే మహిరావణుడు. అతడు రామలక్ష్మణుల్ని అపహరించి పాతాళలోకంలో ఉంచుతాడు. ఆతర్వాత హనుమంతుడు వారిని రక్షిస్తాడు. మహిరావణుడు విగతజీవు డవుతాడు.

అంతకుముందు, అనగా 14వ శతాబ్దిలో, హరివరకవి లవకుశుల యుద్ధము అభివర్ణిస్తూ ఒక కావ్యం వెలయించాడు. జైమినీయ మహాభారతం నుంచి కథను స్వీకరించాడు.

ఇవికాక రామాయణ కథలు అభివర్ణించే లఘుకావ్యాలు మరికొన్ని లేకపోలేదు. మందోదరీ మణిహరణం, సీత పాతాళ ప్రవేశం, మహిరావణ వధ, గణక్ చరిత మొదలైనవి ఈ కోవకు చెందినవి. హనుమంతుడు ఒక జ్యోతిష్కుని వేషంలో వచ్చి సీత ప్రేమను పొందాలనుకున్న రావణునికి ఆశాభంగం కలిగించడం ఈ చివరి రచనలోని యితివృత్తం. ఇటువంటి కథలు అవాల్మీకము లని వేరుగా చెప్పనవసరం లేదు. కాని యివి జానపదులకు పరమ ప్రీతి పాత్రములు!

రామకథ జానపద వాఙ్మయంలో ప్రముఖంగా చోటు చేసుకుంది. అలాగే రంగస్థలం మీద కూడా రామకథకు తగినంత ఆదరం లభించింది.

అస్సామీ సాహిత్యాన్ని అధ్యాత్మ రామాయణం కాని యోగ వాసిష్ఠం కాని ప్రభావితం చేసినట్లు కనిపించదు. తులసీదాసు రామచరితమానస్ లోని కొంత భాగం అస్సామీ భాషలోకి అనూదితమయింది.

సత్యేంద్రనాథ శర్మ కథా రామాయణ్ అనే ఒక రామాయణం వ్రాశారు. 1955లో ముద్రితం. లఖేశ్వర్ శర్మ రాజాజీ రామాయణాన్ని అనువదించారు. 336 పుటల ఈ గ్రంథం 1970లో ప్రచురించబడింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మాధవ కందలి వంటి మహాకవి అస్సామీలో రామాయణం రచించినా, అది ప్రచుర ప్రచారం గడించినా, భక్త్యుద్యమం ప్రచారం లోకి వచ్చిన తర్వాత కృష్ణతత్త్వం బాగా వాడుకలోకి వచ్చింది. రామకృష్ణులకు అభేదం పాటించబడింది. అందువల్ల కృష్ణభక్తి రామభక్తిగా పరిగణించబడింది. శ్రీనాథ జానకీ నాథుల మధ్య అభేదం పాటించి అస్సామీ కవులు తమ భక్తి భావాన్ని ప్రదర్శించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

4
ఆంగ్లం

బహు ప్రాచీనమైన భాష సంస్కృత మైతే, ప్రచుర ప్రచారంగల భాష ఆంగ్లం. ప్రపంచ భాషలలో ఆంగ్లం ప్రముఖ మైనదనే అంశం సర్వ విదితం. ఆంగ్లం ద్వారా ఆధునిక విజ్ఞానాన్ని చాలావరకు స్వాయత్తం చేసుకోవచ్చు. ఇది అతిశయోక్తి కాదు. ఆంగ్లం ప్రపంచ జ్ఞానగవాక్షంగా భావించబడుతున్నది. కాగా, ఆంగ్లంలో రామకథా సాహిత్యం వెలువడడంలో ఆశ్చర్యం లేదు. వాల్మీకి రామాయణానువాదాలు అనుసరణలేకాక, కంబరామాయణం తులసీదాసు రామచరితమానస్, అధ్యాత్మ రామాయణం మొదలైనవాటికి కూడా ఆంగ్లానువాదాలు వెలువడడం గమనించదగిన విషయం. రామాయణం గురించి ఆంగ్లంలో విమర్శ గ్రంథాలు, తులనాత్మక పరిశీలనలు మొదలైనవి ఎక్కువ సంఖ్యలోనే వెలువడ్డాయి.

హరిప్రసాద్ శాస్త్రిగారు వాల్మీకి రామాయణాన్ని మూడు సంపుటాలలో వచనంలోకి అనువదించారు. ఈ వచనానువాదం లండన్‌లో ముద్రితం. దీన్ని ఆధారం చేసుకుని ఎలిజబెత్ సీగర్ 'ది రామాయణ' అనే పేరుతో తమ గ్రంథం ప్రకటించారు. రామాయణ మహాభారతాలలో కొన్ని భాగాలను ఆర్.సి దత్‌గారు పద్యరూపంలో అనువదించారు. ఈ పద్యకృతి 1900 లో తొలుత ముద్రించబడింది. దత్‌గారే రామాయణ మహాభారతాల సంగ్రహానువాదాన్ని ప్రత్యేక పద్యకృతిగా ప్రచురించారు. కె.ఆర్. శ్రీనివాస అయ్యంగారు సుందరకాండకు పద్యాకృతి కల్పించి 'ది ఎపిక్ బ్యూటిఫుల్.' అనే పేరుతో ప్రచురించారు. ఈ పద్యానువాదం విమర్శకుల ప్రశంసను చూరగొన్నది. రాబర్ట్ పి. గోల్డ్‌మన్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వాల్మీకంలోని బాలకాండను అనువదించారు. ఇది 429 పుటల గ్రంథం. దీన్ని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్సు వారు ప్రచురించారు.

వాల్మీకి కృతికి పెక్కు వచనానువాదాలు, సంగ్రహానువాదాలు, అనుసరణలు వెలువడ్డాయి. శ్రీయుతులు యస్. చంద్రశేఖర అయ్యరు, పి.పి. యస్. శాస్త్రి, పి. లాల్, మధురం భూతలింగం, సుధామజుందార్, కమలా సుబ్రహ్మణ్యం, యస్. రఘునాథన్ (3 సంపుటాలు), మఖన్‌లాల్ సెన్ ప్రభృతుల అనువాదాలు, అనుసరణలు ముద్రితములయినాయి. వీటిలో కొన్నిటిని భారతీయ విద్యాభవన్ వారు ప్రకటించారు. ఈ సందర్భంగా చక్రవర్తి రాజగోపాలాచారిగారి (రాజాజీ) రామాయణం గురించి చెప్పక తప్పదు. 1957 లో తొలిసారిగా ముద్రితమైన యిది 317 పుటల గ్రంథం. ఈ వచన గ్రంథం పెక్కు ముద్రణల భాగ్యానికి నోచుకోవడమేకాక, డోగ్రీ అస్సామీ మొదలైన భాషలలోకి అనూదిత మయింది. ప్రాచ్య పాశ్చాత్య పాఠకుల మన్ననలు పొందిన రచన యిది. లిఫ్కో రామాయణం కూడా పాఠకుల్ని చూరగొన్నది.

లాలా బైజ్‌నాథ్ అధ్యాత్మ రామాయణాన్ని అనువదించారు. ఇది 1913లో తొలిసారిగా ముద్రిత మయింది. ఆ తర్వాత 1979లో ప్రచురించబడింది.

తులసీదాసు కృతికి ఆంగ్లంలో పెక్కు అనువాదాలు వెలువడ్డాయి. డబ్ల్యు. డౌగ్లాస్ పి.హిల్ (1952), యఫ్. ఆర్. ఆల్చిన్ (1964), ఏ.జి. అట్కిన్స్ (3 సంపుటాలు, 1954), యఫ్. గ్రౌస్ (9వ ముద్రణ), యస్.పి. బహదూర్ (1973), ఆర్. ప్రసాద్ ప్రభృతులు అనువాదకులలో ప్రముఖులు. వీరిలో కొందరు పాశ్చాత్య రచయితలై ఉండడం గమనించదగింది. వీరి అనువాదాలు ఎంతవరకు మూల విధేయాలో చెప్పలేము. కాని, పఠన యోగ్యములై ఉంటాయని మాత్రం చెప్పవచ్చు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కంబరామాయణం కూడా ఆంగ్లానువాదానికి నోచుకున్నది. రాజాజీ, వి.యస్. ముదలియార్ గారలు అయోధ్యాకాండమును ఆంగ్లీకరించారు. కంబరామాయణ సంగ్రహాన్ని కొంత వచనం కొంత పద్యంగా వి.యస్. ముదలియారు అనువదించారు (333 పుటల గ్రంథం). ప్రఖ్యాత నవలా రచయిత ఆర్. కె. నారాయణ్ గారు తమ వచనానువాదాన్ని 1973లో ప్రచురించారు. ఈ వివిధ అనువాదాల వల్ల కంబరామాయణం ఆంగ్ల పాఠక లోకానికి పరిచయం చేయబడింది. రాజాజీ, ఆర్.కె. నారాయణ్ వంటి సుప్రసిద్ధ రచయితలు అనువాదకులు కావడం కంబరామాయణం చేసుకున్న సుకృత మనవచ్చు. అ. శ్రీనివాస రాఘవన్ వంటి ప్రసిద్ధ తమిళ, ఆంగ్ల పండితుడు కంబకవి కృతి నుంచి కొన్ని భాగాలను 'పీల్స్ ఫ్రం కంబన్' (1955) అనే పేరుతో ప్రచురించారు.

సంస్కృతంలో సంతరించబడిన కొన్ని రామ నాటకాలు కూడా ఆంగ్లంలోకి పరివర్తితము లయినాయి. భవభూతి వ్రాసిన ఉత్తర రామచరితను జి.కె. భట్‌గారు, భాసుని అభిషేక, ప్రతిమానాటకాలను ఏ.సి. ఉల్నర్, లక్ష్మణ్ సరూప్ గారలు, కుమార దాసుని జానకీహ రణను సి.ఆర్. స్వామినాథన్ గారు అనువదించారు. రామభక్తుడైన త్యాగరాజు కీర్తనలు చాలా వాటిని సి. రామానుజాచారిగారు సమర్థంగా అనువదించారు. వి. రాఘవన్ గారు కొన్ని ప్రాచీన అలభ్య రామనా టకాలు గురించి అమూల్య విషయాలు పొందుపరుస్తూ ఒక పుస్తకం వెలుగు లోకి తెచ్చారు. కాళిదాస కవి కృత రఘువంశాన్ని 'ది డైనాస్టి ఆఫ్ రఘు' అనే పేరుతో రాబర్ట్ ఆన్టోయిన్ అనువదించారు.

రామకథను గురించి, రామాయణ పాత్రలను గురించి విమర్శ గ్రంథాలు చాలా వెలువడ్డాయి. రైట్ ఆనరబుల్ వి.యస్. శ్రీనివాస శాస్త్రిగారు తమ రామాయణోపన్యాసాలను 1949లో ప్రచురించారు. రామాయణం మానవుని దస్తావేజు - అనే తమ అభిప్రాయాన్ని ఆ ఉపన్యాసాలలో ఆయన సుస్పష్టం చేశారు. సి.వి. వైద్య గారు 'ది రిడిల్ ఆఫ్ ది రామాయణ' (1906) అనే ఆలోచనాత్మకమైన రచనను ప్రచురించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామాయణ గ్రంథులు కొన్ని యిందులో విపులంగా చర్చించబడ్డాయి. మల్లాది వెంకటరత్నం గారు రెండు సంపుటాలలో 'రామ దిగ్రేట్ ఫారో ఆఫ్ ఈజిప్ట్' అనే పుస్తకం 1934లో ప్రచురించారు. వెబర్ అనే పాశ్చాత్య పండితుని సిద్ధాంతం పురస్కరించుకుని వెంకట రత్నంగారు రామకథలోని భారతీయతను సంశయించారు. ప్రాచీన ఈజిప్టుని పరిపాలించిన రెండవ రమెసెస్ (క్రీ. పూ. 1292-1225) చరిత్రకు కృత్రిమ రూపమే రాముని కథ అని ఆయన పేర్కొన్నారు. వెబర్ ప్రభృతుల అభిప్రాయాలను యస్.కె. బెల్వాల్కర్, కె.టి. తెలాంగ్ ప్రభృతులు ఖండించారు. వీరిలో పాశ్చాత్య విద్వాంసులూ కొందరు లేకపోలేదు. కనుక గ్రీకు ప్రభావం రామాయణం మీద లేదని పిండితార్థం. శ్రీపాద్ కృష్ణ బెల్వాల్కర్ (యస్. కె. బెల్వాల్కర్) ఉత్తర రామచరిత్ర లేక 'రామాస్ లేటర్ హిస్టరీ' అనే గ్రంథం 1915లో వ్రాశారు. ఆయన వ్రాసిన ఉపోద్ఘాతం అవశ్య పఠనీయం.

'కన్నడిగుల ఆస్తి మాస్తి' అనే ప్రశస్తి పొందిన మాస్తి వెంకటేశ అయ్యంగారు వాల్మీకి కవితను గురించి సాధికారంగా ఒక గ్రంథం వ్రాశారు. దాని పేరు 'ది పొయెట్రీ ఆఫ్ వాల్మీకి' (1940); రామాయణం లోని రసవద్ఘట్టాలలో ఆవిష్కృతమైన వాల్మీకి కవితా రామణీయకం వివరించబడింది. వాల్మీకంలోని ధర్మం గురించి బెంజమిన్ ఖాన్ ఒక పుస్తకం రచించారు. రామోవిగ్రహవాన్ ధర్మః అనే పుస్తకంలో (ఉప న్యాసాలు) సి. శివరామమూర్తి గారు ధర్మ స్వరూపుడైన రాముణ్ణి గురించి వివరించారు. హెచ్. డి. సంకాలియాగారు చారిత్రక దృష్టితో రామాయణాన్ని పరిశీలించి మంచి రచనలు చేశారు.

కె. సి. ఆర్యన్, సుభాషిణీ ఆర్యన్, అనిల్. కె. బెనర్జీ, పి. బెనర్జీ, ఋస్. ఏ. శ్రీనివాసన్, యస్.యన్ వ్యాస్ ప్రభృతులు రామాయణం లోని వివిధ పాత్రలు, భారతీయ కళలు మొదలైన వాటిలో రాముడు అనే అంశాలను గురించి పుస్తకాలు వ్రాశారు. వి. సీతారామయ్యగారు 'వాల్మీకి రామాయణ' అనే ఉద్గ్రంథం సంతరించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రసిద్ధ దేశభక్తుడైన వి.వి.యస్. అయ్యరు గారు కంబరామాయణ పరిశీలన మనే ఉద్గ్రంథం వ్రాశారు. కంబరామాయణ ప్రాశస్త్యాన్ని తమిళేతరులు గ్రహించడానికి ఈ పుస్తకం బహుధా ఉపకరించింది. వాల్మీకం కంటె కంబ రామాయణమే రసవత్తర మైన కృతి అని అయ్యరు గారి అభిప్రాయం. కంబకవిని గురించి యస్. మహారాజన్ గారు ఒక చిన్న పుస్తకం వ్రాశారు. ఇది పెక్కు భారతీయ భాషలలోకి అనూదిత మయింది. తులసీదాసు గురించి కూడా ఆంగ్లంలో రెండు మూడు పుస్తకాలు వెలువడ్డాయి. ఆ మహాకవిని గురించి మదన గోపాల్ గారు ఒక చిన్న పుస్తకం వ్రాయగా, తులసీదాసు కవితను గురించి సంతరించబడిన వ్యాస సంపుటిని గజేంద్రగారు పరిష్కరించారు.

కంబ, తులసీదాసు రామాయణాలను తులనాత్మకంగా పరిశీలించి యస్. శంకరరాజు నాయుడుగారు ఒక మంచి పుస్తకం 1971 లో ప్రచురించారు. ఇది ఆయన పి హెచ్.డి. సిద్ధాంత వ్యాసం. అలాగే మరొక సిద్ధాంత వ్యాసం తెలుగు, తమిళ రామాయణాలు గురించి 1973లో వెలువడింది. ఇందులో ప్రధానంగా రంగనాథ - కంబరామాయణాల తులనాత్మక పరిశీలన చేయబడింది. దీని రచయిత సి.ఆర్. శర్మ. (చల్లా రాధాకృష్ణ శర్మ). టి. గోపాలకృష్ణ రావుగారు తెలుగు కన్నడ భాషలలోని జానపద రామాయణాలను తులనాత్మకంగా పరిశీలించి పుస్తకం వ్రాశారు (1984). టి. జి. మైన్కర్ గారు వాసిష్ఠ రామాయణ పరిశీలనం అనే గ్రంథం సంతరించారు. వాసిష్ఠ రామాయణాన్ని అధ్యయనం చేసినవారో, దాన్ని గురించి వ్రాసిన వారో తక్కువ సంఖ్యలోనే ఉన్నారు.

రామాయణ విమర్శ అనే పేరుతోనే టి. అమృత లింగంగారు 521 పుటల బృహద్గ్రంథం వ్రాశారు. వాల్మీకి కృతిని చాలా సార్లు చదివినట్లుగా ఆయన తమ మున్నుడిలో పేర్కొన్నారు. తత్ఫలితంగా చాలా పునరుక్తులు, ప్రక్షిప్తాలు, స్వవచోవ్యాఘాతాలుగా చెప్పదగిన శ్లోకాలు మొదలైనవి ప్రస్తుత రామాయణంలో ఉన్నట్లుగా ఆయన పేర్కొన్నారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇందుకు కారణం ప్రసిద్ధ వ్యాఖ్యాత అయిన గోవిందరాజు ప్రభృతులని ఆయన అభిప్రాయం. వాల్మీకి తన రామాయణాన్ని కాండలుగా విభ జించలేదనీ, 10,000 శ్లోకాల కృతిగా రచించాడనీ, రావణవ ధానంతరం అయోధ్యకు తిరిగివచ్చి పట్టాభిషిక్తుడై నాడనీ, అంతటితో కథ ముగిసిందనీ (ఉత్తర కాండం ప్రక్షిప్తం) ఆయన పేర్కొన్నారు. మహాభారతంతో సరి సమానమైన గ్రంథంగా చెయ్యాలనే ఉద్దేశంతో రామాయణాన్ని 24,000 శ్లోకాల గ్రంథంగా తరువాతి వారు తీర్చిదిద్దారనీ అమృతలింగం గారి అభిప్రాయం. రాముడు ఆర్యవీరుడనీ, రాక్షసు లనబడే వారి శౌర్యాన్ని అతడు అణచివేశాడనీ ఆయన నిశ్చితాభిప్రాయం. ఆయన సోదరులైన టి. పరమశివయ్యరుగారు 'రామాయణ అండ్ లంక' అనే పుస్తకం వ్రాశారట.

ప్రసిద్ధ సంస్కృత విద్వాంసులూ రామాయణ మర్మజ్ఞులూ అయిన వి. రాఘవన్ గారు రామాయణం గురించి పెక్కు రచనలు ఆంగ్లంలో చేశారు. జాతీయ అంతర్జాతీయ సమావేశాలలో రామాయణం గురించి పత్రాలు సమర్పించారు. ఆయన వ్రాసిన 'ది గ్రేటర్ రామాయణ' (1973), 'ది రామాయణ ఇన్ గ్రేటర్ ఇండియా' (1975) అనే పుస్త కాలు ప్రశస్తమైనవి. శ్రీలంక, టిబెట్, మంగోలియా, చైనా, జపాన్, కంబోడియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పైన్స్, బర్మా మొదలైన దేశాలలోని రామకథా సాహిత్యం గురించి అద్భుత విషయాలెన్నిటినో పొందుపరుస్తూ ఆయన వ్రాసిన 'ది రామాయణ ఇన్ గ్రేటర్ ఇండియా' పుస్తకం అమూల్యమైనదే కాక అవశ్యపఠనీయం. పుస్తకం చివర ఆయన యిచ్చిన 14 పుటల గ్రంథ సూచిని అలవోకగా పరిశీలించినా, ఆగ్నేయాసియాదేశాలలో రామకథ గురించి జరుగుతున్న పరిశోధన, వెలువడుతున్న రచనలు మొదలైన వాటిని గ్రహించవచ్చు.

సాహిత్య అకాదెమీ వారు 1975, డిసెంబరు 8 నుంచి 12 దాకా నిర్వహించిన మొదటి అంతర్జాతీయ రామాయణ సదస్సులో ప్రాచ్య పాశ్చాత్య విద్వాంసు లెందరో పాల్గొని రామాయణం గురించి అమూల్య

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పత్రాలు సమర్పించారు. ఆ వివిధ పత్రాలను 'ది రామాయణ ట్రడిషన్ ఇన్ ఏషియా' అనే బృహద్గ్రంథంగా (728 పుటలు) అకాడెమీ 1981లో ప్రచురించింది. ఆ గ్రంథ పరిష్కర్తలు రాఘవన్ గారే. (ఈ సదస్సుకి సంబంధించిన నివేదిక అవీ ఇవీలో ఇవ్వబడింది.)

1981 జనవరిలో అకాడెమీ నిర్వహించిన అంతర్జాతీయ రామాయణ సదస్సులో చదవబడిన పత్రాలను 'ఏషియన్ వేరియేషన్స్ ఇన్ రామాయణ' (రామాయణంలో ఆసియాకవులు చేసిన మార్పులు) అనే పేరుతో 1983లో ఒక గ్రంథం ప్రకటించారు (358 పుటలు). దీని పరిష్కర్తలు కె. ఆర్. శ్రీనివాస అయ్యంగారు. ఈ గ్రంథ ద్వయం రామాయణ పరిశోధకులకు బహుధా ఉపకరిస్తుంది అనడం అతిశయోక్తి కాదు.

ఇటీవల అకాడెమీ వారే ప్రచురించిన 'ఏ క్రిటికల్ ఇన్వెన్టరి ఆఫ్ రామాయణ స్టడీస్ ఇన్ది వర్ల్డ్, (మొదటి భాగం) వివిధ రామాయణాలు గురించి రామకథా సంబంధి రచనలు గురించి ఎన్నో విషయాలు తెలుపుతుంది.

వివిధ భారతీయ భాషలలో రామాయణాలు, రామాయణ పాత్రలకు సంబంధించిన రచనలు మొదలైనవి వెలువడుతున్నంతగా, రామాయణానికి సంబంధించిన ప్రసిద్ధ విమర్శ గ్రంథాలు వెలువడడం లేదని చెప్పవచ్చు. కాని ఆంగ్లంలో విమర్శ గ్రంథాలు, వ్యాసాలు అమూల్యమైనవి ఎన్నో వెలువడుతున్నవి. కాగా ఆంగ్లంలో వెలువడుతున్న రామకథా సాహిత్యం పరిశీలనార్హమని చెప్పడం సమంజసం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

5
ఉర్దూ

ఇండో ఆర్యన్ (హైందవార్య) భాషా కుటుంబానికి చెందిన భారతీయ భాష ఉర్దూ. దఖనీ (దక్కను) భాష ఉర్దూకి మూల మని పండితులు చెబుతారు. తొలినాటి ఉర్దూసాహిత్యం చాలావరకు దక్కనులో వర్ధిల్లింది. బీజపూరుకి చెందిన ఆదిల్‌షాహి పాలకులూ, గోల్కొండకు చెందిన కుతుబ్‌షాహి పాలకులూ ఈ సాహిత్యాన్ని యథోచితంగా పోషించారు. కాగా ఉర్దూ భాషాసాహిత్యాలపై భారతీయ భాషా సాహిత్యాల ప్రభావం ద్యోతకం కావడంలో ఆశ్చర్యం లేదు.

ఉర్దూ సాహిత్యంపై రామాయణ ప్రభావం అనే తమ అమూల్య వ్యాసంలో అబ్దుల్ కాదిర్ శర్వరి ఇలా అన్నారు. 'అత్యుత్తమ కావ్యాలలో ఒకటైన వాల్మీకి రామాయణం వల్ల ఉర్దూ భాషా సాహిత్యాలు ప్రగాఢంగా ప్రభావిత మైనాయి.'

తొలినాటి ఉర్దూ రచయితలకు తులసీదాసు రామచరిత మానస్ సుపరిచితమైన గ్రంథమని చెప్పవచ్చు. హిందీ వ్యాకరణ నియమాలు కూడా కొన్ని ఉర్దూలో ప్రవేశించినట్లు చెపుతారు. నేటి ఉర్దూలో క్రియావిశేషణ అసమాపక క్రియను సూచించేందుకు 'సే' వాడతారు. కాని తొలినాటి ఉర్దూ రచయితలు తులసీదాసాది హిందీకవులవలె 'తె' వాడేవారు. ఇటువంటి విశేషాలు మరికొన్ని లేకపోలేదు. తొలినాటి ఉర్దూకావ్యాలు చాలావరకు రామాయణంలా కథాత్మక కావ్యాలు కావడం మరో విశేషం.

ఉర్దూ ఒక ప్రముఖ సాహిత్య భాషగా గుర్తింపు పొందిన తర్వాత కూడా, తులసీదాసు కృతి ఉర్దూ రచయితల్ని ఆకర్షిస్తూనే వచ్చింది. రామచరిత మానస్ లోని కొన్ని పదబంధాలు సామెతలుగానో ఉదాహరణ వాక్యాలుగానో ఉర్దూలోకి ప్రవేశించాయి. వాటిలో కొన్ని ఉర్దూ వ్యావహారిక భాషలో నిలిచిపోయినట్లు చెపుతారు. హనుమాన్ బహర్, గన్‌జల మొదలైనవి హనుమంతుని లంకాదహన వృత్తాంతాన్ని సూచించేవి. అలాగే, రాత్‌భర్ రామాయణ్ సుని, రామనం లిఖె బలతర్ జాయుగి, దిల్‌మే దుష్మన్ మన పర్ రామ్, రామ్‌కీ సీతా కౌన్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వంటి సామెతలు వాడుకలో ఉన్నాయి. ఇవి రామాయణ సంఘటనల్ని సూచిస్తున్నాయని ప్రత్యేకంగా వ్రాయ నవసరం లేదు.

ఇకపోతే ఉర్దూలో రామకథా సాహిత్యం బహుళంగానే వెలువడింది. వాల్మీకి, తులసీదాసుల రామాయణాలకు ఉర్దూ అనువాదాలు, తులసీ దాసు కృతికి ఉర్దూ లిప్యంతరాలు, అనుసరణలు, రామకథా ఘట్టాల సంపుటాలు ఈ సాహిత్యంలో ఉన్నాయి.

ఉర్దూ రామాయణానువాదాలలో సూరజ్ నారాయణ్ మెహర్, సూరజ్ పర్షద్ తసవ్వర్ ప్రభృతులవి ఉత్తమములుగా భావించబడుతున్నవి. వీరే కాక ప్రసిద్ధకవులూ రచయితలూ మరికొందరు రామాయణాన్ని అనువదించారు. పరమేశ్వర్ దయాళ్ రామాయణ్ బాల్మీకి అనే పేరున వాల్మీకి కృతిని 1916లో ఉర్దూవారికి పరిచయం చేశారు. ఒక రచయిత వాల్మీకాన్ని ఆధారం చేసుకుని రామ్ చరిత్ అనే శీర్షికతో నవలగా వ్రాశారు. ఇది మంచి రచనగా ఉర్దూ భాషాభిజ్ఞులు భావిస్తున్నారు. అలాగే రామాయణ కథాఘట్టాలను చక్‌బస్త్, సురూర్ జహనా బాదీలు కమ్మని కావ్యాలుగా తీర్చి దిద్దారు.

భారతీయ సాహిత్య నిర్మాతలలో ప్రముఖులూ, హిందీ ఉర్దూలకు ఎనలేని సేవ చేసిన రచయిత అయిన ప్రేమ్‌చంద్ (1880 - 1936) పిల్లల్ని ఉద్దేశించి రామ్‌చర్చా అనే 346 పుటల పుస్తకం వ్రాశారు. ఇది 1929లో వెలువడింది.

నానక్ లఖ్నవీ లేఖినీ నామం కల నానక్ చంద్ రెండు భాగాలలో రామాయణం సంగ్రహంగా వ్రాశారు. 1940లో రాంబీతీ అనే రామకథాత్మక కావ్యం రచించారు.

1951 లో మరొక రామకథాకావ్యం వెలువడింది. దీనిపేరు సీతారామ్. కర్త తాలిబ్ అలహాబాదీ.

ఉర్దు, ఫారసి భాషల్లో రామాయణ గ్రంథ రచన అనే తమ వ్యాసంలో (ఆంధ్రపత్రిక, మార్చి 29, 1977) శ్రీ వెల్దుర్తి మాణిక్యరావుగారు ఇలా పేర్కొన్నారు. "రెండు వందలకు తక్కువ కాకుండా ఉర్దూభాషలో రామాయణాలు వెలసినవి." గ్రంథకర్తలలో ముస్లిములూ హిందువులూ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉన్నారనీ ఆయన పేర్కొన్నారు. ఆధ్యాత్మ పరంగా విజ్ఞాన్ రామాయన్ అనే పేరుతో శివభరత్‌లాల్ ఒక వచన గ్రంథం వెలయించారు. హైదరాబాదీయులైన హకీం వైస్రాయెగారు రామకథను పద్యకావ్యంగా వ్రాశారు. దోమకొండ సంస్థానాధిపతులైన రాజా రాజేశ్వరరావు అస్గర్ గారు ఒక రామాయణం రచించారు. వీరి రామాయణం పండిత ప్రకాండుల ప్రశంసలు సముపార్జించింది. ఉఫక్ లేఖినీ నామం కల మున్షి ద్వారకా పర్షాద్ గారు మనోహరమైన శైలిలో రామాయణం వ్రాశారు. ఉషక్ లఖ్నవీ వెలయించిన బాల్మీకి రామాయన్ 824 పుటల గ్రంథం. రామ్‌శరబ్ దాస్ జీ జోతిషీ కూడా వాల్మీకాన్ని అనువదించారు.

తులసీదాసు రామచరిత్ మానస్‌కి ఉర్దూలో పెక్కు అనువాదాలు వెలిశాయి. రామ్ శరబ్ దాస్‌జీ జోతిషీ, హకీం వైస్రాయె వహ్మ, నూరుల్ హసన్ నఖ్వీ ప్రభృతులు ఉర్దూ అనువాదకులలో కొందరు.

ఫారసీ భాషలో కూడా రామాయణ రచన సాగిందనీ, రామాయణ మస్నవీలు మూడు లభ్యమైనవనీ వెల్లుర్తి వారు తమ వ్యాసంలో తెలియజేశారు. మస్నవి అతి విశిష్టమైన రచన. భౌతిక ప్రేమను ఆసరాగా గ్రహించి అద్వైత ప్రేమ తత్త్వ పరంగా అది అభివర్ణించబడుతుది. జీవాత్మ పరమాత్మలో లీనం కావడమే ప్రేమకు లక్ష్యంగా పరిగణించబడుతుంది. అక్బర్ కాలంనాటి మున్షి గిరిధర్‌దాస్ వ్రాసింది ఒక రామాయణ మస్నవీ. రెండవ మస్నవీ జహంగీర్ కాలపు సాదుల్లా ముల్లామసీకాశీ వ్రాసింది. మూడవ మస్నవీ రచించినవాడు తుర్క్ ఆలీ షాతుర్క్. ఆయన తన రామాయణ కావ్యానికి ఫరూక్ నామా అని పేరు పెట్టారు. ఇది విశిష్టమైన రచనగా భావించబడుతున్నది. ఫారసీ రామాయణాలలో సీత శీలాన్ని పాతివ్రత్యాన్ని అతి సున్నితంగా అభివర్ణించినట్లు అభిజ్ఞులు చెప్పడం గమనించదగిన అంశం.

ఇలా రామకథ వివిధ రూపాలలో వెలువడడమేకాక ఉర్దూకవుల్ని పాఠకుల్నీ అలరించింది కూడా. ఉర్దూ సాహిత్యాన్ని ప్రభావితం చేసిన కావ్యాలలో రామాయణానికి కూడా సముచితమైన స్థానం ఉండడం పేర్కొనదగిన అంశం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

6
ఒడి(రి)యా

ఒడియా భాషని సాధారణంగా ఒరియా అని వ్యవహరిస్తాము. దానినే ఉత్కల భాష అని కూడా అంటారు. ఇండో - ఇరేనియన్ భాషా కుటుంబానికి చెందినదే అయినప్పటికీ, ఒడియా భాషలోని ఎన్నో మాటలకు మూలం ద్రావిడ భాషలలో కనిపిస్తుందని విజ్ఞుల విశ్వాసం.

ఒరిస్సా (ఒడిశా) లో రామకథ సజీవంగా ఉంది. ఒరిస్సాలోని పెక్కు అడవులు, నదులు, కొండలు, ఊళ్ళు మొదలైనవి రామకథతో సంబంధం కలవిగా పేర్కొనడం పరిపాటి. ఫుల్‌బని జిల్లాలోని ఒక కొండను రామగిరి అని వ్యవహరిస్తారు. కోరాపుట్ జిల్లాలోని పెక్కు స్థలాలు రామాయణంలోని వర్ణనలతో ముడివడి ఉన్నట్లుగా స్థానికుల అభిప్రాయం. రామాయణ శిల్పాలు కూడా ఒరిస్సాలో కనిపిస్తాయి. రామాయణంలోని కథలు వర్ణచిత్రాలలో కూడా అందాలు దిద్దుకున్నాయి. ఒరియా గృహిణి రామవివాహాన్ని వినూత్న పద్ధతిలో తన యింటిగోడ మీద చిత్రిస్తుంది.

ఒడియా సాహిత్య చరిత్రలో 15వ శతాబ్ది బహు విశిష్ట మయింది. ఆ శతాబ్దిలోనే ఒడియా తొలి మహాకవి సరళదాసు (సరళాదాసు) ప్రభవించాడు. పురాణ పద్ధతిలో ఆయన సప్తకాండ రామాయణం, విలంకా రామాయణం వ్రాశాడు. గురుముఖతః విద్య నేర్చినవాడు కాదు ఆయన. పెక్కు యుద్ధాలలో పాల్గొన్న వాడు. ఆయన రచించిన మహాభారతం లేని ఓఢ్ర గృహం లేదనవచ్చు. ఆ మహాభారతంలో కూడా రామకథను పూర్తిగా చొప్పించాడు. అద్భుత రామాయణాన్ని అనుసరించి విలంకా రామాయణం రచించాడు. సహస్ర కంఠుడైన రావణుని సంహరించడం అద్భుత రామాయణంలోని ప్రధాన కథ. ఆ సహస్ర కంఠుణ్ణి సీత సంహరించి తన శక్తి సామర్థ్యాలు ప్రదర్శిస్తుంది. రాముడు సీత సమ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క్షంలో తన పరాజయాన్ని అంగీకరిస్తాడు. సరళదాసు వ్రాసినట్లుగా భావించబడుతున్న సంక్షేప రామాయణం ఒకటి ఒరిస్సా రాష్ట్ర వస్తు ప్రదర్శనశాలలో ఉన్నది. కాని అది సరళదాసు రచన కాదని విజ్ఞులు చెపుతారు. ఈ రచనలన్నీ ప్రజలకోసం, ప్రజల భాషలో, ప్రజల ఛంద స్సులో సంతరించబడడం పేర్కొనదగిన అంశం. సంస్కృత వృత్తాల జోలికి ఆయన పోలేదు. ఈ సందర్భంగా విచిత్ర రామాయణం గురించి రెండు మాటలు చెప్పడం సమంజసం.

విచిత్ర రామాయణంలో కవి తనపేరు సిద్ధేశ్వరదాసు అని చెప్ప కున్నాడు. సరళదాసు అని పేరు మార్చుకోక ముందు ఆయన యీ రామాయణం రచించి వుండవచ్చునని భావించబడుతున్నది. ఈ విచిత్ర రామాయణాన్ని 18వ శతాబ్ది పూర్వార్ధంలో డొంకాడ గోపీనాథ కవి తెలుగువచనంలోకి అనువదించాడు. తెలుగు అనువాదం 1892లో ముద్రితం. ఈ వచనానువాదాన్ని ఆధారం చేసుకుని నరసింహదేవర వెంక టశాస్త్రి, వేల్పూరి వెంకటేశ్వర కవి, కళ్లేపల్లి వెంకట నరసింహమూర్తి ప్రభృతులు పద్యకావ్యాలు వెలయించారు. ఈ వివరాలతోపాటు ఒడియా విచిత్ర రామాయణం గురించి ఒడియా వారికి కూడా తొలిసారిగా తెలియజేసినవారు యశశ్శరీరులు పురిపండా అప్పలస్వామిగారు.

రామాయణం అనగానే ఒరియా వారికి బలరామదాసు పేరు స్ఫురణకు వస్తుంది. ఆయన సంతరించిన జగమోహన రామాయణం అంత ప్రసిద్ధ మైన రచన. వాల్మీకానికి యథానువాదం కాకపోయినా, అది జనప్రియ రామాయణం. అది ఏడుకాండల గ్రంథం. 16వ శతాబ్దిలో జీవించిన బలరామదాసు నాటి పండిత లోకాన్ని ప్రతిఘటించి రచన కావించాడు. శ్రీ చైతన్య ప్రభువుతో ఆయనకి కలిగిన సాహచర్యం విస్మరించరానిది.

బలరామదాసు తన రామాయణంలో మార్పు లెన్నో చేశాడు. ఆయన చెప్పిన కథ యావత్తు ఓఢ్ర దేశంలో జరిగినట్టుగా అనిపిస్తుంది. ఉడుత కథ ఆయన రచనలో ప్రముఖంగా కనిపిస్తుంది. ఆయన వర్ణించిన యుద్ధాలు అప్పటి యుద్ధాలులా కనిపిస్తాయి. ఒరియా వారి ఆచార వ్యవహారాలు, వేషభాషలు, అభిరుచులు - ఒకటేమిటి సమస్తం - ఆయన రామాయ ణంలో చోటు చేసుకున్నాయి. దక్షిణ ఒరిస్సాలో - అనగా గంజాం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కోరాపుట్, ఫుల్‌బని జిల్లాలలో - జగమోహన రామాయణాన్ని దక్షిణీ రామాయణం అని వ్యవహరించడం అలవాటు. ఈ రామాయణం తరువాతి కవులకు మార్గదర్శక మయింది. బలరామదాసు రామచరితా వళి అనే మరొక కృతిని కూడా వెలయించాడు. ఒడియా కవిత్రయంలో చివరివాడైన జగన్నాథ దాసు కూడా ఒక రామాయణం వ్రాశాడు. (సరళదాసు, బలరామదాసు, జగన్నాథదాసు - వీరినే కవిత్రయం అని వ్యవహరిస్తారు.)

సరళదాసు సమకాలికుడైన మార్కండేయదాసు రామాయణ మహో భస కృతి వెలయించాడు. వాల్మీకి రచన దీనికి ఆధారం. పరమశివుడు పార్వతికి రామకథ చెపుతూ వుండగా, మధ్యలో ఆమె నిద్ర పోయిం దట. అది గమనించని పరమ శివుడు కథ చెప్పడం మానలేదు. ఆ కథను అక్కడే చెట్టుమీద కూర్చున్న ఒక చిలుక విని, శివుడు చెప్పిన కథను ఆ చిలుక పాట పాడుతూ ఊరూరు తిరిగిందనీ కథ ఒకటి వాడుకలో ఉన్నది.

వారానిధి దాసనే కవి విలంకా రామాయణాన్ని సంతరించినట్లుగా చెపు తారు. ఈ రచన మీద జగమోహన రామాయణ ప్రభావం కనిపిస్తుంది. అసలు ఈ రచన బలరామదాసుదే అనీ, లేదా ఆయన శిష్యుడెవ రైనా వ్రాసి ఆయనమీది గౌరవం కొద్దీ ఆయన పేరుతో వెలయించి వుండవచ్చుననీ భావించబడుతున్నది. బలరామదాసుకి వారానిధిదాసనే నామాంతరం ఉన్నట్లు కొందరి అభిప్రాయం.

మహేశ్వర దాసు వ్రాసిన టీకా రామాయణం కూడా పేర్కొన దగిన రచన. ఆయన సరళదాసుని అనుసరించి రచన చేశాడు. విషాద సంఘటనల్ని హృదయానికి హత్తుకునేలా చిత్రించాడు.

రాజా ముకుందదేవుని వంశీయుడైన హలధరదాసు అధ్యాత్మరామా యణం అనువదించాడు. ఆయన రచన సరళ సుందరం. ఆయన రచనలు ఒరియా సాహిత్యంలోనే ఉత్కృష్టరచనలుగా భావించబడుతున్నవి. తెలుగు వాడైన గోపాలదాసు (18వ శతాబ్ది) అధ్యాత్మ రామాయణానువాద కులలో ఒకడు. కాని ఆయనది ఒరియాసేత అనడం కంటె స్వతంత్ర రచన అని భావించడం సమంజసం. కవిచంద్ర నరహరి కూడా అధ్యాత్మ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామాయణాన్ని అనువదించాడు. మరో అనువాదకుడు సూర్యమణి చౌ పట్నాయక్ అనే పండితుడు వాల్మీకి రామాయణాన్ని అనువదించాడు. ఇలా వాల్మీకానికి కొన్ని అనువాదాలు వెలిశాయి.

కేశవ త్రిపాఠి అనే కవి పూరిణ రామాయణం వ్రాశాడు. అది వాల్మీకాన్ని గాని జగమోహన రామాయణాన్ని గాని పూర్తిగా అనుసరించ లేదు. పైగా ఆయన తన రామాయణాన్ని పదికాండలుగా విభజించాడు. ఇతివృత్త గౌరవానికి భంగం వాటిల్లని పద్ధతిలో కథను పెంచి వ్రాశాడు. సర యూనదీ తీరాన సీతారాములు రాసలీల నెరపినట్లు ఆయన వివరించాడు.

బలరామదాసు శిష్యుడైన సీతాచరణ దాసు రామాయణ కృతులు ఎన్నో వెలయించాడు. అవి - భక్తి రసార్ణవ రామాయణం, రామగు ణసాగరం, రామరసామృత రామాయణం, రామకావ్యం, జానకీశవిలాసం మొదలైనవి. ఇవి భక్తి రసప్రధానములని పేర్కొనవచ్చు.

కపిలేశ్వర విద్యాభూషణుడు పెక్కు సంస్కృత కృతులను ఒరియా లోకి అనువదించి ప్రచురించి ఒరియా సాహిత్యానికి విశిష్టమైన సేవ చేశాడు. వాటిలో వాల్మీకి రామాయణం ఒకటి. ఇంకా పలువురు రామాయణ సంబంధి రచనలు చేసి, రామకథా సాహిత్యాన్ని విస్తృత పరిచారు. వారిలో పేర్కొనదగినవారు ఫకీర మోహన్ సేనాపతి (వాల్మీకి రామాయణం), భగవత ప్రసాదదాసు (రామాయణం), గోపీనాథ కర్ (విచిత్ర విలంకా), చైతన్య గురు (విలంకా రసామృతం), బిప్రచరణ్ దాసు (రామరసామృత), మధుసూధన దాసు (బాల రామాయణం), పరీక్షితదాసు (అధ్యాత్మ రామాయణం), నరసింగ్ నాథ్ (రఘునాథ కీర్తన్), లింగరాజ మిశ్ర (వాల్మీకి రామాయణ వచనం) ప్రభృతులు.

తులసీదాసు రామచరిత మానస్‌ని అనువదించినవారిలో మధుసూ దన దాసు ఆద్యు డనవచ్చు. అయితే ఆయన ఒరియా సేత అసమగ్రం. అయోధ్య, ఆరణ్యక లంక, ఉత్తర కాండలు మాత్రమే లభించాయి. మానస్‌ని స్వప్నేశ్వరదాసు, జగబంధు మహాపాత్ర, విక్రమదేవవర్మ, త్రినాథ మిశ్ర, రాజ్ కిశోర్ కానుంగో మొదలైన ఆధునిక రచయి తలు అనువదించారు. మైథిలీ శరణ్ గుప్తగారి పంచవటిని బనమాలి మిశ్ర పద్యకృతిగా అనువదించారు. అలాగే వి.యస్. శ్రీనివాస శాస్త్రి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గారి రామాయణోపన్యాసాలను రఘునాథ్ మిశ్ర రామాయణ ప్రబచన పేరుతో అనువదించారు.

పురాణ పద్ధతిలో గాక కావ్యరూపంలో కూడా రామకథ వెలువడింది. జయదేవుని గీతగోవిందం ఒరియా కావ్యాన్ని ప్రముఖంగా ప్రభావితం చేసింది. మంగళ గుజ్జరి, కేదార గుజ్జరి, ధిబాసగుజ్జరి మొదలైన రాగాలలో రామకావ్యాలు సంతరించబడ్డాయి. ఒరియా కావ్యాలు అక్షర ఛందస్సులో వ్రాయబడ్డాయి.

అర్జునదాసు వ్రాసిన రామవిభాకావ్యం ఒరియా సాహిత్యంలోనే విశిష్టమైన కృతిగా భావించబడుతున్నది. మార్కండేయ మహర్షికీ యుధిష్ఠరునికీ మధ్య జరిగిన రామాయణ సంవాదమే యీ కావ్యంలోని ప్రధాన విషయం. ఇది 16వ శతాబ్దిలో వెలువడిన కావ్యం. ధనంజయ భంజా శ్రీరామవిలాసం అన్నే మహాకావ్యం సంతరించాడు. ఆయన వర్ణనలు శబ్దాలంకారాలలో పొదిగిన కారణంగా శ్రవణ సుభగత్వం కలిగి వుంటాయి. గంజాం జిల్లాకి చెందిన కాన్హుదాసు రామరసామృత సింధు వ్రాశాడు. ఇది 108 అధ్యాయాల కావ్యం. ఒక్కొక్క అధ్యాయంలోనూ 108 పద్యాలు. హనుమన్నాటకం అనుసరించి కావ్యనిర్మాణం చేసినట్లు ఆయనే చెప్పకున్నాడు. నీలకంఠ దాసుని రామార్చన చంద్రిక కూడా బృహత్కావ్యమే. ఆయన తనను రామదాసుగా అభివర్ణించుకున్నాడు. సూర్య వంశం గురించి ప్రస్తావిస్తూ అది వాల్మీకి రామాయణంలో పేర్కొనబడలేదనే అంశాన్ని నీలకంఠదాసు పేర్కొన్నాడు. ఉపేంద్ర భంజ శ్రీరామనీలామృతం రచించాడు. సీతా సౌందర్యం, సీతా స్వయంవరం మొదలైన ఘట్టాలను ఆయన రమణీయంగా చిత్రించాడు. ఆయనే వైదేహీశ విలాసమనే విలక్షణమైన కావ్యం వెలయించాడు.

కోయిల పాటల్ని 'కొయిలి' పాటలంటారు. ఒరియాలో కాంతా కొయిలి, శ్రీరామ కొయిలి అనే రెండుపాటల్ని బలరామదాసు రచించాడు. చౌతీస, లీల మొదలైన రూపాలలోను రామకథ రచించబడింది. ప్రాచీననాటక రూపమైన 'యాత్ర' పద్ధతిలోనూ రామకథ చిత్రితం.

ఆధునిక రచయితలు పలువురు రామాయణాన్ని నూతన దృష్టితో వ్రాస్తున్నారు. విమర్శలు వెలువడుతున్నాయి. రామాయణం గురించి

Forwarded Free of Cost and with the
CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar
Education, Govt. India, NEW DELHI.

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్రాసిన ఆధునికులలో గోపీనాథ నంద, చక్రధర్ మోహపాత్ర, రాధామోహన్ రాజేంద్ర, నరేంద్రనాథ్ మిశ్ర, ధనేశ్వర్ మోహపాత్ర, భలభద్ర పాణిగ్రాహి, మనోజ్‌దాస్ ప్రభృతులు పేర్కొనదగినవారు.

ఉపసంహారంగా ఒకటి రెండు మాటలు. 15వ శతాబ్దం నుంచి నేటి దాకా ఒడియాలో రామాయణ సంబంధి రచనలు ఎన్నెన్నో వెలువడినట్లు నిస్సంశయంగా చెప్పవచ్చు. పురాణ పద్ధతిలోనూ కావ్యరూపంలోనూ రామకథ వివరించబడింది. స్వతంత్ర రచనలూ ఎన్నో వెలువడ్డాయి. వాల్మీకి రామాయణానువాదాలు చాలా వెలువడ్డాయి. అధ్యాత్మరామాయణానికి కూడా ఒరియా నేతలు వెలువడ్డాయి. సరళదాసు, బలరామదాసు, కేశవత్రిపాఠి ప్రభృతులు రామచంద్రుని ఓఢ్రవీరునిగా చిత్రించారు. వారి రచనలలో ఒరియా వారి సంస్కృతి సజీవంగా చిత్రించడం జరిగింది. వారు ప్రజలకోసం, ప్రజలభాషలో రచన చేసిన ప్రజాకవులు. రామకావ్యాలు కూడా వెలుగు చూశాయి. పురాణ పద్ధతిలో సంతరించబడిన కృతులు 'దాండీ' వృత్తంలో అందాలు దిద్దుకున్నాయి. దాండీ అంటే వరస అని అర్థం. దాండీ వృత్తం ద్విపద వంటిది. అందులో రెండు పాదాలు ఉంటాయి. గణ నియమం కాని, మాత్రా నియమం కాని, అక్షర నియమం కాని ఉండదు. రామ కావ్యాలు గానానుకూలములు; లయాన్వితములు. దాండీ వృత్తంలో వ్రాయబడిన రామాయణాలు కూడా గానానుకూలములే. మొత్తం మీద ఒడియా భాషలోని రామాయణ సాహిత్యం విస్తృతమైనదనీ, ఒడియావారి సామాజిక జీవన విధానంలో రామకథ కలిసిమెలిసి పోయిందనీ పేర్కొనడం సత్య సన్నిహితం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

7
కన్నడం

14వ శతాబ్దిలో వర్ధిల్లిన కుమార వ్యాసుడు (నారణప్ప) భారతం వ్రాస్తూ యిలా పేర్కొన్నాడు.

"తిణికిదను ఫణిరాయ రామా
యణద కవిగళ భారదలి; తిం
తిణియ రఘువరచరితెయలి కాలిడలు తెరపిల్ల."

8272

[వణికె రామాయణ కవుల భారమునకు
సర్పరాజు. నే నడుగిడ జాలలేను
క్రిక్కిరిసిన ఆ రాజు చరిత్ర లోన.]

రామాయణ కవుల భారం మొయ్యలేక, ఆ ఫణిరాజు సతమతమై పోతున్నాడు. ఆ కిక్కిరిసిన రామచరిత్రలో కాలు మోపే చోటైనా నాకు లేదు! కన్నడంలో రామాయణకవులు అంతమంది ఉన్నారని ఎంత లౌక్యంగా పేర్కొన్నాడు కుమార వ్యాసుడు! కనుకనే ఆయన భారతం రచించి. తృప్తి పడ్డాడు. సాహిత్య సంపద గల ప్రాచీన భాషలలో ఒకటి కన్నడం.

కన్నడ కవుల్ని జైన, వైదిక, వీరశైవ కవులని తద్భాషాచరిత్రకారులు విభజిస్తారు. రామాయణ కవుల్ని కూడా ఇలాగే విభజించి, కన్నడంలో వెలసిన రామకథా సాహిత్యాన్ని పరిశీలించడం సముచితం.

కన్నడ జైన కవులలో రత్నత్రయంగా చిరకీర్తి సముపార్జించిన పంప, పొన్న, రన్నలు సుప్రసిద్ధులు. పొన్న భువనైక రామాభ్యుదయ మనే కావ్యం సంతరించాడు. ఈ తొలి రామాయణం దురదృష్టవశాత్తు నేటికీ అలభ్యం. అంతకు ముందే వెలువడిన (క్రీ.శ. 850) నృపతుంగుని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవిరాజమార్గ మనే లక్షణ గ్రంథంలో రామకథా సంబంధి పద్యాలు కొన్ని ఉదాహరించబడినవి.

ఉపలబ్ధమైన కన్నడ రామాయణాలలో 1140 ప్రాంతంలో జీవించిన నాగచంద్రుని రామచంద్ర చరిత పురాణమనే చంపూకావ్యం మొదటిది. విమల సూరి సంప్రదాయం అనుసరించి వ్రాయబడిన కావ్య మిది. ఆయన అభినవ పంప బిరుదాంకితుడు. కనుకనే రామచంద్ర చరిత పురాణానికి పంపరామాయణ మనే ప్రసిద్ధ నామం కలిగింది. ఇది 16 ఆశ్వాసాల గ్రంథం. కుముదేందుకవి, చంద్ర శేఖరుడు, దేవచంద్రుడు, చంద్ర సాగరవర్ణి ప్రభృతులు రామకథను కావ్యరూపంలో అభివర్ణించారు. ఇవన్నీ జైన రామాయణాలు.

జైన రామాయణాలలోని కథ వాల్మీకానికి భిన్నంగా ఉంటుంది. జైనుల విశ్వాసం ప్రకారం రావణ సంహారం లక్ష్మణుని వల్ల జరుగుతుంది. రాముడు చరమ జీవి. రావణుడు ప్రతివాసుదేవుడు. రామలక్ష్మణులు బలదేవ వాసుదేవులు. రావణవధానంతరం లక్ష్మణునికి నరకప్రాప్తి లభిస్తుంది. రావణపాత్రను జైన కవులు ఉదాత్తంగా చిత్రించారు. దశకంఠుడు జైన ధర్మ పరాయణుడు. వాల్మీకి రామాయణాంతర్గత విషయాలను పరోక్షంగా విమర్శించడం జైన రామాయణాలలో కనిపిస్తుంది. ఏది యెలా ఉన్నా, జైనకవులు అద్వితీయమైన తమ కవితా శక్తిచే నేటికీ జీవించగలుగుతున్నారు. అభినవపంపడు కూడా మహాకవి కావడం వల్ల, ఆయన కృతి నేడు కూడా ప్రచారంలో ఉన్నది. ఆయన కవిత మనోజ్ఞంగా ఉంటుందని అభిజ్ఞులు చెపుతారు.

కన్నడ జైనకవులు ఎంత ప్రసిద్ధు లైనా, వాల్మీకి రామాయణం పెక్కు కన్నడ కవుల్ని - ముఖ్యంగా - వైదిక కవుల్ని బహుధా ఆకర్షించింది. ఈ వైదిక రామాయణాలలో తొరవె రామాయణం బహు ప్రసిద్ధ మయింది. దీని కర్త నరహరి. కుమార వాల్మీకి బిరుదాంకితుడు. 1500 నుంచి 1650 మధ్యకాలంలో ఆయన జీవించినట్లు కవి చరిత్రకారుల అభిప్రాయం. వాల్మీకిని అనుసరించి భాస్కరుడు తెలుగులో రామాయణం వ్రాయగా, ఆ రామాయణాన్ని కుమార వాల్మీకి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కన్నడంలోకి పరివర్తించినట్లు కర్ణాటక కవి చరిత్రకారులు వ్రాసినట్లుగా తెలియవస్తున్నది. కాని యిది సత్య సన్నిహితంగా కనిపించదు. తొరవె అనే గ్రామం బిజాపురం దగ్గరలో ఉంది. ఆ గ్రామంలో వెలసిన నరసింహస్వామి వారికి అంకితంగా నరహరి రామాయణ రచన కావించాడు. అందువల్ల ఆ రచన తొరవె రామాయణంగా వాడుకలోకి వచ్చింది. ఇది షట్కాండ రామాయణం. (ఉత్తర కాండం లేదు.) 5080 షట్పదీవృత్తాల గ్రంథ మిది. యుద్ధ వర్ణనలు ఈ గ్రంథంలో కొంచెం దీర్ఘములని పండితుల అభిప్రాయం. కుమార వాల్మీకి ప్రదర్శించిన భక్తి ప్రపత్తులు పేర్కొనదగినవి. ఆ భక్తి ప్రపత్తుల వల్లనే ఈ రామాయణం సజీవంగా ఉన్నట్లు చెపుతారు. ఆయన దృష్టిలో రాముడు సాక్షాత్ మహా విష్ణువే. రావణుడు తలపెట్టిన యజ్ఞానికి భంగం కల్పించాలనే ఉద్దేశంతో రావణుని సమక్షానికి మందోదరిని కొప్పు పట్టి ఈడ్చి తెచ్చిన ఉదంతం ఈ రామాయణంలో చోటు చేసుకుంది.

వాల్మీకం అనుసరించి తిమ్మరుసు (1650 ప్రాంతం) మార్కండేయ రామాయణం వ్రాశాడు. మార్కండేయుడు యుధిష్ఠరునకు రామ కథను వివరించినట్లుగా వ్రాయబడడం వల్ల దీనికి మార్కండేయ రామాయణ మనే పేరు వచ్చింది. 1800 ప్రాంతం వాడైన శంకర నారాయణ కవి శంకర రామాయణం (అధ్యాత్మ రామాయణం) రచించాడు. హరిదాసు మూలబల రామాయణం వ్రాశాడు. వెంకామాత్యుడు శ్రీమద్రామాయణం (సుందరకాండం) రచించాడు. ఇంకా మరికొన్ని రామ కథలు వెలువడినాయి. సుప్రసిద్ధ కవులైన కువెంపు (కె.వి. పుట్టప్ప) జనప్రియ వాల్మీకి రామాయణం రచించారు. సి.యస్. శ్రీనివాస అయ్యంగారు వాల్మీకి రామాయణ వచనానువాదం (2 సంపుటాలు) వెలయించారు. దేవుడు నరసింహశాస్త్రిగారు శ్రీ మద్వాల్మీకి సంగ్రహ రామాయణం సంతరించారు. మాస్తి వేంకటేశ అయ్యంగారు ఆదికవి వాల్మీకి అనే ప్రశస్త విమర్శ గ్రంథం వ్రాశారు. 15వ శతాబ్ది వాడైన బత్తలేశ్వరు డనే వీరశైవ కవి రామాయణం రచించాడు. కాని అది ప్రస్తుతం లభించడం లేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇలా కన్నడంలో జైన, వైదిక, వీరశైవ కవులు రామాయణ రచన చేయడం కొనియాడదగిన విషయం. వాల్మీకాన్ని అనుసరించి తొరవె రామాయణం వెలువడినప్పటికీ అందులో అవాల్మీకాంశములు చోటు చేసుకున్నాయి. ఆనంద, అధ్యాత్మ రామాయణాలలోని కొన్ని విషయాలు తొరవె రామాయణంలో కనిపిస్తున్నాయి. సీతా స్వయంవరానికి రావణుడు అరుదెంచుట, శివధనుస్సు నెత్తబోయి పరాభవం చెందుట, దశరథుని బాణానికి హతుడైన మునిబాలుని పేరు తాండవు డనుట, వనవాస దుఃఖితుడైన రాముణ్ణి జాబాలి ఓదార్చుట, శిలారూపమున ఉన్న అహల్య రాముని పాదస్పర్శ వల్ల పూర్వాకృతిని పొందుట, శివధనుర్భంగానికి పిదప అసూయాగ్రస్తులైన రాజకుమారులు రామునిపై దాడి చేసినట్లు వారిని రాముడు జయించినట్లు చెప్పుట, వనవాసకాలం పధ్నాలుగు సంవత్సరాలు ఆహారనిద్రలు పరిత్యజించి లక్ష్మణుడు సీతారాములను సేవించుట, మరణ సమయంలో వాలి రాముణ్ణి విష్ణువుగా గుర్తించి స్తుతించుట, విభీషణుని వల్ల కుంభకర్ణుడు ధరించిన జీవరత్నం విషయం తెలుసుకుని ఆ జీవరత్నాన్ని ఖండించి రాముడు ఆ పిదప కుంభకర్ణుని వధించుట, చివరి సారిగా యుద్ధభూమికి బయలుదేరిన రావణుడు అంతకు ముందు తన సిరిసంపదలను దానము చేసినట్లు చెప్పుట మొదలైన విషయాలు ఎన్నో తొరవె రామాయణంలో కానవస్తున్నవి. తొరవె రామాయణం నేటికీ ప్రచారంలో ఉండడానికి ముఖ్య కారణం అందులో ప్రదర్శితములైన భక్తి ప్రపత్తులే. కుమార వాల్మీకి కవిత అభినవ పంపడైన నాగచంద్రుని కవితవలె అంత ప్రశస్తమైనది కాదని పండితుల అభిప్రాయం.

రామకథా సంబంధి రచనలు కావించిన ఆధునికులు చాలా మంది ఉన్నారు. ముద్దణ లేఖినీ నామం గల కె. లక్ష్మీనారాయణప్ప రామాశ్వమేధం రచించారు. ఇది ప్రశస్తరచనగా పేరు పెంపులు గడించింది. బెల్లవి నరహరి శాస్త్రి రామాయణ నాటకం వ్రాశారు. రంగభరత అనే నాటకం రచించారు శ్రీరంగ గారు. యం.బి. శంకరరావు, తిమ్మప్పయ్యలు రామాయణ కథాసారమాలిక, నవనీత రామాయణములనే పద్యకృతులు వెలయించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ సందర్భమున కువెంపుగా సుప్రసిద్ధులైన కుప్పళ్లి వెంకటప్ప పుట్టప్ప గారు రచించిన శ్రీరామాయణ దర్శనం గురించి ప్రస్తావించడం అవసరం. సుమారు 22 వేల పాదాల మహాకావ్య మిది. భారతీయజ్ఞానపీఠం వారి పురస్కారమును పొందిన ఈ కావ్యరాజం విశ్వసాహిత్యంలో స్థానం పొంద దగిందని కొందరు విమర్శకులు భావిస్తున్నారు. ఈ ఉద్గ్రంథం పై సమీక్షా గ్రంథాలు పది పన్నెండు దాకా వచ్చినవట. మరి ప్రశంసాత్మక వ్యాసాలు ఎన్ని వెలువడ్డాయో! చన్నాప్రగడ జయలక్ష్మి గారు విశ్వనాథ కువెంపుల రామాయణాలను తులనాత్మకంగా పరిశీలించి పి.హెచ్.డి. పట్టం పొందారు; కన్నడములో రామకథ అనే పుస్తకం కూడా వ్రాశారు.

మహా ఛందస్సులో కువెంపు రామాయణ రచన సాగించారు. రామ కృష్ణ వివేకానంద అరవిందాది మహనీయుల ప్రభావం ఆయనపై ప్రగాఢంగా ఉన్నది. సమన్వయం, సర్వోదయం, సంపూర్ణదృష్టి తమ కావ్యానికి ప్రాతిపదికలై ఉన్నట్లు ఆయన పేర్కొనడం గమనించదగింది. నేటి ప్రపంచ సమస్యలను పరిష్కరించుటకు రామకథ తోడ్పడగలదని ఆయన విశ్వాసం.

పుట్టప్ప తమ కావ్యాన్ని అయోధ్య, కిష్కింధ, లంక, శ్రీ సంపుటాలని నాలుగు ఖండాలుగా విభజించారు. వాల్మీకాన్ని జైనరామాయణాలను అనుసరించారు ఆయన. కిష్కింధా నివాసులు కపులు కారు; కపిధ్వజులు. రుమ, తారలు పతివ్రతలు. వాలి మరణానంతరం తార సహగమనం చేస్తుంది. రావణుడు రాజనీతిజ్ఞుడు. సీతలో పతివ్రతా గుణమును గుర్తించి, ఆమెకు నమస్కరించిన మహనీయుడు. మందోదరి సచ్ఛీల. అగ్నిప్రవేశం కావించి సీత తన పతివ్రతా ధర్మాన్ని పాదుకొల్పగా, రాముడు కూడా అగ్నిప్రవేశం ద్వారా తన ఏక పత్నీవ్రతాన్ని నిరూపించుకుంటాడు. ఇలాంటి విశేషాలు ఆయన కావ్యంలో గోచరిస్తాయి. రామ రావణ యుద్ధం ఆర్యద్రావిడ వైరానికి ఫలిత మని ఆయన భావించారనీ, ఈ ఆర్యద్రావిడ సంఘర్షణ ఆయన కృతిలో ప్రస్తావించడం జరిగిందనీ అభిజ్ఞులు చెపుతారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కువెంపు శూద్ర తపస్వి అనే ఒక నాటకం వ్రాశారు. ఇందులో శంబుక వృత్తాంతం అభివర్ణితం.

ఉత్తర రామాయణ కథ కూడా కన్నడ రచయితల్ని ఆకర్షించింది. లక్ష్మీశుని (1550 ప్రాంతం) జైమినీ భారతంలోని ఉత్తర రామాయణ కథ నలుగురినీ ఆకర్షించేలా ఉన్నది. కవి నారాయణ, నరసప్ప ప్రభృతులు షట్పదీ ఛందస్సులో ఉత్తర రామాయణాలు వ్రాశారు. వి.యస్. రామకృష్ణగారు లక్ష్మీశన మహాకావ్య అనే విమర్శ గ్రంథం వెలయించారు. లక్ష్మణ విరూపాక్ష జోషి కావ్య రామాయణం సంతరించారు.

సంస్కృతంలోని రామకథా సంబంధి రచనలు కొన్నిటికి కన్నడ రూపాంతరాలు వెలసినవి. వాటిలో సుప్రసిద్ధ విద్వాంసులు యస్.వి. పరమేశ్వర భట్టుగారి కన్నడ రఘువంశం పేర్కొనదగింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

8
కాశ్మీరీ

కాశ్మీరులో వెలువడిన సంస్కృత సాహిత్యంలో రామకథా ప్రసక్తి కనిపిస్తుంది. చివరికి ఆలంకారిక గ్రంథాలలో కూడా రామ ప్రశంస కానవస్తుంది. మమ్మటుడు తన కావ్య ప్రకాశలో 'రామాదివద్ వర్తి తవ్యం న రావణాదివత్' అని పేర్కొన్నాడు. రామునివలె ప్రవర్తించాలి; అంతే కాని రావణునివలె కాదు - అని ఆయన ఉద్బోధించాడు. బృహత్కథామంజరి రచించిన క్షేమేంద్రుడు రామాయణ మంజరి కూడా రచించాడు. ఇది వాల్మీకానికి సంక్షిప్త రచన కాదు. కొన్ని భాగాలు పెంచి వ్రాసినట్లు అభిజ్ఞుల అభిప్రాయం. సోమదేవుని కథాసరిత్సాగ రంలో రామాయణ కథలు కొన్ని ఉదాహరించబడిన విషయం విజ్ఞులకు తెలియంది కాదు. వాటిలో కొన్ని అవాల్మీకాలు.

కాశ్మీరులోని స్థలనామాలు (రామకుండం, సీతాకుండం), సామెతలు, కొన్ని పదబంధాలు మొదలైన వాటిని పరిశీలిస్తే, రామకథ కాశ్మీర భాషను ఎంతగా ప్రభావితం చేసిందో విదిత మవుతుంది. ఇంద్ర ధనుస్సుని రామభద్రుని దూని (ధనుస్సు) అనే పేరుతో వ్యవహరిస్తారు. వ్యథాభరితమైన దీర్ఘకథకు కాశ్మీరీ భాషలో రామాయణం పర్యాయపద మయింది. తెలుగువారిలా రామాయణ మంతా విని సీత రాముడి కేమవుతుంది? అని అడిగినట్లు, కాశ్మీరీలు కూడా 'రాత్రంతా నేను రామాయణం చెప్పాను; తెల్లవారిన తర్వాత రాముడు సీతకేం అవు తాడని నువ్వడిగావు' అంటారు. (రాతస్ వొన్మయ్ రామాయణ్ ; సుభన్ ప్రుష్మం రామ్ క్యా వాతిహే సీతాయె). రావణ శబ్దానికి రావణు డనీ, భ్రష్టు డనీ అర్థాలున్నాయి. ఆధునిక కవులు కొందరు విషాద సన్నివేశాలను చిత్రించేటప్పుడు సీతారాముల పేర్లు ఉపయోగిస్తారు. కాగా కాశ్మీరీల జీవన విధానంతో రామకథ ముడివడినట్లు చెప్పవచ్చు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాశ్మీరీ జానపద సాహిత్యంలో కూడా సీతారాములకు సంబంధించిన గాథలు అనేకం కనిపిస్తాయి. సీతారాములు పడిన కష్టాలూ, లక్ష్మణుని అనురాగ పూరితమైన భక్తి భావం మొదలైనవి కాశ్మీరీ హిందువుల్నే కాదు హైందవేతరుల్ని కూడా ఆకట్టుకున్నాయి. కాశ్మీరీల పెళ్లిపాటలు, అప్పగింతపాటలు మొదలైన వాటిలో సీతారామ ప్రసక్తి బహుళంగానే కనిపిస్తుంది. అయినా కృష్ణునికి సంబంధించిన గేయాలే ఎక్కువగా ఉన్నట్లు నిర్వివాదంగా చెప్పవచ్చు. రామకథ కాశ్మీరీలకు సుపరిచితమైనదే అయినా, కృష్ణకథకు తర్వాతనే రామకథ కాశ్మీరీ సాహిత్యంలో ప్రవేశించిందని అభిజ్ఞులు భావిస్తున్నారు.

కాశ్మీరీ బాలబాలికల అక్షరాభ్యాసం ఒమఒమ్ (ఓమ్) అనే మాటతో ఆరంభ మవుతుంది. తర్వాత ఓమ్ స్వస్తిసిద్ధం అనే వాక్యంలోని ఓమ్ స్వస్తి (స్వయంసో, త్యవిస్తె) పలక మీద దిద్దిస్తారు. ఆ తర్వాత శ్రీరాముని పాఠం ప్రారంభ మవుతుంది. రాము డంతటి గొప్ప వాడివి కావాలని గురువు శిష్యుణ్ణి ఆశీర్వదిస్తాడు.

కాశ్మీరీ భాషకు చెందిన కష్టవరి మాండలికంలో కూడా రామకథాత్మకము లైన పెళ్లి పాటలు ఉండడం గమనించదగిన విషయం. ఎన్నో గేయాలలో రామకథలోని ముఖ్యఘట్టాలు శక్తి మంతమైన జీవద్భాషలో వివరించబడ్డాయి. సీత ఆత్మకథ వంటి ఒకగేయం ఉంది. అది మూర్తీభవించిన శోకం అనడం అత్యుక్తి కాదు. సీత రాముడిని పరంధాముడని (పరమదాం) సంబోధిస్తుంది. హృదయాన్ని కదిలించే యీ గేయం 19వ శతాబ్దిలో వెలువడిన ప్రకాశ్ రామాయణంలోకి చొప్పించబడింది. అనగా ఇది కాశ్మీరీలను ఎంతగా ఆకట్టుకుందో ఈ విషయం వ్యక్తం చేస్తున్నది. ఈ గేయంలోంచి కొన్ని పంక్తులు.

"స్వస్తి, స్వస్తి రామా! అని జయ పెడుతూ
వచ్చెనపుడు హనుమంతుడు, సందేశహరుడు.
'తొలగిపోయెనమ్మా ఎడబాటు
వచ్చేనమ్మా రాముడు నీ కడకు'
అని వినగానే, వచ్చెను పోయిన ప్రాణం.
అయిదు రోజులు గడిచిపోయెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఏమి చేశానో పాపం
ఎవరు చేశారో దుర్బోధం?
ఆ దేవుడికే తెలియాలి
నారెక్కలు విరిచినట్లయింది
మొగ్గలోనే వాడిపోయాను
లక్ష్మణుడు వచ్చాడు మళ్లీ
నన్ను వంచించడానికి
అడవికి తీసుకువెళ్ళడానికి.
అడవిలో నన్ను విడిచిపెట్టాడు
పట్టపగలే చీకటే క్రమ్ముకుంది
అర్ధరాత్రి సమయాన లవకుశులు పుట్టారు
అంతమయిందనుకున్నాను నా దురవస్థ
అయినా నువ్వు నీ చాపల్యం మానలేదు......
నామీదికి గురి పెట్టావు బాణం...... రామా!
విధి మరేమి రాసిందో నా నుదుట
లేకుంటే ఎందుకింత పరాభవం?
అడగిపోతాను నేను భూమిలోకే"

కాశ్మీరులో రామకథ బాగా ప్రచారంలో ఉన్నప్పటికీ, 19వ శతాబ్దికి ముందు రామాయణం కాశ్మీరీ భాషలో వెలువడక పోవడం ఆశ్చర్యకరమైన విషయం. కాని 15వ శతాబ్ది మధ్యభాగంలోనే కృష్ణకథాత్మక కావ్యం వెలుగులోకి వచ్చింది. దాని పేరు బాణాసుర కథ లేక బాణాసురవధ. రాధాకృష్ణ ప్రణయ తత్త్వం బహుశః కాశ్మీరీకవుల్ని బహుధా ఆకర్షించివుండవచ్చు. 1843లో కాశ్మీరీ తొలిరామాయణం వెలువడింది.

ఏది ఎలా ఉన్నా, మొగలుల కాలంలో పారశీకంలో వ్రాయబడిన రామాయణం కాశ్మీరం ప్రవేశించింది. అప్పటికే సంస్కృతానికి బదులుగా పారశీకం రాజభాషా గౌరవం సముపార్జించింది. పారశీకం మస్నవీ వాడుకలోకి వచ్చింది. కనుకనే శృంగార ప్రధానమైన కృష్ణతత్త్వం పాలకుల్నీ కవుల్నీ ఆకర్షించగలిగింది.

పారశీక రామాయణంతో పాటు వాల్మీకం, అధ్యాత్మ రామాయణం,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామునికి సంబంధించిన పౌరాణిక గాథలు మొదలైనవి కాశ్మీరీ రామాయణ రచనకు కారణా లయినాయి.

ఆ తర్వాత మరికొన్ని రామాయణాలు వెంటవెంటనే వెలుగు చూశాయి. సిక్కుల కాలంలో వారి భజన సంప్రదాయం, రామలీలా సంప్రదాయం కాశ్మీరీలను ఆకర్షించాయి. అలాగే తులసీదాసు రామచరిత మానస్ పదిమందినీ ఆకట్టుకుంది. తర్వాత డోగ్రాల పరిపాలనలో రామకథ బాగా ప్రచారంలోకి వచ్చింది. పైగా వారి అభిమానదైవం రాముడు. అందువల్ల రామకథాత్మక కావ్యాలు వెలుగులోకి రావడంలో వింత లేదు.

తొలి కాశ్మీరీ రామాయణంపేరు శంకర రామాయణం. మహారాజా రాణ్‌బిర్‌సింగ్ కాలంలో అది శారదా లిపిలోంచి దేవనాగరిలిపిలోకి వ్రాయబడింది. వ్రాతప్రతిగానే ఉంది.

ముద్రణ భాగ్యం పొందగలిగిన కాశ్మీరీ రామాయణం ప్రకాశ రామాయణం. కర్త దివాకర ప్రకాశభట్ట. 1846లో రచించబడిన యీ కృతి దేవనాగరి, పారశీకం, రోమన్ లిపులలో ముద్రిత మయింది. రోమన్ లిపిలోని యీ రామాయణాన్ని జార్జి ఏ. గ్రియర్సన్ పరిష్కరించి ప్రకటించాడు. ఇందులో శ్రీరామావతార చరిత్ర లవకుశ యుద్ధ చరితలు ఉన్నాయి. పారశీక రామాయణ (మస్నవి) ప్రభావం దీనిమీద ఉన్నట్లు అభిజ్ఞుల విశ్వాసం. రావణుని చెల్లెలి ప్రోద్బలం కొద్దీ సీత రావణుని చిత్రం వెయ్యడం, అగ్ని పరీక్షకు తర్వాత సీత వాల్మీక్యాశ్రమం ప్రవేశించి రాముడు ఎంతగా అర్థించినా తలుపు తియ్యకపోవడం వంటి సన్నివేశాలు ఇంచుమించు ఒకే విధంగా ఈ రెండు రామాయణాల లోనూ చిత్రించబడ్డాయి.

తరువాతి కాశ్మీరీ రామాయణం. విష్ణుప్రతాప రామాయణం. 1913లో విష్ణుకౌల్ అనే కవి దీన్ని రచించాడు. ఆ తర్వాతిది నీలకంఠ శర్మ 1919-1926 సంవత్సరాల మధ్య వ్రాసిన శర్మ రామాయణం. ఇది తులసీదాసు కృతి ననుసరించి వ్రాయబడింది. 1927 లో తారా చంద్ రచించిన రామాయణం అయిదవ కాశ్మీరీ రామాయణం. చివరిది 1940 లో అమర్‌నాథ్ రచించిన అమర్ రామాయణం. ఆనంద్ రామ్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

త్రిశల్ వ్రాసిన ఆనంద్ రామాయణం ఆయన వారసు వద్ద ఉన్నట్లు తెలియవస్తున్నది.

ఇలా ఆరేడు రామాయణాలు వెలసినా, ఒక్క ప్రకాశ్ రామాయణమే అచ్చయింది; కడమవి వ్రాతప్రతులుగానే ఉన్నట్లు చెపుతారు. ఈ రామాయణ కర్తలు తమ అభిరుచులను పురస్కరించుకొని కొన్ని కథాఘట్టాలు పెంచి వ్రాశారు. కొన్నిటిని పరిహరించారు. కొన్ని కొత్తకథలు చేర్చారు. గుహుడు, శబరి - వీరిద్దరినీ ఆధారం చేసుకుని హరిజనోద్ధరణ అనే విషయాన్ని అమర్ రామాయణ కర్త వివరించాడు. వాలి మరణానంతరం తార సుగ్రీవుణ్ణి వరించిన సన్నివేశాన్ని ఆధారం చేసుకుని అమర్ రామాయణం విధవా వివాహాన్ని ప్రస్తావించింది.

అన్ని కాశ్మీరీ రామాయణాలలోనూ రామగీత కనిపిస్తుంది. అలాగే సీత జన్మవృత్తాంత విషయంలోనూ ఏకవాక్యత కనిపిస్తున్నది. అయితే యిది అవాల్మీకం.

సీత రావణుని కుమార్తె అనీ, జ్యోతిష్కుల సలహా ననుసరించి పుట్టిన మరుక్షణమే ఆమెను మిధిలలో భూమిలో ఉంచారనీ, క్షామసమయంలో పొలాలు దున్నుతూ వుండగా జనకుడికి ఆమె లభించిందనీ శంకర రామాయణం చెబుతున్నది.

ప్రకాశ రామాయణంలో ఒక మార్పు చేయబడింది. సీతను ఒక పెట్టెలో ఉంచి, ఆ పెట్టెను ఒక నదిలోకి విసిరివేశారనీ, అది కొట్టుకుపోయి ఒడ్డు చేరగా దాన్ని రజకు డొకడు తీసుకువెళ్ళి జనకమహారాజుకి సమర్పించాడట!

సీత మందోదరికి పుట్టినట్లు విష్ణుప్రతాప రామాయణ కథనం. శర్మ రామాయణ మేమో తులసీదాసు ననుసరించింది. తారాచంద్ రామాయణం ప్రకారం కొందరు ఋషులు కుండెడు నెత్తురు రావణునికి బహూకరించగా, అత డాకుండను జనకపురంలో పాతిపెట్టమని ఆజ్ఞాపిస్తాడు. జనకుడు కనుక ఆ కుండను పైకి తీసినట్లయితే, అతనికి మరణప్రాప్తి అవుతుందని రావణుని నమ్మకం రావణుడూ జనకుడూ విరోధులు. ఇది కొంతవరకు అద్భుత రామాయణంలోని కథనంతో ఏకీభవిస్తున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అమర రామాయణంలో ఇలా ఉంది; రావణుడు తన పూర్వజన్మలో ఒక సుందరాంగిని మానభంగం చేసినట్లు, కసి తీర్చుకునేందుకు ఆమె ఉత్తర జన్మలో రావణుని కుమార్తెగా జన్మించినట్లు చెప్పబడింది. తనకు బహూకరించబడిన రక్తభాండాన్ని రావణుడు మందోదరికి ఇచ్చాడనీ, ఆమె ఆ నెత్తురు తాగి గర్భం ధరించిందనీ, వెంటనే రావణుడు గర్భస్రావం చేయించి ఆ పిండాన్ని కుండలో ఉంచి జనకపురిలో పాతిపెట్టించాడనీ చెప్పబడింది. ఇది జైనుల ఉత్తర పురాణంలోని కథనాన్ని పోలి వుంది.

కాశ్మీరీ రామాయణాలన్నీ ప్రధాన కథను ఇంచుమించు ఒకే విధంగా చిత్రించాయి. ఎటొచ్చీ సీత పుట్టుక, లవకుశుల పుట్టుక, భూదేవి ఒడిలో సీత అదృశ్య మగుట మొదలైన కొన్ని విషయాలలో మాత్రం ఏకవాక్యత కనిపించడం లేదు. మంచి చెడుల మధ్య సంఘర్షణ ఏర్పడినా, అంతిమ విజయం మంచిదే అన్న అంశాన్ని ఆ రామాయణాలు వ్యక్తీకరించాయి. ఎన్నటికైనా రామరాజ్యం ఏర్పడాలనీ అవి తెలియజేశాయి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

9
గుజరాతీ

గుజరాతీ భాష అనగానే 'వైష్ణవ జనతో తేనే కహియే - జే పీడ పరాయి జాణేరే' అనే మధుర మనోహర గేయం స్ఫురణకి వస్తుంది, గుజరాతీలు కానివారికి. 15వ శతాబ్ది ఉత్తరార్థంలో నివసించిన ప్రముఖ భక్తకవి నరసింహా మెహతా రచించిన గేయ మిది. జాతిపిత గాంధీజీకి పరమ ప్రీతి పాత్రమైన యీ గేయం గంభీర భావ బంధురం. ఆయన రచనలో రాధాకృష్ణుల ప్రేమ బహుళంగా వర్ణించబడింది. ఆతర్వాత వల్లభాచార్యుని భక్త్యుద్యమం గుజరాతీలను ప్రముఖంగా ఆకర్షించింది. జైన, వైష్ణవ మతాల ప్రాబల్యం వల్ల కాబోలు రామాయణ కావ్యానికి గుజరాతులో పలుకుబడి అంతగా లభించలేదు. అయినప్పటికీ, ప్రాచీనకవులనూ వారి కావ్యాలనూ కనక పరిశీలిస్తే 1370 - 1852 - ఆ ప్రాంతాల సుమారు 50 మందికి పైగా పూర్తి రామాయణమునో లేదా రామకథా సంబంధమైన రచనలో చేసినట్లు తెలియవస్తున్నది. ఆ తర్వాత కూడా రామకథాత్మక రచనలు చాలా వెలువడ్డాయి.

భక్తి గేయరచన నరసింహ మెహతాతో ప్రారంభ మైనట్లు గుజరాతీ విద్వాంసులు చాలాకాలం దాకా భావించారు. కాని తర్వాతి పరిశోధనలవల్ల, 1371లో అశైయ్‌త్ అనే కవి రామలీలల్ని అభివర్ణిస్తూ కొన్ని పాటలు వ్రాసినట్లు తెలియవచ్చింది. అలాగే భలన్ (1426 - 1500), భీమ (1428) ప్రభృతులు రామకథాత్మక గేయాలు సంతరించారు. అయితే వారు వాడిన భాష పశ్చిమ రాజస్థానీ అని ఒక పాశ్చాత్య పండితుడు, ప్రాచీన గుజరాతీ భాష అని కొందరు పేర్కొన్నారు. మొత్తంమీద, నరసింహమెహతాకి ముందే రామకథాత్మక గేయరచన గుజరాతీలో ఉన్నట్లు భావించవచ్చు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామకథ, యితర ప్రాంతాలలోవలె, కవులనేకాక జానపద రచయితలను కూడా బహుధా ఆకర్షించింది. గర్బనృత్య ప్రదర్శనానికి రామ కథాత్మకగేయాలు తరచుగా ఉపయోగిస్తూ వుంటారు. పెళ్లిపాటల్లో కూడా రామకథ అభివర్ణించబడింది.

వాల్మీకి రామాయణానికి అనువాదాలో అనుసరణలో గుజరాతీలో చాలా వెలువడ్డాయి. అవి గుజరాతీ రచయితలపైగల వాల్మీకి ప్రభావాన్ని స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా బాలకాండ కథ కవుల్ని బాగా ఆకర్షించినట్లు చెప్పవచ్చు. రాముడి బాల్యం, సీతా వివాహం, సీతాపహరణం, రామరావణ యుద్ధం మొదలైన యితివృత్తాలు పెక్కు రచనలకు మాతృక లైనాయి. అలాగే, హనుమంతుడు, అంగదుడు, విభీషణుడు, మండోదరి, లవకుశులు మొదలైనవారిని గురించి కొందరు ప్రత్యేక రచనలు వెలయించారు. ఒక ఆధునిక రచయిత లక్ష్మణ-ఇంద్రజిత్తుల యుద్ధాన్ని ప్రత్యేక కావ్యంగా అభివర్ణించగా, మరొక రచయిత ఊర్మిళాదేవి గుణగణాలను కీర్తిస్తూ ఒక రచన చేశాడు. మామూలు కావ్య ధోరణిలోనే కాకుండా పద, ధల, ధోల, ధుల, ధవళాది గేయ రూపాల్లో రామకథను చెప్పడం జరిగింది.

వాల్మీకి రామాయణానికే కాక అధ్యాత్మ, యోగవాసిష్ఠ రామాయణాలకు కూడా గుజరాతీ అనుసరణలు వెలువడ్డాయి. జైన రామాయణమైన పౌమచరియకి కూడా అనుసరణ వెలసింది. తులసీదాసు రామచరిత మానస్ కూడా గుజరాతీ కవుల్ని ఆకర్షించింది.

ఈ విషయాదికాన్ని పరిశీలిస్తే గుజరాతీ రచయితలు - ప్రాచీనులూ, అర్వాచీనులు - రామకథను ఆదరించినట్లు స్పష్ట మవుతుంది. గుజరాతులోని బరోడా విశ్వవిద్యాలయంవారు బరోడా ప్రాచ్యవిద్యాసంస్థ ద్వారా సంశోధిత వాల్మీకి రామాయణాన్ని తయారు చేయించి ప్రకటించడం కూడా గుజరాతీల రామకథాభిమానాన్ని వ్యక్తం చేస్తున్నది.

గుజరాతీ రామాయణాలలో బహు ప్రసిద్ధ మయింది గిరిధర్ రామాయణం (గిరిధర్ రచించిన రామాయణం). ఇది 1837లో వ్రాయబడినట్లు గుజరాతీ విద్వాంసుల అభిప్రాయం. అంతకు ముందే నకర్ (1568),

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కహాన్ (1571), విష్ణుదాస్ (1589) ప్రభృతులు రామాయణ కథను పూర్తిగా వెలయించారు. కాని ఆధునిక భాషకు అతి సన్నిహితంగా ఉన్న శైలిలో అందాలు దిద్దుకున్న గిరిధర్ రామాయణం వెలుగులోకి వచ్చిన తర్వాత పూర్వ రామాయణాలకు ప్రచారం తగ్గుముఖం పట్టింది.

గిరిధర్ రామాయణం అసలు పేరు రామచరిత్ర. వాల్మీకాన్నే కాక హనుమన్నాటకం, పద్మపురాణం, అగ్నిపురాణం మొదలైన వాటిని కూడా సంప్రదించి గిరిధర్ కవి రామాయణం వ్రాశాడు. నేటికీ బహుళ ప్రచారంలో ఉన్న రచన యిదే. నిన్న మొన్నటిదాకా మనభట్టు లనే గాయకులు పట్టణాలలోనూ పల్లెపట్టులలోనూ ఈ రామాయణాన్ని రమణీయంగా గానం చేసేవారు. కాని కవితా దృష్టితో చూస్తే, యిది అంత ఉత్కృష్ట రచన కాదని ఆధునిక విమర్శకుల అభిప్రాయం.

15,16 శతాబ్దాలలో రామకథా సాహిత్యానికి సంబంధించిన పెక్కు రచనలు వెలువడ్డాయి. కర్మణ్ మంత్రి (1470) రచించిన సీతాహ రణ్, భీమ్ (1500) వ్రాసిన రామలీల, శ్రీధర్ (1509) రచించిన రావణమండోదరి సంవాద్ మొదలైనవి వాటిలో కొన్ని. బాణుని కాదం బరిని ఎంతో రసవత్తరంగా అనువదించిన ఛలన్ (15వ శతాబ్ది చివర కాని 16వ శతాబ్ది మొదట కాని) రామ బాలలీల రచించాడు. బాల్యం గురించి చెప్పడంలో ఛలన్ అద్వితీయుడు. కాగా ఆయన కావ్యం మనో హరమైన కవితకు ఆలవాలం.

ఛలన్ కుమారులు ఉద్ధవ్, విష్ణుదాసులు షట్కాండ రామాయణం వ్రాశారు. మరో విష్ణుదాసు సప్తకాండలలో రామకథను చిత్రించాడు. ఆయనే లవకుశ ఆఖ్యాన్ మొదలైన రచనలు వెలయించాడు. రామవి వాహ్ (1584), హనుమంత్ చరిత్ (1591), పరశురాం ఆఖ్యాన్ (1612), సీతా స్వయంవర్ (1637), సీతా విరహ్ (1666) మొదలైన అనేక కావ్యాలు సంతరించబడ్డాయి.

జైన కవులు కూడా కొందరు రామకథను చిత్రించారు. ప్రధాన కథలో మార్పులు చెయ్యకపోయినా, జైనకవులు అవాల్మీక విషయాలు ఎన్నో ఉదాహరించారు. పౌమచరియ, త్రిషష్టి శలాక పురుష చరిత - వారికి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆధారాలు. వారి రచనల్లో నీతిబోధ, మతసిద్ధాంత వ్యక్తీకరణ స్పష్టంగా కనిపిస్తాయి. అందువల్ల అవి జనసామాన్యాన్ని అంతగా ఆకర్షించలేదు. రావణమండోదరీ సంవాద్ (ముని లావణ్య సమయ), సీతారామరాస (బాలకవి), రామసీతా ప్రబంధ (సమయసుందర), రామయశోరసాయన రాస (కేశరాజ్) మొదలైనవి జైనులు రచించిన రామకథాత్మక రచనలు. సమయ సుందరుని రచనలో మనోహరమైన కల్పనలు కనిపిస్తాయి.

జనరంజకంగా రామకథను రచించిన ప్రేమానందుని గురించి యిక్కడ ప్రస్తావించడం సమంజసం. ఆయన బరోడా వాస్తవ్యుడు. ఆయన యుద్ధ కాండ కథను రామయజ్ఞ అనే పేరుతో 1685లో కావ్యంగా వ్రాశాడు. రణయజ్ఞ అనే మరోకృతి కూడా వెలయించాడు. ఇది అంత ప్రశస్త రచన కాకపోయినా, ఆయన పరిహాస రసికత మానవ స్వభావ పరిశీలన మొదలైన వాటిని గ్రహించేందుకు ఇది తోడ్పడుతుంది. ఆ కావ్యంలోని ఒక సన్నివేశం.

కుంభకర్ణుణ్ణి నిద్ర నుంచి లేపుతారు. అప్పు డతడు సీతాపహరణ వృత్తాంతం తెలుసుకుంటాడు. తర్వాత సోదరుణ్ణి యిలా అడుగుతాడు: 'అశోకవనంలో ఉంచడానికా సీతను అపహరించి తీసుకు వచ్చావు?' అని. అందుకు రావణు డిచ్చిన సమాధానం అతని మనోభావాలకు అద్దం పడుతున్నది. 'సచ్ఛీల అయిన జానకిని దర్శించినప్పుడల్లా ఆమె తల్లిగా కనిపిస్తున్నది' అని దశకంఠుడు సమాధానం చెపుతాడు.

రామబాణాలు రావణుణ్ణి ఎలా వెంటాడాయో ప్రేమానందుడు వర్ణించిన తీరుని పరికిద్దాం.

> కోపంతో రాముడు ధనుర్ధారి కాగా
> లంకేశ్వరుడు పరుగు లంకించుకున్నాడు.
> బాణాలు అతని వెనుక పరుగులు తీశాయి.
> ముఖం చూపలేకపోయాడు దశముఖుడు.
> బాణాలు పరుగుని విరమిస్తాయా?
> యమదూతలు వెన్నంటే వచ్చినట్లుగా
> లంకాధిపతిని అనుసరించాయి ఆ బాణాలు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సభాస్థలికీ సుందరోద్యానానికీ పరుగు తీశాడు
పాతాళ గృహం కొండగుహలూ పరికించాడు
మేడలూ మిద్దెలూ అధిరోహించాడు
రాష్ట్రాలూ రోజులూ పరిభ్రమించాడు
'రామబాణాల నుంచి రక్షించేవారు లేరా?'
అని ఆక్రోశించాడు నలుగురినీ చూసి.
ద్వారాలు బంధించి పరుగులు తీశాడు.
కోడళ్లు కూతుళ్లు పరిచారికలు
కన్నకొడుకులు హితులూ సచివులూ
ముఖం చాటు చేసుకున్నారు.
సకల భువనాలు సప్తద్వీపాలు తిరిగాడు
శరణు శరణని ఘోషిస్తూ.
బాణాలు వెన్నంటే అనుసరించాయి.
చివరి కా గర్వాంధుడన్నాడు గదా:
'రక్షించు మందోదరీ' అని .
బాణగతిని ఆపి ప్రశ్నించింది భర్తను
'గ్రహించారా యిప్పుడైనా సీతాపతి శౌర్యం?'

ఒకసారి మందోదరి సమక్షంలో రావణుడు తన యెదుట దైవత్వం మానవాకృతిలో ప్రత్యక్ష మయిందనీ, తాను తన మరణాన్ని కోరుతున్నా ననీ పేర్కొన్నాడు. ప్రేమానంద్ ఈ విధంగా రావణుణ్ణి చిత్రించాడు. ప్రేమానందుని కుమారుడు వల్లభ సీతావిలాప, సీతావిలాసాది కావ్యాలు రచించాడు.

18వ శతాబ్దికి చెందిన శమల్ అంగదవిష్టి, రావణ మందోదరీ సంవాద్ అనే కావ్యాలు సంతరించాడు. ఇవి చాలా ప్రచారంలో ఉన్నాయి. దయారాం (1777 - 1852 - హనుమాన్ గరుడ్ సంవాగ్), దళ్‌పత్‌రాం (19వ శతాబ్ది - రామాయణ - నధాల) ప్రభృతులు రామకథాత్మక రచనలు చేశారు.

ఆధునిక గుజరాతీ సాహిత్య నిర్మాతలలో ప్రముఖులైన నర్మద్ శంకర్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

1970లో 'రామాయణ నొసార్' అనే కావ్యం రచించారు. రామ జానకీ దర్శన్ అనే నాటకం కూడా ఆయన వ్రాశారు. నానాభాయ్ భట్ 'రామాయణనన్ పాత్రో' అనే పేరుతో లఘురచన లెన్నో చేశారు. రామాయణంలోని వివిధ పాత్రల్ని గురించి పెక్కు విషయాలు గ్రహిం చేందుకు, యువతరం వారికి ఈ రచనలు బహూధా ఉపకరించగలవని విజ్ఞుల అభిప్రాయం. జి. దేశాయ్ (శ్రీరామకథ), యం. త్రిపాఠి (సంక్షిప్త రామాయణ్), పి. సోప్ (రామాయణ కథా మంగళ్) ప్రభృతులు వాల్మీకి రామాయణాంతర్గత విషయాలను తెలియజేసేందుకు ప్రయత్నించారు. సంగ్రహ వాల్మీకాన్ని పద్యరూపంలో హంసా మెహతా అనువదించారు. దీన్ని యం.యస్. విశ్వవిద్యాలయం వారు ప్రచురించారు. వాల్మీకాన్ని పూర్తిగా సుశీల ఝవేరీ అనువదించారు. సుప్రసిద్ధ కవి ఉమాశంకర్ జోషీ సంగ్రహ వాల్మీకానికి తాము చేసిన పద్యానువాదాన్ని (అయోధ్యా కాండ దాకా) సంస్కృతి పత్రికలో ప్రకటించారు. మంథర, భరత అనే గేయనాటకాలు కూడా ఆయన వెలయించారు. తులసీదాస్ రామచ రితమానస్‌ని శివలాల్ ధనేశ్వర్ అనువదించారు. ఈ పద్యానువాదం సహృదయుల ఆదరాభిమానాలు చూరగొన్నది. గిరిజాశంకర్ మాయా శంకరశాస్త్రి, యస్.టి. పటేల్‌గారలు కూడా రామచరితమానస్‌ని అనువదించారు.

మొత్తంమీద నాడూనేడు గుజరాతీలో వెలువడిన రామకథాసాహిత్యం పేర్కొనదగిన విధంగా ఉంది. ఎందరో కవులూ రచయితలూ వాల్మీకి కృతికి ప్రభావితు లైనట్లు చెప్పవచ్చు. గిరిధర్ కవి తన రామాయణంలో తెలియజేసిన రామాయణ కవుల వివరాలు పరిశీలిస్తే, రామకథాసాహిత్య విస్తృతిని గ్రహించవచ్చు. వాల్మీకి, వ్యాసుడు, వసిష్ఠుడు, శుకదేవుడు, బ్రహ్మ, హనుమంతుడు (హనుమన్నాటకం), విభీషణుడు, పరమేశ్వరుడు (శివరామాయణం), కొందరు ఋషులు (అధ్యాత్మరామాయణం), భర తుడు, కార్తికేయుడు (స్కంద రామాయణం,) పౌలస్త్యుడు, ధర్మరాజు (ధర్మరామాయణం) ప్రభృతులు రామకథను సంతరించినట్లుగా ఆ కవి పేర్కొన్నాడు. ఇన్ని రామాయణాలు కర్ణాకర్ణిగా విన్నవో మరి ఆయన కన్నవో మనం స్పష్టంగా చెప్పలేము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వాల్మీకి రామాయణంలోని బాల, అయోధ్య, అరణ్యకాండలను హంసా మెహతా అనువదించారు. బాల, అయోధ్యకాండలను సురేశ్ మజుందార్ పద్యరూపంలో అనువదించారు. వాల్మీకి రామాయణ వచనానువాదాన్ని నరహరి యుగన్‌దాస్ శర్మ ప్రకటించారు. 1953 నాటికి ఇది అయిదుసార్లు ముద్రించబడింది.

అధ్యాత్మ రామాయణాన్ని నట్వర్లాల్ ఇచ్ఛారం దేసాయి వచన కావ్యంగా వెలయించారు. భవభూతి ఉత్తర రామచరిత నాటకాన్ని ఉమా శంకర్ జోషీ నాటకంగానే గుజరాతీలోకి అనువదించారు. బాలబాలికల్ని ఉద్దేశించి ధూమకేతు అనే ప్రముఖ రచయిత లోక్ రామాయణ్ సంతరించారు. రామాయణం గురించి విమర్శ గ్రంథాలు కూడా వెలువడకపోలేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

10
డోగ్రీ

డోగ్రీ సాహిత్యం అని చెప్పదగింది చాలా అధునాతన మనవచ్చు; సుమారు నాలుగు దశాబ్దుల చరిత్ర కలది. మనదేశపు వాయవ్యభాగాన దుగ్గర్ (జమ్మూ తత్పరిసరాలు) ప్రాంతంలో నివసించే సుమారు అయిదు మిలియన్ల (50 లక్షలు) డోగ్రాలు వ్యవహరించే భాషను డోగ్రీ అంటారు. ఈ భాష ఉనికి కూడా చాలామందికి తెలియదు. కేంద్ర సాహిత్య అకాదెమీ దీన్ని స్వతంత్ర సాహిత్య భాషగా గుర్తించింది. కాని భారత రాజ్యాంగం గుర్తించలేదు.

డోగ్రీలోని లిఖితసాహిత్యం అత్యాధునికమైనదే అయినా, ఆ భాషలో ప్రాచీనమూ వైవిధ్యవిలసితమూ అయిన జానపద సాహిత్యం ఉంది. ఇది కూడా ఇటీవలి కాలంలోనే ముద్రణభాగ్యం పొందగలిగింది. ఈ భాష అసలు పేరు గురించి కూడా కొంత వివాదం లేకపోలేదు. జమ్ము - కాశ్మీర్ రాష్ట్రంలోని డోగ్రా ప్రాంతంలో వ్యవహృత మయ్యే భాష డోగ్రీ అని, హిమాచల్ ప్రదేశ్‌లోని డోగ్రాలు మాట్లాడేది పహారీ అనీ యీ వాద సారాంశం. డోగ్రీ మండల్, డోగ్రీ సంస్థ, కళలు సంస్కృతి భాషల జమ్ము-కాశ్మీర్ అకాదెమీ (**Jammu and Kashmir Academy of Art, culture and Languages**) మొదలైన సంస్థలు డోగ్రీ భాషా సాహిత్యాల అభివృద్ధికి యధోచితంగా కృషి చేస్తున్నాయి.

దుగ్గర్ ప్రాంతంలో చాలాకాలంగా సంస్కృతంలో రచనా వ్యాసంగం అవిచ్ఛిన్నంగా సాగింది. ఆ తర్వాత బ్రజ భాష, హిందీ, పంజాబీ, ఉర్దూలలో సాగింది. 14వ శతాబ్దినుంచీ దుగ్గర్ ప్రాంతపు రాజులు డోగ్రీని పరిపాలనా వ్యవహారాలకు ఉపయోగిస్తూ వచ్చినా, సాహిత్య సృష్టికి డోగ్రీ తగిన భాష కాదని భావించడం వల్ల, ఆ భాషలో గ్రంథ నిర్మాణం జరగలేదు. జమ్మూ-కాశ్మీరుకి మహారాజా ప్రతాపసింహుడు పాలకుడైన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తరువాత (1890), ప్రభుత్వ కార్యకలాపాలలో డోగ్రీ స్థానాన్ని ఉర్దూ ఆక్రమించడంతో, డోగ్రీ ఒక విస్మృత భాషా స్థితికి వచ్చిందన్నా అతిశయోక్తి కాదు. తదాదిగా పంజాబీ, ఉర్దూలు దుగ్గర్ ప్రాంతంలో బాగా వాడుకలోకి వచ్చాయి.

ఇతర భారతీయభాషలవలె, డోగ్రీ కూడా రామాయణ భారతాల నుంచి ఇతివృత్తాలు మొదలైనవాటిని గ్రహించింది. జానపద కథలతో డోగ్రీ సాహిత్యం పల్లవించింది; సంస్కృతానువాదాలతో రూపరేఖలు దిద్దుకుంది.

డోగ్రీ జానపద సాహిత్యంలో కృష్ణునికీ, రామునికీ సంబంధించిన గేయాలు ఎన్నో ఉన్నాయి. శివ ధనుర్భంగం చేసి రాముడు సీతను పరిణయ మాడడం, కృష్ణుని కాళీయమర్దనం మొదలైన కథాఘట్టాలను చిత్రించే గేయాలు చుబ్బన చూరలు. ఒక గేయంలోని కొన్ని చరణాలు:

విల్లు విరిచిన వానికే
పిల్ల నిస్తానని పలికె
ఎల్లరూ వినగ నా తండ్రి.
విల్లు కనక విరగకుంటే
చెలులారా! నే నిలాగే
పెళ్లి లేక వుండిపోదు.
విల్లు నెటుల విరుతురే
చెలులారా! దాశరథులు
ఎల బ్రాయంపువారే, వారు!

ఋతువులు మారే సందర్భంలో దాసర్లు ఇంటింటికీ వెళ్లి ఛింజాన్, ఢొలరూ మొదలైన గేయాలు పాడతారు. ఒక ఢొలరూ పరిశీలించండి.

అఖిల జగతికి సృష్టికర్త
ఆ రామచంద్రుని మొదట స్మరించుకో
నీకు జన్మ మిచ్చిన
తల్లినీ తండ్రినీ పిదప స్మరించుకో
వైశాఖ మొస్తుంది చైత్రం తరువాత
పన్నెండు నెలల కొకసారి వస్తుంది

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మారి మారి వస్తాయి ఋతువులు
తిరిగి రారు పోయిన మనుషు లేమో!

1950 ప్రాంతాలలో శంభునాథ్ అనే కవి డోగ్రి రామాయణం వ్రాశాడు. 330 పుటల యీ గ్రంథం డోగ్రి కవితకు పుష్టి కలిగించినట్లు భావించబడుతున్నది. అయితే యిది దేనిని (అనగా వాల్మీకమునా లేక తులసీదాసు రామాయణమునా) అనుసరించి వ్రాయబడిందో స్పష్టంగా తెలియడం లేదు. కాని డోగ్రా ప్రాంతీయుల మనస్తత్వానికి అనుగుణంగా ఈ రామాయణ రచన సాగినట్లు భావిస్తున్నారు. ఆదర్శ గృహిణీ ధర్మాలు, విధి బలీయత మొదలైనవి యిందులో వివరించబడ్డాయి. కొన్ని సందర్భాలలో వర్ణనలు కొంచెం దీర్ఘంగా ఉన్నట్లు కానవస్తాయి. ఇందుకు మంచి ఉదాహరణ కుంభకర్ణునితో జరిగిన యుద్ధ వర్ణన.

1960 నుంచి వచన రచనలూ, అనువాదాలూ వెలువడసాగాయి. చక్రవర్తి రాజగోపాలాచారిగారి (రాజాజీ) రామాయణ, మహాభారతాలు డోగ్రిలోకి అనువదించబడ్డాయి.

రామనాథ శాస్త్రి అనే రచయిత రాజాజీ రామాయణాన్ని డోగ్రి రామాయణ్ అనే పేరుతో అనువదించారు. 372 పుటల యీ గ్రంథాన్ని జమ్ము లలితకళలు సాహిత్య అకాదెమీవారు 1960లో ముద్రించారు. దినుభాయ్ పంత్ అయోధ్య అనే స్వతంత్ర కావ్యం వ్రాశారు.

డోగ్రి జానపద సాహిత్యాన్ని పురస్కరించుకుని చూస్తే, డోగ్రాలు కూడా, ఇతర ప్రాంతీయుల వలె, రామాయణ మహాభారతాల వల్ల ప్రభావితు లైనట్లు నిస్సంశయంగా చెప్పవచ్చు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

11
తమిళం

రామకథ మృత పురాణం కాదు, సజీవమైన చక్కని కథ. తమిళ నాడులో ప్రచారంలో ఉన్న రామకథా సంబంధములైన సామెతలనూ, పలుకుబళ్ళనూ కనుక పరిశీలిస్తే ఈ విషయం మరింత స్పష్ట మవుతుంది.

'వల్లవనుక్కు పుల్లుం ఆయుదం' అనే రుచికరమైన సామెత నేటికీ తమిళుల వాడుకలో ఉన్నది. ఇది కాకాసురుని కథను తెలియజేస్తున్నది. ఇంద్రుని కుమారుడైన జయంతుడు మలిన మనస్కుడై కాకి రూపంలో సీతాదేవిని సమీపించినప్పుడు, చెంతనే ఉన్న తృణమును రాముడు అతని మీదికి విసిరివేశాడు. అదే అతని పాలిటికి రామబాణ మయింది. బల వంతుని చేతిలో ఎందుకూ పనికిరాని తృణం కూడా శక్తివంతమైన ఆయుధంగా రూపొందుతుందనే సామెత అప్పటినుంచీ వ్యవహారంలోకి వచ్చి వుండవచ్చు.

ఈ కాకాసురుని వృత్తాంతమును తెలియజేసే సామెతలు మరికొన్ని తమిళంలో లేకపోలేదు.

'కురివిక్కేట్ర రామచరం' (షక్షికి తగిన రామబాణం), 'చిట్టుక్కురి విక్కు రామబాణమా?' (పిచ్చుక మీద రామాస్త్రమా?) మొదలైనవి ఈ కోవకు చెందినవి.

సీతాన్వేషణ ఘట్టమును తెలియజేసే సామెత ఒకటి ఉన్నది. 'వడ క్కేపోన కురంగు వరవిల్లై' (ఉత్తరంగా వెళ్లిన కోతి తిరిగి రాలేదు) అన్నదే ఆ సామెత. సీతాన్వేషణకై వానర వీరులు నాలుగు వైపులకూ వెళ్ళారు. దక్షిణాభిముఖంగా వెళ్ళిన హనుమంతుడు మాత్రం సీత జాడ తెలుసుకొని రాముని వద్దకు వచ్చాడు. మిగిలిన వానర వీరులు అలా చెయ్యలేక పోయారని యిందులోని భావం. 'విడియ విడియ రామా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యణం కేట్టు రామనుక్కు సీతై ఎన్న ఆగవేణుం ఎన్ను కేట్టానాం' (రామాయణ మంతా విని రాముడికి సీత ఏం కావాలి అని అడిగాడట) వంటి మరికొన్ని సామెతలు కూడా వాడుకలో ఉన్నాయి.

సామెతలు ఒక్కరోజులో పుట్టేవి కావు. ఏళ్ళ తరబడిగా ప్రచుర ప్రచారంలో ఉండే కథలనూ నమ్మకములనూ అవి వ్యక్తం చేస్తాయి. ప్రజల జిహ్వాగ్రాలే వాటికి నిలువ నీడ!

అలాగే తమిళ జానపద సాహిత్యంలోనూ రామకథా సంబంధములైన రచనలు చుబ్బన చూరలు. అమ్మానై (అచ్చన గాయలు ఆడుతూ పాడే పాట), కావడిచ్చిందు (కావడి పాట), కుమ్మి (కోలాటపు పాట) మొదలైన జానపద కళారూపములలో రామకథ చెప్పబడింది. ఒక ఏతం పాటలో రామాయణ కథ సంగ్రహంగా వివరించబడింది.

ఆధునికులు కూడా రామకథను జానపద గేయములలో రచించడం గమనించదగిన అంశం. ఈ తెగకు చెందిన వాటిలో టి. వైద్యలింగం చెట్టియార్ సంతరించిన 'రామాయణచ్చిందు', కె తిరుమలై సామి అయ్యంగార్ రచించిన 'రామాయణక్కప్పల్', సి. మునుస్వామి ముద లియార్ వ్రాసిన 'రావణన్ కుమ్మి', రత్న సభాపతి ముదలి రచించిన 'రామర్ తాలాట్టు (జోలపాట), త్యాగప్పదాసర్ వెలయించిన 'రామసిం గారచ్చిందు' మొదలైనవి పేర్కొనదగినవి. తక్కై రామాయణం, కుయిల్ రామాయణం మొదలైనవి కూడా జానపదులు రచించిన రామకథలలో పేర్కొనదగినవే; కుయిల్ (కోకిల) రామాయణం 128 పాటల రామా యణం.

ఇవి కాక రామకథా సంబంధములైన చాటువులు ఎన్నో ఉన్నాయి. ఈ కింది చాటువులో అవాల్మీకమూ, రుచికరమూ అయిన కథ ఒకటి చోటు చేసుకుంది.

'అలైకడల్ కడైయక్కండేన్,
అయన్ ఐన్దు సిరముం కండేన్,
మలై యిరు సిఱగు కండేన్,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్సైలైయదన్ వడివు కండేన్,
శివన్ సుద్దక్కళుత్తు క్కండేన్,
కులవరి యిరుకణ్ కండేన్
కొడుత్తదై వాంగక్కాణేన్.
కంటే సాగర మథనమ్ము, కంటే అయిదు
తలల బ్రహ్మను, కంటే రెక్కల గిరులను,
కమ్మని కడలి నీటని గంటే, ఇక్షు
చాపుని కనుగొంటే, శివుని చక్కని మెడ
గంటే, రెండు కండ్ల మఘవు గంటే, యిచ్చి
మరల పుచ్చుకొనెడు వింత నరయ నైతి.

ఇక ఇందులోని కథను దిఙ్మాత్రంగా పరిశీలిద్దాము : రావణ వధానంతరం, సపరివారంగా రాముడు అయోధ్యకు బయలు దేరే సన్నాహంలో ఉన్నాడు. అప్పుడు సీతాదేవికి ఒక కోరిక కలిగింది. తనతోపాటు లంకలోని చూడ చక్కని ఒక సన్నెకల్లు తీసుకు వెడదామనుకుందట! ఆ కోరికను తన నమ్మినబంటు అయిన హనుమంతునికి తెలియజేసింది. అమ్మవారి ఆజ్ఞ ప్రకారం, సన్నెకల్లు ఒకటి హనుమంతుడు పైకి ఎత్తి తల మీద పెట్టుకోబోతూ వుండగా అక్కడికి జాంబవంతుడు వచ్చి, హనుమంతుని చూచి ఏం చేస్తున్నావని ప్రశ్నించాడు. అమ్మవారి కోరికను తెలియజేశాడు, ఆ నమ్మినబంటు. వెంటనే జాంబవంతుడు నవ్వుకుంటూ సీత వద్దకు వెళ్ళాడు. సముద్ర మథనం, అయిదు తలల బ్రహ్మ, రెక్కలున్న కొండలు, తియ్యని సముద్రజలం, మన్మథుని మనోహరాకృతి, శివుని తెల్లని కంఠం, రెండుకళ్ళ ఇంద్రుడు మొదలైన అద్భుతాలు ఎన్నింటినో తాను తన దీర్ఘ జీవితంలో చూశాననీ, అయితే దానంగా ఇచ్చిన వస్తువుని తిరిగి తీసుకోవడం మాత్రం తా నింతవరకూ తన జీవితంలో ఎన్నడూ చూడలేదనీ జాంబవంతుడు సవినయంగా మనవి చేశాడు. అప్పుడు తన తప్పని తెలుసుకుంది సీత. లంకకు విభీషణుని రాజుగా చేసిన తర్వాత అది అతని రాజ్య మనీ, కనుక అందులోని ప్రతి అణువూ అతనిదే అనీ ఆమె గ్రహించింది. విభీషణుని అనుజ్ఞ లేకుండా తాను సన్నెకల్లు తీసుకుపోదామనుకోవడం తప్పనుకుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ చక్కని కథ తమిళ సాహిత్యంలో కూడా మరెక్కడా ఉన్నట్లు తెలియరాలేదు. శిష్టకవుల దృష్టికి అసలు రాలేదు.

తమిళ జానపద వాఙ్మయంలో మహిరావణుడికి సంబంధించిన రచనలు కూడా ఎన్నో ఉన్నాయి. మయిల్ రావణన్ కదై, శతకంఠ రామాయణక్కదై మొదలైనవి మహిరావణ కథా సంబంధములు. అంతే కాదు. జానపదులు ఏదో ఒకవిధంగా తమ పాటలలో రామకథను చొప్పించడానికి ప్రయత్నించారు. ఈ క్రింది చరణాలు చవి చూడండి.

'కుంభకోణమే కోణము - ఆ
కురవలు నాటిందే జొన్నలు
రాముడు వేసిందే బాణము - అది
ఎక్కడ దాగిందో కానము.'
'లంక నేలే రావణునీ
ఎందుకయ్యా చంపినది'
'లంకను కాల్చి వేసి
మరలినాడు అయోధ్య'
'ఆ రజకుని వల్లా
అవస్థల పాలయ్యేను సీత'
'పట్టా పట్టా రావణా
ఫరంగి పట్టా రావణా
నెత్తిమీద గుండు వేసి
కాల్చినాడు రావణా'

తమిళ జానపద సాహిత్యంలో వెలసిన రామకథల్ని టి. నటరాజన్ గారు అయోద్దికదై (అయోధ్యా కథ) అనే గ్రంథంలో పరిశీలించారు. అక్కడక్కడ ఇతర రామకథలతో పోల్చి వివరించిన వైనం కూడా మనం చూడవచ్చు.

తమిళ వాఙ్మయ చరిత్రలో తొలియుగం సంగయుగం. సంగయుగపు కాలమును గురించి పండితలోకంలో అభిప్రాయ భేదములు ఉన్నా, అది క్రీస్తుశకం తొలి మూడు శతాబ్దులలో వర్ధిల్లినట్లు నిస్సందేహంగా చెప్ప

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వచ్చు.

సంగయుగంలో వెలసిన కృతులలో అగనానూరు, పురనానూరు మొదలైనవి పేర్కొనదగినవి. అగనానూరులోని ఒక పద్యంలో రామకథా సంబంధమైన అద్భుత సన్నివేశం ఒకటి ఉదాహరించబడింది.

ధనుష్కోటిలో ఒక రావిచెట్టు నీడను ఆసీనుడై రామచంద్రుడు తన సహచరులతో రావణుని మీదికి ఎలా దండెత్తి వెళ్లాలా అని సమాలోచన జరుపుతూ ఉండగా, చెట్టుమీది పిట్టలూ, పులుగులూ చెవులు చిల్లులు పడేలా గోల చెయ్యసాగాయి. అప్పుడు వాటివంక రాముడు చూసేసరికి, పక్షులన్నీ మౌనం వహించాయి. అనగా పక్షిజాలం కూడా రాముడి పక్షం వహించినట్లు, ఆ విధంగా అవి సహానుభూతి ప్రదర్శించినట్లు కవి పై పద్యంలో వ్యక్తం చేశాడు.

పురనానూరు అనే మరొక కృతిలోని ఒక పద్యం వానరులు నగలు అలంకరించుకున్న విధమును తెలియజేస్తుంది. రావణాసురుడు సీతను అపహరించి లంకకు వెడుతూ వుండగా, సీత తన ఆభరణాలను ఆకాశం నుంచి భువికి జార్చింది. అవి వానరుల కంటబడ్డాయి. అయితే ఆ నగలను ఎలా ధరించాలో తెలియక తికమక పడి చివరికి వాటిని ఏదో ఒకవిధంగా ధరించి సంతృప్తి చెందారట వానరులు!

కలిత్తొగై అనే మరొక కృతిలో దశకంఠుడైన రావణుడు హిమవత్పర్వతమును పైకెత్తబోయి, తుదకు పరాభవం చెందిన వృత్తాంతమును ఒక పద్యం అభివర్ణించింది.

పరిపాడల్ అనే ఇంకొక కృతిలో అహల్యా వృత్తాంతమును సంగ్రహంగా తెలియజేసే ఒక పద్యం కనిపిస్తుంది. తమిళనాడులో ప్రచారంలో ఉన్న కథకు అనుగుణంగా, ఇంద్రుడు పిల్లి రూపంలో గౌతమాశ్రమమును ప్రవేశించినట్లు అందులో చెప్పబడింది.

కాగా, అతి ప్రాచీనమైన సంగయుగంలోనే తమిళంలో ఒక రామాయణం వెలుగులోకి వచ్చినట్లు తమిళ పండితులు విశ్వసిస్తున్నారు. కాని యీ రామాయణం లభ్యం కాలేదు. (5 పద్యములు మాత్రం లభ్య

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మైనాయి.)

కంబమహాకవికి పూర్వమే తమిళంలో రామాయణం వెలసి ఉండ వచ్చునని సుప్రసిద్ధ పండిత పరిశోధకులు యస్. వైయాపురి పిళ్లై పేర్కొన్నారు. తమ అభిప్రాయమునకు బలంగా ఆయన కొన్ని కారణాలు ఉదాహరించారు. యాప్పరుంగలం అనే ఛందో గ్రంథమునకు సంతరించబడిన వ్యాఖ్యానంలో 'వెణ్బా' అనే ఛందస్సులో వ్రాయబడిన ఒక రామాయణం ఉదాహృత మయింది. తొల్కాప్పియం లక్షణ గ్రంథమునకు నచ్చినార్‌కినియార్ అనే ప్రసిద్ధ వ్యాఖ్యాత వ్యాఖ్య వ్రాస్తూ రామాయణంలోనిదంటూ ఒక పద్యం ఉదాహరించాడు.

వెణ్బా ఛందస్సులో (అగవల్ ఛందస్సని కొందరు) ఒక రామాయణం వ్రాయబడినట్లూ, అది క్రీస్తుశకం 650 ప్రాంతాల వెలుగు చూచినట్లూ పండితుల అభిప్రాయం. ప్రాచీనకాలంలో రామాయణమును సీరామ కదై (శ్రీరామకథ) అని కూడా వ్యవహరించేవారనీ, వెణ్బా ఛందస్సులో కంబనికి పూర్వమే రామాయణ రచన జరిగి ఉండవచ్చుననీ ము. రాఘవయ్యంగారనే ప్రసిద్ధ విద్వాంసుని విశ్వాసం.

కనుక, సంగకాలంలో సంతరించబడిన రామాయణం తరువాతి కాలంలో లభ్యం కాకపోయినప్పటికీ, కంబకవికి పూర్వమే రామాయణ రచన తమిళంలో జరిగి వుండవచ్చునని నిస్సంశయంగా పేర్కొనవచ్చు. పైగా, తమిళనాడులోని స్థలపురాణములను అలవోకగా పరిశీలించినా, ఎన్నో స్థలములు రామకథతో సంబంధం కలవిగానో రామాయణాంతర్గత పాత్రలతో సంబంధం కలవిగానో కనిపిస్తాయి.

రామకథతో ముడివడిన గ్రామాలు తమిళనాడులో ఎన్నో ఉన్నాయి. కన్యాకుమారి జిల్లాలోని చిరమడం, దెరిశనంకోప్పు, తాటక మలై, మహేంద్రగిరి, మరున్దువామలై మొదలైనవి యిందుకు ఉదాహరణములు. చిరమడం అనే గ్రామంలో రాముడు ఒక పర్ణశాలలో నివసించినట్లూ సీతాపహరణం అక్కడే జరిగినట్లు ఆ గ్రామస్థులు చెపుతారు. తిరు వరం కోప్పు అనే మూడు మాటల సమాహారం దెరిశనం కోప్పు. తాటకను రాముడు బాణంతో వధించిన ప్రదేశ మట అది! ఆ గ్రామానికి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సమీపంలోనే తాటకమలై (కొండ) ఉన్నది. మహేంద్రగిరి వర్ణన రామాయణంలో ప్రముఖంగా కనిపిస్తుంది. ఆ కొండమీది నుంచి లంకకు హనుమంతుడు ఒక్క ఎగురు ఎగిరినట్లు చెపుతారు. మహేంద్రగిరి నాగర్కోవిల్ పట్టణానికి 35 కిలోమీటర్ల దూరాన ఉన్నది. అలాగే ప్రసిద్ధికెక్కిన మరొక కొండ మరున్దువామలై (మరున్దువాళ్మలై అంటారు.) రామరావణ యుద్ధ సందర్భంలో ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగాస్త్రానికి లక్ష్మణుడు మూర్ఛ పోతాడు. అప్పుడు హనుమంతుడు సంజీవితో పాటు ఇతర మూలికలు కూడా తెచ్చాడు. అవి కొండలా పడిన ప్రదేశమే మరున్దువామలై అయింది. ఈ కొండమీద ఎన్నో మూలిక లున్నాయని స్థానికుల విశ్వాసం. ఆ కొండను సమీపించగానే మనస్సుకి హాయి గొలిపే చల్లనిగాలి వీస్తుంది.

అలాగే, తిరునల్వేలి జిల్లాలోని కళక్కాడు, వారైముట్టి, ముంది త్తోప్పు, మాయమాన్ కురిచ్చి మొదలైన గ్రామాలు కూడా రామకథతో సంబంధం కలవే.

రామనాథపురం జిల్లాలోని తిరుప్పుల్లణై (దర్భశయనం), ధనుష్కోటి ప్రసిద్ధ క్షేత్రములు. సేలం జిల్లాలో మాయమాన్ కరడు కూడా ఈ సందర్భంలో పేర్కొనదగింది. లేడి (మాన్) వేషంలో వచ్చిన మారీచుడు విగతజీవుడైన స్థల మది! అనుమంత కుడి, వాలికంట పురం మొదలైనవి కూడా రామకథతో సంబంధమున్న గ్రామనామాలు.* ఇలా తమిళనాడులోని పెక్కు స్థలాలు రామకథా సంబంధములుగా వ్యవహృతం కావడం గమనించదగిన అంశం.

సంగయుగమునకు తర్వాత వెలుగులోకి వచ్చిన తమిళ కావ్యములలో సైతం రామకథా ప్రశంస కనిపించడం పేర్కొనదగిన అంశం. అనగా, తమిళనాడులో అతి ప్రాచీన కాలం నుంచీ నేటి దాక రామకథ ప్రచారంలో ఉందని చెప్పడం ఎంతమాత్రమూ అతిశయోక్తి కాదు.

*[వివరాలకు : శ్రీ శాస్తాన్‌కుట్టి పిళ్లై వ్యాసం, దినమణి (తమిళ దినపత్రిక) 20.10.1979]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తమిళ పంచకావ్యములలో సిలప్పదికారం (మంజీర గాథ) ఒకటి. తత్కావ్య నాయకుడైన కోవలుడు, దురదృష్టవశాత్తు, స్వస్థలమైన పుహార్‌ని (కావేరీపూంపట్టణము) విడిచిపెట్టి, పాండ్యరాజధాని అయిన మధురా నగరానికి వెళ్ళవలసివస్తుంది. ఈ విషయాన్ని వర్ణిస్తూ సిలప్పదికార కావ్య కర్త ఇళంగో అడిగళ్ (ఇళంగో పూజ్యపాదులు), 'కోవలన్ వెళ్ళిపోయిన తర్వాత పుహార్ పట్టణం రాముడు లేని అయోధ్య వలె ఉన్నది' అని పేర్కొన్నాడు. మధురానగరం సరిహద్దులు చేరుకొన్న పిదప కోవలుడు తన భార్య కణ్ణకిని కౌంతి అనే యోగినికి ఒప్పజెప్పాడు. అప్పుడామె పూర్వం భార్యావియోగం వల్ల రాముడు, నలుడు మొదలైనవారు బాధ పడ్డారనే విషయాన్ని తన అనునయ వాక్యాలలో కోవలుడికి గుర్తు చేస్తుంది.

తమిళకావ్య పంచకంలో మరొకటి అయిన మణిమేఖలలో (మణిమేకలై) కూడా రామకథా ప్రశంస కనిపిస్తుంది. పెద్దపెద్ద కొండలను సముద్రంలోకి విసిరివేసి సేతునిర్మాణంలో వానరవీరులు రామచంద్రుడికి సహాయం చేసిన వృత్తాంతమును కవి ఒకచోట ఉదాహరిస్తాడు. పండిత ప్రభాకరులు ము. రాఘవయ్యంగారు అభిప్రాయము ననుసరించి, యిక్కడ ఉదాహృతమైన సేతువు కన్యాకుమారిని సూచిస్తున్నది. ఇది ఆది సేతువనీ, ధనుష్కోటివద్ద ఉన్నది మధ్య సేతువనీ ఆయన అభిప్రాయం. తమిళకావ్యములను పురస్కరించుకొని చూస్తే కన్యాకుమారి అతి పవిత్ర స్థలంగా భావించబడేదనీ, అక్కడికి వచ్చి పలువురు సముద్రస్నానం చేసేవారనీ తెలియవస్తుంది. అంతేకాక ఆసేతుహిమాచలం అన్న సంస్కృత పదబంధానికి సమానార్థక మైన తమిళ పదబంధం 'కుమరి ముదల్ ఇమయం వరై.' అనేది. ఇక్కడ సేతువనే అర్థంలో కన్యాకుమారి ప్రయుక్తం.

కనుక పై విషయములను పరిశీలించే కొద్దీ కంబమహాకవికి మునుపే తమిళనాడులో రామకథ ప్రచుర ప్రచారంలో ఉండేదనీ, కంబ రామాయణం వెలుగులోకి వచ్చిన తర్వాత ఆ రామాయణానికి ఎక్కడలేని ప్రచారం లభించిందనీ ఖచ్చితంగా చెప్పవచ్చు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తమిళం

తమిళంలో జైనకవి ఒకరు సంతరించిన రామాయణం నేడు లభించడం లేదని కొందరి విశ్వాసం. అరువది ముగ్గురు మహాపురుషుల జీవిత విశేషాలను అభివర్ణించే శ్రీ పురాణం అనే కృతిలో ఇర్వదవ తీర్థంకరుడైన మునీశ్వరస్వామి కథలో రామ వృత్తాంతం వివరించబడింది. ఆ కథలో శ్రీ పురాణకర్త సీత దుఃఖమును తెలియజేసే కొన్ని పద్యాలు ఉదాహరించాడు. ఈ పద్యాల శైలికీ శ్రీ పురాణశైలికీ భేదం ఉండడంవల్ల, ఉదాహృత పద్యాలు శ్రీ పురాణ కావ్యకర్తవి కావనీ, అవి జైన రామాయణాంతర్గతములై ఉండవచ్చుననీ పండితులు భావిస్తునారు. మణిప్రవాళ వచనంలో సంతరించబడిన గ్రంథం శ్రీ పురాణం; తమిళ జైనుల కది పరమ ప్రీతిపాత్రమైన గ్రంథం.

జైనుల కథలో హనుమంతుడు అణుమహాన్ అయినాడు. వాలిని సంహరించినవాడు లక్ష్మణుడు. రావణాసురుని వధించినవాడు కూడా లక్ష్మణుడే; రాముడు కాదు. యుద్ధానంతరం రాముడు దీక్ష స్వీకరిస్తాడు. తర్వాత మోక్షం పొందుతాడు. అణుమహాన్ ప్రభృతులు కూడా దీక్ష స్వీకరిస్తారు. ఒక్క లక్ష్మణుడికి మాత్రం నరకప్రాప్తి కలుగుతుంది.

తమిళ వాఙ్మయ చరిత్రలో భక్తకవులైన ఆళ్వారులూ నాయన్మారులూ వెలయించిన గీతాలు బహుధా పేర్కొనదగినవి. అవి భక్తి రసపు ముద్దలు. నేటికీ వాడుకలో ఉన్నాయి.

వైష్ణవ భక్త శిఖామణులైన ఆళ్వారులు సాహితీ రంగంలో ప్రవేశించేనాటికి వాల్మీకి అభివర్ణించిన ఆదర్శ మానవుడైన రామచంద్రుడు అవతార పురుషుడుగా వినుతి కెక్కాడు. రాముడు విష్ణ్వంశ సంభూతుడనే విశ్వాసం వాడుకలోకి రావడమే కాక బలపడింది కూడా. తత్ఫలితంగా, రసవత్కావ్యమైన రామాయణం పవిత్ర గ్రంథంగా, పారాయణ గ్రంథంగా భావించబడింది. కాలం తెచ్చిన మార్పిది! ఇందులో వింత లేదు.

ఆళ్వారులు కృష్ణావతారమునకు సంబంధించిన గాథలనే తమ మధుర గీతాలలో ఎక్కువగా వర్ణించినా, రాము డంటే వారికి గల భక్తి అపారం. పెరియాళ్వార్ అనే భాగవతోత్తముడు (విష్ణుచిత్తుడు) రామకథా సంబం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ధములైన పది పాశురములు వెలయించాడు. వాటిలో సీతారాములకే తెలిసిన సంఘటనలు కొన్ని వర్ణించడం జరిగింది. అటువంటి వాటిలో ఒకటి కాకాసుర వృత్తాంతం. నేను నిజంగా రామదూతనే - అనే నమ్మకం కలిగించేందుకు హనుమంతుడు సీతకు ఆ పాశురములు తెలియజేస్తాడు.

రాజకవి అయిన కులశేఖరాళ్వారు కూడా తన రచనలో రామప్రశంస చేశాడు. ఆయనకి రాముడు సర్వస్వం. రామలీలలను అభివర్ణిస్తూ చక్కని లాలిపాట ఒకటి సంతరించాడు. రాముడు అడవికి వెళ్ళిన విషయం తెలుసుకున్న దశరథుని సంతాపమును పది పాశురములలో ఆయన అభివర్ణించాడు. కులశేఖరాళ్వారు అభివర్ణించిన రామకథా సంబంధ విషయాలను సంగ్రహ రామాయణంగా భావించవచ్చు.

విప్రనారాయణు డనబడే తొండరడిప్పొడి ఆళ్వారు (భక్తాంఘ్రిరేణువు) ఒక పాశురంలో సేతు నిర్మాణంలో రామచంద్రునికి సహాయపడిన ఉడుత కథను పేర్కొన్నాడు. తెలుగువారికి చిరపరిచితమూ, అవాల్మీకమూ అయిన యీ వృత్తాంతం కంబరామాయణంలో కూడా లేదు.

రాముని వాత్సల్యభావమును ప్రస్తుతిస్తూ తిరుమంగై ఆళ్వారనే మరొక భక్తకవి ఒక పాశురం సంతరించాడు. గుహుని తన సోదరునిగాను, సీతను గుహుని వదినగానూ, లక్ష్మణుణ్ణి తమ్మునిగానూ రాముడు సంబోధించి నట్లు తిరుమంగై ఆళ్వారు అందులో పేర్కొన్నాడు. ఆటవికుడూ చెంచుజాతికి చెందినవాడూ అయిన గుహునియందు రాముడు ప్రదర్శించిన యీ సోదరభావం విస్మరించరానిది. ఈ విశ్వమానవ ప్రేమయే కంబకవి రామాయణమునకు జీవగర్ర అయిందని సుప్రసిద్ధ పండిత పరిశోధకులు టి. పి. మీనాక్షి సుందరన్ సహేతుకంగా పేర్కొన్నారు.

12వ శతాబ్దిలో జీవించిన పెరియవాచ్చాన్ పిళ్లై అనే వైష్ణవాచార్యుడు పాశురప్పడి రామాయణం అనే ఒక లఘుకృతిని సంకలనం చేశాడు. ద్రావిడవేద మని వినుతి కెక్కిన నాలాయిర దివ్య ప్రబంధం ఆయనకి హృద్గతం కాబట్టి, తద్గ్రంథంలోని పదబంధాలతోనే పాశురప్పడి రామాయణం సంతరించాడు ఆయన. ఇదే యీ రచనలోని వైశిష్ట్యం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నాయన్మారులలో (శివభక్తులు) తిరుజ్ఞాన సంబంధర్, తిరునావుక్క రశర్ ప్రభృతులు రావణుని చేతలను చిత్రించారు.

కంబమహాకవికి ముందు తమిళ సాహిత్యంలో ఈవిధంగా రామకథా సంబంధములైన విషయాలు అభివర్ణితములైనట్లు చెప్పవచ్చు. అంతేకాని సమగ్ర రామాయణం ఏదీ లభ్యం కాలేదు.

మనదేశ భాషలలో లభించిన సంపూర్ణ రామాయణాలలో మహాకవి కంబన్ రచించిన రామావతార మనే నామాంతరం కల రామాయణమే మొదటిది. ఎన్నో అవాల్మీక విషయాలు అందులో పేర్కొనబడినా, కంబని దృష్టిలో సీతారాములు దైవస్వరూపులు; లక్ష్మీనారాయణులు. ఈ విషయమును ఆ మహాకవి ఎన్నో చోట్ల పేర్కొన్నాడు., సంస్కృతంలో వాల్మీకి, వసిష్ఠుడు, బోధాయనుడు మొదలైనవారు రామాయణములు వెలయించినా, తాను వాల్మీకి కృతిని పురస్కరించుకొని తమిళంలో రామా యణ రచనకు పూనుకొన్నట్లు ఆయన పేర్కొనడం గమనించదగిన విషయం. వాల్మీకి అంటే ఆయనకి గల ఆదరభావం నిరుపమానం. వాల్మీకి రామాయణం వ్యాప్తిలో ఉండగా, తనవంటివాడు రామాయణ రచనకు పూనుకోవడం పాలసముద్రము నంతా తాగాలని తలచిన పిల్లి ఆశవంటి దని కంబడు పేర్కొన్నాడు. ఆయన అంత వినయంగా చెప్పకున్నా, వాల్మీకం కన్నా కంబరామాయణమే మిన్న అని కొందరు తమిళ విద్వాంసుల అభిప్రాయం. ఈ సందర్భంగా ప్రసిద్ధ సాహితీవే త్తలూ, ప్రముఖ దేశభక్తులూ అయిన వి.వి.యస్. అయ్యర్ వెలిబుచ్చిన అభిప్రాయంలోని కొన్ని వాక్యాలను ఉదాహరిస్తున్నాను.

'In the Ramayana of Kamban, the world possesses an epic which can challenge comparison not merely with *Iliad* and *Aeneid*, the *Paradise lost* and the *Mahabharatha*, but with its original itself, namely, the *Ramayana* of Valmiki.....'

(Kamba Ramayana - A study, 1965, p.1)

కవిచక్రవర్తి బిరుదాంకితుడైన కంబకవి 9వ శతాబ్దివాడని కొందరూ,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

12వ శతాబ్దికి చెందినవాడని మరికొందరూ భావిస్తున్నారు. ఆయన 12వ శతాబ్దివాడని భావించడం సముచిత మని నా అభిప్రాయం. కంబడు షట్కాండలు మాత్రమే రచించాడు. ఉత్తర కాండను వాణిదాసన్ అనే కవి వ్రాశాడు. కాని అది ఒట్టక్కూత్తర్ అనే కవివతంసుని రచన అని కొందరి విశ్వాసం.

వివాహత్పూర్వమే సీతారాములు ఒకరినొకరు చూసుకోవడమే కాక ప్రేమించుకోవడం, పర్ణశాలతో కూడా రావణుడు సీత నపహరించడం, కైకేయిని రాముడు దూషణోక్తులాడకపోవడం, అంగదుడు రాముని శరణు వేడడం, వాలి మరణానంతరం అతని భార్య తార సుగ్రీవుని వల పునేస్తం కాకపోవడం, విభీషణుడు రావణునికి హిరణ్యకశిపుని వృత్తాంతం నివేదించడం - మొదలైన మార్పులు కంబకవి చేసిన వాటిలో కొన్ని. ఇవి గమనించదగినవి. కథా గౌరవమును ఇనుమడింపజేస్తున్న మార్పు లివి.

18వ శతాబ్దివాడైన అరుణాచలకవి రామకథను కీర్తనల రూపంగా వెలయించాడు. ఈ గ్రంథం పేరు రామాయణ కీర్తనై. ఇది గేయాంశం నిండిన రచనయే కాక సాహిత్యపు విలువ సంతరించుకున్నది కూడా. కనుకనే నేటికీ ఇది ప్రచారంలో ఉన్నది. 19వ శతాబ్దికి చెందిన ప్రసిద్ధ భక్తకవి రామలింగస్వామి రామనామ మహత్త్వమును గురించి తన తిరు అరుట్పా అనే రచనలో వివరించారు.

ఆధునికులలో కొట్టైయూర్ సుబ్రహ్మణ్య అయ్యర్ 9,379 వృత్తాలలో రామాయణ వెణ్బా రచించారు. ఇది సమగ్ర రామాయణం. ఇంకా పలువురు రామకథా సంబంధములైన లఘుకృతులు వెలయించారు. నటేశశాస్త్రి, తి.క. కనకసబై పిళ్లై, సి. ఆర్. శ్రీనివాసయ్యంగారు, తాతాచారియార్ ప్రభృతులు వాల్మీకి రామాయణమును పూర్తిగానో కొన్ని భాగాలనో తమిళ వచనంలోకి అనువదించారు. తిరుచ్చిత్రంబల దేశికర్ అనే పండితుడు ఉత్తరకాండమును వచనంగా వ్రాశారు. ఆయనే కంబరామాయణమును కూడా వచనంలో వ్రాశారు.

అధ్యాత్మ రామాయణాలు కూడా తమిళం చేయబడినవి. వీరై

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆళవందార్ అనే కవి 2,055 పద్యాలలో జ్ఞాన వాసిష్ఠ అమల రామాయణం సంతరించారు. ఇటీవల తి. వెంకట కృష్ణయ్యం గారు అనే పండితుడు ఇరాఘవకావ్యం అనే రామాయణమును 6,000 వృత్తములలో వెలయించారు. నేటికీ తమిళనాడులో చాలా చోట్ల వాల్మీకి రామాయణం, కంబరామాయణం పురాణంగా చెప్పబడుతూ వుండడం, కంబరామాయణమునకు వ్యాఖ్యలూ విమర్శలూ ఎన్నో వెలువ డుతూ వుండడం పేర్కొనదగిన అంశాలు. తమిళనాడులో పెక్కుచోట్ల ప్రతి సంవత్సరమూ కంబకవి ఉత్సవం (కంబన్ విళా) శ్రద్ధాసక్తులతో జరుగుతూ వుండడం కూడా గమనించదగిందే!

ఉపసంహారంగా, అతిప్రాచీనమైన సంగయుగం మొదలుకొని నేటిదాకా రామకథ తమిళ రచయితలనూ పాఠకులనూ ఆకర్షిస్తున్నదనీ, కంబకవికి పూర్వమే జైన రామాయణం కాక మరొక రామాయణం కూడా సంతరించబడిందనీ పేర్కొనవచ్చు. అయితే తమిళంలో రామకథా సాహిత్యానికి కంబ మహాకవి ప్రసాదించిన రామాయణం తలమానికం. అంతేకాదు; తమిళ సాహిత్యసదనంలోనే మణిదీపిక వెలిగించిన మహా కావ్యం కంబరామాయణం!

ఇంతకు మునుపే పేర్కొనినట్లు తమిళంలో రామాయణ సంబంధి రచనలు అసంఖ్యాకంగా వెలువడినాయి. కంబరామాయణాన్ని వై.ము. గోపాలకృష్ణమాచారియార్ చక్కగా పరిష్కరించి ప్రచురించారు. మద రాసులోని మర్రే అండ్ కంపెనీ, అణ్ణామలై విశ్వవిద్యాలయం, డా. ఉ. వే. స్వామినాథ అయ్యరు గ్రంథాలయం మొదలైన సంస్థలు సుప్రసిద్ధ పండితులచే పరిష్కరించి, ఆ కావ్యాన్ని ప్రశస్తంగా ప్రచురించారు.

చెల్వకేశవరాయ ముదలియారు గారి కంబన్, యస్. వైయాపురి పిళ్ళైగారి కంబన్ కావియం (1962), తమిళ రచయితల సహకార సంఘం వారి కంబన్ మలర్ (సంచిక) మొదలైనవి ప్రశస్త రచనలు.

టి.కె. చిదంబరనాథ ముదలియార్ అనే ప్రసిద్ధ విమర్శకుడు కంబ రామాయణం ప్రక్షిప్తాల కావ్యంగా అభివర్ణించారు. నేడు ప్రచారంలో ఉన్న కంబగామాయణంలో 10,569 పద్యాలున్నాయి. వీటిలో అధిక

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భాగం ప్రక్షిప్తాలనే ఆయన నిశ్చితాభిప్రాయం. ఆయన పరిష్కరించి ప్రకటించిన కంబరామాయణం బాలకాండంలో 167 పద్యాలే ఉన్నాయి. (1,420 పద్యాలకు బదులుగా). అలాగే అయోధ్యాకాండలో 1210 పద్యాలకు బదులుగా 550 పద్యాలే ఉన్నాయి. వెళ్లైయంబలవానత్తంపిరాన్ అనే ఆయన కంబరామాయణంలో పెక్కు పద్యాలు చొప్పించినట్లుగా చెపుతారు. అందుకే చిదంబరనాథ ముదలియారు కంబరామాయణాన్ని ప్రక్షిప్తాల మయం అన్నారేమో!

తమిళంలో అధ్యాత్మరామాయణ వచనం, ఆనంద రామాయణం (సారకాండం, వచనం) జ్ఞానవాసిష్ఠ రామాయణం (పద్యంలోనూ వచనంలోనూ) మొదలైనవి వెలువడ్డాయి. వాల్మీకి రామాయణానికి పెక్కు వచనానువాదాలు వెలువడ్డాయి. పద్యానువాదం వచ్చినట్లు తెలియడం లేదు. విమర్శ గ్రంథాలు చాలా వెలువడ్డాయి. పులవర్ కుళందై అనే పండితుడు రావణకావ్యం సంతరించారు. ఇటీవల (1989) మ. రా. పో. గురుస్వామి అనే పరిశోధక విద్వాంసులు ఇరామాయణ చ్చిన్నై అనే వ్యాస సంపుటిని ప్రచురించారు. రాజాజీ చక్రవర్తి త్తిరుమగన్ (చక్రవర్తి తనూజుడు) అనే తమ రామాయణం (వచనం) ద్వారా రామకథా వ్యాప్తికి తోడ్పడ్డారని పేర్కొనడం చర్విత చర్వణం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

12
తెలుగు

తమిళులకు సుబ్రహ్మణ్యుడు (మురుగన్) అభిమాన దైవం. అలాగే తెలుగువారికి అభిమానదైవం భద్రాద్రి రాముడు. తెలుగు వారికి సీతా రాములు ఆరాధ్యదైవాలన్నా అతిశయోక్తి కాదు. తెలుగునాడులో రామ మందిరాలు ఎక్కువ. రామభక్తుల సంఖ్యకు కొదవ లేదు. వ్యక్తి నామాలలో రామశబ్దం ఎక్కువగా వినిపిస్తుంది. జోలపాటలు, మంగళ హారతులు, పల్లెపాటలు మొదలైనవాటిలో సీతారాముల ప్రశంస బహుధా కానవస్తుంది. శ్రీరామనవమిని శ్రద్ధాసక్తులతో జరపని పల్లె లేదు; పట్టణం లేదు. పట్టణాలలో నివసించే పడతులు కూడా స్నానానంతరం తమ బిడ్డలకు 'శ్రీరామరక్ష' పెట్టడం విస్మరించలేదు. నేటికీ ఇది సజీవంగా ఉన్న ఆచారం. ఈ విషయాలన్నీ పరిశీలిస్తే, రామకథ తెలుగువారి జీవనంలో అంతర్భాగమై పోయిందేమో అనిపిస్తుంది.

తెలుగులో నాడూనేడూ కూడా ఎన్నో రామాయణాలు వెలుగు చూశాయి. ఇంకా ఎన్ని రామాయణాలు వెలుగులోకి రానున్నవో చెప్ప లేము. ఒక్కమాటలో చెప్పాలంటే, వివిధ సాహిత్య ప్రక్రియలలోనూ రామకథ చోటు చేసుకుంది. రామకథ రూపుదాల్చని సాహిత్య శాఖ లేదనడం సత్యసన్నిహితం. జానపద కళారూపాలలోను రామకథ ప్రముఖ స్థానం వహించింది. చివరకు సామెతలు, పొడుపుకథలు, పదబంధాలు మొదలైన వాటిలో కూడా రామకథకు తగినంత ప్రాముఖ్యం లభిం చింది. రామకథా సంబంధి రచనలే తెలుగులో ముక్కాలు మువ్వీస మనడం అసమంజసం కాదు.

తెలుగులో వెలసిన తొలి రామాయణం రంగనాథ రామాయణం (1240). గోన బుద్ధారెడ్డి రచించిన యీ ద్విపద రామాయణం పండిత పామర రంజకం. షట్కాండలు కలిగిన యీ గ్రంథంలో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

17, 290 ద్విపదలున్నాయి. పైడిపాటి పాపయ్య అనే సహృదయుడు రంగనాథ రామాయణానికి వచనానువాదం వెలయించాడు. బుద్ధారెడ్డి పుత్రులు కాచవిభుడు, విఠ్ఠల నాథుడు 5, 640 ద్విపదలలో ఉత్తర కాండం వ్రాశారు. (రంగనాథ రామాయణ కర్తృత్వం గురించి వివాదం లేకపోలేదు.)

రామాయణ మర్మజ్ఞుడూ, రామకథా సుధారసరక్తుడూ అయిన బుద్ధారెడ్డి వాల్మీకిని అనుసరించి రామచరితను రచించినా, ఆయన రచనలో అవాల్మీకా లెన్నో చోటు చేసుకున్నవి. ఆయన వీటిని ఇతర రామాయణాలనుంచీ, జనశ్రుతి నుంచీ గ్రహించినట్లు చెప్పవచ్చు. రంగనాథ రామాయణంలోని ఉడుత కథ, జంబుకుమారుని వృత్తాంతం, కాలనేమి కథ, సులోచనా వృత్తాంతం మొదలైనవి వాల్మీకంలో లేవు. ఈ నూతనాంశాలలో కొన్ని కథాగౌరవాన్ని ఇనుమడింపజేసేవిగా ఉండడం గమనించదగింది.

రంగనాథ రామాయణ ప్రశస్తికి కారణాలుగా మూడు అంశాలు ముఖ్యంగా పేర్కొనవచ్చు. (1) ఇది ద్విపదలో వ్రాయబడింది. ద్విపదలో గేయాంశం ఉండడంవల్ల, గానానుకూల రచనగా భావించవచ్చు. కనుకనే తోలుబొమ్మలాటలు ప్రదర్శించేవారు ఈ రామాయణం నుంచి కొన్ని ద్విపదలు గ్రహించారు. (2) శైలి యేమో సమత గలది. పైపెచ్చు సరళ సుందరం. (3) వాల్మీకానికి విధేయంగా సంచరిస్తూనే, రంగనాథ రామాయణ కర్త ఆనాడు వ్యవహారంలో ఉన్న కొన్ని రామ కథా సంబంధి కథలకు తన రచనలో పెద్ద పీట వేశాడు.

తరువాత వెలసిన రామాయణం భాస్కర రామాయణం. రంగనాథ భాస్కర రామాయణాలు సమకాలిక గ్రంథా లనవచ్చు. అనగా 13వ శతాబ్దిలో రెండు పూర్తి రామాయణాలు తెలుగులో వెలుగు చూశాయి.

భాస్కరుడు మల్లికార్జున భట్టు ప్రభృతులు రచించిన యీ రామాయణం చంపూ పద్ధతిలో సంతరించబడింది. ఇందులో 6,081 గద్య పద్యాలున్నాయి. పండితలోకపు ఆదరాభిమానాలు చూరగొన్న యీ రామాయణం వాల్మీకం అనుసరించే వ్రాయబడింది. కాని అవాల్మీకాంశాలు కొన్ని చోటు చేసుకున్నాయి. చిన్నప్పుడు రాముడు తనను తన్నినా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

డన్న కోపంకొద్దీ మంథర రామునిపై కినుక వహించడం, జంబుకుమార వృత్తాంతం, తార రాముణ్ణి శపించడం, కాలనేమి వృత్తాంతం, రావణుని నాభిలో అమృతకలశం ఉన్నదనడం మొదలైనవి అవాల్మీకాంశాలలో కొన్ని.

కవిత్రయంలోని వాడైన ఎఱ్ఱన (14 వ శ.) కూడా రామాయణ రచన చేసినట్లు స్పష్టంగా ఆధారాలు కనిపిస్తున్నవి. అయితే ఆయన రామాయణం అలభ్యం. అలాగే ఆదికవి నన్నయ రాఘవాభ్యుదయం అనే కావ్యం వ్రాసినట్లు చెపుతారు. అలభ్య రామాయణాలలో అన్నమాచార్యుని (1424-1503) రామాయణం కూడా ఉన్నది. ఆ పదకవితా పితామహుడు కొన్ని సంకీర్తనలలో రామకథను అభివర్ణించడం పేర్కొనదగిన అంశం. 'ఇతడే పరబ్రహ్మ, మిదియె రామకథ, శతకోటి విస్తరము సర్వ పుణ్య ఫలము' అని ఒక సంకీర్తనలో రామకథా వైశిష్ట్యాన్ని తెలియజేశాడు.

15వ శతాబ్దిలో వర్ధిల్లినట్లుగా భావించబడుతున్న మొల్ల షట్కాండ రామాయణాన్ని సుమారు 900 గద్య పద్యాలలో రచించి సహృదయుల ప్రశంసను చూరగొన్న విదుషీమణి. మొల్ల రామాయణం మాధుర్యానికి పెట్టింది పేరు. రాముని స్తుతించే నాలుక చిల్లర రాజలోకాన్ని మెచ్చదు; ఎలాగంటే బెల్లం తినేవాడు అల్లం కోరనట్లు అనే సామెత ద్వారా ఆ కవయిత్రి మధురమోహనంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

అయ్యలరాజు రామభద్రుడు (1510 - 80) రామకథను 8 ఆశ్వాసాల ప్రబంధమైన రామాభ్యుదయంలో మనోజ్ఞంగా వివరించాడు. ఇందులో రమారమి 1800 గద్యపద్యాలున్నాయి. రాజకవి అయిన కట్టా వరదరాజు (1650) 23, 170 ద్విపదలలో శ్రీరామాయణం సంతరించాడు. ద్విపద కావ్యాలలో ఇది చాలా పెద్దది. అంతేకాదు. కొన్ని అవాల్మీకాంశాలు కానవస్తున్నా, యథావాల్మీకంగా రచితములైన రామాయణాలలో ఇది మొదటి దని భావించవచ్చు. రామాయణాన్ని రచించిన రాజకవులలో తంజనగరం పరిపాలించిన రఘునాథరాయులు, భోసల ఏకోజీలు (మహారాష్ట్ర నృపతి) పేర్కొనదగినవారు. ఏకోజీ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కృతి యింకా వెలుగు చూడలేదు.

కవిసార్వభౌమ బిరుద విరాజితుడైన కూచిమంచి తిమ్మకవి (1684 - 1757) ఆరు కాండల రామాయణం రచించాడు. ఇది అచ్చ తెనుగులో ఉండడం ఒక విశేషం. సంస్కృత శబ్ద సహాయాన్ని అపేక్షించక, కేవలం తెలుగుమాటలలోనే రామకథ వంటి ఒక ఉదాత్తమైన కథను వ్రాయడం నిజంగా ఒక విశేషమే.

తరువాతి కాలంలో కూడా కొన్ని రామాయణాలు వెలుగు చూశాయి. కాని అవి అంత ప్రశస్తములు కావని పేర్కొన వచ్చు. మర్దయ అనే కవి శతకంఠ రామాయణం వెలయించాడు. రావణుని సోదరుడూ మహావీరుడూ అయిన శతకంఠుణ్ణి సీత సంహరించిన కథ 4 ఆశ్వాసాలుగల యీ కావ్యంలో వివరించబడింది. దీనికి సీతా విజయం అనే నామాంతరం కూడా ఉన్నది.

పింగళి సూరన వంటి ప్రముఖ కవి రాఘవ పాండవీయం అనే ద్వ్యర్థి కావ్యం సంతరించాడు. ధర్మాత్మజా పరిణయం వంటి ద్వ్యర్థి కావ్యాలు మరికొన్ని వెలువడ్డాయి. ఆ తర్వాత రాఘవ యాదవ పాండవీయం వంటి త్ర్యర్థి కావ్యాలు వెలువడ్డాయి.

ఇక పూర్వకవులు రచించిన ఉత్తర రామాయణాలను దిఙ్మాత్రంగా పరిశీలిద్దాము.

ఉత్తర రామాయణాన్ని తెలుగు చేసినవారిలో ఆద్యుడు తిక్కన (1210-1300). ఆయన రచించిన నిర్వచనోత్తర రామాయణం 10 ఆశ్వాసాల కావ్యం. మూలంలో 110 సర్గలలో 3, 276 శ్లోకాలలో ఉన్న కథను ఆయన 1300 పద్యాలలో తెలియజేశాడు. కాగా, తిక్కనది సంగ్రహ రచన అనవచ్చు. ఇదే కథను కంకంటి పాపరాజు (1575-1630) 3,000 గద్యపద్యాలలో వివరించాడు. తిక్కన పరిహరించిన రామనిర్యాణం వంటి కథా ఘట్టాలను కూడా పాపరాజు తన కృతిలో వివరించడం వల్ల ఆయనది సంగ్రహ రచన కాదు. రసవద్రచన. ఆయన చేసిన వర్ణనలు మనోహరములు. తిక్కన పరిహరించిన కథా భాగాన్ని జయంతి రామభట్టు ఒక ఆశ్వాసంలో తెలియజేశాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పూర్వకవులకందరికీ వాల్మీకం మాతృక అయినా, వారెవ్వరూ వాల్మీకాన్ని యథాతథంగా అనువదించలేదు. యథానువాదాలు ఆధునిక యుగంలో వెలువడ్డాయి. వాల్మీకికి అతి సన్నిహితంగా ఉండాలన్న తలంపుతో రామాయణ రచన చేసినవారిలో ఆద్యుడు గోపీనాథం వేంకటకవి (1820 - 1890). ఆయనది గోపీనాథ రామాయణమని వ్యవహారం. కాణాదం పెద్దన సోమయాజి ప్రభృతులు యథాశ్లోక తాత్పర్య రామాయణం వెలయించారు. వావిలికొలను సుబ్బారావుగారు (1863-1939) ఆంధ్రవాల్మీకి రామాయణం సంతరించారు. ఆయన జీవిత కాలంలోనే యీ యథానువాదం నాలుగుసార్లు ముద్రణ భాగ్యానికి నోచుకున్నది. జనమంచి శేషాద్రిశర్మగారి (1882-1950) ఆంధ్ర శ్రీ మద్రామాయణం కూడా యథావాల్మీకంగా సాగిన రచనే. ఆయనే ధర్మసార రామాయణం కూడా రచించారు. శ్రీ కృష్ణరామాయణం అనే పేరుతో శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు (1866-1960) రామకథను రచించారు. ఇది యథావాల్మీకం కాదు. ఇది సర్వరామాయణ సారం! ఎన్నో విశేషాలు ఇందులో కానవస్తాయి. అహల్య దోషరహిత. అలాగే కైకేయి నిష్కళంక. తాను రుచి చూచిన పండ్లనే శబరి రాముడికి సమర్పిస్తుంది. శంబుడికి శిక్ష విధించడమే కాని శంబుక వధ లేదు. రావణుని దోష రాహిత్యం చెప్పబడింది. ఈ విశేషాలతో అలరారుతున్న యీ రామాయణం శ్రీపాదవారి నూతన దృష్టికి ప్రబలోదాహరణం. గోవింద రామాయణం, సుభద్రా రామాయణం, సరస్వతీ రామాయణం, శ్రీరామ కథామృతం, మానికొండ రామాయణం (తెలుగు వాల్మీకం), మైథిలి, రాయప్రోలు వారి సుందరకాండ ఇంకా మరికొన్ని రామాయణాలు సంతరించబడ్డాయి. రామసంబంధి రచనలూ చాలా వెలువడ్డాయి. చర్ల గణపతి శాస్త్రిగారి గణపతి రామాయణ సుధకు (వాల్మీకి రామాయణానికి తెలుగుసేత) 1990 వ సంవత్సరపు సాహిత్య అకాదెమీ బహుమతి లభించింది.

ఇక విశ్వనాథ సత్యనారాయణగారి శ్రీమద్రామాయణ కల్పవృక్షం గురించి రెండు మాటలు. వాల్మీకాన్ని ఆధారంగా చేసుకుని వ్రాయబడిందే అయినా, యిది స్వతంత్ర రచన అనడం సముచితం. వాల్మీకం కరుణ రస ప్రధానమైతే, కల్పవృక్షం శాంతరస ప్రధానంగా సాగింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రచనలో పెక్కుతావుల మనస్తత్వ పరిశీలన కనిపిస్తుంది. భారతీయ జ్ఞాన పీఠం వారి ప్రతిష్ఠాకరమైన బహుమతి పొందిన యీ ఉద్గ్రంథం గురించి ఒక వ్యాసంలో విశ్వనాథ వారు ఇలా పేర్కొన్నారు. 'నేనే స్వయముగా ఎన్ని అడవులు తిరిగానో ఎన్ని కొండలు ఎక్కానో చెప్పలేను. ఆ నా స్వంత అనుభవాలు, ఆయా గ్రంథాలలో ఉన్న విషయాలు రామాయణంలో వ్రాశాను.' కల్పవృక్షం గురించి ఖండన మండనలు చాలా వెలువడ్డాయి. విశ్వనాథ వారే ఒకచోట యిలా పేర్కొన్నారు; 'ఆ పూర్వకవులను (పద్యరచనాసామ్రాజ్య పట్టభద్రులు, కథాకథన శిల్ప నూత్నాచార్యులు...... అయిన నన్నయ్య తిక్కనాదులు) నిలబెట్టుకొంటే అప్పుడు నేనూ నిలుస్తాను. నేను చేసిన పని అటువంటిది......' 'ఇతని (విశ్వనాథ) కవనాన్ని వ్యాకరించడానికి చాలా పిండి వుండాలి' అని చెళ్ళపిళ్ల వెంకటశాస్త్రిగారు చెప్పినట్లుగా, విశ్వనాథవారి 'రామాయణాన్ని పరిశీలించడానికి బహువిషయపరిజ్ఞానం, విద్వత్తు అవసర మనడం అసమంజసం కాదు.

రామసంబంధి శతకాలు యక్షగానాలు మొదలైనవి లెక్కకు మిక్కిలిగా వెలువడ్డాయి. దాశరథి, సీతాపతి, ప్రసన్న రాఘవ, రామప్రభు మకుటాలు గల శతకాలు నేటికీ ప్రచారంలో ఉన్నాయి. వంగూరు ముద్దు నరసకవి కృత పసన్న రాఘవ శతకంలో, రెండు వందల పద్యాలలో, రామకథ పూర్తిగా - అయితే బహు సంగ్రహంగా చెప్పడం జరిగింది. సీత లంకలో జన్మించినట్లు, రావణు డామెను ఒక మందసంలో ఉంచినట్లు, ఆ మందసాన్ని సముద్రంలోకి విసిరివేసినట్లు, దాన్ని చూసిన భూదేవి తన వద్ద ఉంచుకున్నట్లు ఈ శతకం చెబుతున్నది. చివరికి సీతను జనకుడు నాగేటి చాలులో కనుగొన్నాడు. కంచర్ల గోపన్న (రామదాసు) వ్రాసిన దాశరథిశతకం భక్తిరస ప్రపూర్ణమైన రచన.

ఇక భక్తిరసపు ముద్దలైన త్యాగరాజ కీర్తనలు రామభక్తి సాహిత్యంలో రసగుళికలు. రాముని సంస్తుతించిన ప్రముఖ వాగ్గేయ కారులలో ఆయనే అగ్రేసరుడు. రాముణ్ణి ప్రస్తుతిస్తూ ఆయన అన్ని కీర్తనలు వెలయించాడు. త్యాగరాజు 24,000 కీర్తనలు వెలయించినట్లు చెపుతారు. కాని ఒక వెయ్యిమాత్రమే లభించాయి. తెలుగులో గేయ రామాయణం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లేని లోటుని తీర్చిన మహనీయుడు త్యాగరాజు!

యక్షగానాలలో 16వ శతాబ్ది వాడైన కందుకూరి రుద్రకవి రచించిన సుగ్రీవ విజయం ప్రశస్త మైనది. వాలి వధను ఆయన సమర్థించాడు. కాని తార పలికిన పలుకులు రామబాణాలకంటె బహూ కఠినమైనవి. జానకీ హరణంతో పాటు, రామా! నీ వివేకం రాజనీతి మొదలైనవి కూడా అపహరించబడినవా? అని ఆమె అడుగుతుంది. శేషాచలదాసు వ్రాసిన ధర్మపురి రామాయణం, విజయ రాఘవ నాయకుని జానకీ కళ్యాణం, కూచిమంచి జగ్గకవి వ్రాసిన జానకీ పరిణయం, వెంకటార్యుడు రచించిన లేపాక్షి రామాయణం మొదలైనవి కూడా ప్రసిద్ధ యక్షగానాలే. ఖండకావ్యాలూ ఎన్నో వెలువడ్డాయి.

ఇది వచన యుగం. కాగా, రామాయణ వచనానువాదాలు బహుళంగా వెలువడడంలో ఆశ్చర్యం లేదు. వావిళ్ల రామస్వామి శాస్త్రి, దేవరాజసుధి (తేవప్పెరుమాళ్లయ్య), దొడ్డా వెంకటరామిరెడ్డి, మోడేపర్తి గున్నయ్య ప్రభృతులు గ్రాంధికాంధ్రంలో వచన రామాయణాలు వెలయించారు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీనివాస శిరోమణి, పురిపండా అప్పలస్వామి, ఉషశ్రీ ప్రభృతులు శిష్టవ్యావహారికంలో వచనానువాదాలు వెలయించారు.

ఈ సందర్భంగా సురవరం ప్రతాపరెడ్డి గారి రామాయణ విశేషములు (1957) అనే ఉద్గ్రంథం పేర్కొనదగింది. వాల్మీకి రామాయణాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన పేర్కొన్న విశేషాలు ఆసక్తికరములు. చక్కని విమర్శ కది నికషోపలం. దావూరి దొరస్వామి శర్మగారు పరిశ్రమించి రచించిన తెలుగు సాహిత్యము: రామకథ (1972), శ్రీమతి పండా శమంతకమణిగారి తెలుగుసాహిత్యంలో రామకథ (1972) మొదలైన రచనలు కూడా పరిశీలనార్హములే. అలాగే రామాయణానికి సంబంధించిన రంగనాథ వాల్మీకి రామాయణముల తులనాత్మక పరిశీలనము, రామాయణ వైభవము, రామాయణ కల్పవృక్షం - అధ్యాత్మ రామాయణ ప్రభావం, రామాయణ సర్వస్వము, రామాయణ సుధాలహరి మొదలైన సిద్ధాంతవ్యాసాలూ సంకలనములూసంభావించదగినవి.

వాల్మీకి రామాయణం, రామాయణ కల్పవృక్షం మొదలైన వాటిని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విమర్శిస్తూ కొన్ని పుస్తకాలూ వ్యాసాలూ వెలువడడం గమనించదగిన విషయం. రంగనాథ రామాయణాదులకు పీఠికలు వెలయించినవారు కూడా విమర్శనాత్మక విషయాలు వెల్లడించారు. రామాయణ పాత్రల్ని పురస్కరించుకుని ప్రసిద్ధ రచయితలు కొందరు గ్రంథరచన చేశారు. వాటికే బృహత్ పీఠికలు వెలయించారు. ఎన్నో విషయాలు వారు చర్చించారు. వారు చెప్పిన విషయాలలో ముఖ్యమైనవి : వర్తమాన రామాయణ మంతా వాల్మీకి రచన కాదు; ప్రక్షిప్తాలు చాలా వాల్మీకంలో చేరాయి. సాధారణంగా మనం భావించేటంత దుర్మార్గుడు కాడు రావణుడు. కుంభకర్ణుడు న్యాయపరుడు. వాల్మీకి మహర్షి చిత్రించిన దాక్షిణాత్య చిత్రం అంత శోభాయమానంగా లేదు. ఆటవికుల్ని క్రూర రాక్షసులుగా చిత్రించడం జరిగింది. ఆర్య - అనార్య (ద్రావిడ) దృష్టితో పరిశీలించడం వల్ల ఇలాంటి భావాలు విమర్శకులు కొందరికి కలిగి వుండవచ్చు. ఏది యెలా వున్నా, ఆధునిక విమర్శకులు వెలార్చిన భావాలను జాగ్రత్తగా పరిశీలించడం సహృదయుల కర్తవ్యం.

సంస్కృతంలోని వాల్మీకి రామాయణమే కాక అధ్యాత్మ ఆనంద రామాయణాదులు, భాసకవికృత నాటకాలు మొదలైనవి తెలుగు కవులను, రచయితలను బహుధా ఆకర్షించిన వని పేర్కొనవచ్చు. తత్ఫలితంగా ఆ వివిధ రచనలకు తెలుగుసేతలు వెలుగు చూశాయి. రామకథను చిత్రిస్తూ స్వతంత్ర నాటకాలు కూడా వెలువడ్డాయి.

అధ్యాత్మ రామాయణం బ్రహ్మాండ పురాణంలోని ఒక భాగ మని కొందరు భావిస్తారు. కాణాద పెద్దన సోమయాజి (18 వ శతాబ్ది) అనువాదమే లభ్యమైన వాటిలో మొదటి దని పేర్కొనవచ్చు. కాని అంతకు ముందే అధ్యాత్మ రామాయణం తెలుగు చేయబడినట్లు తెలియ వస్తున్నది. కాళహస్తి సుబ్రహ్మణ్య కవి ఆ రామాయణాన్ని కీర్తనలుగా అనువదించాడు. ఇది 1911 లో ముద్రితం. ఇవి కాక అధ్యాత్మ రామాయణానికి గద్య పద్యానువాదాలు మరికొన్ని వెలిశాయి. పిశుపాటి నారాయణ శాస్త్రి గారి ఆంధ్రాధ్యాత్మ రామాయణము (1929), బులుసు వేంకటేశ్వర్లుగారి నిర్వచన సంపూర్ణ అధ్యాత్మ రామాయణము (1968) మొదలైనవి పేర్కొనదగిన రచనలు. పిశుపాటివారి తెలుగు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సేతకు వేటూరి ప్రభాకర శాస్త్రిగారు అమూల్యాభిప్రాయం ఇచ్చారు. 'మూలార్థమును చాల జాగ్రత్తగా సంగ్రహించి యాంధ్రభాష నావర్జించు కొని పలుకు పొంకము గానరా గొప్ప గ్రంథమును దెనిగించిన వారిలో వావిలికొలను సుబ్బరావుగారు ముఖ్యులని నే, దలంతును అన్న వేటూరి వారి మాటలు గమనించదగినవి.

ఆనంద రామాయణం కూడా తెలుగు చేయబడింది. చిలుకూరి శ్రీరామశాస్త్రిగారి అనువాదాన్ని చూడగలిగాను. ఆయన అభిప్రాయం ప్రకారం అది సమర్థ రామదాసు కృతమని చెప్పవలసి వున్నది. ఇందులో 4 కాండ లున్నవి. వాల్మీకానికీ దీనికీ కొన్ని భేదాలు కానవస్తున్నవి. ఉదాహరణం హనుమంతుని జన్మ వృత్తాంతం. ఆనంద రామాయణ కథనం ఇలా సాగింది. దశరధుడు పాయసాన్ని తన ముగ్గురు రాణు లకు సరిసమానంగా పంచి యివ్వలేదు. అది నచ్చలేదు కైకేయికి. ఆ కోపం కొద్దీ ఆమె తనకు లభించిన పాయసభాగాన్ని విసిరివేసింది. ఆ భాగాన్ని ఒక గంధర్వస్త్రీ గ్రహించి అంజనపర్వతం మీద ఉంచింది. దాన్ని ఆరగించిన అంజనీదేవికి ఆంజనేయుడు కలిగాడు.

జ్ఞానవాసిష్ఠం కూడా తెలుగు చేయబడింది. మడికి సింగన (14వ శతాబ్ది), తరిగొండ వెంగమాంబ ప్రభృతులు తెలుగు చేశారు.

ఇతర భాషా రామాయణాలు కొన్ని తెలుగులోకి అనూదితములు కావడం తెలుగువారి రామాయణ ప్రియత్వాన్ని సూచిస్తున్నది.

ఒరియాభాషలో శ్రీ సిద్ధేంద్ర యోగి రచించిన విచిత్ర రామాయ ణాన్ని డొంకా గోపీనాథకవి 17వ శతాబ్ది మొదట్లో వచనకావ్యంగా తెలుగు చేశాడు. దాన్ని ఆధారంగా చేసుకుని తుమురాడ పాపకవి, నరసింహదేవర వేంకటశాస్త్రి ప్రభృతులు పద్యకావ్యాలు వెలయించారు.

తులసీదాసు వ్రాసిన శ్రీ రామచరితమానసం తెలుగు కవుల్ని బహుధా ఆకర్షించిందనవచ్చు. మైలవరపు సూర్యనారాయణమూర్తి, భాగవతుల నరసింహ శర్మలు పద్యకావ్యంగా అనువదించగా, నేలనూతలపాటి పార్వతీ కృష్ణమూర్తి ప్రభృతులు వచనానువాదాలు వెలయించారు.

తమిళంలోని సుప్రసిద్ధమైన కంబరామాయణాన్ని పూతలపట్టు శ్రీరా ములు రెడ్డిగారు రెండు సంపుటాలలో తెలుగు చేశారు. పూతలపట్టువారి పద్యకావ్యాన్ని ఆధారంగా చేసుకుని మరుపూరు కోదండరామిరెడ్డిగారు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వచన కంబరామాయణం వెలయించారు. ఆదిపూడి సోమనాథరావుగారు (1867-1941) కంబ రామాయణాన్ని పద్య కావ్యంగా అనువదించి నట్లు, ఆ తెలుగు సేత అముద్రితంగానే ఉన్నట్లు తెలియవస్తున్నది. కంబ కవి జీవితాన్ని తెలుగువారికి తొలుదొలుత తెలియజేసిన వారు తి. సు. మురుగేశం పిళ్ళై. ఆయన రచన ఆంధ్రసాహిత్య పరిషత్ పత్రికలో (సంపుటం 12) ముద్రితం. ఇంకా పుస్తకరూపం దాల్చలేదు.

విద్వత్కవులవలె జానపదకవులు కూడా రామకథాసాహిత్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. వారి కృషి అనల్పం. వారి పాటల వల్లనే రామకథ మారుమూల పల్లెలలకు కూడా పాకింది. చిత్ర విచిత్రములైన అంశాలు రామకథలో అంతర్భాగాలైనవి. రామకథ వారిని ఎంతగా ఆకర్షించిందో, శోకపూరితమైన సీతమ్మ కథ వారిని అంతగా ఆకట్టుకుంది. సీతకథను మిషగా చేసుకుని జానపద కవయిత్రులు తమ మూగబాధను వ్యక్తం చేసి వుంటారు. సీతను గురించి ఎన్ని పాటలు - రకరకాల పాటలు - వాడుకలోకి వచ్చాయో ఖచ్చితంగా చెప్పలేము. సీత పెండ్లి, సీత అప్పగింతలు, సీతను అత్తవారింటికి పంపుట, సీతమ్మవారి అలక, సీత దాగుడుమూతలు, సీత చెర, సీత అగ్నిప్రవేశం, సీతా దేవి వేవిళ్లు - ఇలా ఎన్నో పాటలు! సీతను జానపద కవులు సీతాంగన అని వ్యవహరించారు.

చాలాకాలం అనాదృత వాఙ్మయంగా ఉండిపోయిన జానపద సాహిత్యం సహృదయులైన పండితుల కృషివల్లనూ, పరిశోధకుల కృషివల్లనూ వెలుగు చూడగలిగింది. తత్ఫలితంగా 42 స్త్రీల రామాయణపు పాటలు ఒక సంపుటంగా వెలువడ్డాయి. (ఆంధ్ర సారస్వత పరిషత్తు వారి ప్రచురణ). తత్ సంపాదకులు కృష్ణశ్రీగారి అభిప్రాయం ప్రకారం ఆ పాటలలో చాలా భాగం కవయిత్రులు చెప్పినవే. రామాయణపు పాటలు, ముద్రితా ముద్రితాలు, మరికొన్ని ఉండవచ్చునని నిస్సంశయంగా చెప్పవచ్చు.

జానపద రామాయణాలలో కానవచ్చే కొన్ని విశేషాలు వాల్మీకంలో గాని, తెలుగు విద్వత్కవులు వెలయించిన రామాయణాలలో గాని లేవని పేర్కొనడం అతిశయోక్తి కాదు. లక్ష్మణుని భార్య ఊర్మిళ చేసిన త్యాగం గాని ఆమె అనుభవించిన మూగ బాధ గాని ఎందుకో పండిత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవుల్ని ఆకర్షించలేదు. కాని జానపద కవి (కవయిత్రి ?) ఊర్మిళాదేవి నిద్ర అనే రసార్ద్రమూ దీర్ఘమూ అయిన గేయం సంతరించాడు. అది నేటికీ పల్లెటూరి పడతుల జిహ్వాగ్రముల నిలిచివున్నది. ఆ గేయం నేటి జానపద విజ్ఞాన పరిశోధకులకు ప్రీతిపాత్ర మయింది. హిందీ పంజాబీ భాషా రచయిత, సుప్రసిద్ధ జానపద విజ్ఞానవేత్త అయిన దేవేంద్ర సత్యార్థి గారు ఆగేయాన్ని ఆంగ్లంలోకి అనువదించి, ఆంగ్లానువాదాన్ని 1940 ఏప్రిలులో Modern Review పత్రికలో ప్రకటించారు.

ఇటీవల ఇలపావులూరి పాండురంగారావుగారు అనుదిన రామాయణం (తెలుగు విశ్వవిద్యాలయం, 1991) అనే బృహద్రచన చేశారు. ఇది వాల్మీకికి అనువాదం కాదు. రామాయణం ఒక ఆత్మ దర్శన మని ఆయన అభిప్రాయం.

ఉపసంహారంగా కొన్ని మాటలు.

తెలుగులో రామకథా స్రవంతి 13వ శతాబ్ది నుంచీ నేటిదాకా అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తూనే ఉన్నది. కనుక తెలుగు సాహిత్యం మీది రామకథా ప్రభావం మాటల కందనిది. రామాయణ కవులందరు వాల్మీకి రామాయణాన్నే అనుసరించారు. అధ్యాత్మ రామాయణాదుల్ని అనుసరించినవారూ కొందరు లేకపోలేదు. కట్టా వరదరాజు తప్ప, ప్రాచీనులలో మరెవ్వరూ వాల్మీకానికి యథానువాదం చెయ్యాలని భావించలేదు. అనగా, కథకు సంబంధించినంతవరకూ వాల్మీకిని అనుసరించారు. రచనా విధానంలో కవిత్రయంవారినే అనుసరించారనడం సత్యోక్తి. యథానువాదం పూర్వ కవుల ధ్యేయం కాదనీ, అది ఆధునికుల అభిమత మనీ పేర్కొనవచ్చు. ఇతర భాషా కవుల వలె, తెలుగు కవులు కూడా వాల్మీకి చిత్రించిన మానవోత్తముడైన రాముణ్ణే పరంధాముడనే భావించారు. జానపద కవులకు రామకథ ఎంతగా నచ్చినా, వారి దృష్టి చాలా వరకు సీతమ్మ సుఖ దుఃఖాల మీదనే కేంద్రీకృతం కావడం పేర్కొనదగిన అంశం. మొత్తం మీద తెలుగు రామకథా సాహిత్యం ప్రాచీనమైనదే కాక ప్రశస్తమైనది కూడా.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

13
పంజాబీ

పంజాబీలో వెలసిన రామాయణం పేరు రామావతార్. కంబకవి తన రామాయణానికి పెట్టిన పేరు రామావతారమే. పంజాబులో అధర్మం విలయ తాండవం చేస్తున్న రోజులవి. నీతి న్యాయం నశించింది. పాలకులు తమ యిచ్ఛ వచ్చినట్లు ప్రవర్తించసాగారు. ఆ రోజుల్లో అన్నమాట, సిక్కుల పదవ గురువైన గురు గోవిందసింగ్ ధర్మయుద్ధం సాగించారు. సత్యం, న్యాయం, మానవ స్వాతంత్ర్యం, సమత్వం - వీటిని ధ్యేయంగా చేసుకుని ఆయన సమరం సాగించారు. జాతీయతను ప్రబోధించారు. ధైర్య సాహసాలు తన అనుయాయులలో నెలకొనాలని కృషి చేశారు. వారు ఆత్మగౌరవం కలిగి సాహసోపేతులై సంచరించేలా పాటుపడ్డారు. అందుకు ఆయనకి రామకథ తోడ్పడింది. అనుయాయుల్ని రామాయణ వీరులుగా చేశారు.

గురుగోవిందసింగ్ ప్రముఖ సాహితీవేత్త. గొప్ప పండితుడు. పైపెచ్చు ఆధ్యాత్మిక వేత్త. యుద్ధవీరుడు కనుకనే ఆయన అభివర్ణించిన రాముడు కూడా ప్రముఖ వీరుడుగా దర్శన మిస్తాడు. యుద్ధ నైపుణ్యం అతనిలో కానవస్తుంది. విలువిద్యలో ఘటికుడు. ఖడ్గచాలనంలో అందె వేసిన చేయి. ఒంటరిగా నిలబడి ఎంతమందినైనా యుద్ధంలో జయించగలడు. ధైర్య సాహసాలకు మారుపేరు.

గురుగోవిందసింగ్ సంతరించిన రామావతారంలో 864 ఆశ్వాసాలు ఉన్నాయి. ఆయన 71 ఛందస్సులు ఉపయోగించారు. ఛందో వైవిధ్యం గల కావ్య మది! ఆయన అవతార పురుషుడైన రాముని కథను సట్లెజ్ నదీ తీరాన కూర్చుని రచించారు. భగవదనుగ్రహం వల్ల వ్రాసి ముగించినట్లు చెప్పుకున్నాడు. గొప్ప యుద్ధవీరుల్ని సాహసోపేతులైన సైనికుల్ని, ధైర్యంగల నేతల్ని కనుక నేను తయారు చేయగలిగితే, నన్ను

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గోవిందసింగ్ అని పిలవండి - కావ్యారంభంలో ఆయన చేసిన ప్రతిజ్ఞ యిది. కాగా అలాంటివారు తయారుకావడానికి తన యావచ్ఛక్తిని ఆయన వినియోగించి ధన్యుడైనాడు. ఆయన చేసిన యుద్ధ వర్ణనలు సహజ సుందరములు.

ధ్వనుల సహాయంతో భావ వ్యక్తీకరణ చెయ్యడంలో గురు గోవింద సింగ్ ఘటికుడు. పరశురామ-రామ సంవాదం అతి రమణీయంగా సాగి నట్లు అభిజ్ఞుల అభిప్రాయం. కోపోద్దీపితుడైన పరశురాముడు కఠినోక్తులాడినా, రాముని ధనుర్విద్యాకౌశలం చూసి ముగ్ధుడైనాడు. భృగుమహర్షి ధనుస్సును చేతిలోకి తీసుకుని దాన్ని రాముడు ఎక్కుపెట్టగానే అది ఆరుముక్కలయింది. పదహారేండ్ల పడుచువాని శౌర్యం చూడగానే కుఠారధారి అయిన పరశురాముడు ముగ్ధుడైనాడు. రాముని శౌర్యాన్ని మహా మెచ్చుకున్నాడు. రాముణ్ణి కౌగిలించుకున్నాడు. కళ్లలో ఆదరాభిమానాలు నెలకొనగా అతని వంక చూశాడు. ఆయన మనస్సంతా రాముని కపోలముల మీద కేంద్రీకృత మయింది. రాముని పద్మనయనాలు, చంద్రవదనం, సుధారసోక్తులు ఆయన్ని వశంవదం చేసుకున్నాయి. పరశురాముడు తన దృష్టుల్ని రాముని నుండి మరల్చలేకపోయాడు.

పది తలలు, ఇరవైచేతులు గల రావణాసురుణ్ణి గురుగోవింద సింగ్ అభివర్ణించిన తీరు హృద్యం.

చందర్ హస్ ఎకంకర్ ధారి
దూతి ధప్ హా త్రిటి కటారి
ఛత్రత్ హతి సైహతి ఉజియారి
గొఫన్ గూరజ్ కరత్ చంకారి.

రావణుని ఒక చేతిలో పరమశివుడిచ్చిన ప్రత్యేక ఖడ్గం ఉందట. రెండవ చేతిలో చాక్కపు చిరుకత్తి ఉందట. మూడవ చేతిలో బాకు, నాలుగవ చేతిలో బల్లెం, ఐదవచేతిలో పాశం, ఆరవ చేతిలో వెండిబెత్తం ఉన్నాయట. ఏడవచేతిలో రెండువైపుల పదును పెట్టిన ఖడ్గం, ఎనిమిదవ చేతిలో గద, తొమ్మిదవ చేతిలో త్రిశూలం, పదవ చేతిలో చురకత్తి ఉన్నాయట. తంబురా పదకొండవ చేతిలో, బాణాలు పన్నెండవ చేతిలో ధనుస్సు పదమూడవ చేతిలో కవచం పధ్నాలుగవ చేతిలో, వృత్తాకారపు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విల్లు పదిహేనవ చేతిలో ఉన్నాయట. ఇక కడమ చేతులలో ఉచ్చు, కుఠారం, తుపాకి, బాకు, పట్టా కత్తి మొదలైనవి ఉన్నాయట. ఇలా ఇరవై చేతులలోనూ ఆయుధాలు ధరించిన రావణుని అభివర్ణించిన కవి బహుశః గురుగోవిందసింగ్ ఒక్కరే అన్నా అతిశయోక్తి కాదు.

రామావతార్ లోని వ్యక్తులు దైవలీలలకు లోబడిన వారుగా కనిపిస్తారు. అందరూ విధివిలాస మని భావిస్తారు. వారు కఠినోక్తు లాడరు. మృదుభాషులు. గోవిందసింగ్ వీరయోధుడు కావడం వల్ల, ఆయన అభివర్ణించిన రామ లక్ష్మణాదులు కూడా వీరులుగా దర్శన మిస్తారు. సీతను ఉదాత్తంగా చిత్రించాడు. ఆమె క్షత గాత్రుల వరుసలో రాముని చూస్తుంది. భర్తతోపాటు చితినెక్కి ఆత్మత్యాగం చేసుకోవాలని అభిలషిస్తుంది. అప్పుడు 'పామర స్త్రీవలె ఎందుకు నీవు సంచరిస్తావు? క్షత గాత్రుల మీద నీవు కనక నీళ్లు చల్లితే వాళ్లకి పూర్వపు ఆరోగ్యం కలుగుతుంది.' అని ఆకాశవాణి పలుకుతుంది. సీత అలాగే చేస్తుంది. ఇలాంటి మహిమలు సచ్ఛీలం వల్లనే సాధ్య మవుతాయి!

గత శతాబ్దిలో వాల్మీకి రామాయణాన్ని పంజాబీలోకి అనువదించారు. జటిల సంస్కృత శబ్దాలకు పంజాబీలో అర్థాలు ఇచ్చారు. బ్రిజ్ లాల్ శాస్త్రి రామకథ అన్న పేరుతో వాల్మీకాన్ని వచనంలోకి అనువదించారు. ఆయనే ఆ తర్వాత పద్య కృతి ఒకటి వెలయించారు. దాని పేరు రామ్ గీత్. మూలంలోని కథను ఏ మార్పులు లేకుండా అలాగే యిచ్చారు. సరళ సుందరమైన భాషను ఉపయోగించారు.

తులసీదాసు రామచరిత మానస్‌ని ముగ్గురు నలుగురు పంజాబీలోకి పరివర్తించినట్లు తెలియవస్తున్నది. జ్ఞాని సంత్ సింగ్ తులసీరామాయణ్ సటీక్ రచించారు. వ్యాఖ్యా సహితంగా అది 1894లో ప్రచురిత మయింది. 1957లో జ్ఞాని ఇషర్ సింగ్ నరాగారు కవితావళి రామాయణ్ వెలువరించారు. హోషియార్‌పూరులోని విశ్వేశ్వరానంద్ వైదిక సంస్థాన్ వారు పంజాబీ రామాయణ్ (384 పుటలు) ప్రచురించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

14
బెంగాలీ

బెంగాలీలో రామాయణం అనగానే కృత్తివాసుని పేరు వెంటనే గుర్తుకి వస్తుంది. కృత్తివాస రామాయణం వలె మార్పులకు లోనైన మరొక రచన మనకు కనిపించదు. ఆ మహాకవి వ్రాసిన పద్యం ఒకటైనా యథాతథంగా ఆ రామాయణంలో ఉన్నదా అనే సందేహం కలిగేలా ఆ రచన పెక్కు మార్పులకు లోనయిందని పండితులు భావిస్తున్నారు. ఇలా మార్పులకు లోను కావడమే ఆ రామాయణానికి గల ప్రాశస్త్యమునూ, ప్రాచుర్యమునూ స్పష్టం చేస్తున్నది. కాలం గడవను గడవను మార్పులూ చేర్పులూ ఎన్నో సంతరించుకొని కృత్తివాస రామాయణం నేటికీ బెంగాలీలను అలరిస్తూ ఉండడం గమనించదగిన అంశం.

కృత్తివాసుడికి పూర్వం బెంగాలీలో రామకథను రచించినవారు లేరనడం సత్యసన్నిహితం. ఈ విషయంలో ఆయన కాని యితర కవులు కాని మౌనం వహించడమే యిలా అనడానికి ప్రధాన కారణం. కాని రామకథ మౌఖికరూపంలో ప్రచారంలో ఉండివుండవచ్చు. భక్తకవి జయదేవుడు చంద్రుణ్ణి అవతారపురుషుడిగా గుర్తించి కీర్తించాడు. జయదేవుడు వంగ దేశీయుడని విజ్ఞుల విశ్వాసం. 13వ శతాబ్దికి చెందిన రామానందుడు ఆయన అనుయాయులూ రాముని ఆరాధనను వ్యాప్తిలోకి తెచ్చినట్లు కొందరు భావిస్తున్నారు. అయినా రాధాకృష్ణ భక్తి తత్త్వానికి లభించినంత ప్రచారం బెంగాలులో రామతత్త్వానికి లభించలేదనడం నిర్వివాదం. ముఖ్యంగా మహాభక్తుడు చైతన్యుడు (16వ శతాబ్ది) రంగ ప్రవేశం చెయ్యడంతో రాధాకృష్ణతత్త్వం బాగా వాడుకలోకి రావడమే కాకుండా బెంగాలీ కవుల్ని, ప్రజల్నీ ముఖ్యంగా ఆకర్షించింది కూడా!

అయితే అంతకు పూర్వమే రామకథ సంస్కృత సాహిత్యం ద్వారా బెంగాలులో వ్యాప్తి చెందింది. గుప్తులకాలంలో - అనగా 4వ శతాబ్దిలో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

- సంస్కృతం బెంగాలులో ప్రవేశించినదనీ, బౌద్ధమతానుయాయులైన పాలరాజుల కాలంలో (7వ శతాబ్ది) రామకథ బెంగాలీలకు సుపరిచిత మయిందనీ తెలియవస్తున్నది. 9వ శతాబ్దికి చెందిన అభినంద అనే వంగదేశీయుడు సంస్కృతంలో రామచరిత అనే కావ్యం వ్రాశాడు. ఇది వాల్మీకం అనుసరించి వ్రాయబడింది. అప్పటికి బెంగాలీభాష బాగా అభివృద్ధి చెందలేదనీ, కనుకనే అభినంద సంస్కృతంలో రచన సాగించాడనీ చెప్పబడుతున్నది. కాని ఆయన రామచరితలో బెంగాలీ ప్రభావం కనిపిస్తున్నది. రావణవధకు పూర్వం రాముడు భక్తిపూర్వ కంగా దేవీపూజ చేసినట్లు బెంగాలీ రామాయణాలు పేర్కొన్నాయి. ఈ దేవీపూజా ప్రసక్తి రామచరితలో కూడా కనిపిస్తున్నందువల్ల, తన కాలపు విశ్వాసాన్ని, అవాల్మీకమైనా, కవి మన్నించక తప్పలేదు. ఆ తర్వాత సంధ్యాకరనంది అనే మరొక వంగదేశీయుడు సంస్కృతంలోనే రామచ రిత వ్రాశాడు. దీనికి చారిత్రక కావ్య యశస్సు లభించింది. కాగా, కృత్తివాసునికి పూర్వమే రామకథ బెంగాలులో వ్యాప్తిలో ఉన్నట్లు నిస్సం శయంగా పేర్కొనవచ్చు. బెంగాలులో కొన్ని చోట్ల రామచంద్రుడికి (రఘునాథుడని కూడా వ్యవహరిస్తారు) ఆలయాలు వెలిశాయి.

రాధాకృష్ణతత్త్వం ప్రచుర ప్రచారం గడించినా, కృత్తివాస రామా యణం వంగ భాషా ప్రియుల్ని ఆకర్షించగలిగిందంటే, ఆ రామాయణ రచన ఎంత గొప్పదో మనం ఊహించుకోవచ్చు. చైతన్యుడి జీవిత కథను రచించిన వారిలో ఆద్యుడైన బృందావనదాసు కృత్తివాసరామాయణ ప్రాశస్త్యమును వివరిస్తూ తత్కావ్యం హిందువుల్నీ మహమ్మదీయుల్నీ సరిసమానంగా ఆకర్షించగలిగిందని పేర్కొన్నాడు. కాగా, ప్రతి బెంగాలీ యింట ఆ రామాయణపు ప్రతి ఉండడంలో ఆశ్చర్యం లేదు. జనప్రియ రామాయణ మది! వాల్మీకి రామాయణం అనుసరించి వ్రాయబడినా, అందులో ఎన్నో పురాణగాథలూ, పిట్ట కథలూ చోటు చేసుకోవడంతో దాని నిజస్వరూపం పూర్తిగా మారిపోయింది. బెంగాలీల ఆచార వ్యవ హారాలు, నమ్మకాలు, అభిరుచులు - ఒకటేమిటి, అన్నీ - ఆ కావ్యగత విషయాలు కావడం వల్ల దానిపై ప్రాంతీయుతా ముద్ర కనిపిస్తుంది. ఈ జనప్రియ రామాయణ కర్త అయిన కృత్తివాస పండితుణ్ణే కృత్తి వాస ఓఝు అని కూడా వ్యవహరిస్తారు. ఉపాధ్యాయకు సంక్షిప్త రూపం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒఝ. ఆయన 15వ శతాబ్ది ఉత్తరార్థంలో జీవించాడు. ఆయన జననం 1398 లో జరిగినట్లు కొందరి అభిప్రాయం. ఆయన పూర్వులలో ఒక రైన నరసింహ తూర్పు బెంగాలునుంచి వచ్చి నాడియా జిల్లాలోని పూలియాలో స్థిరపడినట్లు తెలియవస్తున్నది.

కృత్తివాసుని తండ్రి వనమాలి. తల్లి మాలిని. వారికి ఆరుగురు మగపిల్లలు. వారిలో పెద్దవాడు కృత్తివాసుడు. ఆయన ఉత్తర బెంగాలుకి వెళ్లి అక్కడ సంస్కృత విద్యాభ్యాసం చేశాడు. తగినంత విద్వత్తు సముపార్జించిన తర్వాత ఆయన అక్కడి హిందూరాజుని దర్శించాడు. కృత్తివాసుని సంస్కృత విద్వత్తూ, కమనీయకవితా శక్తీ రాజుని బహుధా ఆకర్షించాయి. బెంగాలీలో రామాయణ రచన చేయవలసిందిగా కవిని అర్థించాడు. అది కృత్తివాసుడు తన భాగ్యంగా భావించాడు. ఆయన దృష్టిలో వాల్మీకి 'మహాముని' ('ముని మధ్యే బఖని వాల్మీకి మహా ముని'). దివ్య కృతి అయిన వాల్మీకి కృతిని సామాన్యుల కోసం సప్తకాండ రామాయణంగా వ్రాయడానికి ఆయన సన్నద్ధు డయ్యాడు. ఆరోజుల్లో హిందూరాజులు పదవీభ్రష్టులు కావడం, మహమ్మదీయ నృపతులు విజృంభించడం, తత్ఫలితంగా రామాయణం వంటి రచనకు గల ఆవశ్యకతను గుర్తించడం జరిగివుండవచ్చు.

కృత్తివాసుని రామాయణ రచనకు ప్రేరేపించిన రాజు మహమ్మదీయుడనీ, అతను బహుశా జలాలుద్దీననీ ఒక అభిప్రాయం ఉంది.

వాల్మీకాన్ని మాతృకగా చేసుకున్నా, కృత్తివాసుడు తన రచనలో కొత్త విషయాలూ కొత్త కథలూ చొప్పించాడు. అంతే కాదు. జైమినీ భారతం, అద్భుత రామాయణం మొదలైన వాటిలోంచి కూడా కొన్ని కథలు గ్రహించాడు. ('విస్తరిత లిఖిత అద్భుత రామాయణె', 'ఏసబ్ గయిలగీత్ జైమిని భారతే'.) సంస్కృత విద్వాంసుడు కావడం వల్ల, కృత్తివాసుడు యోగవాసిష్ఠం, రఘువంశం, అనర్ఘరాఘవం మొదలైన రామ కథాత్మక వాఙ్మయాన్ని సంప్రదించి వుండవచ్చు. వాల్మీకంలోని వర్ణన సంగ్రహంగా ఉన్నచోటల్లా కొత్త అంశాలతో విపులీకరించడానికి ఆయన ప్రయత్నించాడు. ఉదాహరణకి, గంధమాదన పర్వతం నుంచి హనుమంతుడు బయలుదేరిన సందర్భంలో ఆయన ఇలా అన్నాడు. 'ఈ వివరాలు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వాల్మీకంలో లేవు. అద్భుత రామాయణం ఆధారంగా దీన్ని వివరిస్తాను - ' అని. కాగా కృత్తివాస రామాయణం వాల్మీకానికి అనువాదం కాదు; పునస్సృష్టి.

కృత్తివాసుని కృతిలో కానవచ్చే కొన్ని అవాల్మీకాంశాలను పరిశీలిద్దాం. ఇవి ముఖ్యంగా ఆది, యుద్ధ, ఉత్తర కాండలలో కనిపిస్తాయి. ఆది కాండలో మూలంలోని కథాక్రమం పాటించబడలేదు సరికదా, సూర్య చంద్రవంశాలకు సంబంధించిన విషయాలూ, హరిశ్చంద్రుడు దిలీపుడు అజుడు మొదలైన వారి కథలూ, శంబరాసురవధ, హరగౌరీ కలహం, అంగద రాయబారం, వీరబాహుని మరణం, విభీషణుని కుమారుడైన తర ణిసేనుని మరణం, అహిరావణ మహిరావణులు వృత్తాంతం, నూటెనిమిది నీలకమలాలతో రామచంద్రుడు దుర్గాపూజ కావించడం మొదలైన వాటిని కొత్తగా చొప్పించాడు.

మధ్యకాలీన వంగరామాయణాలలో కానవచ్చే ముఖ్యమైన మార్పు, సీతను రావణ బీజోత్పన్నగా అభివర్ణించడం. ఇది అద్భుత రామాయ ణంలో ఉన్నది. అలాగే రాముడు చండీ (దుర్గ) పూజ చేయడం కూడా బెంగాలీ రామకథలోని మరొక ముఖ్యమైన మార్పు. శివుడు, రాముడు చేసిన యుద్ధం కూడా ఈ కోవకు చెందిందే. బెంగాలీ రామా యణ కర్తలు రాముణ్ణి విష్ణ్వంశ సంభూతుడుగానే గ్రహించారు.

కృత్తివాసుడిది సరళసుందరమైన శైలి. గానయోగ్యత గల శైలి; అలం కారికమైన శైలి. ఉపమాద్యలంకారాలను చక్కగా వాడాడు. అనుప్రాస ఆయనరచనకు అందాలు దిద్దింది.

> 'హె అరణ్య తుమి ధన్య వన్య వృక్షగణ'.
> 'రక్తె రంగ అంగ భంగ పలయ్ సుగ్రీవ'.
> 'హేమ్‌గిరి సమగిరి జగతెన హెరి.'

మొదలైన పంక్తుల్ని యిందుకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

ఈ శ్రవణ సుభగత్వమైన శైలి సామాన్యపాఠకుణ్ణి అలరిస్తే, చాలా చోట్ల కృత్తివాసుడు వివరించిన తాత్త్విక విషయాలు బుద్ధిజీవుల్ని ఆకర్షి స్తాయి. అయినా చిత్ర మేమిటంటే, యీ తాత్త్విక విషయ వివరణ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆయన కవితామృతాన్ని ఆస్వాదించడానికి అడ్డు తగలక పోవడమే! ఈ అంశం తత్కృతి ప్రాచుర్యానికి ఎంతగానో తోడ్పడిందనడం చర్విత చర్వణం. ఈ రామాయణ ప్రియులు ఎవరికి వారు తమకు నచ్చిన ఉపాఖ్యానాలు మొదలైనవి చేర్చారు. కృత్తివాస రామాయణానికి ఎన్నో ప్రత్యంతరాలు వెలుగులోకి వచ్చాయి. భిన్న ప్రతుల్ని సంప్రదించి 1802లో శ్రీరాంపురం మిషన్ ప్రెస్సువారు ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగులకోసం కృత్తివాస రామాయణం ముద్రించారు. నేటికీ ఇది ప్రశస్తమైన ముద్రణగా భావించబడుతున్నది.

ఇతర రామాయణకవుల వలె, కృత్తివాసుడు కూడా రామనామ మహత్మ్యాన్ని బహుధా కీర్తించాడు.

"రాం నాం లహితె భాయ్‌న కరియొ హెల
భవసింధు తరిబరె రాం నాం భెల
రాంనాం బోలో భాయ్ బార్ బార్
భెబె దేఖ రాం బినా గతినహి ఆర్."

[రామనామ సంకీర్తనాన్ని నిర్లక్ష్యం చెయ్యకు
భవసాగరాన్ని దాటే నావ అని విస్మరించకు
ఆ నామం ఉచ్చరించు మాటిమాటికీ
అది వినా గతి మరొకటి లేదని తెలుసుకో.]

మధ్యకాలీన వంగదేశంలో రామాయణం అతి ప్రీతిపాత్రమైన గ్రంథం. కవు లనేకులు రామకథను చిత్రించడానికి ప్రయత్నించారు. అయితే పూర్తి రామాయణాలు చాలా వెలుగులోకి రాలేదు. అంగద రాయబారం, శివరాముల యుద్ధం, లవకుశుల యుద్ధం, సీతావనవాసం ఇలా రామాయణాంతర్గత కథలు ప్రత్యేక రచనలుగా వెలువడ్డాయి. కాని అద్భుతాచార్య (16వ శతాబ్ది), చంద్రావతి (16వ శతాబ్ది), కవిచంద్ర (18వ శతాబ్ది), రామానంద ఘోష (18వ శతాబ్ది), జగత్‌రాం (18వ శతాబ్ది) ప్రభృతులు ఏడుకాండల రామాయణం రచించారు.

చంద్రావతీ దేవిని గురించి రెండు మాటలు. రామాయణ గాయకుడుగా పేరుపెంపులు గడించిన వంశీదాసుని కుమార్తె చంద్రావతి. హృదయ విదారకమైన సీతమ్మ కథను ఆమె గేయరూపంలో చిత్రించింది.

రావణాసురుడు ఎలా ఉంటాడో చూడాలని బుద్ధిపుట్టింది సీత చెలికత్తెలకు. ఆ రాక్షసుని చిత్రం గీసి చూపమని వాళ్ళు సీతను వేధించుకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తిన్నారు. వాళ్లబాధ పడలేక ఆమె అలాగే చిత్ర రచన చేసింది. ఆ తర్వాత అలిసిపోయి, ఆ చిత్రంతో పాటే ఆమె నిద్ర పోయింది. అప్పుడే రాముడు అక్కడికి వచ్చాడు. ఆ దృశ్యం చూడగానే రాముడు సీతను శంకించాడు. సీత రావణుని చిత్రం వ్రాయడానికి కారణం రాముని సోదరి అయిన కకుయ (కైకేయి కూతురు) అని చంద్రావతి కథ అల్లింది. ఆమెను రాముడు సంశయించాలనే దురుద్దేశంతోనే కకుయ సీతను రావణుని చిత్రరచనకు పురికొల్పింది. చివరికి ఆమె కోరిక నెరవేరింది.

ఇటువంటి సన్నివేశమే జైన రామాయణాలలో ఉన్నట్లు, అది బెంగా లులో వాడుకలో ఉండినట్లూ అభిజ్ఞుల విశ్వాసం. లంక నుంచి తిరిగి వచ్చిన తర్వాత, రాముడు మరి ముగ్గురు స్త్రీలను పెళ్లి చేసుకున్నట్లూ, వారు సీతపట్ల అసూయాగ్రస్తులై సంచరించినట్లూ జైనరామాయణాల కథనం. ఏది యెలా ఉన్నా, వాల్మీకి చిత్రించిన ఏకపత్నీవ్రతుడైన రామచంద్రుడే. ప్రజాహృదయంలో నిలిచిపోయాడు.

17వ శతాబ్దికి చెందిన రామానంద ఘోష రాముడు బుద్ధుని అవ తారంగా భావించాడు. ఆయన ఉద్దేశంలో రాముడూ దారు బ్రహ్మ (పూరీలోని జగన్నాథస్వామి) భిన్నులు కారు. అధ్యాత్మరామాయణాన్ని అనుసరించి ఆయన రామాయణం రచించాడు. ఆయన రచనలో బౌద్ధ, వైష్ణవ, శాక్తములకు సంబంధించిన పెక్కు విషయాలు చోటు చేసు కున్నాయి.

మధ్యకాలీన వంగసాహిత్యంమీద రామకథ చెరగని ముద్ర వేసింది. వైష్ణవ పదావళిలో కూడా రామకథా ప్రభావం కొంచెం కనిపిస్తుంది. బృందావనం నుంచి కృష్ణుడు మధురకు బయలుదేరిన సందర్భంలో గోపికలు పరితపించిన దృశ్యం, రామచంద్రుడు అయోధ్య నుంచి వనవాసానికి బయలుదేరిన ఆ విషాద దృశ్యాన్ని స్ఫురణకు తెస్తుంది. 15వ శతాబ్దికి చెందిన మాలాధరవసు రచించిన శ్రీకృష్ణవిజయంలో రామకథ చోటు చేసుకుంది. ఇది బెంగాలీలో వెలసిన మొదటి కృష్ణకథా కావ్యం. కృష్ణలీలలు బాగా వాడుకలోకి వచ్చేంతవరకూ, సీతారాముల కథలు నాట కాది వివిధ కళారూపాల్లో ప్రదర్శిత మవుతూ ఉండేవి. బెంగాలీ రంగస్థలం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మీద మకుటంలేని మన్నీడుగా కీర్తిగడించిన గిరీష్ చంద్రఘోష్ ప్రభృతులు రామాయణ భారతాలనుంచి కథలు గ్రహించి నాటకాలు ప్రదర్శించి ప్రజల మన్ననలు సంపాదించారు.

19వ శతాబ్ది పూర్వార్ధంలో వాల్మీకి రామాయణానికి బెంగాలీలో యథానువాదం వెలువడింది. అనువాదకుడు రఘునందన్ గోస్వామి. అయితే ఈ అనువాదం ప్రధానంగా వాల్మీకాన్ని అనుసరించినా ఇతర రామాయణాలను కూడా అనుసరించినట్లు విజ్ఞుల అభిప్రాయం. రాజ శేఖర బస, హేమచంద్ర భట్టాచార్య, శిశిర్ కుమార్ నియోగి ప్రభృతులు కూడా అనువదించారు. బెంగాలీలో నవ్యకవితావిర్భావానికి దారి వేసిన మైకేల్ మధుసూదన దత్తు మేఘనాథవధ కావ్యం అనే ప్రశస్త కృతి వెలయించారు. ఆయన దృష్టిలో రావణుడు విధివంచితుడు. రావణుని పాత్ర ఆయనకి బాగా నచ్చిన పాత్ర. రవికవీంద్రులు వాల్మీకి ప్రతిభ అనే అమూల్య రచన చేశారు. అందులో ఆయన రామాయణ ప్రాశస్త్యాన్ని ఉగ్గడించారు.

అపూర్వానందస్వామి దివ్యరామాయణం వ్రాశారు. తులసీదాసు రామాయణం అనూదిత మయింది. హిరణ్మయ బంద్యోపాధ్యాయ, సుఖమయ భట్టాచార్య, దీపక్ చంద్రలు విమర్శ గ్రంథాలు వ్రాశారు. కృష్ణపదావళి, శాక్త పదావళీ మొదలైనవి ఎక్కువే వెలసి, బెంగాలులోని వివిధ జానపద కళారూపాల్లో రామకథ స్థానం సంపాదించింది. పెళ్లిపాటలు, తోలుబొమ్మలాటలు, నృత్యనాటికలు (నటగీత), రామాలయాలలో పాడబడే రామలీల ఝుమర్లు, ఆగమ సంబంధమైన కార్యకలాపాలు - మొదలైన వాటిలో రామకథకు ప్రాధాన్యం బాగా లభించింది. పెళ్లిపాటల్లో సీతారాముల ప్రసక్తి ఎక్కువగా కనిపిస్తుంది. సీతారాములు ఆదర్శ దంపతులనే విశ్వాసం యిందుకు కారణం. ప్రతి వధువు సీత అనీ, ప్రతి వరుడూ రాముడనీ బెంగాలీలు భావిస్తారు. కాని విచిత్ర మేమిటంటే, బెంగాలీలు తమ ఆడపిల్లలకి సీత, జానకి, మైథిలి అని యిలా సీతా పరమైన పేర్లు పెట్టడానికి ఇష్టపడరు. ఒక రామలీల ఝుమరులో రావణునిపాత్ర ఉదాత్తంగా చిత్రించబడింది. సీతను రావణుడు మాతృస మానంగా భావించి గౌరవిస్తాడు. శూర్పణఖ కోరికను తీర్చడంకోసమే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రావణుడు సీతను అపహరించి లంకకు తీసుకువస్తాడు. అంతేకాని ఆమె మీది ప్రేమ కారణంగా మాత్రం కాదు. నృత్యనాటికా ప్రదర్శనాలకు రామకథలోని సన్నివేశాలు బాగా తోడ్పడ్డాయి. పశ్చిమ బెంగాలులోని మిడ్నపూరు జిల్లాకి చెందిన ఆదిమజాతి వారయిన సంతాలులు తాము రావణుని సంతతివార మని చెప్పుకుంటారు. విజయదశమినాడు వాళ్లు జరిపే భువాంగ్ నాచ్ అనే ఒక విలక్షణమైన నృత్యం ద్వారా తాము రామచంద్రుని చేతుల్లో పొందిన అపజయాన్ని గుర్తు చేసుకుంటారు. ఆదిమవాసుల గుండెల్లోకి కూడా రామకథ చొచ్చుకుపోయిన విషయాన్ని ఈ అంశం స్పష్టం చేస్తున్నది.

పండిత కవులూ జానపదకవులూ కృష్ణకథా సాహిత్యాన్నీ హరగౌరీ కథలనీ ఎక్కువగా ఆదరించినా, సీతారాముల కథలూ బెంగాలీవారిని ఆకర్షించకపోలేదు. రామాయణంలోని ధర్మనిష్ఠ కంటె, ఆ కావ్యంలో వివరించబడిన కౌటుంబిక సంబంధాలూ సరళసుందరమైన కథా వారిని ప్రముఖంగా ఆకర్షించాయి. ముఖ్యంగా హృదయాన్ని కదిలించే సీతకథా, భరతుడు రామునిపట్ల ప్రదర్శించిన భక్తిభావమూ మొదలైనవి అందరినీ ఆకట్టుకున్నాయి. నేటికీ ప్రప్రథమ బెంగాలీ రామాయణకవి కృత్తివాసుడు మహాకవిగా, ఆయన రచన ప్రశస్త కృతిగా భావించబడుతూ వుండడం విస్మరించరాని విషయం! అంతేకాదు; కృత్తివాస రామాయణం బెంగాలీల జాతీయకావ్య మనే కీర్తిని కూడా గడించింది!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

15

మలయాళం

'భారత పఠనం కలహకారణం, రామాయణ పఠనం ఐశ్వర్యదాయకం' - అనే నమ్మకం కేరళదేశంలో వ్యాప్తిలో ఉంది.

మనదేశంలో పెక్కు ప్రాంతాలలో రామమందిరాలు కనిపిస్తాయి. ఇందులో ఆశ్చర్య మేమీ లేదు. కాని కేరళలో రామాలయం తోపాటు భరతాలయం, లక్ష్మణాలయం, శత్రుఘ్నాలయం మొదలైనవి కూడా కనిపిస్తాయి. ముఖ్యంగా త్రిచూరుకి సమీపంలో ఇరిజల్‌కూడ లోని భరతాలయం చాలా ప్రసిద్ధి చెందింది. అలాగే ఆల్వాయికి దగ్గరలో ఉన్న మాళిక్కుళంలోని లక్ష్మణాలయం కూడా ప్రసిద్ధ మైనదే.

మహాకవి ఎళుత్తచ్చన్ మలయాళంలో సంతరించిన అధ్యాత్మ రామాయణం నేటికీ పారాయణ గ్రంథం. సంజవేళ దీపాలు పెట్టిన తర్వాత ఎళుత్తచ్చన్ రామాయణంలోంచి కొన్ని పద్యాలు చదువుతారు. ఎప్పుడు చదివినా చదవకపోయినా కటకమాసంలో (శ్రావణ - భాద్రపదములు) మాత్రం రామాయణాన్ని పారాయణం చేసే సంప్రదాయం నేటికీ సజీవంగా ఉంది. ఇది పల్లెపట్టులలోనే కాదు, పట్టణ ప్రాంతాలలోనూ వాడుకలో ఉంది.

ఈ విషయాదికాన్ని పరిశీలిస్తే కేరళలో రామాయణానికి గల ప్రచారం అనల్పమని వ్యక్త మవుతుంది. రామకథకు సంబంధించిన సామెతలూ ఎన్నో ప్రచారంలో ఉన్నాయి. వాటిలో కొన్ని:

1. అణ్ణార్ కణ్ణనుం తన్నాలాయదు.
   (ఉడుత కూడా తనవల్ల అయినది చేసింది.)

ఉడుత భక్తికి సంబంధించిన సామెత యిది. ఈ కథ కూడా ప్రచారంలో ఉంది. కాని మలయాళ కవు లెవ్వరూ దీనిని గ్రంథస్థం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చెయ్యలేదు.

2. వల్లవన పుల్లు మాయుధం
(బలవంతునికి తృణమూ ఆయుధమే)
ఇది కాకాసురునికి సంబంధించినది.

3. రామబాణం పోలె.
(రామబాణం వలె)

4. నేరం విళక్కు వోళం రామాయణం కేట్టు
ఎన్నిట్టుం రామను సీతయార ఎన్నాణ చోద్యం?
(రామాయణ మంతా విని రాముడు సీత కేమవుతాడని అడిగినట్లు)

5. హనుమాన్టె వాలు
(హనుమంతుని తోక.)

హనుమంతుని తోక పొడుగూ కావచ్చు; పొట్టిదీ కావచ్చు. గొప్ప ఆతిథ్యం లేదా మామూలు ఆతిథ్యం అనే భావాన్ని సూచించేందుకు 'అతని ఆతిథ్యం హనుమంతునితోక' అనడం మలయాళీలకు అలవాటు.

6. రావణన్ కోట్ట.
(రావణుని కోట)

రావణుని కోట దిగ్భ్రమ కలిగించే చోటు; తికమక పెట్టే చోటు; అయోమయావస్థ కలిగించే చోటు; సులభంగా పరిష్కరించలేని సమస్య అనడానికి కేరళీయులు, 'అది రావణుని కోట' అని వ్యవహరిస్తారు.

7. బాలి కేరామల
(వాలి ఎక్కలేని కొండ.)

వాలి ఎక్కలేని కొండ. అనగా ఋష్యమూక పర్వత మని అర్థం. చొరరాని చోటు అనే అర్థంలో ఈ సామెత ప్రయుక్తం.

కేరళలోని పెక్కు ప్రాంతములు రామకథా సంబంధములై ఉండడం గమనించదగిన అంశం. ఎక్కడెక్కడి భక్తులూ శ్రద్ధాభక్తులతో సందర్శించే శబరిమలై, రామపాదం మొదలైనవి ఈ సందర్భంలో పేర్కొనదగినవి.

కేరళలో రామభక్తులకు కొదవ లేదు. 'పెరుమాళ్ తిరుమొళి' సంత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రించిన కులశేఖర ఆళ్వారు (క్రీ.శ 8 వశతాబ్ది) రామభక్తాగ్రగణ్యుడు. చేరవంశీయుడైన కులశేఖరుడు రాజకవి; ఆయన రామభక్తిని గురించి రుచికరములైన కథలు కొన్ని నేటికీ ప్రచారంలో ఉన్నాయి. ఈ కులశేఖరుడే ముకుందమాల కర్త అని కొందరి నమ్మకం. కాని యిది సరి కాదేమో!

రామకథ మలయాళీల సాంస్కృతిక జీవితంలో ఎంత గాఢంగా పెన వేసుకుపోయిందంటే, వారి అభిమాన పాత్రమైన కళారూపం కథకళికి రామకథ వెన్నెముక వంటిది. కథకళికి నామాంతరం ఆట్టకథ. దాని పూర్వనామం రామనాట్టం. భారత కథల్ని ప్రదర్శించడం మొదలుపెట్టినప్పటినుంచీ దానికి కథకళి అనే వ్యవహార నామం ఏర్పడింది. ఆట్టకథ ఒక్కటైనా వ్రాయని రచయిత కవి కాడని మలయాళ పండిత లోకంలో మొనమొన్నటివరకూ ప్రబలంగా ఉండిన అభిప్రాయం. కనుక ఈ ఆట్టక్కథా వాఙ్మయం బహు విస్తృత మైనది. అయితే వైవిధ్య రహితం.

రామనాట్టం (రామనాటకం) తొలి ఆట్టక్కథ. ఇది 17వ శతాబ్దిలో వెలుగు చూసింది. దాని కర్త కొట్టారక్కరకు చెందిన ఒక రాజు. ఇది అంత ప్రశస్తమైన సాహిత్య రచన కాకపోయినప్పటికీ, ప్రదర్శనానుకూలమైన రచన. కాగా, నేటికీ ఇందులోని కొన్ని భాగాలు ప్రదర్శితములవుతూ ఉన్నవి. పుత్రకామేష్టి, సీతాస్వయంవరం, విచ్ఛిన్నాభిషేకం, ఖరవధం, వాలివధం, తోరణయుద్ధం, సేతుబంధం, యుద్ధం - అనే ఎనిమిది భాగాలలో రామకథ అంతా ఈ నాటకంలో మనోజ్ఞంగా చిత్రించబడింది. ఒక్కొక్క భాగమూ ఒక్కొక్క రాత్రికి సరిపోతుంది. ఈ నాటకమే కాక రామకథాత్మకములైన నాటకాలు ఎన్నో ఆట్టక్కథా వాఙ్మయంలో ఉన్నాయి. రావణ విజయం, మేఘనాథ విజయం, శ్రీరామావతారం, సీతాస్వయంవరం మున్నగునవి ఈ కోవకు చెందిన చక్కని రచనలు.

అలాగే, తుళ్లల్ సాహిత్యంలోనూ రామకథాత్మకములైన రచనలు చాలా ఉన్నాయి. ఒకే ఒక నటుడు ప్రదర్శించే నృత్యనాటకమును తుళ్లల్ అని వ్యవహరిస్తారు. ఈ ప్రక్రియకు ఆద్యుడు పరిహాస రసి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కుడుగా ప్రసిద్ధి కెక్కిన మహాకవి కుంజన్ నంబియార్. ఆయన 18వ శతాబ్దికి చెందినవాడు. ఆయన వ్రాసిన సీతాస్వయంవరం మొదలైనవి సాహితీవేత్తల ఆదరాభిమానములు చూరగొన్నవి.

రామకథను ప్రచారం చేసినవారిలో చాక్యార్లు ముఖ్యులు. గుళ్ళు గోపురాలలో కథలు చెప్పే వీరు సంస్కృత నాటకాలు ప్రదర్శించేవారు.

వారి నాటక ప్రదర్శనకు కూడిఆట్టం (సమష్టిప్రదర్శన) అనిపేరు. చాక్యార్లు ప్రదర్శించిన రామాయణ నాటకాలలో ఆశ్చర్య చూడామణి, అభిషేక నాటకం, ప్రతిమా నాటకం మొదలైనవి ముఖ్యమైనవి.

రామకథకు సంబంధించిన జానపద గేయములు చుబ్బన చూరలు. వాటిలో ఒకటి సీతా దుఃఖం. సీతా పరిత్యాగానికి ఒక రజకుని ఎత్తి పొడుపుమాటలు కారణ మైనట్లు కథ ఒకటి ప్రచారంలో ఉంది. కాని రావణుని చిత్రమును సీత గీయడం వల్ల ఆమె అడవులకు పంపబడినట్లు ఈ జానపదగేయం స్పష్టం చేస్తున్నది. ఇది వ్యాప్తిలో ఉన్న గేయం. ఇటువంటి గేయములే కాకుండా, పొలం పనులు చేసేటప్పుడు కార్మికులు (పులయులు) పాడే కమన్ని పాటలలో రామకథా ప్రశంస బహుళంగా కానవస్తుంది. ఒక పాటలోంచి మూడు పాదాలు:

'జనగణ్ణై మగళల్లో సీతప్పెణ్ణు
అవళుక్కల్లో రామక్కోలాన్ ఉడుక్కానిట్టు
అవనల్లో రావణచ్చనె కొన్ను........'
(జనకుని కూతురు సీతాంగన కాదా
ఆమెకే గదా రామరాజు చేసెను వస్త్రదానం
అతడేగా రావణునీ చంపె.)

రామక్కోలాన్ గౌరవ వాచకం. మహాఘనత వహించిన రాముడని ఆ మాటకు అర్థం. వస్త్రదాన మనగా వివాహ మైనదని భావం. ఇది కేరళీయుల సంప్రదాయం.

ఇలా జానపద సాహిత్యంలో రామకథ చోటు చేసుకుంది. ఇక మలయాళ కావ్య వాఙ్మయంలో రామకథ ఎలా అందాలు దిద్దుకుందో పరిశీలిద్దాము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మలయాళంలో వెలసిన తొలిరామాయణం రామచరితం అనే కావ్యం. 13వ శతాబ్దిలో జీవించిన సీరామ (శ్రీరామ) అనే కవి దానికి కర్తగా భావించబడుతున్నాడు. ఆయన తిరువాంకూరు ప్రభువని కొందరి అభిప్రాయం. యుద్ధకాండమును మాత్రమే అభివర్ణిస్తున్న యీ కావ్యంలో 1814 పద్యాలు (పాట్టు) ఉన్నాయి. తమిళ ఛందస్సుకి సంబంధించిన వృత్తములు ప్రయుక్తము లైనా సంస్కృత శబ్దాలు ఎన్నో యిందులో వాడబడినవి. ఈ కావ్యం అంత ప్రశస్తమైనది కాకపోయినా, కవి మాత్రం సంస్కృత విద్వాంసుడనే అంశం వ్యక్త మవుతుంది. వాల్మీకి కృతిని అనుసరించి యీ కావ్యం సంతరించబడడం గమనించదగిన విషయం.

మలయాళంలో వెలసిన రెండవ రామాయణం కణ్ణశ్శ రామాయణం. దానికర్త కణ్ణశ్శ పణిక్కర్. 15వ శతాబ్దివాడు; నిరణం కవివర్గంలోని వాడు. ఉత్తరకాండ కథను కూడా వివరించే యీ కావ్యం చాలా ప్రచారంలోకి వచ్చింది. తరువాతి కవుల్ని ప్రభావితం చేసింది. వాల్మీకిని అనుసరించే కావ్యం వెలయించినా, వర్ణనలలో కవి కొంచెం స్వాతంత్ర్యం వహించినట్లు చెప్పవచ్చు. ఇది చక్కని కావ్యం. కాని యిందులో తమిళపు పాలు కొంచెం ఎక్కువగా ఉన్నట్లు పండితుల అభిప్రాయం.

మలయాళంలో రామకథా పాట్టు అనే రామాయణం ఒకటి ఉంది. 15వ శతాబ్ది దాని రచనా కాలం. అయ్యప్పిళ్ళై ఆశాన్ అనే కవి దాని కర్త. వాల్మీకం అనుసరించి వ్రాయబడిన యీ కావ్యాన్ని సుప్రసిద్ధ విద్వాంసులు పి.కె. నారాయణ పిళ్ళై చక్కగా పరిష్కరించి రెండు సంపుటాలలో ప్రకటించారు. భాషా పరిమళం అనే ప్రశస్త వ్యాఖ్యానం కూడా ఆయన వెలయించారు. మొత్తం 1759 పుటల బ్రహద్గ్రంథ మిది. రచన అంత మేల్తరమయినది కాదని పండితుల అభిప్రాయం.

ఒక సన్నివేశం.

నీకు నచ్చిన వ్యక్తిని నువ్వు పెళ్ళి చేసుకోవచ్చునని రావణుడు శూర్పణఖకు అనుజ్ఞ యిస్తాడు. అప్పు డామె రాముణ్ణి సమీపిస్తుంది. శూర్పణఖ చేసిన రామదర్శనాన్ని కవి అన్తాది వృత్తంలో వర్ణించిన తీరు హృద్యం. మూల రచన యిలా సాగింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'కండనళాం సుందరనె కడియ
మళముగిల రక్కి
వండమరుం కేశముల్ల మాయవనె
ఎరిము ఒయాళ్
పుండరీకాక్షంగళుల్ల పుణ్ణియనె
పుళంద కణ్ణాళ్
అండర్ తొళుం మరనూలె
అరిజవన్ అరివు కెట్టాళ్.'

[భావానువాదం :

చూచింది సుందరుణ్ణి - కారు మబ్బువంటి రక్కసి
భ్రమర కేశుణ్ణి మాయగాణ్ణి - ఎఱ్ఱ జుట్టు కలది.
పుండరీక నయనుణ్ణి పుణ్యుణ్ణి - వెఱ్ఱి చూపులది.
దేవతలు కొలిచే వేదము లెరిగిన వాణ్ణి - బుద్ధి లేనిది]

ఇక నా తెలుగుసేత:

కనియె సుందరుని — వికారపు రక్కసి,
కమల నయను — చికిలి కనులు కలది,
భ్రమర కేశపాశు — రాగి జుట్టు కలది,
శ్రుతు లెరుగని వాని — మతి విహీన.

ప్రతిపాదంలోనూ అందాల రాముడికీ, అనాకారి శూర్పణఖకూ మధ్య గల అంతరాన్ని కవి కళ్లకు కట్టినట్లు తెలియజేశాడు. రాము డంతటి మనోహరాకృతి కలిగినవాణ్ణి అందచందములు మృగ్యమైన శూర్పణఖ ఆశించడం అసమంజసం అన్న భావాన్ని పద్య మంతటా కవి స్పష్టం చేశాడు. పద్యంలో అందాలు దిద్దుకున్న పరిహాస దృష్టి పేర్కొనదగింది.

15వ శతాబ్దిలో పునం నంబూద్రి అనే మహాకవి వ్రాసిన రామాయణ చంపు వెలుగు చూచింది. ఇది 20 ప్రబంధముల (భాగముల) గ్రంథం. రావణోద్భవం, విచ్ఛిన్నాభిషేకం, సుగ్రీవ సఖ్యం, ఉద్యాన ప్రవేశం మొదలైనవి కొన్ని భాగాలు. ఈ రామాయణ చంపు మణి ప్రవాళ శైలిలో సంతరించబడిన ప్రశస్త కావ్యం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మలయాళ రామాయణ సాహిత్యంలోనే కాక మలయాళ వాఙ్మయం లోనే అమూల్యరచనగా భావించబడుతున్న ఎళుత్తచ్చన్ రామాయణం 16వ శతాబ్దిలో వెలువడింది. ఈ రామాయణం వెలుగులోకి వచ్చిన తర్వాత అంతకు పూర్వం వెలువడిన రామాయణా లన్నీ తమ ప్రచా రాన్ని కోల్పోయినట్లు పేర్కొనవచ్చు. అంతేకాక, మలయాళం మీది తమిళభాషా ప్రభావానికి స్వస్తి చెప్పబడింది కూడా. ఎళుత్తచ్చన్ ఆధు నిక మలయాళ భాషా జనకు డని చిరకీర్తి సముపార్జించాడు.

తుంజత్ ఎళుత్తచ్చన్ మహాకవికి పూర్వం వెలువడిన రామాయణా లకు వాల్మీకం మాతృక. కాని ఎళుత్తచ్చన్ అధ్యాత్మ రామాయణమును అనుసరించాడు. అధ్యాత్మ రామాయణ కథకు అనల్పమైన ప్రచారం కల్పించిన ప్రాంతీయ భాషా కవులలో ఆయన విశిష్ట డనవచ్చు. కాని యుద్ధకాండమును మాత్రం వాల్మీకమును అనుసరించే ఎళుత్తచ్చన్ సంతరించాడు. ఉత్తర కాండను పరిహరించాడు. తరువాతి కాలంలో ఉత్తర కాండను కిళిప్పాట్టు (చిలుక పాట) శైలిలో ఒకరు రచించారు. దానికి ప్రచారం లభించలేదు.

అధ్యాత్మ రామాయణాన్ని అనుసరించడం వల్ల, ఎళుత్తచ్చన్ తీర్చిది ద్దిన రాముడు విష్ణ్వంశ సంభూతుడు. సీతారాముల వివాహం ఆయన దృష్టిలో, లక్ష్మీ నారాయణుల పునస్సమాగమం. వివాహవేళ రాముని కంఠసీమను సుమహారంతో అలంకరించేందుకు ముందు, సీత తన చూపుల పూలదండతో అలంకరించినట్లు ఎళుత్తచ్చన్ మనోజ్ఞంగా పేర్కొన్నాడు. ఆ మహాకవి అభివర్ణించిన రావణుడు సీతను లావణ్య లతికగా చిత్రించినా, ఆమె లక్ష్మీదేవి అని కూడా భావించాడు. తన ప్రేమను వమ్ము చేయవద్దని దశకంఠుడు సీతను అర్థిస్తాడు. ఆ సందర్భంలో అతడు చేసిన దీర్ఘ ప్రసంగం "సుముఖి! తవ చరణ నలిన దాసోస్మ్యహం......." అనే మాటలతో అంత మవుతుంది. ఈ ప్రసంగం పైకి మామూలుగా కనిపించినా, అంతరార్థం మాత్రం విభిన్న మని మలయాళ పండితుల అభిప్రాయం. సీత నుద్దేశించి రావణుడు, 'నేను నీ చరణముల నాశ్ర యించుచున్నాను.' అనడంలో, శరణాగతి భావం ప్రస్ఫుట మవుతున్నది. కొందరి దృష్టిలో రామాయణం శరణాగతి కావ్యం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మలయాళంలో రామాయణ మంటే ఎళుత్తచ్చన్ సంతరించిన అధ్యాత్మ రామాయణ మనే అర్థం. అంత ప్రశస్తి ఈ కృతికి లభించింది! పారాయణ గ్రంథంగా కూడా అది ప్రసిద్ధి కెక్కింది. ఈ రామాయణ పఠనానంతరం కన్నెపడుచులు కొందరికి కళ్యాణప్రాప్తి కలిగిందట! ఇక యింతకంటే ఎక్కువగా ఎళుత్తచ్చన్ కృతిని గురించి చెప్ప నవసరం లేదు.

ఎళుత్తచ్చన్ మహాకవిని గురించి రెండుమాటలు. ఆయనకి తెలుగు, తమిళ లిపులు బాగా తెలుసునని పండితుల విశ్వాసం. ఈ సంద ర్భంలో చేల్నాట్ అచ్యుత మీనన్ పేర్కొన్న విషయాన్ని యథాతథంగా ఉదాహరిస్తున్నాను.

"Once a Brahmana Sanyasin presented a manuscript copy of the original *Adhyatma* written in Telugu (according to another version Nagari) script to an Ambalapuza Raja who wished to have it translated into Malayalam script so that he might read the rare work....... Since Meppattur did not know Telugu, Ezuttaccan was approached for the purpose, as he was conversant with all Dravidian scripts. In the course of transcription, the work was rendered into Malayalam verse by the poet." పైన ఉదాహృతుడైన బ్రాహ్మణ సన్న్యాసి కాశీ నుచి వచ్చినట్లు భావించబడుతున్నది.

17వ శతాబ్దినుంచి వాల్మీకి రామాయణానికి యథానువాదములు వెలువడసాగాయి. రాజకవి అయిన కేరళవర్మ రామాయణం తొలుత పేర్కొనదగింది. ఇది ప్రశస్తమైనదే కాని అసమగ్రం.

మహాకవి వళ్లతోళ్ నారాయణ మీనన్ (1878 - 1957) చేసింది అక్షరాలా యథానువాదం. ప్రతి శ్లోక పరివర్తన మది. అంతేకాక అనువాద మంతా అదే అనుష్టుప్ ఛందస్సులోనే సాగింది. మూలం ఏ ఛందస్సులో ఉన్నదో, అనువాదం కూడా ఆ ఛందస్సులోనే సాగడం పేర్కొనదగింది.

ఆధునిక మలయాళ కవిత్రయ యుగంలో ఒకడైన మహాకవి కుమా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రన్ ఆశాన్ (1873-1924) చింతా విష్టయాయ సీత (చింతా క్రాంత అయిన సీత) అనే ఖండకావ్యం సంతరించాడు. ఆయన బాలరామాయణం కూడా వ్రాశాడు. ఈ రెండూ సాహితీ ప్రియుల ఆదరాన్ని బహుధా చూరగొన్నవి. అళకేత్ పద్మనాభ కురుప్ (రామచంద్ర విలాసం), వడక్కుంకూర్ రాజరాజవర్మ (రాఘవాభ్యుదయం) ప్రభృతులు రామాయణాలు వెలయించారు. వెణ్ణికుళం గోపాల కురుప్, పి. కుంజరామేన్ నాయర్, టి. కె. భట్టతిరి, నీలకంఠపిళ్లై ప్రభృతులు తులసీదాసు రామాయణమును మలయాళం చేశారు. యస్.కె. నాయర్, జి. రామకృష్ణపిళ్ళైలు కంబరామాయణమును అనువదించారు. ఇవి కాక అనర్ఘరాఘవం, ప్రతిమానాటకం, ఉత్తరరామచరితం, రఘువంశం మొదలైన ఎన్నో సంస్కృత రామనాటకములూ కావ్యాలూ మలయాళం చేయబడినవి.

ఆదినుంచీ కేరళీయులు సంస్కృత భాషాభిజ్ఞులు. ఎందరో సంస్కృత విద్వాంసులూ, రచయితలూ కేరళలో జన్మించారు. వారిలో కొందరు సంస్కృతంలో కూడా రామకథా సంబంధములైన రచనలు వెలయించారు. ఆశ్చర్య చూడామణి కర్త అయిన శక్తి భద్రుడు నంబూదిరి బ్రాహ్మణుడని విశ్వసిస్తున్నారు. ఇళయ తంపురాన్, రామపురత్తు వారియర్, మేప్పత్తూర్ నారాయణ భట్టతిరి ప్రభృతులు రామకథాత్మకములైన కావ్యాలూ నాటకాలూ మొదలైనవి సంస్కృతంలో సంతరించారు. వాల్మీకం, అధ్యాత్మ రామాయణములేకాక పాతాళ రామాయణం, వాసిష్ఠ రామాయణం మొదలైనవి కూడా మలయాళ సాహిత్యంలో చోటు చేసుకున్నవి. ఇంకా రామకథను అభివర్ణించే లంకాలక్ష్మి, సాకేతం, రావణవిజయం మొదలైన రచనలు చాలా ఉన్నాయి.

ప్రాచీనాంధ్రకవుల వలె మలయాళ కవులు కూడా సంస్కృత విద్వాంసులు కావడంవల్ల, వారు తమ యితివృత్తములను సంస్కృత మూలం నుంచే గ్రహించారు. వర్ణనాంశములు మినహాయిస్తే, కడమ విషయాలను యథామూలములుగానే వారు అనువదించారు. అందువల్ల, మలయాళ రామాయణములలో అవాల్మీకాలు అంతగా చేరలేదు. ఇది ఒక విశేషం. ఉదాహరణానికి సంస్కృత అధ్యాత్మ రామాయణంలో బాలకాండలో రామ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లక్ష్మణుల పరిహాస ప్రసంగములు కనిపిస్తాయి. కాని ఎళుత్తచ్చన్ వాటిని పూర్తిగా పరిహరించక కుదించి వ్రాశాడు. దైవాంశ సంభూతులైన వారు ఆవిధంగా తేలికగా మాట్లాడరనే అభిప్రాయంతో ఆ మహాకవి అలా చేసి ఉండవచ్చు.

వాల్మీకి కృతిని గురించి ఐ.సి.చాకో (వాల్మీకి యుటె లోకత్తిల్ - వాల్మీకి లోకంలో), చిన్మయానందన్ (వాల్మీకి దర్శనం), పి.కె. గోవిందపిళ్లై (ఆదికవి), కణ్ణన్ జనార్దనన్ (రావణ షక్షం), వాసుదేవ భట్టతిరి ప్రభృతులు విమర్శాత్మక రచనలు వెలయించారు.

వాల్మీకి రామాయణానువాదకులలో కేరళవర్మ, .పి.జి. వారియర్‌లు కూడా ఉన్నారు.

ఒక్క మాటలో చెప్పాలంటే, కేరళీయుల సాహిత్యం, కళలు, ఆధ్యాత్మిక జీవనం మొదలైన వాటిమీద రామకథ చెరగని ముద్ర వేసింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

16
మరాఠీ

మహారాష్ట్రలో 11వ శతాబ్ది ప్రారంభంనుంచీ రామకథ ప్రచారంలో ఉన్నట్లు చెప్పవచ్చు. ఆఖ్యానాలు లేక చాటువుల ద్వారా రామకథ వాడుకలో ఉండేది. మహానుభావ యుగంలో వర్ధిల్లిన శైల్య అనే కవి తన రామాయణాన్ని దేవగిరి రాజయిన రామదేవరావ్ యాదవ్‌కి (1272-1309) వినిపించినట్లు భావించబడుతున్నది. ఈ తొలి రామాయణం నేడు అలభ్యం. కాని నాటినుంచీ రామకథ ప్రచుర ప్రచారం పొందినట్లు పేర్కొనవచ్చు. ఇందుకు భక్త్యుద్యమం ఎంతగానో దోహదం చేసింది.

భక్త్యుద్యమాన్ని మహారాష్ట్రలో భాగవత సంప్రదాయం లేక వార్కరీ సంప్రదాయ మని వ్యవహరిస్తారు. ఇది 13వ శతాబ్దిలో జ్ఞానేశ్వరుడితో (1271 - 1290) ప్రారంభ మయింది. ఆ భక్తకవి భగవద్గీతకు జ్ఞానేశ్వరి లేక బావార్ధ దీపిక అనే ప్రశస్త వ్యాఖ్య వెలయించాడు. తత్ఫలితంగా మహారాష్ట్ర దేశపు మత చరిత్రలో నూతన శకం మొదలయింది. ఆయన వ్యాఖ్యావిధానం సాంప్రదాయిక వ్యాఖ్యాన విధానానికి దగ్గరగా ఉన్నప్పటికీ, ఉపయోగించిన మరాఠీ భాషవల్ల ఆయన ప్రజలకు సన్నిహితుడు కాగలిగాడు. పైగా సంకీర్తనలు వ్యాప్తిలోకి వచ్చాయి.

వార్కరీ సంప్రదాయానికి చెందిన భక్త కవులు, ప్రధానంగా విట్ఠలుని భక్తులు లేదా కృష్ణభక్తులు దోహదం చేశారు. అయినా వారు రామపూజకు వ్యతిరేకులు కారు. అందువల్ల వారు రామ- కృష్ణ - హరిని తమ దీక్షామంత్రంగా స్వీకరించారు. రామకథను సహర్షంగా గానం చెయ్యసాగారు. రామకథా వ్యాప్తికి ఈ భక్త కవులు బహుధా కృషి చేశారు.

జ్ఞానేశ్వరుని సమకాలికుడు భక్త నామదేవుడు (1270 - 1350).

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిమ్నజాతికి చెందిన ఆ భక్తకవి ప్రభావం చాలామంది కవుల మీద కాన వస్తుంది. నామదేవుడు, కబీరులవల్ల ప్రభావితుడైన నానక్ శిక్కు మతం స్థాపించినట్లు అభిజ్ఞుల అభిప్రాయం.

రామగాథలోని కొన్ని ఉదంతాలను అభివర్ణిస్తూ నామదేవుడు 27 అభంగాలు వ్రాశాడు. లంకాదహనం, దశరథుని భార్యల వేవిళ్లు మొదలైనవి వీటిలో ప్రసక్తాలు.

నామదేవునికి రెండు శతాబ్దుల తర్వాత భక్త్యుద్యమానికి ప్రాణప్రతిష్ఠ చేసిన మహనీయుడు ఏకనాథుడు (1533 - 99). కుల నిరసన చేసిన వాడు. దేశానికి ముప్పు ఏర్పడినప్పుడు మతధర్మాలను ఎలా సంరక్షించుకోవాలో తెలిపినవాడు. సర్వసంగపరిత్యాగం చెయ్యకుండా సాంసారిక ధర్మాలు అనుసరిస్తూనే మోక్షం పొందవచ్చునని వ్యక్తం చేసిన వాడు. ఆయన భావార్థ రామాయణం ఖెలయించాడు. మరాఠీ రామాయణాలలో, లభ్యమైన వాటిలో, ఇదే ప్రథమమూ ప్రశస్తమైనదీ అని తద్భాషా పండితులు విశ్వసిస్తున్నారు.

భావార్థ రామాయణం ఏ సంస్కృత రచనకూ అనువాదం కాదు. నామదేవుడు ప్రధాన ఇతివృత్తం వాల్మీకం నుంచి గ్రహించినా, ఆనంద రామాయణం, ఆధ్యాత్మ రామాయణం, హనుమన్నాటకం, రవిసేనుని పద్మపురాణం, స్కందపురాణం మొదలైన వాటి నుంచి కూడా కొన్ని కథలు గ్రహించినట్లుగా పండితులు భావిస్తున్నారు. లక్ష్మణునిచే నిహతుడూ, శూర్పణఖా తనయుడూ అయిన సాంబుని వృత్తాంతం జైన రామాయణం నుంచి గ్రహించబడినదిగా విద్వాంసుల విశ్వాసం. అలాగే భావార్థ రామాయణంలో కాననగు తాత్త్విక చింతన అధ్యాత్మ రామాయణం నుంచి స్వీకరించబడిందనీ భావిస్తున్నారు. యుద్ధకాండలోని 44వ అధ్యాయం వ్రాస్తూ వుండగా, ఏకనాథుడు స్వర్గస్థుడైనాడు. ఆ తర్వాత ఆయన శిష్యుడైన గవబుడు ఆ రామాయణాన్ని పూర్తిచేసినట్లు కొందరు భావిస్తున్నారు. కాని అలా పూర్తి చేసినవాడు ఆయన మనుమడైన ముక్తేశ్వరుడని పలువురి విశ్వాసం. (ఉత్తర కాండం రచించిన వాడు ముక్తేశ్వరుడనే పండితలోకం భావిస్తున్నది.) భావార్థ రామా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యణం 7 కాండల గ్రంథం. అందులో 297 అధ్యాయాలూ, రమారమి 37, 500 పద్యాలూ ఉన్నాయి. మధ్య మధ్య 2,950 శ్లోకాలున్నాయి. రామకథా రచనకు తనను ఆదేశించినవాడు ఆ శ్రీరామ చంద్రుడే అని ఏకనాథుడు పేర్కొన్నాడు.

ఇతర రామాయణాలలో వలె, భావార్థ రామాయణంలోనూ అవాల్మీక విషయాలు కొన్ని కానవస్తాయి. కౌసల్య, సుమిత్ర - యిద్దరూ తమ వంతు పాయసాన్ని కైకేయికి యివ్వడం, రాముడు తీర్థయాత్ర చేయడం, దశరథుడు రాముని అస్త్ర విద్యాప్రావీణ్యాన్ని పరీక్షించడం మొదలైనవి కొన్ని కొత్త విషయాలు. రాముణ్ణి భగవదవతారంగా భావించాడు ఏకనాథుడు. కనుక ఆయన వర్ణించిన రాముడు మానవాతీతుడుగా కనిపిస్తాడు. భక్తరక్షకుడుగా కంటె రాముడు రాక్షస సంహారకుడుగా దర్శన మిస్తాడు. ఇందుకు కారణం ఆనాళ్లలో మహారాష్ట్రలో కానవచ్చిన సాంఘిక చారిత్రక పరిస్థితులని పండితుల అభిప్రాయం. మరాఠా - ముస్లిం సంఘర్షణ నేపథ్యంలో ఈ అంశాన్ని పరిశీలించడం అవసరం. అందువల్లనే భావార్థరామాయణంలోని యుద్ధకాండం బాగా పెరిగిపోయింది. యుద్ధవర్ణనలు ప్రముఖ స్థానం ఆక్రమించాయి. యవనులు (ముస్లిములు) అయిన రాక్షసుల బారి నుండి ప్రజలను సంరక్షించడమే రామలక్ష్మణుల కర్తవ్యంగా కనిపిస్తున్నది. యవనుల బారినుండి తమ దేశాన్ని, మతాన్ని, సంస్కృతిని సంరక్షించుకోవలసిన పరిస్థితి ఏర్పడిందన్న విషయాన్ని ప్రజలకు గుర్తు చేయడం కోసం రామకథను రామాయణ కవులు, భక్తకవులు వినియోగించుకున్నట్లు భావించబడుతున్నది. కనుక వారు కేవలం కథకోసమో, తమ భగవద్విశ్వాసాన్ని ప్రకటించుకోడానికో, ఆనందం కోసమో రామకథను గానం చెయ్యలేదని చెప్పడం సమంజసం. విపత్సమయంలో రాముడు రక్షకుడనే భావాన్ని నామదేవుడు తన పెక్కు అభంగాలలో తెలియజేయడం గమనించదగిన అంశం.

కృష్ణదాస్ ముద్గళ్ 10,000 ఓవి పద్యాలలో రామగాథను పూర్తిగా రచించాడు. కాని దురదృష్టం! ప్రస్తుతం ఒక్క యుద్ధకాండమే లభ్యం. సంస్కృత సాహిత్యాన్ని మథించగా తేలిన మీగడే మరాఠీలో రామకథ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అని ఆయన భావించాడు.

శ్రీధరుడనే కవి (1658-1730) రచించిన రామవిజయ కూడా ప్రముఖ రామకథాకావ్యంగా భావించబడుతున్నది. పండరీ పురస్థుడైన ఆయన విట్ఠలుని భక్తుడనడం చర్విత చర్వణం. రేణుకాదేవి ఆయన యిలు వేలుపు. కనుక ఆయన భావించిన రాముడు రేణుకాదర్శనం కోసం వెడతాడు. కౌసల్య రేణుకాదేవి అవతార మని చెప్పబడింది. రామనిర్యాణం సూచించదు కవి. జనన మరణాలకు రాముడు అతీతు డనీ, విట్ఠలుని రూపంలో సాక్షాత్కరిస్తున్నాడనీ ఆయన పేర్కొన్నాడు. ఆయన బహు కావ్య కర్త. 40 అధ్యాయాలలో రామవిజయనే కాక, హరి విజయ, పాండవ ప్రతాసం మొదలైనవి కూడా వ్రాశాడు. అవన్నీ నేటికీ పరమ పవిత్ర గ్రంథాలుగా భావించబడుతున్నవి.

17వ శతాబ్దిలో వర్థిల్లిన భక్తకవి రామదాసు (1608-82) గొప్ప దేశభక్తుడు కూడా. రామభక్తితత్త్వాన్ని వ్యాప్తిలోకి తీసుకువచ్చాడు. మహారాష్ట్రలో రాముడు అభిమానదైవం కనుక, రామదాసు కృషి ఫలవంత మయింది. ఆయన రాముణ్ణి కోదండధారిగా భావించాడు. దుష్టుల్ని శిక్షించడానికి రాము డెప్పుడూ సంసిద్ధుడే అనే భావాన్ని కోదండం సూచిస్తున్నది. ఆయన కర్మకు గల ప్రాధాన్యాన్ని స్పష్టం చేశాడు. ఆయన అన్నాడు గదా:

ఖలులకు భయ మంది కర్మ సలుపకున్న
మాసిపోవు గాదె మంచి చెడులు.

దైవధ్యాన మన్న పేరుతో సమకాలిక పరిస్థితుల్ని నిర్లక్ష్యం చెయ్యకూడదనీ, దేశాన్నీ మతాన్నీ సంరక్షించుకోవాలనీ ఆయన ఉద్బోధించాడు. ఛత్రపతి శివాజీకి ఆయన ఆధ్యాత్మిక గురువు. తన లఘు రామాయణం ద్వారా రామదాసు మహారాష్ట్రులకు ఆత్మగౌరవ వైశిష్ట్యాన్ని వ్యక్తం చేశాడు. ఆయన రామాయణం నుంచీ, ముద్గళ్ రామాయణం నుంచీ కొన్ని ఘట్టాలను చదవడం యుద్ధభూమికి వెడుతున్న వీరయోధులకు అలవాటని అభిజ్ఞులు చెపుతారు. అలా చదవడం వల్ల తమకు విజయప్రాప్తి లభ్య మవుతుందని అది ఆ వీరయోధుల విశ్వాస మట!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వివేకంతో, దీర్ఘ ప్రయత్నంతో, తులజాదేవి ఆశీర్బలంతో రాముడు రావణ సంహారం చేసినట్లు రామదాసు పేర్కొనడం గమనించదగింది. ఏ కార్య సాధనకైనా దైవ కృప ఒక్కటే చాలదు. ఆ కృపకు తోడుగా మానవుని వివేకం, అతని నిరంతర కృషి కావాలి. ఈ ఉపదేశం ఒక్క ఛత్రపతి శివాజీకే కాక ప్రతి కార్యసాధకునికీ ఉపయుక్తం.

వివేక్ విచార్ సావధపనె
దీర్ఘ ప్రయత్న కేళాచి కరనె
తులజావర చెని గుణె
రామె రావణ మారిల.

[మంచి చెడుగు లరసి సంచరించియు, దీర్ఘ
కృషి సలిపియు, తులజ కృప వలనను
రాముడు హతమార్చె రావణబ్రహ్మను.]

రామదాసు శిష్యులలో కొందరు రామాయణ రచయిత లున్నారు. రంగనాథుడనే కవి 7,000 కి పై బడిన పద్యాలలో యోగవాసిష్ఠం వెలయించాడు. మరొకరు సీతా స్వయంవరం అనే కృతి సంతరించారు. గిరిధర్ అనే కవి 40 పుస్తకాలు రచించినాడనీ, వాటిలో 7 రామకథాత్మకములనీ, వాటిలో సంకేత రామాయణం మిన్న అనీ భావించబడుతున్నది. ఈ రామాయణం 188 ఆశ్వాసాల గ్రంథం. ఇంకా సంక్షేప రామాయణం, చిద్బోధ రామాయణం, రామకర్ణామృతం మొదలైనవి వెలువడ్డాయి.

రామకథా సాహిత్యంలో మోరోపంత్ పరద్‌కర్‌కి విశిష్టమైన స్థానం ఉన్నది. ఆయన సంస్కృతంలో మంత్ర రామాయణం రచించాడు. మరాఠీలో 108 (అష్టోత్తర శత్ రామాయణె) రామాయణాలు వెలయించాడు. వాటిలో 94 మాత్రమే లభ్యాలు. వీటిలో వివిధ ఛందస్సులు అందాలు దిద్దుకున్నవి. 70,000 కు పైగా పద్యాలున్నాయని పండితుల అభిప్రాయం. ఆయన ప్రసిద్ధ పౌరాణికుడు. ఆయన కథనం నలుగురినీ అలరిస్తుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కన్హోత్రిమలదాసు, కేశవరాజ; ఆనందమూర్తి, వామన పండిత, రేణు కానందన ప్రభృతులు వివిధ శతాబ్దులలో రామాయణాలు రచించారు. రామకథా సాహిత్యం అపారంగా వెలువడినా, భావార్థ రామాయణమూ రామ విజయమూ నేటికీ బహుళ ప్రచారంలో ఉండడం గమనించదగింది. ప్రయత్న పూర్వకంగానో లేక అప్రయత్నంగానో భావార్థ రామాయణ కర్త తన కాలపు సామాజిక పరిస్థితులను తన రచనలో చొప్పించాడు. మంగళసూత్రం మహారాష్ట్రంలో పరమ పవిత్రంగా భావించబడుతున్నది. సీతకు మంగళసూత్రం కట్టబడినట్లుగా ఏకనాథుడు పేర్కొన్నాడు. సీతా స్వయంవరానికి 96 జాతుల రాజులు వచ్చినట్లుగా ఆయన కథనం. మహారాష్ట్రంలోని భక్తకవులు రామకథా సాహిత్య వ్యాప్తికి ఎంతగానో తోడ్పడ్డారు. ముఖ్యంగా రామదాసు కృషి ప్రశంసార్హం. ఆయన రామ - హనుమ సంప్రదాయాన్ని బాగా వాడుక లోకి తీసుకువచ్చాడు. చైత్ర మాసంలో రామనవమిని తొమ్మిదిరోజులపాటు జరపసాగాడు. రామనవమి సందర్భంగా రామకథా సంకీర్తనం చేయడం ఆచార మయింది. ఆయన కృషికి ఫలితంగా మహారాష్ట్రలో వీధివీధిలోను హనుమంతుని విగ్రహం, సీతారామమందిరం నెలకొన్నాయి. హనుమంతుడు రామునికి తోడబుట్టినవాడుగా (అనగా సహోదరునిగా) మరాఠీ రామకథా సాహిత్యంలో ప్రముఖ స్థానం వహిస్తున్నాడు. కైకేయి వద్ద ఉన్న పాయసం లోంచి ఒక భాగాన్ని ఒక గ్రద్ద ఎత్తుకొనిపోయి ఆంజనేయుని తల్లి అయిన అంజని వద్ద వుంచింది. ఆ పాయస భాగాన్ని ఆరగించిన అంజనికి హనుమంతుడు జన్మించాడు. ఇది మరాఠీ రామాయణపు విశిష్టాంశం. భగవద్ భక్తి మానవసేవగా పరిగణించబడడం, అలాంటి సేవకు భక్త కవులు రాముణ్ణే అర్హునిగా ఎంచుకోవడం కూడా మరాఠీ రామకథలో కానవచ్చే మరొక విశిష్టాంశం. రాముని పర్యటన వల్ల నాసిక్, పంచవటి వంటి క్షేత్రాలు పవిత్రత గడించుకున్నాయి. ఈ క్షేత్రాలను నేటికీ భక్తులు దర్శించడం గమనించదగింది. ఈ వివిధ విషయాలూ మహారాష్ట్రలో రామకథకు గల ప్రాభవాన్ని తేటతెల్లం చేస్తున్నాయి.

ఆధునిక కాలంలోనే వాల్మీకి రామాయణానికి మరాఠీలో అనువాదాలు వెలువడినాయి. శ్రీపాద్ దామోదర్, సత్యలేకర్, సదాశివ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జగన్నాథ్‌లు అనువదించినవి శ్రీరామాయణ మహా కావ్య, వాల్మీకి రామాయణ్ (సమగ్ర అనువాదం) పేర్లతో వ్యవహృతము లవుతున్నవి. వాస్తవ రామాయణ్, రామ్‌యశోగాథ మొదలైన యితర రామాయణాలు కూడా వెలువడ్డాయి. భవభూతి ఉత్తర రామచరిత్ర, కాళిదాసు రఘువంశం మొదలైనవి మరాఠీలోకి అనూదితము లైనవి. అలాగే తులసీదాసు రామాయణం కూడా మరాఠీలోకి అనూదిత మైనది. జి.డి. మడ్గుళ్కర్, ఆర్. సి. శ్రీఖండె, నారాయణ్ భాస్కర్ జోషి ప్రభృతులు అనువాదకులు. ఇతర భాషా రామాయణాలు పరివర్తితము లైనట్లు తెలియడం లేదు.

సుప్రసిద్ధులైన మామా వరేర్కర్ భూమికన్యా సీత అనే నాటకం వ్రాశారు. జి.యస్. అల్టేకర్, కె.యస్. దివాన్, కేశవ్ రానడే ప్రభృతులు విమర్శగ్రంథాలు వెలయించారు. అమరేంద్ర లక్ష్మణ్ గారు సంపాదకులుగా శ్రీ రామ్‌కోశ వెలువడింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

17

మైథిలి

సంస్కృత భాషా సాహిత్యాలకూ సాంప్రదాయిక విజ్ఞానానికీ నిలయం మిథిల. ఇది ప్రస్తుతపు పేరే అయినా, పూర్వం దీన్ని విదేహ అని వ్యవహరించేవారు. విదేహ అనగానే తత్త్వజ్ఞాన సంపన్నుడూ విదేహుడూ అయిన జనకుడు స్ఫురణకు వస్తాడు. నిజానికి విదేహను పరిపాలించిన రాజులు తాత్త్వికులు, విద్వాంసులు, వేదవిజ్ఞాన సంపన్నులూను. మైథిలీ కవులు సంస్కృత సాహిత్యం నుంచి ఇతివృత్తాలు మొదలైనవి గ్రహించారు. సంస్కృతాలంకారికుల మార్గంలో వారు రచనా వ్యాసంగం చేశారు. మైథిలి భాషానాటకాలలో సంస్కృతం, ప్రాకృతం, మైథిలి యథోచితంగా ప్రయుక్తాలు. చివరికి మిథిలావాసుల జానపదకథలు - ముఖ్యంగా వ్రత కథలు - సంస్కృత పురాణేతిహాసాల వల్ల ప్రభావిత మయినాయి. తత్ఫలితంగా మైథిలీ సాహిత్యానికి కొంత అపకారం జరిగింది. మైథిలిని సంస్కృత పండితులు అపభ్రంశంగా భావించారు. కాగా మైథిలిలో ఉదాత్తమైన ప్రాచీన సాహిత్యం వెలువడలేదు. ఉదాత్త సాహిత్య సృష్టికి సంస్కృతమే అర్హమైన భాషగా భావించడం జరిగింది.

మిథిలలో ఏ ఒకమతానికి అత్యధిక ప్రాధాన్యం లభించినట్లు కనిపించదు. శైవం, వైష్ణవం, శాక్తేయం - ఈ మూడూ-సమ ప్రాధాన్యం వహించాయి. అయినా శక్త్యారాధనది పైచెయ్యి అనవచ్చు. శక్తిరూప అయిన సీతకు మిథిల పుట్టిల్లు కావడం వల్ల, శక్త్యారాధనకు ప్రాచుర్యం లభించినట్లు పేర్కొనవచ్చు. వైష్ణవుల అభిమానదైవం కృష్ణుడు. మైథిలీ వాఙ్మయంలో మణిదీపిక వెలిగించిన మహాకవి విద్యాపతి (1360-1448) కృష్ణుడు రాముని మరో అవతార మని భావించాడు.

సంస్కృత భాషా సాహిత్యాలు ప్రచారంలో ఉన్నా, వాల్మీకి రామా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యణం పట్ల ఆదరభావం ఉన్నా మిథిలావాసులకు రాముడు ఇష్టదైవం కాలేకపోయాడు. ఉత్తరభారతంలో పెక్కుచోట్ల రామలీల జరిగినట్లుగా, మిథిలలో రామలీల జరగదు. అలా అని రామకథ మిథిలావాసుల్ని ఆక ర్షించలేదనుకోవడం అవివేక మవుతుంది. వారిలో రామభక్తు లున్నారు. శ్రీరామనవమిని ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. విద్యాపతి రచ నలు వెలువడడానికి మునుపు, ఆ తర్వాత కూడా వాల్మీకి 'రామాయణం వాడుకలో ఉంది. రామాయణ పఠనం వల్ల కవితాశక్తి అలవడుతుందనే నమ్మకం ఉండేది. చైత్రమాసం పూర్వార్ధంలో వాల్మీకి రామాయణం పారాయణం చేసే అలవాటు నేటికీ నిలిచి వున్నట్లు అభిజ్ఞులు చెపు తారు. అయినా మధ్యకాలీన మైథిలీ సాహిత్యంలో రామాయణం కాని, రామకథను అభివర్ణించే కావ్యం కాని వెలువడలేదు. మిథిలలో వైశాఖ మాసం పూర్వార్ధంలో జానకీనవమి జరుగుతుంది. శక్త్యారాధనకు గల ప్రాబల్యాన్ని ఈ విషయం కూడా కొంతవరకు బలపరుస్తున్నది.

మిథిలలో మహమ్మదీయ నృపతుల ప్రాబల్యం ఎక్కువ కావడంతో, మైథిలీ సాహిత్యం నేపాలు ఇతర ప్రాంతాలలో ఆశ్రయం పొందవలసి వచ్చింది. నేపాలీ రాజులూ కవులూ మైథిలిని సమాదరించారు. 1318 నుంచి 1394 దాకా నేపాలుని పాలించిన జయస్థితి మల్లుని ప్రోత్సా హంతో రామకథకు సంబంధించిన నాటకం ఒకటే వెలువడింది. ఆ తర్వాత కృష్ణదాస అనే కవి మూడంకాలలో రామకథను చిత్రించాడు. అస్సాముకి చెందిన శంకర దేవుడు (1449 - 1568) రామ విజయ అనే నాటకం వెలయించాడు. ఈ నాటకంలో రాముని విజయాలు చెప్పబడలేదు. కాని సీతను రాముడు పరిణయ మాడిన వృత్తాంతం వివరించబడింది. శివదత్తుడు రచించిన సీతాహరణ నాటకంలో సీతా రాములు ప్రేమైక జీవులుగా చిత్రించబడ్డారు. ప్రథమ దర్శనంలోనే వారి మధ్య ప్రేమ అంకురించినట్లు చెప్పబడింది.

మైథిలీ వాఙ్మయంలో 1860 నుంచి ఆధునిక యుగం ప్రారంభ మవుతున్నట్లు ఆ వాఙ్మయ చరిత్రకారుల అభిప్రాయం. రామాయణా నువాదం లేకపోవడం ఒక లోపంగా తలచి, మహారాజాధిరాజ్ లక్ష్మీశ్వర సింహుడు చందా ఝూ అనే కవిని అందుకు నియోగించాడు. సంస్కృ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తంలోనేకాక మైథిలిలో కూడా మహాకావ్య నిర్మాణం జరగాలనే వాంఛ మైథిలీ సాహిత్యోపాసకులలో ఉదయించింది. మహారాజా ఛత్ర సింహుని పరిపాలనా కాలంలో (1803 - 1839) మైథిలిలో మహాకావ్య రచనకు అంకురార్పణ జరిగింది. చందా ఝా వ్రాసిన రామాయణంతో (మిథిలా భాషా రామాయణ్) ఆధునిక మైథిలీ సాహిత్యం ప్రారంభమైనట్లు విజ్ఞుల విశ్వాసం. ఇది కేవలం అనువాదం అనుకోవడం అసమంజసం. మహాకావ్యంగా గణించబడుతున్న యీ రామాయణం 1898లో వెలువడింది.

తన కావ్యంలోని ప్రతిపాదమునూ చందా ఝా లక్ష్మీశ్వర సింహుడి కొలువుకూటం లోని వారితో చర్చించినట్లు తెలియవస్తున్నది. అనగా, పర్యాప్తమైన పరిశీలనకు ఫలితంగా ఆయన రామాయణ కావ్యం రూపు దాల్చినట్లు పేర్కొనవచ్చు. ఈ మహాకావ్య వైశిష్ట్యాన్ని మహామహోపాధ్యాయ ఉమేశమిశ్రా ఇలా వ్యక్తీకరించారు.

"కావ్యగత భాషా మాధుర్యమూ శైలీ పరితల్ని అచిరకాలంలోనే ఆకర్షించ గలిగాయి. కాగా పండితలోకంలోనూ పామరులలోనూ అది బాగా ప్రచారంలోకి వచ్చింది. ఇతివృత్త గౌరవం, సంస్కృత పద భూయిష్ఠమైన ఆ కావ్యశైలీ తను మాతృభాషకు గల సహజ శక్తి సౌందర్యాలను మిథిలలోని సంస్కృత విద్వాంసులకు స్పష్టం చేశాయి. అది చాలావరకు సంస్కృత ఛందస్సులలో సాగినా, మిథిలా సంగీత సంప్రదాయానికి అనుగుణంగా మలచబడిన గేయాలూ అందులో ఉన్నాయి. వాల్మీకి రామాయణంలో వలె, ఈ రామాయణంలోని పాటలూ ఆలపించినప్పుడు శ్రావ్యంగా ఉంటాయి."

ఈ రామాయణంలో మూల రాగాలు స్వీకరించి వాటిని మైథిలీ సంప్రదాయపు రాగాలతో సమన్వయించడం జరిగింది. ఇందులో ప్రయుక్తమైన భాష, సందర్భోచితంగా వాడబడిన లోకోక్తులు, అలంకారాలు, సజీవమైన పాత్ర చిత్రణ మొదలైనవి యీ కావ్య ప్రాశస్త్యాన్ని ఇనుమడించాయి.

చందా ఝా రామాయణం లాల్ దాస్ అనే మహాకవిని రామాయణ రచనకు ప్రోత్సహించింది. ఆయన వ్రాసిన రామాయణాన్ని రామేశ్వర

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామాయణం (1914) (రామేశ్వర చరిత్ మిథిలా రామాయణ్) అని వ్యవహరిస్తారు. చందా ఝా కృతిలోని ఛందోవైవిధ్యం కాని భాషా మాధుర్యం కాని యిందులో లేవు. ఇందులో కథాకథనం సరళంగా సాగిపోతుంది. రాముని కంటె సీతకే యీ రామాయణంలో ప్రాధాన్యం యివ్వడం ఒక విశేషం. దీన్ని శాక్తేయ కృతిగా భావించవచ్చు.

రామాయణాంతర్గత కథలు ఆధునిక నాటక కర్తలను ఆకర్షిస్తున్నాయి. ఆనంద ఝా వ్రాసిన సీతా స్వయంవరం, మహావీర ఝా వ్రాసిన శంబూకవధ మొదలైనవి ఈ సందర్భంగా ఉదాహరించదగినవి.

ఇవి పఠన యోగ్యాలే కాని ప్రదర్శనకు అంత అనుకూలంగా లేవని విమర్శకుల అభిప్రాయం. రంగస్థలాన్ని కనక దృష్టిలో ఉంచుకొని వ్రాసివు న్నట్లయితే, యివి ఎంతో రమణీయంగా ఉండేవని విజ్ఞులు చెపుతారు.

ఇక మైథిలిలో వెలువడిన యితర రామాయణ రచనల్ని స్థూలంగా పరిశీలిద్దాము.

మహాకవి లాల్‌దాస్ రామేశ్వర చరిత్ మిథిలా రామాయణ్ రచించాడు. ఇది 1954లో ముద్రితం. 371 పుటల గ్రంథం. తులసీదాస కృత రామచరిత మానస్‌ని రామ్‌లోచన్ శరణ్ పద్యకావ్యంగా (మైథిలీ శ్రీరామచరిత మానస్) అనువదించారు. 1968 లో ఇది ప్రచురించబడింది.

భాసుని అభిషేక నాటకం మైథిలిలోకి అనూదిత మయింది.

అంబికా కుమార్‌దాస్ రచించిన సతీ సులోచన, బెంగాలీ నుంచి గౌరీశంకర్ ఝా అనువదించిన మేఘనాథ్ బధ్ (మైకేల్ మధుసూధన దత్తు రచన), జీవనాథ్ ఝా సంతరించిన రావణ్ వధ్ మహాకావ్య, వైద్యనాథ్ మల్లిక్ (విధు) రచించిన సీతాయన్ (649 పుటల మహాకావ్యం), మణిపద్మ సంతరించిన లవహరి కుశహరి కావ్యం, కపిలేశ్వర మిశ్ర వ్రాసిన సీతాదాయ్, భువనేశ్వర్ ప్రసాద్ వెలయించిన బాల్ రామాయణ్, శంకర్ దేవ్ వ్రాసిన రామ్ విజయ మొదలైన రచనలు కూడా సంభావించదగినవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

18
రాజస్థానీ

సుమారు వెయ్యేళ్ల చరిత్ర కల రాజస్థానీ సాహిత్యంలో 1518 ఆ ప్రాంతాలలో ఒక రామాయణం వెలిసింది. తత్కర్త పేరు మెహాజీ (1483-1544). 261 దోహాలూ చౌపాయీలలో రామకథను సంగ్రహంగా చిత్రించే కావ్య మిది. అంతే కాదు, రామకథను అభివర్ణించే ప్రప్రథమ ఆఖ్యాన కావ్యం కూడా ఇదే!

మధ్యకాలీన రాజస్థానీ సాహిత్యంలో ఆఖ్యాన కావ్యం ఒక ముఖ్యమైన కావ్యభేదం. ప్రజల్ని ఆకర్షించేలా ఇది గానానుకూలంగా సంతరించబడుతుంది. నాటకీయత కూడా రచనలో చోటు చేసుకుంటుంది. సంభాషణలు సంగ్రహంగా శక్తిమంతంగా ఉంటాయి. వర్ణనలు జనరంజకంగా ఉంటాయి. భాష యేమో సరళ సుందరం. అందువల్ల ఆఖ్యాన కావ్యం కంఠ పాఠం చెయ్యడానికి వీలుగా ఉంటుంది. కావాలనుకున్నప్పుడు ఒప్పగించడానికీ అనువుగా ఉంటుంది. పైగా ఈ ఆఖ్యానకావ్యాలలో చాలావాటిని ఆరుబయలు రంగస్థలం మీద అనాయాసంగా ప్రదర్శించవచ్చు కూడా. మానసోల్లాసం ప్రధానోద్దేశమైనా, వీటిలో పరోక్షంగా ఉదాత్త తాత్త్వికాభిప్రాయాలు, ఆదర్శాలు మొదలైనవి వివరించడం జరుగుతుంది. మెహాజ్ రామాయణం ఈ కోవకు చెందిన ఆఖ్యాన కావ్యం.

మెహాజీ వాడుకలో ఉన్న కొన్ని రామకథల్ని గ్రహించినట్లు చెప్పవచ్చు. భోజ్, వారాహి అనే రెండు కొత్త పాత్రల్ని ఆయన కథలో ప్రవేశపెట్టాడు. రావణుని విశ్వాసపాత్రుడైన మిత్రుడు భోజ్. వారాహి యేమో రావణుని చెల్లెలు. ఈ రెండు పాత్రలూ ఇతర ఆఖ్యానకావ్యాలలో లేవు.

స్వయంవర మహోత్సవంలో సీత వరించిన వరుడెవరో తెలుసుకు రమ్మని రావణుడు తన మిత్రుడైన భోజుని అర్థిస్తాడు. అప్పు డతను వ్యాధిగ్రస్తుడిలా నటిస్తూ పంచ్‌మధికి (పంచవటి ?) వస్తాడు. ఆ రాత్రి పర్ణశాలలో ఉండేందుకు సీత అనుమతిని అర్థిస్తాడు. ఆ తర్వాత అతను సీత రూపరేఖావిలాసాదుల్ని మిత్రుడికి సవివరంగా తెలియజే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్తాడు. మందోదరి కంటె సౌందర్యవతిగా సీతను వర్ణిస్తాడు. అది విన్న మీదట ఆమెను అపహరించాలనే దుర్బుద్ధి రావణుడికి కలుగుతుంది. జ్యోతిష్కుల్ని సంప్రదించి ఆ నీచకార్యంలో నిమగ్ను డవుతాడు.

ఇక వారాహి వృత్తాంతం.

ఒక బాటసారి ద్వారా ఆమె లంకలోని తన వారిని గురించి వివరాలు తెలుసుకుంటుంది. సీతాపహరణం మూలంగా లంకలో జరుగుతున్న యుద్ధం గురించి కూడా వివరాలు తెలుసుకుంటుంది. రావణుడికి అపజయం కలగవచ్చునని కూడా ఆ బాటసారి తెలియజేస్తాడు.

ఈ రామాయణం రాజస్థాన్ వాసుల ఆచారాలకూ విశ్వాసాలకూ దర్పణ మనవచ్చు. కథ చాలా వరకూ సంభాషణల్లో సాగుతుంది. భావవ్యక్తీకరణకు ప్రాధాన్యం లభించిన యీ కావ్యం కవితా సౌందర్యానికి ప్రసిద్ధి చెందింది.

భోజ్‌ని చూసి రావణుడు అంటాడు గదా!

యుద్ధాల మూలంగా దుర్గమూ, చిత్రాల ద్వారా భిత్తీ వెలుగొందుతాయి. అలాగే సీత అందచందాలను ఎలా వర్ణించి చెబుతావు? అందుకు అతని సమాధానం. నీ అరవై నాలుగువేల రాణులకన్నా, చివరికి నీ పట్టమహిషి మందోదరి కన్నా, సీత సౌందర్యవతి. ఆమె సౌందర్యం నేనెలా వర్ణించగలను?

అశోకవనంలో సీత రాముని ఉంగరాన్ని చూస్తుంది. 'ఇది ఇక్కడికి ఎలా వచ్చింది? ఒకవేళ రాముడు మరణించాడేమో! లేకపోతే ఎవరైనా చంపారేమో! లేదా యిదంతా కలగా వుండాలి.' అప్పుడు హనుమంతుడు ఇలా అంటాడు. 'రాముడు మరణించలేదు. ఎవ్వరూ చంపనూ లేదు. కల అంతకన్నా కాదు. హనుమంతుడనే అతను రాముడి యీ వుంగరాన్ని ఇక్కడికి తీసుకువచ్చాడు.'

ఆ తర్వాత 1595 ఆ ప్రాంతాల రామ్‌రాసౌ అనే రామాయణం వెలువడింది. ఇది 1034 పద్యాల గ్రంథం. దీని కర్త మాధొదాస్ దధవాడియా [1553 - 1621]. వాల్మీకి రామాయణం అనుసరించి వ్రాయబడినా, కవి అధ్యాత్మ రామాయణం, ఆనంద రామాయణం, విచిత్ర రామాయణం మొదలైన వాటిని సంప్రదించినట్లు తెలియవస్తు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

న్నది. ఇందులో రాముడు వీరునిగా, మోక్షప్రదాతగా చిత్రించబడ్డాడు. రాముడే కాదు; ఇతరులు కూడా ఆదర్శప్రాయులుగా చిత్రించబడ్డారు. తాను సజీవుడై ఉండగానే, రావణుడు సీతాపహరణం చెయ్యడం చూసి జటాయువు వ్యాకుల చిత్తు డవుతాడు. ఈ కావ్యంలోని హనుమం తుడు సురసను బతిమాలడు; ఆమెను జయించి లంకకు ప్రయాణ మవుతాడు. లక్ష్మణుడు మూర్ఛితుడైన విషయం తెలుసుకుని, రాముడు రావణుని ప్రతిఘటించాలనుకున్నాడు. కాని రావణుడు సంజవేళలో అదృశ్యు డవుతాడు. ఈ రామాయణంలోని వర్ణనలూ సంభాషణలూ ఉదాత్తంగా ఉన్నా, కొన్ని చోట్ల స్వల్పదోషాలు కొన్ని కానవస్తున్నట్లు చెపుతారు. దసరా ముగిసిన వెంటనే తన సేనలు లంక మీదికి తరలి వెడతాయని సుగ్రీవుడు రాముడికి చెప్పడం ఇటువంటి దోషాలలో ఒకటి. అప్పటికి దసరా లేదు; రావణ వధానంతరం అది వాడుకలోకి వచ్చినట్లు భావించబడుతున్నది.

సుర్జన్‌దాస్ పూనియా (1583 - 1691) అనే ప్రఖ్యాతకవి 176 పద్యాలలో రామ్‌రాసొ కావ్యం రచించాడు. వనవాసం చేస్తున్న రాముణ్ణి శూర్పణఖ సమీపించే కథా ఘట్టంతో ఈ కావ్యం ప్రారంభమై రామరా వణ యుద్ధంతో అంత మవుతుంది. ప్రధాన విషయాలు మనోహరంగా వర్ణించబడినా, కొన్ని అవాల్మీకాంశాలు కూడా చొప్పించబడినాయి. లంకలో సీతకోసం వెతుకుతున్నప్పుడు హనుమంతుడు మగపిల్లి రూపం ధరించడం, పాతాళలోకం నుంచి వారాహీదేవి పంపిన సర్పం కాటు వెయ్యగా లక్ష్మణుడు మూర్ఛ పోవడం, సీత మంత్రోచ్చారణ చేసి లక్ష్మణుడిని బ్రతికించడం వంటి విషయాలు ఈ రామాయణంలో కనిపిస్తాయి. రావణుడు దూతగా వచ్చిన అంగదుణ్ణి మందలించిన తీరు ఈ కృతిలో ఎలా ఉందో పరిశీలించండి.

'అంగదా! ఆకృతిలోనే కాదు బుద్ధిలో కూడా నువ్వు అల్పుడివే. అలాంటివాడివి గొంతెత్తి ఎలా మాట్లాడగలిగావు? ప్రాణంమీది ఆశతో ఇప్పటికైనా కాళ్లకు బుద్ధి చెప్పు. నీలముఖుడ వైన అవివేకీ! నీ యజమానికి నీకన్నా మంచివాడు దొరకలేదా రాయబారం పంపడా నికి? చేజేతులారా నువ్వు నీ రాజ్యం కాస్తా పోగొట్టుకున్నావు. నీకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సిగ్గు లేదూ? నీ తండ్రిని చంపిన వాళ్ళతో స్నేహం కట్టావు; వాళ్ల చేతుల్లో చిలక వైనావు? ఇంతకంటె నువ్వేం చెయ్యగలవు? కోతికీ దొమ్మరివానికీ బుద్ధి తక్కువ; గుప్పెడు మెతుకుల కోసం వాళ్లు తమ తలల్నే ముక్కలు చేసుకుంటారు.'

కళ్యాణ్ దాస్ రావ్ అనేకవి 1643లో. గుణ్‌గోవింద్ అనే ఒక విలక్షణమైన కావ్యం వెలయించాడు. 32 ఛందస్సులలో సాగిన కావ్య మిది. దశావతారాల్ని, ముఖ్యంగా రామకృష్ణుల్ని, అభివర్ణించే రచన యిది. ఇటువంటిది ఇదొక్కటే అంటారు. సందర్భానుగుణంగా భాషా శైలులు మారుతూ వుంటాయి. లంకాదహనం, లక్ష్మణ మూర్ఛ, హనుమంతుడు సంజీవిని తీసుకురావడం వంటి కథాఘట్టాలు ఇందులో లేవు.

రఘునాథ్ చరిత్ - నవ్‌రస్ వెలి అనే మరొక కృతి కూడా వెలువడింది. ఇందులో 127 పద్యాలున్నాయి. బాలకాండ కథను తెలియజేసే. యీ కృతిని మహేశ్‌దాస్ రావ్ (1644-1698) సంత రించాడు. ఇందులో శత్రుఘ్నుడు వదరుబోతు; అతడు పరశురామునితో వాగ్యుద్ధానికి దిగినట్లు చెప్పబడింది. కావ్య శీర్షిక ననుసరించి, దీన్ని నవరసాత్మకంగా వెలయించాలని కవి ఆశించాడు; కాని అలా పూర్తి చేయలేక పోయాడని తెలియవస్తున్నది.

రాజస్థానీ రామకథా సాహిత్యంలో పేర్కొనదగిన మరొక రచన రఘు రాసో. ఇది 1668 లో వ్రాయబడింది. కవి మహ్తా రఘునాథ్. లభించిన వ్రాతప్రతి అసమగ్రంగా ఉంది. బాలకాండ మొదలుకొని సీతాపహరణం దాకా గల వ్రాత ప్రతి లభించలేదు. దొరికిన ప్రతి జటాయువు రావణుని ప్రతిఘటించిన కథాఘట్టంతో ప్రారంభ మవుతున్నది. రామ పట్టాభిషేకం తరువాత జరిగిన కథ లభ్యం కావడం వల్ల, ఈ రామాయణాన్ని కవి సమగ్రంగా వ్రాసివుండవచ్చునని అభిజ్ఞులు భావిస్తున్నారు.

కొన్ని రాజస్థానీ కావ్యాలలో బౌద్ధ సంప్రదాయాల ప్రభావం లీలగా కని పిస్తున్నదని తద్భాషా విద్వాంసుల అభిప్రాయం. వారాహీదేవి వృత్తాంతం ఇందుకు నిదర్శనం. మొహాజీ రామాయణం, సుర్జన్‌దాస్ రామ్ రాసో మొదలైన వాటిని ఈ సందర్భంగా ఉదాహరించవచ్చు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మధ్యకాలీన రాజస్థానీ సాహిత్యంలో నాథ్, రసిక్ (రామభక్తి) రామ్ స్నేహి మొదలైన ప్రసిద్ధ సంప్రదాయాలు (మత సంప్రదాయాలు లేక శాఖలు) వర్ధిల్లాయి. ఇవి సాహిత్యాన్ని సంస్కృతినీ ప్రభావితం చేశాయి.

ఉత్తర భారతంలో రామానందుడు (1299 - 1410) ఆధ్యాత్మిక సాంఘికాది వివిధ రంగాలలో అభ్యుదయ సిద్ధాంతాలు ప్రవేశ పెట్టిన మహనీయుడు. రామభక్తికి గల ప్రాధాన్యాన్ని వివరించిన ఘను డాయన. కర్మజ్ఞానముల కంటె భక్తియే శ్రేష్ఠ మని తెలియజేశాడు. అయితే రామానందుడు ఏ సంప్రదాయమునూ స్థాపించకపోయినా, ఆయన అనుయాయులు ఆయన సిద్ధాంతాలకు ఒక సంప్రదాయ రూపం ఇచ్చారు. రామభక్తి సంప్రదాయపు ప్రథమాచార్యునిగా ఆయన్ని అభివర్ణిస్తారు. ఆయనకి ముందు రామభక్తి ఒక సంప్రదాయంగా రూపొందలేదు. రసిక్ సంప్రదాయానికి (రామభక్తి) చెందిన కవులు చాలా మంది బ్రజ భాషలో రచనలు చేశారు. ఈ సంప్రదాయం 17వ శతాబ్ది దాకా కొన సాగింది. రూపాదేవి రచించిన రామ్‌రాస్ అనే కావ్యం (1861) ఈ సంప్రదాయానికి చెందిన చివరి ప్రముఖ రచన అని అభిజ్ఞుల విశ్వాసం.

18వ శతాబ్ది పూర్వార్ధంలో నివసించిన సియాసఖి అనే కవి కొన్ని చాటువులు చెప్పాడు. వాటిలో ఒకటి సీత నుద్దేశించి చెప్పింది. ఇందులో కవి వ్యక్తం చేసిన శరణాగతి భావాన్ని పరిశీలించండి:

> "తల్లీ సీతా! నా మనవి ఆలకించవమ్మా.
> నీవే తప్ప నాకు దిక్కు మరెవ్వరూ లేరు.
> నా చేతలలోని చెడుని పరికించక
> నీ మహత్త్వాన్ని ఒక్కసారి తలచుకో.
> నిష్ప్రయోజనంగా నిన్ను ప్రార్థించానని
> లోకులు అనకుండా అనుగ్రహించు
> నా సర్వస్వమూ నీవే నమ్మా.
> నాకు దిక్కు మరెవ్వరూ లేరు."

కృపారామ్ అనే మరొక కవి ఇలా రాముణ్ణి శరణు వేడాడు.

'రాఘవా! నీ దర్శన భాగ్యం కోసం నా కళ్లు తపించిపోతున్నాయి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అందువల్ల నన్ను కటాక్షించు. నా హృదయోద్యానంలో మల్లెపూలు ఎన్నో పూశాయి. భృంగంలా వచ్చి ఆ సౌరభాన్ని ఆస్వాదించు. నీ దర్శనం కోసం తపించిపోతున్న యీ కృపారాముణ్ణి కనికరించు.'

రామ్‌స్నేహి సంప్రదాయానికి చెందిన కవులు కూడా భక్తిని ప్రబోధించారు. వారి రచనల్లో రామనామ స్మరణకూ, భక్తి భావానికి ప్రాధాన్యం లభించాయి. కొందరు సరళమైన రాజస్థానీ ఉపయోగించారు. భగవాన్ దాస్ కర్వా (1744 - 1802) అనే కవి రచించిన గీతాలు ప్రచారంలో ఉన్నాయి. ఒకచోట ఆయన యిలా అన్నాడు: 'భగవంతుణ్ణి ధ్యానించు. అది అన్ని కోరికలను తొలగిస్తుంది. అతని దివ్యనామమును అహరహం స్మరించు. మిగిలిన వాటిని త్యజించు. నా ప్రభువు రాముడు పైన ఉన్నాడు. అతనిని ధ్యానించు; అతని నామం స్మరించు.'

కుశవ్ లాభ్ (సుమారు 1523 - 1593) అనే రచయిత వివిధ విషయాలను గురించి రచనలు వెలయించాడు. ఛందో గ్రంథం కూడా వెలయించాడు. అందులో పర్యాయపదాలు సూచించే 'నామ మాల' కూడా ఉంది. రామకథ ద్వారా చెప్పదలచిన విషయాన్ని ఆయన యిందులో వివరించాడు. ఇదే ఇందులోని ప్రత్యేకత.

జనరాజ్ సూరి (1590 - 1643) అనే విద్వత్కవి వ్రాసిన రామాయణం, రామ్‌కరణ్ ఆసొపా (1857 - 1943) ఖడీ బోలీలోకి పరివర్తించిన తులసీదాసు రామచరితమానస్, సమయ సుందర్ వ్రాసిన సీతారామ్ చౌపయ్, విశ్వనాథ్ 'విమలేశ్' రచించిన రామ్‌కథ (1966) మొదలైనవి రాజస్థానీలో వెలసిన మరికొన్ని రామాయణాలు. అయిదు అధ్యాయాలలో సంగ్రహంగా రామకథను తెలిపే కావ్యం రామ్‌కథ. ఇది సరళమైన భాషలో సంతరించబడింది.

నానూరామ్ సంస్కర్త అనే కవి లంకాణ్‌ధణీ (1976) అనే ఆరు సర్గల కావ్యం రచించాడు. లంకా ప్రభువు అని దీనికి అర్థం. విద్వాంసుడుగా, శీల సంపన్నుడుగా, దేశభక్తుడుగా రావణుడు ఈ కావ్యంలో చిత్రించబడ్డాడు. శూర్పణఖా పరాభవంతో కావ్యం మొదలై రావణవధంతో అంత మవుతుంది. వీభీషణుడు రామభక్తుడుగా దేశద్రోహిగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చిత్రించబడ్డాడు. రావణుణ్ణి ఎంతో ఉదాత్తంగా చిత్రించినా, ఈ కావ్యం ఆశించినంతగా పాఠకుల ఆదరాభిమానాలు చూరగొనలేకపోయింది. రామ కథ అనగానే కొన్ని నిర్దిష్టమైన విశ్వాసాలు ప్రచారంలో ఉండడం వల్ల, ఒక క్రొత్త దృక్పథంతో వ్రాయబడిన ఈ కావ్యం పాఠకుల్ని తృప్తి పరచలేకపోయిందనడం అసమంజసం కాదు.

ఇక అజ్ఞాతకవి అయిన మాధవ్ దాస్ రచించిన రఘునాథ లీలను గురించి రెండు మాటలు. నేటికీ వ్రాత ప్రతిగానే మగ్గుతున్న యీ రామాయణ రచనాకాలం 1714 అని భావించబడుతున్నది. 271 పద్యాలలో సాగిన ఈ కృతిలో ముఖ్య సంఘటనలు మాత్రం పేర్కొనబడినవి.

దశరథుడు సకుటుంబంగా మిథిలకు తరలి వెళ్లడం, సీతారాముల వనవాసం 14 సంవత్సరములని చెప్పడం, శూర్పణఖను సుపర్ణఖా అని పేర్కొనడం, శ్రవణ నాసికా నిపాత సంఘటనను (ముక్కూ చెవులు కోయడం) అభివర్ణించడం, తాపస వేషధారి అయిన రావణుడు సీతాపహరణం కావించడం, యుద్ధ సమయంలో నంది శాపాన్ని రావణుడు స్ఫురణకు తెచ్చుకోవడం - మొదలైన విషయాలు ఈ రామాయణంలో ప్రముఖంగా అభివర్ణితాలు. ఇందులో కాండం, సోపానం, విలాసం అనే విభాగాలు లేవు. (ఈ అంశాలు తెలియజేసిన మాణక్ చంద్ నాహర్ గారికి కృతజ్ఞుణ్ణి.)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

19
హిందీ

హిందీసాహిత్య మనగానే హిందీ భాషీయులు కానివారికి తులసీదాసు పేరు స్ఫురణకు రావడం పరిపాటి. వారికి హిందీ సాహిత్య మంటే తులసీదాసు, తులసీదాసంటే హిందీ సాహిత్యమూను. నిజానికి హిందీ సాహిత్య సదనంలో మణి దీపిక వెలిగించిన మహిత చరితుడు గోస్వామి తులసీదాసు (1526- 1623).

స్వాంతస్సుఖం కోసం రఘునాథ గాథను రచించిన తులసీదాసుపై అధ్యాత్మ రామాయణం చెరగని ముద్ర వేసింది. ఆ రామాయణ ప్రభావం మిక్కుటంగా కానవస్తున్నా, వాల్మీకి రామాయణం, ఆనంద రామాయణం, భశుండి రామాయణం, హనుమన్నాటకం మొదలైనవాటి ప్రభావం కూడా తులసీదాసుపై కానవస్తున్నదని విద్వల్లోకం అంగీకరించింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, నానా పురాణ నిగమాగమములను ఆయన సంప్రతించాడు. ఆయన అభిమానించిన అధ్యాత్మరామాయణాన్ని అనుసరించి, పరమశివుడు పార్వతికి చెప్పినట్లుగా తులసీదాసు రఘునాథగాథను వివరించాడు. ఆనాళ్లలో దేశంలో లోపించిన సదాచారం, శీలసంపదను పునః ప్రతిష్ఠింపజేయాలనే ఉద్దేశంతో ఆయన రామాయణ రచనకు పూనుకున్నట్లుగా పండితులు పేర్కొంటారు. హిందీ ఉపభాషలలో ఒకటైన అవధీలో తులసీదాసు వ్రాశాడు.

తులసీదాసు రచించిన శ్రీరామచరితమానస్ ఒక్క భారతావనిలోనే కాక ఆగ్నేయాసియాదేశాలలో కూడా ప్రచుర ప్రచారం గడించింది. ఇది పేర్కొనదగిన అంశం. మనదేశంలోని పెక్కు భాషలలోకి ఈ రామాయణం అనూదితమై పాఠకలోకాన్ని అలరిస్తున్నది. హిందీ భాషీయులలో అయితే, అది వివిధ వర్ణాల వారికి ప్రీతి పాత్రమైన పారాయణ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గ్రంథం. గాన యోగ్యమైన రచన కావడం వల్ల, రామచరిత మానస్‌ని చదువుతారనడం కంటె శ్రావ్యంగా గానం చేస్తారనడం సమంజసం.

ఆదికవి వాల్మీకి రాముణ్ణి మానవునిగా చిత్రించినా, 16వ శతాబ్ది వాడైన తులసీదాసు అలౌకిక శక్తులతో కూడిన పరబ్రహ్మగా అభివర్ణించాడు. పుంసాం మోహన రూపాయ అన్నట్లుగా తులసీదాసు భావించిన రాముడు భువనైక మనోభిరాముడు. రాముడు అనంత సౌందర్యం అనంత శక్తి అద్వితీయ శీలం మూర్తిగొన్న వాడు. చెల్లెలైన శూర్పణఖను వికృతరూపిణిగా చేసినా, రాముణ్ణి వధించేందుకు చేతులు రావడం లేదని ఖరుని చేత అనిపిస్తాడు రావణుడు. అలాంటి జగదేక సుందరుడు, సమ్మోహన శీలుడు రాముడు! కొన్ని చోట్ల రాముని పాత్ర కంటె భరతుని పాత్రనే ఆయన మిన్నగా తీర్చిదిద్దినట్లు పండితులు విశ్వసిస్తున్నారు. చాలామంది భక్తిపూర్వకంగా పారాయణం చేసే సుందరకాండను కేవలం 60 దోహాలలోనే (ద్విపదలు) ఆయన ముగించడం కొంచెం ఆశ్చర్యంగా ఉన్నది. ఆ రోజుల్లోని శైవ, వైష్ణవ భేదాలు తులసీదాసుని కలత పెట్టి ఉంటాయి. కనుకనే ఆయన శంకరుణ్ణి రామనామ జపితునిగాను, రాముణ్ణి రామలింగేశ్వర ప్రతిష్ఠాపకునిగాను అభివర్ణించి శివకేశవులకు మధ్య అభేదం పాటించాడు. ఇలాంటి భావాలు సార్వకాలికాలు.

ఉత్తర భారతంలోనే కాక, మారిషస్, సురినాం మొదలైన విదేశాలలోనూ రామాయణ మంటే తులసీదాసు ప్రసాదించిన రామచరిత మానసమే. హిందీ భాషీయులున్న దేశ విదేశాలలో తులసీరామాయణానికి అంత ప్రచారం లభించింది! ఇతర భారతీయ భాషలలో కూడా తులసీ రామాయణం అనువదించబడినంతగా, ఇతర భాషల రామాయణాలు అనూదితములు కాలేదని చెప్పడం సత్య సన్నిహితం. ఒఢ్ర భాషలో 4, వంగభాషలో 3, తెలుగులో 7, సంస్కృతంలో 1, ఉర్దూలో 3, మరాఠీలో 3, మలయాళంలో 3, మైథిలీలో 1 - ఇలా పెక్కు భారతీయ భాషలలోకి తులసీరామాయణం పరివర్తిత మయింది. ఇతర భాషలలోని అనువాదాలు ఇయ్యలేదు. ఇచ్చిన వివరాలు కూడా అసమగ్రములు. నాకు తెలియని అనువాదాలు మరికొన్ని ఉండవచ్చు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హిందీ విద్వాంసులు ఎందరో పరిష్కర్తలుగా తులసీరామాయణాన్ని ప్రచురించారు. టీక, వ్యాఖ్యలతో ప్రచురించారు. కొందరు వచనానువాదాలు వెలయించారు. తులసీరామాయణాన్ని వివిధ భాషా రామాయణాలతో సరిపోల్చి తులనాత్మక పరిశీలనలు వెలువరించారు. ఇలా వచ్చిన వాటిలో రామేశ్వర్ దయాళ్ అగర్వాల్ గారి కంబరామాయణ్ ఔర్ రామచరిత మానస్, యన్. శంకరరాజు నాయుడుగారి కంబర్ ఔర్ తులసి, రామచంద్రదేవ్‌గారి తులసి ఔర్ తుంజన్ (ఎళుత్తచ్చన్), సరగు కృష్ణమూర్తిగారి తులసీరామాయణ్ పంపరామాయణ్, విద్యామిశ్రాగారి వాల్మీకి రామాయణ్ ఏవం రామచరిత మానస్ తులనాత్మక అధ్యయన్, నగేంద్రగారి సంపాదకత్వాన వెలువడిన రామచరిత మానస్: తులనాత్మక్ అధ్యయన్, వినయమోహన్ శర్మగారి తులసీదాస్ రామచరిత మానస్ ఔర్ ఏకనాథ్ భరత రామాయణ్, రమాకాంత శుక్లాగారి పద్మపురాణ్ ఔర్ రామచరితమానస్, శివకుమార్ శుక్లాగారి రామచరిత్‌మానస్ కా తులనాత్మక అధ్యయన్, విజయనారాయణ సింహ్‌గారి తులసికే రామకథా కావ్య - తులనాత్మక ఔర్ విశ్లేషణాత్మక అధ్యయన్, రామనాథ్ త్రిపాఠి గారి. కృత్తివాసి బంగ్లా రామాయణ్ ఔర్ రామచరితమానస్ తులనాత్మక అధ్యయన్ మొదలైన వాటిని పేర్కొనవచ్చు. ఇలా రామకథను తులనాత్మకంగా పరిశీలించి వ్రాసిన గ్రంథాలు హిందీలో వచ్చినన్ని ఇతర భారతీయ భాషలలో రాలేదని నా అభిప్రాయం. ఈ విషయమై కృషి చేసిన పండితుల భాషాభిమానం ప్రశంసార్హం.

అలాగే నాకు తెలిసినంతవరకు హిందీలోకి వచ్చినన్ని యితర భాషా రామాయణాల అనువాదాలు మరి యే యితర భాషలలోకి రాలేదు.

గోన బుద్ధారెడ్డి రచించిన రంగనాథ రామాయణాన్ని ఏ. సి. కామాక్షిరావు (1961, 477 పుటలు), భీమ్‌సేన్ నిర్మల్ (1979, 1327 పుటలు) గారలు, పంపరామాయణ కథను యన్. యన్. దక్షిణామూర్తిగారు, గురుగోవిందసింగ్ సంతరించిన గోవింద రామాయణాన్ని (రామావతార్), కంబరామాయణాన్ని యన్. వి. రాజగోపాలన్, టి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శేషాద్రి, సరస్వతీ రామనాథ్ గారలు, కృత్తివాస రామాయణాన్ని నంద కుమార్ అవస్థి, ప్రబోధ్ మజుందార్ గారలు, ఎళుత్తచ్చన్ వెలయించిన అధ్యాత్మ రామాయణాన్ని హిందీలోకి పరివర్తించడం జరిగింది. విశేష మేమిటంటే ఈ హిందీ అనువాదకులలో కొందరు ఆయా మూలభాషలకు చెందినవారు కావడం. కొందరు మూలాన్ని దేవనాగరి లిపిలో ఇవ్వడం మరొక విశేషం. వీటిలో కొన్ని అనువాదాలను లక్నోలోని భువనవాణి ట్రస్టువారు ప్రచురించారు. వీరందరి కృషి కొనియాడదగింది.

తులసీదాసు జీవిత చరిత్ర, ఆయన వ్యక్తిత్వం, రామచరిత మానస్‌లో నీతితత్త్వం, ఆ రామాయణంలోని సూక్తులు, అందులో ప్రదర్శితమైన ఔచిత్యం, ఆ మహాకవి ప్రదర్శించిన కథా శిల్పం, ఆయన చిత్రించిన పాత్రలు, ఆధునిక యుగంలో తులసీదాసు స్థానం మొదలైన పెక్కు విషయాలు గురించి పండితులు పలువురు రచనలు చేశారు. కొత్త రచనలు వెలువడుతూనే వున్నాయి. ఈ సందర్భంగా పాశ్చాత్యుడే అయినా హిందీ విద్వాంసుడుగా పేరు ప్రఖ్యాతులు ఆర్జించిన కమీల్ బుల్కే రచించిన రామ్‌కథ : ఉత్పత్తి ఔర్ వికాస్' అనే బృహద్గ్రంథం తప్పక పేర్కొనదగినది. ఇది 815 పుటల గ్రంథం. ఇందులో ఆయన రామకథా ప్రాదుర్భావం మొదలైన పెక్కు అంశాలు సాధికారంగా వివరించారు. ఈ వివిధ రచనలే కాక మానస్ పర్యాయ్ శబ్దావళి, మానస్ అలంకార్ కోశ్, మానస్ సూక్తి కోశ్, మానస్ సందర్భ కోశ్, తులసీ రామాయణ్ శబ్దసూచి, తులసీ శబ్ద సాగర్ మొదలైన కోశాలు కూడా వెలువడినాయి. గోస్వామి తులసీదాసు హిందీ సాహిత్య ప్రపంచంలో ఎలా ప్రభుత సలుపుతున్నారో, ఆ అంశాన్ని యీ వివిధ రచనలు వ్యక్తం చేస్తున్నాయి. జన ప్రియమైన రామాయణాన్ని వెలయించిన మహానుభావుడు తులసీదాసని నిస్సంశయంగా పేర్కొనవచ్చు.

హిందీ సాహిత్యలోకంలో మకుటంలేని మన్నీడుగా తులసీదాసు వ్యవహృతుడవుతున్నా, రామాయణ మన్న తర్వాత ఆదికవి వాల్మీకి ప్రభావాన్ని త్రోసిరాజనడం సాధ్యం కాదు. చండికాప్రసాద్ అవస్థి, శ్రీపాద్ దామోదర్ సత్యలేకర్, రామ్ నారాయణ్ దత్త శాస్త్రి, చంద్రమణి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విద్యాలంకార్ ప్రభృతులు వాల్మీకాన్ని హిందీలోకి అనువదించారు. 431 పుటల వాల్మీకి రామాయణ కోశం ఒకటి వెలువడింది. 'వాల్మీకి రామాయణం ఏవం సంస్కృత నాటకోం మే రామ్' అనే పరిశోధన గ్రంథం వెలువడింది. వాల్మీకి అభివర్ణించిన ఐతిహాసిక రాముణ్ణి గురించి వాల్మీకి కాలపు భారతదేశం గురించి, పరిశోధన గ్రంథాలు వెలువడ్డాయి. మహర్షి వాల్మీకి అనే నాటకం కూడా వెలువడింది.

తులసీదాసుకి సమకాలికుడైన కేశవదాసనే కవి రామచంద్రిక అనే రామాయణం వ్రాశాడు. ఇది 39 సర్గల గ్రంథం. భావ గాంభీర్యం లోపించిన యీ రచనను ఒక లక్షణ గ్రంథం అనడం సమంజసమని పండితుల అభిప్రాయం. ఇది బ్రజభాషలో ఉన్నది. మధ్యమధ్య బుందేల్ ఖండ్ పదాలు కానవస్తాయి. ఇందులోని భాష అర్థం కావడం ఒక సమస్య. కనుక, దీనికి ప్రచారం లభించలేదు. తులసీదాసు శిష్యుడైన రామ ద్వివేది ప్రేమ రామాయణ మనే పేరుతో రామచరిత మానసానికి సంస్కృతంలో టీక వెలయించారు.

ఆధునిక యుగంలో రామచరిత మానస్‌కి సరివచ్చే రామాయణం హిందీలో వెలువడక పోయినప్పటికీ, రామకథా సంబంధి రచనలు చాలా వెలువడ్డాయి. ముఖ్యంగా హిందీ మహాకవుల దృష్టి రామాయణంలో అనాదృత పాత్రలుగా కొందరు విమర్శకులు భావించే ఊర్మిళాదులపై ప్రసరించింది. విశ్వకవి రవీంద్రులు వాల్మీకంలోని ఉపేక్షిత నాయికలు గురించి ఒక వ్యాసం సంతరించారు. ఊర్మిళను కవులు అనాదర భావంతో చూశారని వివరిస్తూ మహావీర ప్రసాద్ ద్వివేది కూడా ఒక వ్యాసం వ్రాశారు. ఈ రచనలు మైథిలీ శరణ్ గుప్త వంటి ప్రముఖ కవుల్ని బాగా ఆకట్టుకున్నాయి. తత్ఫలితంగా గుప్తగారు సాకేత్ అనే మహాకావ్యం రచించారు. ఇందులో రామాయణ కథ మధుర మనోజ్ఞంగా అభివర్ణితం. ఊర్మిళ ప్రధాన పాత్ర. ఆమె చేసిన త్యాగం, తపస్సు ప్రాధాన్యం వహించాయి. ఆమెను కేంద్రబిందువుగా చేసుకుని రామకథా వలయం తిరుగుతుంది. ఖడీబోలీ హిందీలో రచిత మైన యీ మహాకావ్యంలో భరతుని శీలం, కైకేయి పశ్చాత్తాపం మొదలైనవి అద్భు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తావహంగా చిత్రితములనీ, రామకథను తెలియజేయడంలో మైథిలీ శరణ్ గుప్తగారు ఒక నూతన విధానం అవలంబించారనీ విమర్శక లోకం భావిస్తున్నది. ఆధునిక హిందీ సాహిత్యంలో సాకేత్ అనర్ఘ రత్నంగా ప్రతిభాసిస్తున్నది. ఆయనే పంచవటి అనే లఘుకావ్యం కూడా రచించారు.

సీతా సమాధి, అరుణ్ రామాయణ్, శబరి, మైకేల్ మధుసూదన్ దత్తగారి మేఘనాథ వధ (అనువాదం), రావణ్ మహాకావ్య, కాళిదాసుని రఘువంశం (అనువాదం), రఘువంశ మహాకావ్య వచనానువాదం, రామ్‌చరిత్ర, దశరథ్ నందన్, పద రామాయణం, కైకేయి, ఉత్తరాయణ్ దశానన్, కాళూరి వ్యాసమూర్తిగారి రామరాజ్య కుశలవులు - మొదలైనవి ఎన్నో హిందీలో వెలువడ్డాయి. కాగా ఆధునిక యుగంలో హిందీలో రామకథా సాహిత్యం పుష్కలంగా వెలుగులోకి వచ్చినట్లు నిస్సంశయంగా చెప్పవచ్చు.

నవీన్‌గా లబ్ధ ప్రతిష్ఠులైన బాలకృష్ణశర్మగారు ఊర్మిళ పేరుతో ఒక మహాకావ్యాన్ని వెలయించారు. ఇది 619 పుటల పుస్తకం. నిరాలాగా పేరు ప్రఖ్యాతులు గడించిన సూర్యకాంత్ త్రిపాఠిగారు 'రామాయణ్ కీ అంతర్ కథాయే' అనే పుస్తకం రచించారు. రామాయణ కథలను ఆధారంగా చేసుకుని వ్రాయబడిన పుస్తక మిది. అలాగే రామాయణ కథలను ఆధారంగా చేసుకుని పిల్లల కోసం సంతరించబడిన గ్రంథం రామ్ చర్చా. దీన్ని సుప్రసిద్ధులైన ప్రేమ్‌చంద్‌గారు వ్రాశారు.

హిందీ వాఙ్మయం బహుప్రాచీనం కాకపోయినా, అందులో వెలువడిన రామకథా సాహిత్యం సువిశాలమూ విస్తృతమూ అయినది. తన రామాయణ రచన ద్వారా ఆ సాహిత్యానికి తులసీదాసు చేసిన సేవ చిరస్మరణీయం అనక తప్పదు. అంగీకరించకను తప్పదు. ప్రాచ్య రచయితలనే కాక పాశ్చాత్య రచయితలను కూడా ఎంతగానో అలరించిన కావ్యరాజ మది. ఆ రామాయణం గురించి ఫ్రెంచిలో వ్రాసిన అంశాలను హిందీలోకి అనువదించారు. అలాగే భూమికను మానస్‌కీ భూమికా అనే పేరుతో హిందీలోకి అనువదించారు. ఈ సందర్భంగా కమలా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రత్నం గారు రచించిన 'లావోస్ మే రామ్‌కథా' అన్న పుస్తకం పేర్కొనదగింది. లావోస్‌లో రామకథ ఎలా రూపు దిద్దుకున్నదో అవగాహన చేసుకోవడానికి ఈ పుస్తకం ఎంతైనా ఉపకరిస్తుంది.

మొత్తంమీద తులసీదాసు రామాయణం ఎక్కడెక్కడి హిందీ భాషీయుల్ని సాంస్కృతికంగా, సాహిత్య పరంగా ఏకం చేయగలిగిందని పేర్కొనడం చర్విత చర్వణం. రామ్ ప్రసాద్ మిశ్రాగారు 'విశ్వకే సర్వశ్రేష్ఠ మహాకావ్య' అనే పుస్తకం వ్రాశారు. తులసీదాసు కృతికి హిందీ రచయితలు అలాంటి అత్యున్నత స్థానం ఇచ్చినట్లుగా భావించవచ్చు.

శిష్టు కృష్ణమూర్తి శాస్త్రిగారు (1790 - 1880) హిందీ ఛందస్సుల్లోనే రామ చరిత మానస్‌ని తెలుగు చేసిన అపూర్వ విషయం అందరూ గ్రహించదగింది. ఆ తెలుగు సేత లోని సుందరకాండం మాత్రం ముద్రితం (1984). ఆ అనువాదాన్ని సంపాదించిన భీమ్‌సేన్ నిర్మల్‌గారి కృషి కొనియాడదగింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

20

సౌరాష్ట్రం

దక్షిణా పథంలో వాడుకలో ఉన్న భాషలలో సౌరాష్ట్రం ఒకటి. మధుర, తంజావురాది ప్రాంతాలలో ఈ భాష ప్రచారంలో ఉన్నది. సౌరాష్ట్ర భాషకు ప్రత్యేక లిపి ఉన్నా, మొనమొన్నటి వరకూ సౌరాష్ట్ర పుస్తకాలు తెలుగు లిపిలో ముద్రించబడేవి. తెలుగు లిపికి తమిళనాడులో ప్రచారం లోపించడంతో, సౌరాష్ట్ర పుస్తకాలు తమిళ లిపిలోనో సౌరాష్ట్ర లిపిలోనో ముద్రించబడుతున్నాయి. నిశితంగా పరిశీలిస్తే సౌరాష్ట్రులకూ తెలుగువారికీ కొన్ని కొన్ని విషయాలలో కొట్టవచ్చినట్లుగా పోలికలు కని పిస్తాయి. తెలుగువారి సాంస్కృతిక చరిత్ర మహత్తర మయింది!

సౌరాష్ట్ర భాషకు సాహిత్య సంపద అంతగా లేదు, కాని వెలువడిన పుస్తకాలలో కొన్ని అమూల్యమైనవి. వాటిలో ఒకటి తెలుగు లిపిలో ప్రచురితమైన సౌరాష్ట్ర సంగీత రామాయణం. ఆ భాషలో రామా యణు అంటారు. చెన్న పట్టణంలో 1905లో ముద్రితం. ఈ పుస్తకం ముఖపత్రం ఇలా ఉన్నది.

'శ్రీ మత్కవి వెంకటసూరి విరచితు
సౌరాష్ట్ర సంగీత రామాయణు
శ్రీమత్మధురానగరి
సౌరాష్ట్ర విద్యాభివర్ధని సభికున్‌హాలి
కందాళ్లు కవి లక్ష్మణాచార్యు ఝుద్ధి శెయ్ను
ప్రచుర్నిహాయలై
పా అక్కయ్యదేవర స్వకీయ
శ్రీ మదుమామ పేశ్వర ముద్రాక్షరశాలు
... ...

ఈ ముఖపత్రం తెలుగు పుస్తకం ముఖపత్రంలా కనిపించడం పేర్కొ నదగిన అంశం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంగీత సాహిత్యాలలో నిష్ణాతుడైన వెంకటసూరి తంజావూరు జిల్లా లోని అయ్యంపేటలో [రామచంద్రపురం అని కూడా అంటారు] నారాయణ శర్మ దంపతులకు ప్రభవించాడు. ఆయన లక్ష్మీనరసింహోపాసకుడు. మాతృభాష అయిన సౌరాష్ట్రంలోనేకాక, సంస్కృతాంధ్ర ద్రవిడ భాషలలోనూ పాండిత్యం గడించినవాడు. త్యాగరాజస్వామివారి ప్రథమ శిష్యుడైన వేంకటరమణ భాగవతులవారి శిష్యుడు. త్యాగరాజుకి ప్రశిష్యుడన్నమాట! 18వ శతాబ్దివాడు. లావణిపాటలు, మంగళాష్టకాలు మొదలైనవి సంతరించాడు. చాలాకాలం తంజావూరులో నివసించాడు. ఆ తర్వాత నివాసాన్ని మధురకు మార్చుకుని, అక్కడ ద్రౌపది అమ్మవారి గుడిలో ఉండసాగాడు. మధురలో ఉన్న రోజుల్లోనే ఆయన సౌరాష్ట్ర సంగీత రామాయణం వెలయించాడు. ఆయనకి చిరంజీవిత్వం ప్రసాదించిన కృతి యిదే. ఆ తర్వాత ఆయన తీర్థయాత్రలు చేసి, యమునా తీరాన స్వర్గస్థు డయ్యాడు.

వెంకటసూరి రచించిన సంగీత రామాయణం సంగీత ప్రధానమైన రచన. ఇది రెండు భాగాల గ్రంథం. మొదటి భాగంలో 309 పుటలూ, రెండవ భాగంలో 282 పుటలూ ఉన్నాయి. ఇందులో శ్లోకాలూ [సౌరాష్ట్ర పద్యాలు] కీర్తనలూ ఉన్నాయి. వాటి వివరాలివి.

	శ్లోకాలు	కీర్తనలు
ఇష్టదేవతాది	9	9
బాలకాండ	56	35
అయోధ్యకాండ	77	31
అరణ్యకాండ	9	33
కిష్కింధకాండ	49	24
సుందరకాండ	60	35
యుద్ధకాండ	275	131
మొత్తం	585	299

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సీసం, దరువు, ద్విపద [దు] మొదలైనవి రచనలో ఉపయుక్తాలు. సౌరాష్ట్ర శ్లోకం ఎలా వినిపిస్తుందో కింది రచన చదివితే వ్యక్త మవుతుంది.

మెనిమెనెవాక్‌జని రాం(ప్రతి బోలోస్
జనని వచేగుర ఖోయ్‌దు సర్వాట్
సకలునుతూ జని హైన్‌కోకోరి త్వార్
మొకొాజసెబాప్‌పోశె మాయ్‌జొావాగైలీ.

సౌరాష్ట్ర వాల్మీకిగా ప్రథితయశస్కుడైన వెంకటసూరి స్వామి ప్రస్తుత సౌరాష్ట్ర లిపికి భిన్నమైన లిపిని రూపొందించాడు. కాని అది ప్రచారంలోకి రాలేకపోయింది. ఆయన ప్రతిభావంతుడని చెప్పడానికే ఈ విషయం ఉదాహరించబడింది.

తమిళంలో సీర్కాళి అరుణాచల కవిరాయర్ [18వ శతాబ్ది] వ్రాసిన రామనాటక కీర్తనై బహు ప్రసిద్ధ మయింది. సంగీత ప్రధానమైన ఈ రచన సౌరాష్ట్ర సంగీత రామాయణానికి మాతృక. అయితే తమిళ కృతి కొంచెం విపులంగా సాగింది. ఒక ఉదాహరణ.

తమిళ కృతిలో హనుమంతుడు రావణునితో ఇలా అంటాడు:

'రామసామి దూతన్ నానడా - అడడా రావణా నానడా, ఎన్పేర్ అనుమానడా'

ఈ భావం సౌరాష్ట్ర కృతిలో ఇలా వివరించబడింది.

'దేవు రామదూతమి రావణా'
వచునంగును మొరొా
నావ్ హనుమత్తై కివె రావణా!'

[మి = నేను; వచునంగు = ఇంకా చెపుతాను; మొరొా = నా; నావ్ = పేరు; ఐకివె = వినము]

పర్ణశాలాసహితంగా రావణుడు సీతాపహరణం చేసినట్లు కంబరామాయణంలో చెప్పబడింది. కంబ మహాకవిని అనుసరించి అరుణాచలకవి, 'నిలత్తోడే తూక్కి వంచకున్ యోడత్తు త్తేరినిల్...' అన్నాడు. తమిళ కవిని అనుసరించి వెంకటసూరి, 'ఐకివి జానకికు ధరిసరవి....' అన్నాడు. కాని ఒకటి రెండుచోట్ల సౌరాష్ట్ర కవి చిన్న చిన్న మార్పులు చేశాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సముద్ర లంఘనం చేసేటప్పుడు, రాముడిచ్చిన అంగుళీయకాన్ని హనుమంతుడు చెవిలో పెట్టుకుని వెళ్లాడట! బస్సులు మొదలైన వాటిలో ప్రయాణం చేసేటప్పుడు కొందరు చెవిలో పదిపైసలు, పావలా మొదలైన నాణాలు పెట్టుకుని ఉండడం మనం చూడవచ్చు.

ఏ తమిళ రామాయణం లోనూ లేని ఒక విషయాన్ని వెంకటసూరి పేర్కొనడం గమనించదగిన అంశం. రావణుడు పాతాళహోమం చేస్తుండగా, అప్పుడు అంగదుడు మందోదరినీ లంకేశ్వరుని వద్దకు ఈడ్చుకు వచ్చిన వృత్తాంతాన్ని రంగనాథ రామాయణం కళ్లకు కట్టినట్లుగా అభివర్ణించింది. ఈ ఉదంతం అధ్యాత్మ, ఆనంద రామాయణాలలోనూ కనిపిస్తుంది. అయితే రంగనాథ రామాయణంలోని మందోదరి రావణునికి రాముని మహత్వాన్ని వివరించేందుకు ముందు ఇలా అంటుంది. ఆమె ఆత్మాభిమానం ఎంత దెబ్బ తిన్నదో పరికించండి.

'ఇంద్రు గెల్చిన సత్వ మెక్కడ బోయె
చంద్రహాసము వాడి సమసెనే నేడు!
... ...'
సిగ్గు లజ్జయు లేని చెనటివో, నన్ను
బగ్గించుచున్నారు పగతు లిబ్బంగి
నీ హోమ మేటికి నిష్ఠ యేమిటికి?

తెలుగు రామాయణంలోని మందోదరి అన్నట్లుగానే సౌరాష్ట్ర రామాయణంలోని ఆ మహారాణి కూడా రావణుని నిష్ఠను నిరసించింది. ఇంకా ఎవరికోసం యుద్ధం? జయించి మాత్రం లాభం ఏమిటి? అంటుంది. అనగా హోమం చేసి లాభం లేదని నిష్కర్షగా చెప్పింది, మానం మంట గలిసిన తర్వాత.

రావణుని హోమ వృత్తాంతం, మందోదరీ పరాభవం - రామాయణ వర్ణ చిత్రాలలో కూడా చోటు చేసుకున్నాయి. ఉత్తర ఆర్కాడు జిల్లాలోని చెంగం గ్రామంలో వెలసిన వేణుగోపాల పార్థసారథి స్వామివారి ఆలయంలో రామాయణ వర్ణచిత్రాలు కనులవిందు చేస్తాయి. కొన్ని చిత్రాల కింద తమిళంలోనూ, తెలుగులోనూ లఘు వివరణ యివ్వబడింది. ఈ చిత్రాలు 17వ శతాబ్ది నాటివని పెద్దల అభిప్రాయం. కాగా, ఈ వర్ణచిత్రాలు వేసినవారు తెలుగువారై ఉండవచ్చు. వారు రంగనాథ రామా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యణాన్ని సంప్రదించి ఉండవచ్చు. కనుకనే తమిళ రామాయణాలలో లేని రావణ హోమ వృత్తాంతాన్ని వారు తాము వేసిన చిత్రాలలో చేర్చి ఉండవచ్చు. ఈ వృత్తాంతాన్ని అభివర్ణించిన వెంకటసూరికి రంగనాథ రామాయణమైనా, యీ రామాయణ చిత్రాలైనా ప్రేరణ కలిగించి ఉండవచ్చునని భావించవచ్చు.

వెంకటసూరి బాల రామాయణం కూడా వ్రాశాడు. ఇది జటిలమైన రచన అని అభిజ్ఞులు చెపుతారు. ఆయన నౌకా చరిత్రం సంస్కృతంలో వ్రాశాడు. బహుశః త్యాగరాజస్వామి వారి నౌకాచరిత్ర సంగీత రూపకాన్ని అనుసరించి ఉండవచ్చు.

వాల్మీకి రామాయణాన్ని అనుసరించి తొ.ము. రామారాయ్ [టి.ఎం రామారావు] అనే రచయిత సౌరాష్ట్ర వచన రామాయణం వ్రాశాడు. ఇది తమిళ లిపిలో ముద్రితం. తమిళ లిపిలోనే టి. ఆర్. పద్మనాభ అయ్యరు రచించిన సౌరాష్ట్ర అధ్యాత్మ రామాయణాన్ని మధురలోని శ్రేష్ఠ సౌరాష్ట్ర సాహిత్య సభవారు ప్రకటించారు. ఇది పద్యకావ్యం.

ఇలా సౌరాష్ట్ర భాషలో రామకథ గద్య పద్య సంగీత కృతులలో వెలసింది. నేటికీ వెంకటసూరి విరచిత సంగీత రామాయణం సౌరాష్ట్రులకు ప్రీతిపాత్రమైన గ్రంథం!

[సౌరాష్ట్ర మిత్రులు శ్రీయుతులు ఆర్.ఎ. మోహన్‌రామ్; ఓ.ఎస్. సుబ్రమణియన్‌గారలు వ్యాస రచనకు తోడ్పడ్డారు. రచయిత వారికి కృతజ్ఞుడు.]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

21
విదేశాలలో రామకథ

రామకథ రసవత్కథ. అది ఎప్పటిదో ఇదమిత్థమని ఎవ్వరూ చెప్ప లేరు. చెప్పడానికి విఫల ప్రయత్నాలు జరిగాయి. ఏ శుభముహూర్తంలో వెలుగు చూసిందో తెలియదు కాని, నాటి నుంచీ నేటిదాకా ఆ కథ తరతరాల ప్రజల్ని అలరిస్తూనే ఉంది; ప్రభావితం చేస్తూనే ఉంది. వివిధ ప్రాంతాలవారు, విభిన్న భాషలవారు ఆ కథను తమ కథగా మలచుకోడానికి ప్రయత్నించారు. అలాగే వివిధ మతానుయాయులూ ఆ కథను తమ సిద్ధాంతాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోడానికి ప్రయత్నించారు. చరిత్రకు తెలిసిన నాటినుంచీ ఈ నాటి దాకా ప్రచుర ప్రచారంలో ఉన్న రమణీయ కథ రామకథ అన్నా అతిశయోక్తి కాదు. ఎన్నో యేండ్లూ పూండ్లూ గడిచినా ఒక కథ ఈ నాటికీ జన వ్యవహారంలో సజీవంగా ఉన్నదంటే, ఆ కథలో ఏదో ఒక విశిష్టత అంతర్లీనమై ఉన్నదనే అంశం స్పష్ట మవుతుంది.

భారతీయ సాహిత్యంలో ఆదికావ్య మనే అఖండ యశస్సు సముపార్జించిన రామాయణాన్ని సంహిత అనీ, ఇతిహాస మనీ పేర్కొంటారు. ధర్మార్థ కామమోక్షములనే చతుర్విధ పురుషార్థాలు యిందులో వివరించబడడం వల్ల, దీనికి ఇతిహాసం అనే పేరు వచ్చింది. మహానుభావుని చరిత్రను అభివర్ణించే యీ గ్రంథానికి కావ్యం, ఐతిహాసం, సంహిత అనే పేర్లు కలగడం గమనించదగిన అంశం.

రామకథలో మరొక విశిష్టత కూడా ఉంది. ఉత్తర, దక్షిణ భారతాలను కలిపిన కమనీయ కథ అది. ఉత్తర భారతంలో ప్రభవించిన రాముడు దక్షిణాపథానికి రావడం, చివరికి సముద్రం మీద సేతువు నిర్మించి లంకను చేరుకోవడం మొదలైనవి రామకథలోని కొన్ని ప్రధాన విషయాలు. తత్ఫలితంగా ఆసేతు హిమాచలం అనే మధురమైన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పదబంధం ప్రచారంలోకి వచ్చింది. అఖండ భారతానికి ఆసేతు హిమాచలం నామాంతర మయింది. ఆసేతు హిమాచలానికి సమానార్థకమైన పదబంధంగా 'కుమరి ముదల్ ఇమయం వరై' ని తమిళులు ఉపయోగిస్తారు. ఇక్కడ కుమరి శబ్దానికి సేతువని అర్థం. ఇలా మనదేశమంతా ఒక్కటే అనే జాతీయభావం ఏర్పడడానికి రామకథ బహుధా ఉపకరించింది. అది కేవలం రాజుల కథే అయితే, సామాన్యుల్ని అంతగా ఆకట్టుకుని వుండేది కాదు. అది సర్వమానవ సౌభ్రాత్రానికి ప్రతీక! మానవులూ దానవులూ వానరులూ అందరూ కనిపిస్తారు ఆ కథలో. వానరుడైన హనుమంతుడు, దానవుడైన విభీషణుడు, ఆటవికుడైన గుహుడూ ఎందరో మానవుడైన రాముని భక్తి సామ్రాజ్యంలో సరిసమానంగా పాలు పంచుకొంటారు. ఇది ఆ కథలోని ఒక ప్రత్యేకత. కనుకనే అది సార్వజనీనం కాగలిగింది.

మరొక విశేషం కూడా లేకపోలేదు రామకథలో. తరువాతి పండితులూ, కవులూ రాముణ్ణి దేవునిగా అభివర్ణించినప్పటికీ, వాల్మీకి వర్ణించిన రాముడు మానవునిగానే దర్శన మిస్తాడు. అతడు పరిపూర్ణమానవుడు; ఆదర్శ మానవుడు. మానవుడుగా అనేక కష్టసుఖాలు అనుభవిస్తాడు. ఇక సీత విషయం చెప్ప నవసరం లేదు. ఆమె ఒక రాజు కూతురు, ఒక రాజు కోడలు, ఒక రాజు భార్య అయివుండి కూడా అష్టకష్టాలకు లోనయింది. నిజానికి రామకథ ఒక కుటుంబ కథ. కుటుంబ సభ్యుల మైత్రి ఆ కుటుంబ శ్రేయస్సుకీ, తద్వారా సంఘ శ్రేయస్సుకీ సోపాన మవుతుంది. రామాయణ పాత్రలు కొన్ని ఆదర్శాలకు కట్టుబడి వున్నట్లుగా తెలియకపోదు. అయినా ఆ పాత్రల పట్ల మనకు సానుభూతి కలుగుతుంది. మొత్తం మీద దైవత్వం సంతరించుకున్న ఉత్తమ మానవుని కథ రామాయణం.

అదేమి చిత్రమో కాని, నానాటికి రామకథా వాఙ్మయం హనుమంతుని తోకలా పెరిగిపోతూ వున్నది. 'రామాయణం అనంతకం' అన్న మాట అక్షరాలా నిజ మనిపిస్తున్నది.

రామాయణం మనదేశంలో అవతరించిన కావ్యమే అయినా, అది ఆసియా వాసుల్ని సాంస్కృతికంగా సమైక్యపరచ గలిగింది. ముఖ్యంగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీలంక, మలేషియా, ఇండోనేషియా, మంగోలియా, కంబోడియా, లావోస్ మొదలైన ఆగ్నేయాసియా దేశాల వారిని గాఢంగా ఆకర్షిం చింది; వారి సంస్కృతుల మీద చెరగని ముద్ర వేసింది. ప్రథమ అంతర్జాతీయ రామాయణ సదస్సు 1971 లో ముస్లిం దేశమైన ఇండో నేషియాలో జరగడం గమనించదగింది. ఆగ్నేయాసియా దేశాలవారికి రామకథ మీద గల నిరుపమానమైన ఆదరభావానికి ఇదొక ప్రబల నిద ర్శనం! ఆసియా ఖండపు ఇతిహాసంగా రామాయణం వినుతి కెక్కింది. ప్రశస్త ప్రపంచ కావ్యాలు పదిహేనులో అదొకటి! ఏదో ఒక రూపంలో రామకథ చాలా భాషలలో అవతరించింది. సారస్వత సంపద అంతగా లేని భాషలలో కూడా రామకథ వెలసింది. ఉదాహరణకి, ఫిన్నో ఉగ్రి యన్ భాషా కుటుంబానికి చెందిన ఉజ్‌డెక్ భాషలో మహమ్మద్ అలీ అనే కవి రష్యన్ రామాయణాన్నీ ఒక భారతీయ రామాయణాన్నీ అనుసరించి రామాయణం సంతరించాడు. ఇటీవల కొరియన్ భాషలో రామకథ రచించబడింది. పర్యాప్తంగా పరిశీలించాలే గాని, ఇలాంటి విశే షాలు ఎన్నో లభిస్తాయి.

రామకథ అసలు భారతీయ కథయేనా? అని వెబర్ వంటి పాశ్చాత్య పండితులు కొందరు ఒక ధర్మ సందేహం లేవదీశారు. రామకథ మీద గ్రీకు ప్రభావం గోచరిస్తున్నదని కొందరు భావించారు. దక్షిణాపథంలో వైదిక మతానికీ బౌద్ధమతానికీ మధ్య జరిగిన సంఘర్షణకు కవితా రూపమే రామ రావణ యుద్ధ మన్నారు కొందరు. ఈ వివిధ వాదాలను పండితలోకం పరాస్తం చేసింది. రామాయణానికి ప్రతిధ్వ నియే హోమర్ వెలయించిన ఇలియడ్ అని జెవికీట్ వంటి పాశ్చాత్య విద్వాంసులు భావించడం పేర్కొనదగిన అంశం. వెబర్ చెప్పిన మరొక విషయం కూడా ప్రస్తావించదగిందే. రామాయణంలోని ప్రధాన పాత్రలు చారిత్రక పురుషులు కారనీ వారు కొన్ని సంఘటనలకు ప్రతీకలుగా కల్పించబడిన మూర్తులనీ ఆయన అభిప్రాయం. రామాయణ పాత్రలకే కాక సంఘటనలకు సంబంధించిన మరికొన్ని ధర్మ సందేహాలను ప్రాచ్య పాశ్చాత్య పండితులు వెలిబుచ్చారు. వాటిని అవు నన్నవారూ ఉన్నారు; కాదన్నవారూ ఉన్నారు. ఎన్నడో వెలుగులోకి వచ్చిన ఒక ప్రశస్తకావ్యం గురించి యిలా ఖండన మండనలు వ్యాప్తిలో ఉండడం సహజమే.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇక ఆగ్నేయాసియా దేశాలలో రామకథ ఏవిధంగా విస్తరిల్లిందో స్థూలా రుంధతీ న్యాయంగా పరిశీలిద్దాము. పరిశీలించే ముందు ఆగ్నేయాసియా దేశాలలో రామాయణం గురించి ప్రస్తావిస్తూ ఒక పాశ్చాత్య పండితుడు పేర్కొన్న విషయాన్ని గుర్తుంచుకోవడం సముచితం. ఆయన అన్న మాట లివి:

'ఆర్థరు గాథలకు గల ప్రచారం, షేక్స్పియర్ రచనలలోని సాహిత్య శక్తి, బైబిలుకి గల ప్రామాణికత్వం - ఈ గుణత్రయం ముప్పిరి గొన్నదే రామాయణం.'

ఇండొనేషియా

ఇండొనేషియాలో రామకథ బాగా ప్రచారంలో ఉంది. జావా, బాలీలలోని నాటకరంగం వల్ల రామకథ సజీవంగా ఉందనవచ్చు. ఇండొ నేషియా రాజధానీ నగరమైన జోగ్య (యోగ్య) కర్త అయోధ్యానగరం. అయోధ్య అనే పేరుగల రైలు స్టేషను కూడా ఉన్నట్లు అభిజ్ఞులు చెపు తారు. మధ్య జావాలో సెరయు (సరయు) అనే నది ప్రవహిస్తున్నది. కిష్కింద అనే గుహ కూడా ఉంది. అలాగే సితుబెంద (సేతుబంధ) అనే పట్టణం ఉంది. తూర్పు జావాలోని రెండు శివాలయాలలో రామా యణ చిత్రాలను మనోజ్ఞ శిల్పాలుగా మలిచారు. వాటిని చెక్కిన శిల్పులకు రామకథతో బాగా పరిచయ మున్నట్లు వ్యక్త మవుతున్నదని విజ్ఞులు భావిస్తున్నారు. రామకథను కొన్ని రాత్రులపాటు అదేపనిగా ప్రదర్శిస్తారు. ఈ ప్రదర్శనల్ని వాయంగ్ వాంగ్ అంటారు. బాలీలో నేటికీ హైందవ సంస్కృతి పరిరక్షించబడుతున్నది. ఇండొనేషియాలోని అతి ప్రాచీన శాసనాలు సంస్కృతంలో వ్రాయబడినవి. సంస్కృతానికి అంతర్జాతీయ ప్రచారం ఏర్పడడానికి బౌద్ధ వాఙ్మయం ఎలా దోహదం చేసిందో, అలాగే పంచతంత్ర, రామాయణాలు కూడా దోహదం చేశా యని భారతీయ విషయాల అధ్యయన శీలుర్లో ప్రముఖులైన వి. రాఘ వన్ గారి అభిప్రాయం. రామాయణం ప్రవేశించిన ప్రతి దేశంలోనూ, రామకథ పంచతంత్రంకన్నా, బౌద్ధమతం కన్నా విస్తృతమైన ప్రచారం గడించడం ఒక విశేషంగా పేర్కొనవచ్చు. రామకథ స్థూలంగానైనా తెలియని బాలుడు ఒక్కడూ బాలీలో కనిపించడని అభిజ్ఞులు భావిస్తారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రాచీన జావా వాఙ్మయంలో కవి రామ లేక రామాయణ కకవిన్ కావ్యం అతి ప్రాచీన కృతిగా పరిగణించబడుతున్నది. దీనికి వాల్మీకం కాదు మాతృక. క్రీ. శ. 6-7 శతాబ్దుల నడుమ వర్ధిల్లిన భట్టికవి రచించిన రావణ వధం మాతృక. దీన్ని భట్టి కావ్య మని కూడా వ్యవహరిస్తారు. భట్టి వాల్మీకిని అనుసరించినా, ఆయన కృతిలో కొన్ని మార్పులు కని పిస్తాయి. కబంధుణ్ణి భట్టి దీర్ఘబాహువని పేర్కొన్నాడు. బ్రహ్మాస్త్రంతో కాక నాగపాశంతో హనుమంతుణ్ణి ఇంద్రజిత్తు బంధించడం, సోదరుడైన రావణుణ్ణి విడిచి రాముణ్ణి శరణు వేడేందుకు ముందు విభీషణుడు తన తల్లిని దర్శించడం, చూడామణినే కాక ఒక లేఖను కూడా సీత హనుమం తుని కివ్వడం వంటి మార్పులు జావా రామాయణంలో కానవస్తున్నాయి. అందులోని శబరి వృత్తాంతం విచిత్రంగా కనిపిస్తుది. వరాహావతారంలో విష్ణువు ఆమె హారాన్ని మింగడం వల్ల ఆయన మరణిస్తాడు. ప్రత్యామ్నా యంగా ఆమె ఆయన దేహాన్ని కబళిస్తుంది. తత్ఫలితంగా ఆమె ముఖం నల్లబడుతుంది. రాముడు ఆ నలుపుని తొలగిస్తాడు. అప్ప డామె ముఖం మామూలు ముఖ మవుతుంది. ఈ కథకీ తాయ్‌లాండ్ రామకథలోని శబరి కథకూ భేదం వుంది. ఈ మార్పుల్ని పురస్కరించుకొని జావా రామాయణానికి భట్టికావ్య మొక్కటే మాతృక కాదని పండితులు అభిప్రాయపడుతున్నారు. సీత అగ్ని ప్రవేశ సందర్భంగా అగ్ని స్వర్ణకమ లంగా మారిపోతుందని యిందులో పేర్కొనబడింది. తరువాతి కాలంలో సెరత్‌రామ వంటి పద్యకృతులు వెలుగులోకి వచ్చాయి.

వాయంగ్‌వోంగ్ నృత్య నాటికలోని రామకథలో కూడా కొన్ని మార్పులు కనిపిస్తాయి. మొదట్లో సుబాలి (వాలి) రాముణ్ణి కఠి నోక్తులాడినా, తర్వాత వాల్మీకంలో వలె రామచంద్రుని ఆధిక్యాన్ని సహర్షంగా అంగీకరిస్తాడు. ఆ తర్వాత శక్తిమంతమైన తన హారాన్ని సుగ్రీవుడికి అందజేస్తాడు. మాల్యవంతం మీద రాముడు రాజ్యస్థాపన చేసినట్లు చెప్పబడింది. జాంబవంతుడు కూడా వానరుడే కాని భల్లూకం కాదు. స్వయంప్రభకు రాక్షస సంబంధం చెప్పబడింది. అందువల్ల ఆమె వానరులకు సహాయం చెయ్యదు. సేతు బంధనం సందర్భంగా వాన రులు విసిరివేసిన బండల్ని చేపలు మింగివేసినట్లు తెలుపబడింది. ఈ ఉదంతం కంబోడియా, తాయ్‌లాండు రామకథల్లో కూడా కానవస్తుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తోలుబొమ్మల ప్రదర్శనలలోనే కాక, శిల్పాలలో చిత్రాలలోనూ రామకథ చోటు చేసుకుంది. శిల్పులకూ, చిత్రకారులకూ రామకథ సుపరిచితం. సీత అగ్నిప్రవేశం బాలీ వర్ణచిత్ర కారుల్ని ఎంతగానో ఆకట్టుకున్నది. పంచకన్యల్ని ప్రస్తుతించే

"అహల్యా ద్రౌపదీ సీతా తారా మందోదరీ తథా
పంచకన్యాః స్మరేన్నిత్యం మహాపాతక నాశనం."

శ్లోకం బాలీలో పఠించబడుతుంది. ఈ శ్లోకంలో ఉదాహృతులైన అయిదుగురిలో నలుగురు రామాయణ పాత్రలు కావడం ఒక విశేషం.

మలేషియా :

మలేషియా రామాయణం మౌఖిక, లిఖిత సంప్రదాయాలలో వాడుకలో ఉంది. వీటిలో భేదాలు, అవాల్మీక విషయాలు కనిపిస్తున్నవనడం చర్విత చర్వణం.

రామాయణం తోలుబొమ్మలాట ప్రదర్శకుల్ని దలాంగులని వ్యవహరిస్తారు. ఈ ప్రదర్శనల్లో ఉపయోగించబడే ప్రామాణికమైన రచన 'చెరిత మహారాజవన'. అనేది. మహారాజు రావణ చరిత మని దీనికి అర్థం.

ఈ రామకథలో స్థానికీకరణం కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. సీతా స్వయంవరం జరిగిన ప్రదేశం, రాముడు భేదించిన సప్తతాల వృక్షాలు, లంక మొదలైన వాటిని స్థానికంగా గుర్తిస్తారు. రాముడు పరబ్రహ్మ (దేదబెరంబన్) అవతార మని మలేషియా వారి నమ్మకం. రావణుని పేరు వనగా కుదించబడింది. అతనికి పన్నెండు తల లున్నట్లుగా చెప్పబడింది.

ఆగ్నేయాసియాలోని యితర రామాయణాలవలె, మలయా రామాయణం కూడా రావణుని వంశవృక్ష వర్ణనతో ప్రారంభ మవుతుంది. పేర్లలో కొద్దిపాటి మార్పులే కనిపిస్తాయి. రావణుని తండ్రి పేరు చిత్రబహో. విశ్రవసు చిత్రబహోగా రూపాంతరం చెందాడు. అలాగే శూర్పణఖ శూరపండకి అయింది. విభీషణుడు రావణుని జ్యోతిష్కుడుగా చిత్రించబడ్డాడు. ఇంద్రజిత్తుకి మూడు తలలూ, ఆరు చేతులూ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉన్నట్లు చెప్పబడింది. మలయా రామాయణంలో ముస్లిం ప్రశంస కని పిస్తుంది. కథ మొదట్లో అల్లా, చివర్లో నబి ప్రభృతుల ప్రశంస ఉంది.

సీతాపహరణం తర్వాత రాముడు నలభై లేక యాభై రోజులపాటు మనోవ్యథ చెందినట్లు తెలియవస్తున్నది. అన్ని రోజులూ, లక్ష్మణుడు నిద్రాహారాలు విసర్జిస్తాడు. సీతాపహరణానికి ముందు లక్ష్మణుడు సీత నావరించి ఒక వలయం గీసి, ఆ వలయాన్ని దాటేవారి కాళ్లను గట్టిగా పట్టుకోవలసిందిగా భూదేవిని కోరుతాడు. వాల్మీకంలో ఉన్నట్లుగానే సీత లక్ష్మణుణ్ణి కఠినోక్తు లాడుతుంది. సీతారాముల ఎడబాటు ద్వాదశ సంవత్సరాలు కొనసాగుతుందని అశరీరవాణి తెలుపుతుంది. రావణుని చిత్రం వ్రాయమని ఒకరు బలవంతం పెట్టడం, సీత అలాగే చిత్రరచన చేయడం, అందువల్ల ఆమె మళ్లీ అడవుల పాలయిందనీ చెప్పబడింది. ఈ కథ మన జానపద రామాయణాలు కొన్నిట్లో కానవస్తున్నది. 16వ శతాబ్దిలో జీవించిన చంద్రావతి అనే వంగ కవయిత్రి రచించిన రామాయణంలో ఈ వృత్తాంతం ప్రముఖంగా చోటు చేసుకుంది.

థాయ్‌లాండ్:

థాయ్ భాషలోని (సయామీస్) రామకథను రామ్‌కీన్ (రామకీర్తి) అని వ్యవహరిస్తారు. ఈ కథలో చాలా మార్పులు ప్రక్షిప్తాలు ఉండడం వల్ల, దీనికి ప్రాధాన్యం లభించింది. ఇది కూడా తోలుబొమ్మల ప్రదర్శనకు చాలాకాలంగా ఉపయోగించబడుతున్నది. చాలా పాత్రలలో గల రామకథను ఖోన్ అంటారు. ఈ ఛద్మ ప్రదర్శనలలో దేవతలూ పురుషులూ, కృత్రిమ ముఖాలు ధరించరు; రాక్షసులూ, వానరులూ మాత్రమే ధరిస్తారు. యుద్ధాలతో నిండి నిబిడీకృతమై వుంటుంది ప్రదర్శన. హనుమంతునికి థాయ్ రామకథలో ప్రాముఖ్యం ఎక్కువ. అందువల్ల కాబోలు ఆ కథలో యుద్ధ దృశ్యాలు ప్రముఖ స్థానం వహించాయి. హనుమకు సంబంధించిన ఉదంతాలు కూడా కథలో బహుళంగా కానవస్తాయి. సంగ్రహంగా చెప్పాలంటే, హనుమంతుని కథలు హనుమంతుని తోకలా పెరిగాయి, యీ రామకథలో.

ఉదాహరణానికి సేతుబంధన వృత్తాంతం పరికిద్దాము. సుగ్రీబ్ (సుగ్రీవుడు) పర్యవేక్షణలో సేతు నిర్మాణం ప్రారంభ మవుతుంది. సము

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ద్రంలోకి విసిరివేయబడిన శిలలు మాయ మవుతాయి. అలా మాయం కావడానికి కారణ మేమిటో తెలుసుకు రమ్మని హనుమంతుణ్ణి ఆదే శిస్తారు. ఆ శిలల్ని చేపలు మింగి వేస్తున్నట్లు హనుమంతుడు తెలుసుకుంటాడు. అంతేకాదు. ఆ చేపల నాయకురాలైన సువర్ణమత్స్యని కలుసుకుంటాడు. ఆమె మరెవరో కాదు, రావణాసురుని కుమార్తె!

హనుమంతుడు ఆ బంగారు బొమ్మను ప్రేమిస్తాడు. ఆమె సహకారంతో మునిగిపోయిన శిలల్ని పైకి తెప్పిస్తాడు. చివరికి అనుకున్నట్టుగా, సేతువు పూర్తి అవుతుంది.

తాయ్ రామకథలో పేర్లు ఎలా వినిపిస్తాయో పరిశీలిద్దాము.

దశరథుడు తొట్సరట్ అయ్యాడు. ఆయన ముగ్గురు రాణులు - కౌసురియ, కైయకెశి, సముత్తెవీలు. ఇక దశరథుని కుమారులు రామ, లక్, భ్రొత్ లేక ఫ్రొత్, సుత్రుద్ లేక సత్రూత్. సీత సీదగా మార్పు చెందింది. వాలి పాలి అయ్యాడు. దశకంఠుడు తొసకంఠ్‌గా మార్పు చెందాడు.

కొన్ని పేర్లు తమిళ ప్రభావానికి లోనయినట్లుగా భావించబడుతున్నది. ఋశ్యశృంగుణ్ణి తమిళంలో కలైక్కోట్టు మునివర్ అంటారు. అలాగే, తాయ్ రామకథలోని ఋష్యశృంగుని పేరు కలైకోట్ అయింది. గుహుడు కుఖన్ అయినాడు. యువతుల్ని సంగ్ అని వ్యవహరిస్తారు. తమిళంలో యువతిని మంగై అనడం పరిపాటి. బెంగాలీల ఉచ్చారణలో వలె వకారం బకారం కావడం, అకారం ఒకారం కావడం వంటివి కూడా కనిపిస్తాయి.

తాయ్ రామకథ వరాహావతార మెత్తి విష్ణువు హిరణ్యాక్షుణ్ణి వధించడంతో ప్రారంభ మవుతుంది. ఆ తర్వాత అయోధ్యానగర ప్రసక్తి వస్తుంది. తాయ్‌లాండు ప్రాచీన రాజధాని అయోధ్య కావడం ఒక విశేషం. క్రంగ్ దెవ మహానగర వవర ద్వారవతీ శ్రీ ఆయుధా - అన్నది దీని పూర్తి పేరు. ఆ తరువాతి కథ మామూలే. అవాల్మీకాంశాలు లేకపోలేదు.

ఇటీవల ప్రసిద్ధ సంస్కృత విద్వాంసులు సత్యవ్రత శాస్త్రిగారు సంస్కృ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తంలో 'రామకీర్తి మహాకావ్య' సంతరించారు. పేరుకు తగ్గట్టు ఇది మహాకావ్యమే. సంస్కృత రచనకు తమ ఆంగ్లానువాదాన్ని కూడా శాస్త్రిగారు సమకూర్చారు. తాయ్‌దేశంలోని ప్రసిద్ధ రామకథాకావ్యాన్ని సంస్కృతంలో రచించిన శాస్త్రిగారి కృషి ప్రశంసార్హం.

హనుమంతుడు స్వాహా కుమారుడనీ, వాలి సుగ్రీవుల మేనల్లుడనీ చెప్పబడింది. ఈశ్వరుని కోరిక మేరకు, వాయువు స్వాహా వల్ల హనుమంతుణ్ణి పొందాడు. అతనికి అన్ని దివ్యాయుధాలూ ప్రసాదించాడు. జాంబవంతుడు వానరుడు; భల్లూకం కాదు. పైగా అతడు వైద్యశాస్త్ర నిష్ణాతుడు.

శబరిని సౌవరిగా వ్యవహరిస్తారు. ఆమె ఒక అప్సరస స్త్రీ. శాప వశాన ఆమె దావానల పరివృతమైన ఒక గుహలో నివసించసాగింది. ఆ కార్చిచ్చుని రాముడు ఆర్పివేయడమే కాక ఆమెకు పూర్వాకృతిని కూడా కలుగజేస్తాడు. ఆతరువాత రాముడు అగస్త్యాశ్రమాన్ని దర్శిస్తాడు. రావణ మరణానంతరం, విభీషణుడు మండోదరిని భార్యగా స్వీకరించినట్లు చెప్పడం తాయ్ రామకథలో కనిపించే ప్రముఖ అవాల్మీకాంశం. ఉత్తర కాండ కథ కూడా చెప్పబడింది. శూర్పణఖ కుమార్తె అయిన ఆదుల్ ప్రోద్బలం కొద్దీ సీత రావణుని చిత్ర రచన చెయ్యడం, ఆ ఉదంతం సీతాపరిత్యాగానికి దారి తియ్యడం చెప్పబడ్డాయి. సీతను అడవులకు తీసుకువెళ్లమని రాముడు లక్ష్మణుణ్ణి ఆదేశించడమేకాక, ఆమెను అక్కడే వధించమనీ ఆదేశిస్తాడు. కాని రామానుజుడు అలా చెయ్యక, సీతను అడవిలో దింపివేసి తాను సీతను వధించినట్లు నచ్చచెప్పడానికి చచ్చిన ఒకలేడి గుండెను అన్నగారికి చూపిస్తాడు.

తోలుబొమ్మల ప్రదర్శనల్లో, వర్ణచిత్రాలలో రామకథ స్థానం సంపాదించింది. రాయల్ టెంపుల్ అని పిలువబడే బుద్ధుని ఆలయంలో వివిధ వర్ణాలలో బంగారపు పాడి పొదిగిన చిత్రాలలో రామకథ రమణీయంగా చిత్రించబడింది. రామాయణ శిల్పాలు కూడా కొన్ని లేకపోలేదు. కాని జావాలోనో, కంబోడియా లోనో ఉన్న శిల్పాలకు లభించినంత ప్రసిద్ధి వీటికి లభించలేదు. దుష్టశక్తి మీద మానవ విజయం తథ్యం అనే నీతి తాయ్ రామకథను చదివిన తర్వాత పఠితకు కలుగుతుంది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కంబోడియా:

ఆగ్నేయాసియా దేశాలలోని రామకథలలో సర్వసాధారణంగా అవాల్మీకాంశాలు కొల్లలుగా కనిపిస్తాయి. వాటి ఆధారాలు ద్వితీయ శ్రేణికి చెందినవి. కాని కంబోడియాలోని సంస్కృత శాసనాలు, వాల్మీకాన్ని పురస్కరించుకొని పరిశీలిస్తే, చాలా విలువైనవని విద్వాంసులు భావిస్తున్నారు. శాసన కవులు సంస్కృత పండితులనీ వారు రామాయణ భారతాలలో నిష్ణాతులనీ వారి అభిప్రాయం. రామాయణ భారతాల పట్ల కంబోడియా వారికి ఆదరాభిమానాలు పుష్కలంగా ఉన్నట్లు వ్యక్త మవుతుంది. వాల్మీకి రామాయణాన్ని ఆలయాలలో భక్తి శ్రద్ధలతో చదువుతారు.

వాల్మీకం పట్ల ఎనలేని ఆదరభావం ఉన్నా, కంబోడియా రామకథలోనూ కొన్ని కొత్త విషయాలు ప్రవేశించాయి. వాల్మీకంతోపాటు ఇతర భారతీయ భాషలలోని రామకథల్ని కూడా ఆ రచయితలు, కళాకారులు సంప్రతించి వుండవచ్చు. మొత్తం మీద కంబోడియన్ రామకథ, పెక్కు ఉదంతాలు చేరి బాగా పెరిగిపోయింది. పూర్వం వాటిని ప్రదర్శించేందుకు కొన్ని రాత్రులు పట్టేవి. కాని ప్రస్తుతం ఒకే ఒక ఉదంతాన్ని మాత్రం నాట్య ప్రదర్శనకు ఎన్నుకుంటున్నారు. సీతాపహరణం, రాముడు అరణ్యవాసానికి బయలుదేరడం, సీతా హనుమంతుల సమాగమం, రామరావణ యుద్ధంలోంచి కొన్ని దృశ్యాలు మొదలైనవి తరుచుగా ప్రదర్శితము లవుతున్నవి. రంగస్థలం మీదనేకాక, సీతాపహరణ వృత్తాంతం తోలుబొమ్మల ప్రదర్శనం, వర్ణచిత్రరచన, శిల్పం మొదలైన వాటిలోనూ బహుధా ప్రయుక్త మయింది.

కంబోడియా రామకథ ప్రకారం సీత జనకుని పెంపుడు కూతురు; రావణుడు సీతా స్వయంవరంలో పాల్గొనడు; కైకేయి పట్టుదల వల్ల రాముడు అరణ్యవాసానికి బయలుదేరుతాడు; రామునిచే పరిత్యక్త అయిన సీత వాల్మీకి ఆశ్రమంలో నివసిస్తుంది.

పెక్కు ఆగ్నేయాసియా రామకథలలో కనిపించేలా కంబోడియా కథలో కూడా సీత రావణుని చిత్రం వ్రాసే ఉదంతం కనిపిస్తుంది. ఒక యక్షిణి కోరికను మన్నించి ఆమె చిత్ర రచన చేసినట్లు చెప్పబడింది. కంబోడియాలోని రామకథా శిల్పాలు బహు సుందర మైనవని అభిజ్ఞులు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చెపుతారు. అవి చాలా ఆలయాలలో కనిపిస్తాయి. ఈ శిల్పాలు శిలలోనే కాక దారువులో కూడా మలచబడ్డాయి. మొనమొన్నటి దాకా వస్త్రాలమీద రామకథా చిత్రాలు చిత్రించబడేవి.

ఈ చిత్రాలకు కంబోడియన్ రామాయణమైన రామకెర్తి (కీర్తి) ముఖ్యాధార మనవచ్చు. క్షీరసాగర మథన చిత్రంలో వాలి కూడా ఉండడాన్ని పురస్కరించుకుని తమిళ కంబరామాయణాన్ని కూడా చిత్ర కారుడు సంప్రతించి వుండవచ్చునని భావించబడుతున్నది. ఈ అంశం కంబరామాయణంలో కనిపిస్తుంది.

లావోస్:

కంబోడియాకి ఉత్తరాన ఉన్నది లావోస్. లావోస్ రామాయణం కంబోడియా, తాయ్ రామాయణాలకు భిన్న మయింది. ఈ రామాయ ణంలో స్థానికీకరణం ప్రముఖంగా కనిపిస్తుంది. దత(శ)రథుడు లావోసుని పరిపాలించాడు. ఆయన రాజధాని చందపురి సిసత్తనగ మహానగరం. రావణు డేమో ఇంద్రపత్త నగరాన్ని పరిపాలించాడు. దశరథుని ప్రార్థన మేరకు ఇంద్రుడు దేవపుత్ర ప్రలాంని, అనగా, రాముణ్ణి పంపుతాడు.

సీతాన్వేషణకు బయలుదేరిన రాముడు ప్రారబ్ధవశాన మూడేళ్లపాటు వానరుడై సంచరిస్తాడు. ఆ వర్షత్రయంలో అతనికి హనుమాన్ అనే కొడుకు కలుగుతాడు.

రామకథ లావోస్‌లోని రామజాతకంలో, ప్రాచీన గాథా సంకలనాలలో కూడా కానవస్తున్నదని అభిజ్ఞులు పేర్కొన్నారు. వీటిలో చిత్ర విచిత్ర విషయాలు చోటు చేసుకున్నాయి. దశరథుని కుమార్తె శాంతను రావణుడు వివాహం చేసుకున్నాడట. యుద్ధానంతరం, హనుమంతుడు మానవరూపం ధరిస్తాడు; అయోధ్యలో రాముడితోపాటు సహ పరిపాల కుడవుతాడు. తర్వాత విరక్త మనస్కుడై అడవులకు వెళ్లిపోతాడు. సీత అడవులకు వెళ్లడానికి హేతువు, ఆమె రచించిన రావణుని చిత్రమే కారణంగా చెప్పబడింది. ఉత్తర లావోస్‌లోని ఒక రామకథ ప్రకారం, సీత రావణుని వనంలో ఒక చెట్టుకి పుడుతుంది. ఆమె జనకుని పెంపుడు కుమార్తెగా పెరుగుతుంది. ఒక కథ ప్రకారం సీత దశరథుని కుమార్తె.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చైనా:

చైనీసు భాషలో రామాయణ మంటూ ప్రత్యేక రచన వెలువడలేదు. అసలు రామకథ ప్రభావం చైనాలో ఉన్నట్లుగా కూడా తెలియడం లేదు. బౌద్ధ భిక్షువులు రామకథను చైనా వారికి పరిచయం చేశారు. చైనాలో బౌద్ధం క్రీ.శ. 1 నుండి 4 వ శతాబ్ది దాకా వర్ధిల్లింది. రెండు జాతక కథలలో రామకథా ప్రసక్తి కనిపిస్తుంది.

'నిదాన ఆఫ్ టెన్ లక్షరీస్' అనే రచనను పరిశీలిద్దాం. ఇందులో సీత ప్రసక్తి అసలు లేదు. సీత కథ లేని రామాయణం ఎలా ఉంటుందో మనం ఊహించుకోవచ్చు. 'టెన్‌లక్షరీస్' అనగా దశరథుడని అర్థం. ఆయన 'యెంబుద్వై యెన్ పుటికి' (జంబూద్వీపానికి) రాజు. ఆ రాజుకి నలుగురు భార్యలు. లొమొ (రాముడు), లామన్ (లక్ష్మణుడు), బరద (భరతుడు) కుమారులు. భరతుడు దశరథుని మూడవ కుమారుడుగా చెప్పబడడం గమనించదగింది. ఆ తర్వాతి కథ మామూలే. అక్కడక్కడా వాల్మీకిని సన్నిహితంగా అనుసరించినట్లు చెబుతారు.

ధశరథునికి మూడవ భార్యమీద ఎక్కడలేని అభిమానం. ఆమెకు ఒక వరం కూడా ఇచ్చాడు. ఆమె తన కుమారుడు భరతుడు రాజు కావాలని అభిలషించింది. తత్ఫలితంగా రాముడికి పన్నెండేళ్లు అరణ్యవాసం ప్రాప్తించింది. లక్ష్మణు డప్పుడు ఉగ్రు డయ్యాడు. తండ్రి ఆజ్ఞను ధిక్కరించమన్నాడు. కాని. రాముడు అలా చెయ్యలేదు. చివరికి రామలక్ష్మణు లిద్దరూ అరణ్యాలకు వెళ్లారు. భరతుడు రాముని చర్మ పాదుకలు తీసుకుని వాటిని సింహాసనం మీద ఉంచి, రాజ్యం చేస్తాడు. అంతేకాదు; భరతుడు రాముడికి. ఉత్తరాలూ, సందేశాలూ పంపుతాడు, రాజ్యాధికారం స్వీకరించమని. కాని రాముడు అందుకు సమ్మతించడు. పాదుకాపట్టాభిషేకానికి తర్వాత కథ లేదనే పేర్కొనాలి. సీత పాత్ర లేకపోవడంతో ప్రదానకథ లేకపోయింది. ఉన్నంతవరకూ, ఈ నిదాన కథ వాల్మీకాన్ని అనుసరించింది. కొన్ని చోట్ల వాల్మీకంలోని సూక్ష్మ విషయాలను కూడా గ్రహించింది. భ్రాతృప్రేమ, పితృవాక్యపరిపాలన అనే యీ రెండు విషయాలు ప్రముఖంగా సూచించబడ్డాయి. కథలో విచిత్ర విషయాలు గాని బౌద్ధమత సిద్ధాంతాల ప్రసక్తిగాని లేకపోవడం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గమనించదగింది.

ఇక ఈ పరిశీలన వల్ల వ్యక్త మయ్యే ముఖ్య విషయాలను గుర్తు చేసుకుందాము.

ఉపసంహారం:

1. పాత్రల పేర్లలో సన్నివేశాలలో కథాగత విషయాలలో మార్పులు కొన్ని ఆగ్నేయాసియా రామకథలో కానవస్తున్న మాట వాస్తవమే. కథకు ప్రచుర ప్రచారం లభించినప్పుడు, ద్వితీయ శ్రేణి (పరోక్ష) ఆధారాలను సంప్రదించినప్పుడు ఇలా మార్పులు ఏర్పడడంలో వింత లేదు. టిబెట్టులో సీతారాములు లీలావతి రమణలుగా మార్పు చెందినా, బర్మా కథలో రావణుడు విదూషకుడుగా కానవచ్చినా, మరొక రామాయణంలో విభీషణుడు జ్యోతిష్కుడుగా కనిపించినా, హనుమంతుడు రామచంద్రుని సుతుడని పేర్కొనబడినా - ఆగ్నేయాసియాలో రామకథకు బహుళ ప్రచారం కలదనడం నిర్వివాదాంశం. రామకథ పట్ల ఎంత ఆదర భావం ఉన్నదో, తత్కర్త పట్ల కూడా అంత ఆదరభావం వారికి ఉన్నది. వారు వాల్మీకాన్ని భక్తి శ్రద్ధలతో పఠించడం గమనించదగిన అంశం.

2. ప్రధాన కథకు సంబంధించినంతవరకు, మార్పులు ఎక్కువగా లేవని చెప్పవచ్చు. అవాంతర కథలలో అవి ఎక్కువగా చోటు చేసుకున్నాయి. అయినా కథా గౌరవానికి భంగం వాటిల్లని విధంగా ఆ మార్పులు చేయబడ్డాయి. రాముడు భగవదవతారమనీ, రావణ సంహారమే రామావతారానికి గల ముఖ్య లక్ష్యమనీ, రాముడికి సహాయం చెయ్యడంకోసం వానరులు జన్మించారనీ, ఆగ్నేయాసియావారు గ్రహించారు. రామకథలోని ప్రధాన విషయ మిది.

3. మార్పులు కొల్లలుగా కనిపిస్తున్నప్పటికీ, వాటిలో చాలావాటికి వాల్మీకం మాతృకగా ఉన్నట్లు విద్వాంసులు భావిస్తున్నారు. పుష్పక విమానం మృతుల భార్యలను ఎక్కించుకోదని తాయ్ రామకథలో చెప్పబడింది. వాల్మీకంలో కూడా ఈ విషయాన్ని త్రిజట సీతకు తెలియజేస్తుంది. ఇండోనేషియా రామకథలో హనుమంతుడు లంకలోని ఒక ఆలయాన్ని దర్శించినట్లు పేర్కొనబడింది. చైత్రగృహాలు కూడా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హనుమంతుడు చూచి వచ్చినట్లు వాల్మీకి కృతి చెపుతున్నది. అవాల్మీక విషయాలు ఒక్క ఆగ్నేయాసియా రామకథలలో మాత్రమే కనిపిస్తున్నవని చెప్పడం భావ్యం కాదు. సంస్కృతంలో వెలసిన యితర రామాయణాలలో, రామనాటకాలలో, వివిధ భారతీయ రామాయణాలలోనూ అవాల్మీకాంశాలు చాలా ఉన్నవి. మందోదరిని జుట్టుపట్టి వానర వీరుడొకడు ఈడ్చిన వుదంతం పెక్కు రామకథలలో కానవస్తున్నది. ఈ అంశం ప్రస్తుతం లభ్యం కాని ఒక ప్రాచీన సంస్కృత నాటకంలో ఉన్నట్లు అభిజ్ఞులు పేర్కొన్నారు. ఈ విషయం రంగనాథ రామాయణంలో కూడా కనిపించడం గమనించదగింది.

రావణుడు పాతాళ హోమానికి ఉపక్రమిస్తాడు. నిష్ఠ చెదరకుండా హోమం చేస్తూ వుంటాడు. హోమ భంగం చెయ్యాలని కపివీరులు కృత నిశ్చయు లయ్యారు. అప్పుడు 'నిద్రించు కొండ చందమున' ఉన్న మందోదరిని అంగదుడు రావణుని వద్దకు ఈడ్చుకుని వస్తాడు. ఈ సందర్భంగా రంగనాథ రామాయణ కర్త చేసిన మందోదరీ వర్ణన రమణీయం. ఇంద్రజిత్తు మరణానికి విలపిస్తున్న మందోదరిని -

"వెరచి రాక్షసవధూవితతి శోకింప
చెరనున్న నిర్జర స్త్రీలుత్సహింప
నీరసంబున బట్టి యీడిచి తెచ్చె
వారక రాక్షసేశ్వరుని ముందరికి."

4. భారతీయుల పురాణాల ప్రభావం ఆగ్నేయాసియా రామకథల మీద ఉన్నట్లు చెప్పవచ్చు. ఒక ఉదాహరణ: రావణు డొకసారి నందిని చూసి పరిహసించాడనీ, అందువల్ల రావణునికి వానరుల చేతిలో మరణం కలుగుతుందని నంది శపించెననీ ఒక కథ ఉంది. మలేషియా రామాయణంలో కూడా ఇట్లాంటి కథ ఒకటి కనిపించడం పేర్కొనదగింది. రావణుడు కశ్యపుని ఆశ్రమం గుండా వెడుతున్నాడు. అప్పు డా ముని తపస్సమాధిలో ఉన్నాడు. ఆయన రావణుని రాకను గమనించలేదు. అప్పుడు రావణుడు, 'నీవు మానవుడివా లేక వానరుడివా?' అని కశ్యపుణ్ణి ప్రశ్నించాడు. అందు కాముని నీవు మానవుల, వానరుల చేతిలో మరణిస్తావని శపించాడు. సునిశితంగా పరిశీలిస్తే, విదేశాలలోని రామ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కథలోని కథలకు భారతీయ సాహిత్యంలో ఎక్కడో ఒకచోట ఆధారం లభ్యం కాగలదని చెప్పవచ్చు.

5. ఆగ్నేయాసియా రామకథలు సాధారణంగా రావణుని వంశవృక్ష వర్ణనతో ప్రారంభ మవుతాయి. చాలా కథలలో హనుమంతునికి ప్రాధాన్యం కల్పించబడింది. కనుకనే యుద్ధాలు ఆగ్నేయాసియా రామ కథలలో ప్రముఖంగా కనిపిస్తాయి. అలాగే, తపస్సు కూడా ప్రాధాన్యం వహించినట్లు కనిపిస్తుంది. అందరూ దీర్ఘ తపస్సు చేసినట్లు చెప్పబ డింది. ఉత్తర కాండ కథ కూడా ప్రచారంలో ఉన్నది.

6. స్థానికీకరణం ఒక ముఖ్యాంశంగా కనిపిస్తున్నది. అయోధ్య మొదలైన నగరాలు తమ దేశాలలో ఉన్నట్లు చెప్పకొని తృప్తి పడిన ఆగ్నేయాసియా వాసులు రామాదులు తమ మతానుయాయులే అని కూడా చెప్పకున్నారు. బహుభాషా నిలయమైన ఫిలిఫైన్సులో మరనాన్ భాషలోని రామాయణంలో గాబ్రియెల్ పరబ్రహ్మగా పేర్కొనబడ్డాడు. ఆదం, అల్లా, నబి ప్రభృతులు రామకథలో దర్శన మిస్తారు. రామరావ ణులు నబి ఆధిపత్యంలోని వారు. రాజవంశీయులు సుల్తాను లయ్యారు. హనుమంతుడు లక్ష్మణనామధేయు డయ్యాడు. హనుమంతుడు ఒక ముస్లిం ప్రభువు. రావణుడు ముస్లిం సన్యాసి అవుతాడు. అలాగే తాయ్ రామా యణంలో శైవానికి ప్రాధాన్య మివ్వడం జరిగింది. బహుశః ఇందుకు చోళుల ప్రాబల్యం కారణం కావచ్చు. శివుడు మహాశక్తి సంపన్ను డనీ, ఆయన కనుసన్నల్లో విష్ణ్వవతారమైన రాముడు మెలుగుతున్నాడనీ చెప్పబడింది. నారాయణుడు శివుడి కుడి భుజం.

బర్మా రామకథ ప్రకారం, ఆ దేశంలోని పాప పర్వతం సంజీవకరణి కోసం హనుమంతుడు వెళ్లిన ద్రోణాద్రి. ఈ విషయాదికం మనకు చిత్రంగా కనిపించవచ్చుగాని, రామాదుల్ని వారు తమ ఆత్మీయులుగా భావించుకున్నారనీ, అది వారికి రామాయణం పట్ల గల గౌరవభావాన్ని తెలుపుతున్నదనీ భావించడం సమంజసం. బర్మా రామాయణం రాముణ్ణి బోధిసత్త్వునిగా భావించింది: 16వ శతాబ్దివాడయిన ఒక బౌద్ధభిక్షువు బర్మాలో సీత, హనుమంతుడు మొదలైన వారి కథలను పదిమందిలో చదవరాదని పేర్కొన్నాడు. అనగా బర్మాలో రామకథకు ఎంతో ప్రచారం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉన్నదన్న అంశం యందువల్ల విదిత మవుతున్నది.

ఆగ్నేయాసియా రామకథలలో జ్యోతిశ్శాస్త్రానికి ప్రాధాన్యం కనిపిస్తున్నది. అన్ని రామకథలలోనూ విభీషణుడు జ్యోతిష్కుడుగా అభివర్ణితుడయ్యాడు. కొన్ని రామకథలలో జాంబవంతుడు, చివరికి లక్ష్మణుడు కూడా జ్యోతిష్కుడుగా వర్ణించ బడ్డారు.

ఆగ్నేయాసియా వాసులు రామకథను జానపదగాథగా, దేవతల కథగా సంభావిస్తున్నారని అభిజ్ఞుల అభిప్రాయం. అనగా అంత ప్రీతిపాత్రమైన కథగా ప్రచారంలో ఉన్నదన్నమాట! వారికి అంత సుపరిచితమైన కథ కూడా అది!

జావా వారిని రామాయణం ఎంతగా అలరించిందో గ్రహించడానికి ఒక ఇండొనేషియా పండితుని యీ మాటలను పరికించవచ్చు. 'నా జీవితకాలంలో భాష, అలంకారాలు మొదలైన వాటిని పురస్కరించుకుని చూడగా రామాయణంలా అంత సుందరమైన జావానీస్ కృతి నేను చదవలేదు.'

మలేషియా పండితుడు అమీన్ స్వీనీ యిలా పేర్కొన్నారు.

'కొన్ని శతాబ్దులుగా రామాయణం ఆగ్నేయాసియా వాసుల్ని ఆకట్టుకుంది. కంబోడియా నుంచి బాలి దాకా అది సంగీతనాటకంగా ప్రదర్శించబడుతున్నది; రామాయణం వ్రాయబడుతున్నది; చదవబడుతున్నది, శిల్పాలలో చోటు చేసుకున్నది.'

'రామాయణం ప్రవేశించిన ఆగ్నేయాసియా దేశాలన్నిటా, ఆయాదేశాల సాంస్కృతిక సాహిత్య వారసత్వాన్ని అది సుసంపన్నం చెయ్యడమే కాక, ప్రజలలో నైతిక, ధార్మిక విలువలను నెలకొల్పగలిగింది. ఆ ఇతిహాసం ఆసియా దేశాల సంస్కృతుల్ని ప్రభావితం చేసే సందర్భంగా అందులోని ఉదంతాలు, పాత్రలు చివరికి కొన్ని భావాలు విభిన్న దేశాల మీద వివిధ రీతుల్లో ముద్రలు వేశాయి. తమ సాంఘిక పరిస్థితులకు అనుగుణంగా ప్రతిదేశమూ ఆయా కథావిశేషాలను మలచుకున్నాయి' అని శ్రీలంక విద్వాంసుడు ఒకాయన భావించారు.

బర్మాకి చెందిన ఉతియుహాన్ తమ అభిప్రాయం ఇలా వెలిబుచ్చారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'రామాయణంలోని సాహిత్య భాండారమే కాదు, మానవుల మధ్యగల సంబంధాలను - అనగా తల్లిదండ్రులు, సంతానం, భార్యాభర్తలు, సోదరీసోదరులు, పాలకులు- పాలితులు, గురుశిష్యులు, బంధుమిత్రులు - వీరిమధ్యగల సంబంధాన్ని ప్రభావితం చేస్తున్నది.'

ఇలా ఆగ్నేయాసియా దేశాలలో పండితుల్నీ పామరుల్నీ సరిసమానంగా అలరించిన అద్భుత కథ రామాయణం. సాహిత్యపరంగా, సాంస్కృతికంగా భారతీయులు సాధించిన విజయానికి రామాయణం ఒక వైజయంతి!

రామాయణం ఒక్క భారతదేశానికి చెందిన గ్రంథం కాదు. అది సర్వదేశాల వారి గ్రంథం!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

22

అవీ - ఇవీ

1

తెలుగు తేనెతో రామభక్తిని రంగరించిన గాయకబ్రహ్మ

తెలుగుతేనెతో రామభక్తిని రంగరించి, అనిర్వచనీయమైన ఆనంద మనే దివ్యౌషధాన్ని అందరికీ పంచిపెట్టిన ఉదార హృదయుడు శ్రీ త్యాగరాజ స్వామి. ఆయన కృతుల్లో నిక్షిప్తమైన అమృతాన్ని ఆస్వాదించేం దుకు తెలుగు తెలిసినవారూ తెలియని వారూ ప్రయత్నిస్తూ ఉండడం పేర్కొన దగిన అంశం. రవి కవీంద్రుల రచనల్ని చదివి ఆనందించేం దుకు బెంగాలీ నేర్చుకునే సాహిత్య ప్రియులవలె, త్యాగరాజు కృతులలోని మాధుర్యాన్ని పరిపూర్ణంగా జీర్ణించుకునేందుకు తెలుగు నేర్చిన సంగీత ప్రియులూ చాలా మంది ఉన్నారు. ఆ మాధుర్యాన్ని జీర్ణించుకుని సుందరమైన భాష అని తెలుగుని కీర్తించిన వారూ ఉన్నారు. ఇలా తెలుగు భాష పట్ల ఎంద రెందరికో ఆదరమూ అభిమానమూ కలగజే సిన కారణజన్ముడు త్యాగరాజస్వామి. ఆ పుణ్య పురుషుణ్ణి సభక్తికంగా సంస్మరించడం మన ధర్మం.

త్యాగయ్యగారి వ్యక్తిత్వానికి నిర్మలమైన భక్తీ, నిసర్గ సుందరమైన కవితా రెండు కళ్లు. ఆయన ఎంత గొప్ప భక్తుడో అంత గొప్ప కవి. ఆ భక్తీ తెచ్చి పెట్టుకున్నది కాదు. ఆ కవితా ప్రయత్నపూర్వకంగా సాధించిందీ కాదు. ఈ రెండూ ఆయనకి ఉగ్గుతో అలవడిన విద్య లనడం సత్యసన్నిహితం. అందుకనే ఆయన కృతులు చదువుతున్నప్పుడు గాని వింటున్నప్పుడు గాని సరి సమానమైన ఆనందం కలుగుతుంది.

సాధారణంగా భక్తకవుల రచనలు తాత్త్విక దృష్టి కలవారినే ఎక్కు వగా అలరిస్తాయి. అవి భగవంతుడి కళ్యాణ గుణగణాలను కీర్తించేవిగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉండవచ్చు. లేదా ఏదో ఒక తత్త్వాన్ని తెలియజేసేవిగా ఉండవచ్చు. మధురభక్తి వాటిలో అంతర్వాహినియై ఉండవచ్చు. ఈ గుణాలన్నీ త్యాగయ్యగారి కృతుల్లో మనకు కనిపిస్తాయి. కాని వీటికంటె ప్రముఖంగా కనిపించే ఒక గుణం ఉంది వాటిల్లో. జీవుని ఆవేదన అడుగడుగునా కనిపిస్తుంది. తన వ్యధలూ, తన బాధలూ ఆయన తన యిష్ట దైవానికి విన్నవించుకున్నా, అవి ఐహిక జీవితంలో కొట్టుమిట్టాడే ప్రతి వ్యక్తికీ సంబంధించినవిగా కనిపిస్తాయి. వాటిలో మన జీవిత విశేషాలను చూడ గలుగుతున్నాం కనుకనే, అవి మనల్ని ఎంతగానో వశం చేసుకుంటున్నాయి. ఈ విశిష్ట గుణం ఉన్నప్పుడే, ఒక రచనకు సార్వకాలీనత లభిస్తుంది.

ఈ క్రింది కృతిలో త్యాగరాజు తన దయనీయ పరిస్థితిని ఎలా వర్ణించాడో పరికించండి.

'ఎటుల బ్రోతువో తెలియ - ఏకాంత రామయ్య
కటకట! నాచరితము కర్ణకఠోర మయ్య
పట్టిగొడ్డు రీతి భక్షించి తిరిగితి
పుట్టులోభులను పొట్టకై పొగడితి
దుష్టులతో గూడి దుష్కృత్యము సల్పి
రట్టు జేసిన త్యాగరాజుని దయతో ||ఎటుల||'

నా జీవిత కథ కర్ణకఠోరం; ఎందుకంటావేమో, పట్టిగొడ్డు రీతి, అనగా బసివిఎద్దు మాదిరిగా, తిని తిరిగాను, ఏ లక్ష్యమూ లేకుండా. పుట్టులోభుల్ని పొట్టకై పొగడాను. ఇవి మామూలు మనుషులు సర్వసాధారణంగా చేసే పనులు. ఇలా కనక చేస్తే గొడ్డుకీ, మనిషికీ భేదం యేముంటుంది? మానవ జీవితానికి మంచి లక్ష్యం తప్పని సరిగా ఉండాలి. లక్ష్యరహిత జీవితం నిరర్థకం. అది వాసన లేని ప్రసూనం!

పొట్టకోసం లోభుల్ని పొగడడం, పనీపాటు లేకుండా సోమరిపోతుగా తిరగడం మొదలైన వంటే త్యాగయ్యకు తగని అసహ్యం. ఈ భావాల్ని ఆయన తన కృతుల్లో పదే పదే తెలియజేశాడు.

'దార తనయ వర్గాదుల పాలనము సేయుట కొరకు ధనములు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కలిగిన మనుజుల బొగడి యార్జించిన పైకము....., మమత బంధన యుత నరస్తుతి సుఖమా.....' ఇలా ఆ గాయక బ్రహ్మ తన ఆవేదనను స్పష్టం చేశాడు.

త్యాగరాజు కృతుల్ని చదివీ ఆనందించవచ్చు. పాడుకునీ ఆనందించవచ్చు. గానకళా రహస్యాలే కాక ఆ కృతుల్లో మనస్సుని స్పందింప జేసే మధురములూ ఆలోచనాత్మకములూ అయిన భావాలూ వాటిలో ఉన్నాయి. కనుకనే ఆ వాగ్గేయకారుని కృతులు అన్ని కాలాలకూ పనికి వచ్చే శ్రుతులు!

2

త్యాగరాజు పారాయణ గ్రంథం.

తెలుగు భాషలోని తీరు తీయములను నలుగురికి తేటతెల్లం చేసిన ప్రముఖులలో పోతన, భద్రాచల రామదాసు, త్యాగయ్య ప్రభృతులు పేర్కొనదగినవారు. వారి ధర్మమా అని ఆంధ్రేతర ప్రాంతాలలో సైతం నేటికీ తెలుగుభాషా సాహిత్యాలంటే ఆదరాభిమానాలు నిలిచివున్నాయి.

కర్ణాటక సంగీతానికి త్యాగయ్య నామాంతరంగా ప్రతిభాసిస్తూ ఉన్నాడనడం సత్యసన్నిహితం. ఆయన కృతుల్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలన్న ఉదారాశయంతో తెలుగు నేర్చుకున్నవారు తెలుగు కానివారిలో ఉన్నారు. ఆయన కృతుల ప్రభావం అలాంటిది!

అటువంటి త్యాగయ్యకి పోతన భాగవతం పారాయణ గ్రంథం! ఒక రామభక్తుడికి మరొక రామభక్తుడి కృతి పారాయణ గ్రంథం కావడం ఆశ్చర్యం కాదు కాని అద్భుత మనవచ్చు. త్యాగరాజ స్వామి సామాన్యుడు కనుకనా! రామభక్తి సామ్రాజ్యాన్ని ఏలిన సంగీత బ్రహ్మ! అంత ప్రముఖుడూ భక్తి రసంతో రంగరించబడిన పోతన కవితామృతాన్ని తనివి తీర ఆస్వాదించాడు. ఆ సహజ పాండిత్యుని అనుసరించిన పట్టులు కొన్ని త్యాగయ్య కృతుల్లో కానవస్తాయి.

పోతన భాగవతపు ప్రతిని త్యాగయ్యకి సభక్తికంగా బహూకరించిన విశిష్ట గౌరవం వేంకటరమణ భాగవతులకి (భాగవతారు) చెందుతుంది.

11

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

త్యాగయ్య ప్రథమ శిష్యుడే భాగవతులు (1781 - 1874). గురువు వలె, శిష్యుడు కూడా ఎన్నో కృతులు వెలయించాడు. అవన్నీ తెలుగు లోనూ సంస్కృతంలోనూ ఉన్నాయి. అయితే సుమారు అరవై కృతులు మాత్రమే ప్రచురించబడ్డాయి. ఆయన ఒక కీర్తనలో గురు ప్రశంస చేశాడు.

పల్లవి
గురువరు మహిమల నేమని భువిలో కొనియాడుదురా
అనుపల్లవి
తిరువైయారను పురమున వెలసిన
హరిభక్తాగ్రేసరులగు త్యాగరాజ గురు ||

తంజావూరు జిల్లాకి చెందిన వేంకటరమణ భాగవతారు సౌరాష్ట్రుడు. ఆయన్ని వాలాజాపేట వేంకటరమణ భాగవతారని కూడా వ్యవహరి స్తారు. తరువాతి కాలంలో ఉత్తర ఆర్కాడు జిల్లాలోని వాలాజాపేట ఆయన నివాసస్థల మయింది. అందువల్ల. వాలాజాపేట భాగవతారనే పేరు వచ్చింది ఆయనకి. సుమారు 30 యేళ్లపాటు గురుకులవాసం చేసి, గురువుగారు కృతులు పాడుతుంటే వాటిని తాళపత్రాల మీద వ్రాసి, భావి తరాలవారికి త్యాగరాజు కృతుల్ని అందించి మహోప కారం చేసిన మహనీయుడు వేంకటరమణ భాగవతారు. త్యాగయ్య యింకా రెండు నెలలకు సమాధి చెందుతాడనగా ఆయన తన ప్రియ శిష్యుడైన భాగవతారుకి తన కృతులు వ్రాయబడిన తాళదళ గ్రంథాలు, పాదుకలు, తంబుర, పూజాపాత్రలు, పూజించే కోదండరామస్వామి వారి విగ్రహం, పోతన భాగవతపు ప్రతి, సురా (ధా)ర్ణవం, తాళార్ణవం మొదలైన వాటిని ప్రీతిపూర్వకంగా బహూకరించినట్లు తెలియవస్తున్నది. వాటిని ఆయన సంతతివారు కంటికి రెప్పలా భద్రపరచసాగారు. మధు రలోని సౌరాష్ట్ర సభవారు ఆ అమూల్య గ్రంథాలు మొదలైన వాటిని భద్రపరచాలని అభిలషించారు. అందుకుగాను కృషి చేశారు. తత్ఫలితంగా 1943లో భాగవతారు మనుమరాలయిన శ్రీమతి అలమేలు అమ్మాళ్ త్యాగరాజు పాదుకలు, భాగవతారు పాదుకలు, వా రుపయోగించిన తంబు రలు, వారి కృతులు గల తాళపత్ర గ్రంథాలు, త్యాగరాజు పారాయణం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చేసిన పోతన భాగవతపు ప్రతి మొదలైన వాటిని సౌరాష్ట్ర సభకు బహూకరించారు. తదాదిగా అవన్నీ సభవారి అధీనంలోనే ఉన్నాయి. వాటిని సభవారు ఎంతో జాగ్రత్తగా పరిరక్షిస్తున్నారు. త్యాగరాజు, భాగవతారుల చిత్ర పటాలకు పూజాదికం కూడా నిర్వహించబడుతు న్నది. పోతన భాగవతపు ప్రతిపట్ల సభా నిర్వాహకులు ప్రదర్శిస్తున్న భక్తి శ్రద్ధలు ఎవరినైనా ముగ్ధుల్ని చేస్తాయి.

ఇక సౌరాష్ట్ర సభలోని పోతన భాగవతపు ప్రతిని గురించి రెండు మాటలు: ఇది కాగితపు ప్రతి. ముద్దులు మూట గట్టే వ్రాత. కాని అసమగ్రం. నవమస్కంధం నుంచి కానవస్తున్న ఈ గ్రంథంలో 220 పుటలు ఉన్నాయి. ఇతఃపూర్వం పేర్కొనబడినట్లు, ఈ ప్రతిని వేంక టరమణ భాగవతులు తయారు చేశారు. కాని తమిళంలో వ్రాయబడిన భాగవతుల సంగ్రహ చరిత్రలో ఒకచోట ఇలా చెప్పబడింది. '(త్యాగ రాజు) స్వామివారును (వేంకట రమణ) భాగవతారును కలిసి వ్రాసిన వ్రాత ప్రతి ఇది.' గ్రంథంలో అక్కడక్కడ వ్రాత భేదం కనిపిస్తున్నప్ప టికీ, గ్రంథాంతంలో 'శ్రీ త్యాగరాజ గురు చరణారవిందాభ్యాన్నమః' అని ఉండడంవల్ల ఈ ప్రతిని వేంకట రమణ భాగవతులే తయారు చేసినట్లు చెప్పవచ్చు. కాని నేను చూసినంతవరకు ప్రతిలో ఎక్కడా కూడా భాగవతుల చేవ్రాలు కనిపించలేదు.

ఈ ప్రతిలోని దశమస్కంధం ఉత్తర భాగం ఈ కింది పద్యంతో ప్రారంభ మవుతుంది.

'శ్రీకర పరితోషిత ర'
త్నాకర కమనీయగుణగణాకర కారు
ణ్యాకర భీకర శరధా
రాకంపిత దానవేంద్ర రామ నరేంద్రా.'

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి భారతంలో 'పరిశోషిత' అని ప్రయుక్తం. పాఠాంతరం చూపబడలేదు.

అలాగే ఏకాదశ స్కంధంలోని తొలి పద్యాన్ని కూడా (మధురలోని ప్రతి ననుసరించి) యథాతథంగా ఉదాహరిస్తున్నాను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'శ్రీ సీతావల్లభ లం
కాసుర సంహార దేవతారాధిత వా
ణీసతి రమణార్చిత వృ
త్రాసుర మదహరణ వినుత రామనృపాలా.'

పాఠకుల పరిశీలనార్థం అకాడమి వారి భాగవతంలోని పద్యాన్ని కూడా ఉదాహరిస్తున్నాను.

'శ్రీ సీతాపతి లంకే
శాసురసంహార చతుర! శాశ్వత నుత
వాణీ సత్యధి భూభవ వృ
త్రాసుర రిపుదేవజాల రామనృపాలా!'

కాగా, మధుర సౌరాష్ట్ర సభలో భద్రపరచబడిన భాగవతపు ప్రతిని పర్యాప్తంగా పరిశీలించడం ఎంతైనా అవసరం.

భక్త - వాగ్గేయకారుడు త్యాగయ్య భక్తిపూర్వకంగా పారాయణం చేసిన పోతన భాగవతపు ప్రతి మన కందరికి ప్రాణపదమూ, పరమ పవిత్రమైనదీను. దీనిని పరిరక్షిస్తున్న సౌరాష్ట్ర సభవారు అభినందనీయులు!

3

త్యాగరాజు దృష్టిలో సౌఖ్య హేతువులు

రామభక్తి సామ్రాజ్యంలో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్న త్యాగరాజు జగమెరిగిన వాగ్గేయకారుడు. ఆ భక్త కవి రాముని మీద వెలయించినన్ని కీర్తనలు మరొకరు వెలయించలేదు. పరమ భక్తుడైనా, లోకంలో నెలకొన్న అవినీతిని చూసి ఆయన కంట తడి పెట్టాడు. మానవ స్వభావాన్ని క్షుణ్ణంగా పరిశీలించాడు. కనుకనే ఆనాటి సమాజ స్వరూప స్వభావాలను ఆయన కీర్తనల నుంచి మనం గ్రహించవచ్చు.

త్యాగరాజు తన కీర్తనలలో ఎన్నో విషయాలు ప్రస్తావించాడు. కొన్ని వేదాంతపరములైతే, మరికొన్ని నీతి ప్రధానాలు. మానవ స్వభావాన్ని బాగా పరిశీలించినవాడు కావడం వల్ల, మానవుడికి ఏవి సౌఖ్యహేతువులో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కూడా ఆయన చెప్పగలిగాడు.

కష్టసుఖాలు కావడి కుండ లని మన తరతరాల విశ్వాసం. ఇవి నిలు కడ లేనివి. అయినా కష్ట మనేసరికి ఒంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకినట్లుగా మనం భావిస్తాము. ఎంతటి ఎండ నైనా ఓర్చుకోగలము. కాని వానచినుకు పైన పడేసరికి సహనం నశిస్తుంది. కష్టం అలాం టిది. కష్ట మనే మాట వినేసరికి భయం, దుఃఖం ఆవహిస్తాయి. ప్రతి మానవుడూ సుఖాన్నే మనసారా కోరుకుంటాడు. ఇది అసహజం కాదు.

త్యాగరాజు కీర్తనలలో సామరాగంలోని 'శాంతము లేక సౌఖ్యము లేదు; సారసదళనయన' అనే పల్లవితోగల కీర్తన బహు ప్రసిద్ధ మయింది. శాంతము లేక సౌఖ్యము లేదు - అన్నది సామెతగా తెలుగు నాడులో ప్రచుర ప్రచారంలోకి వచ్చింది. తమిళులు కూడా దీన్ని సామెతగా వాడుతూ వుంటారు. అంత ప్రసిద్ధి కెక్కింది ఈ పల్లవి! శాంతం కనక లోపిస్తే దాంతునికైనా, వేదాంతునికైనా, ధనధాన్యాలు కలిగిన వానికైనా, జపతప సంపద కలిగినవానికైనా, ఆగమ శాస్త్రాలన్నీ చది విన వానికైనా, యాగాది కర్మలన్నీ చేసిన వానికైనా, భాగవతుడని పేరొందిన వానికైనా - సౌఖ్యం ఉండదని ఆ రామభక్తుడు స్పష్టంగా పేర్కొన్నాడు.

శాంతం ఒక విశిష్ట గుణం. కామ క్రోధాదులు లేని ఒక గొప్పగుణం శాంతం. కామ క్రోధాదులు మానవుని శత్రువులు. అవి నశించినప్పుడే శాంతం ఏర్పడుతుంది. సుమతీ శతకకర్త చెప్పిన ఈ కింది పద్యం మన కందరికీ తెలిసిందే.

'తన కోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష; దయ చుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము
తన దుఃఖమె నరక మండ్రు తథ్యము సుమతీ.'

శాంతం మనిషిని కాపాడుతుందని సుమతీ శతక కర్త చెపితే, త్యాగ రాజు శాంతం లేకుంటే సౌఖ్యమే లేదని ఖచ్చితంగా పేర్కొన్నాడు. ప్రతిమానవుడు దేనినైతే కావాలని మనసార కోరుకుంటాడో, ఆ సుఖం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒక్క శాంతం వల్లనే లభ్య మవుతుందనే పరమ సత్యాన్ని ఆయన వ్యక్తం చేశాడు. సౌఖ్యరహితమైన బ్రతుకు వాసన లేని పువ్వు, బుధ వర్గం లేని పురం.....

బాహ్యేంద్రియాలను నిగ్రహించగలిగిన దాంతుడికి గాని, తత్త్వ విచారం చేసే వేదాంతికి గాని, ధనదాన్యాది భౌతిక సంపద ఉన్నవానికి గాని జపతపాలు చేసేవానికి గాని, ఆగమ శాస్త్రాలు అభ్యసించిన వానికి గాని, యజ్ఞయాగాలు చేసినవానికి గాని సౌఖ్యం లభించదు, అతనిలో శాంతం కనక లేకుంటే. ఈ బాహ్యవస్తువుల్ని గాక అంతశ్శత్రువులైన కామక్రోధాదుల్ని జయించినప్పడే శాంతం ఏర్పడుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే తనను తాను జయించగలిగే వానిలోనే శాంతం నెలకొని ఉంటుంది. అలాంటివాడు సుఖం చెందగలుగుతాడు.

కల్యాణిలో సంతరించిన 'నిధి చాల సుఖమా' అనే ప్రసిద్ధ కీర్తనలో కూడా త్యాగరాజు సౌఖ్యహేతువుని పేర్కొన్నాడు.

ధనధాన్యాలు కనుక సమృద్ధిగా ఉంటే సుఖం తనంత తానే కలుగు తుందని మనం సర్వసాధారణంగా భావిస్తూ ఉంటాము. ధనమూల మిదం జగత్! ధనం సాధించలేనిది లేదనీ అనుకుంటాము. నిజమే, కాని ధన ధాన్యాదులు ఉన్నవారు కూడా కొందరు జీవితంలో సౌఖ్యం అనుభవించడం లేదని మనకు తెలుసు. కొందరు దధి నవనీత క్షీరా లలో సుఖ మున్నదని భావిస్తారు. మధుర పదార్థాలు ఆరగించడం వల్ల మనసుకి సంతోషం కలగవచ్చు గాని సుఖం కలుగుతుందా? మరి కొందరు నరస్తుతిలో సుఖ మున్నదని భావిస్తారు. ఆ స్తుతి వల్ల తాత్కాలిక ప్రయోజనం సిద్ధించవచ్చు.

ఈ విషయాదికాన్ని ఉదాహరించి, వీటివల్ల సుఖం కలగదని త్యాగరాజు స్పష్టంగా పేర్కొన్నాడు. రాముని సన్నిధి సేవవల్లనే సుఖం కలుగుతుందనే మన విశ్వాసాన్ని ఆయన ఉద్ఘాటించాడు. దాశరథి ధ్యానభజనాదుల వల్ల కలిగే సుఖం సంతోషం కన్న మిన్న అన్నాడు. మమత మొదలైన వాటిచేత బంధితుడైన మానవుణ్ణి స్తుతించినప్పటికంటె ద్వంద్వాతీతు డైన భగవంతుని నుతించడం వల్లనే సుఖం కలుగుతుందని ఆయన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తెలియజేశాడు.

సౌఖ్యాన్ని నిర్వచించడం కష్టంతో కూడుకున్న పని. కొందరు మానసిక సౌఖ్యానికి ప్రాధాన్య మిస్తే, మరికొందరు శారీరక సౌఖ్యానికి ప్రాధాన్య మిస్తారు. అన్నీ ఉన్నవారు కూడా కొందరు సుఖంగా బ్రతకలేకపోతున్నారు. కటిక నేలమీద, చేతిని దిండుగా చేసుకుని కొందరు కళ్లనిండా నిద్రపోతారు. పట్టుపరుపుల మీద పవ్వళించినా కొందరికి కునుకు కూడా పట్టదు.

ఈ పరిస్థితిలో త్యాగరాజు సౌఖ్యహేతువులుగా రెండు ప్రధాన విషయాలు పేర్కొన్నాడు. అంతశ్శత్రువులైన కామక్రోధాదుల్ని జయించి శాంతం అలవరచుకోవడం వల్ల సౌఖ్యం కలుగుతుందన్నాడు. ధనధాన్యాదుల వల్లగాని, మధుర పదార్ధ సేవనంవల్ల గాని సుఖం కలగదని పేర్కొన్నాడు. నిధి సమకూర్చలేని సౌఖ్యాన్ని రాముని సన్నిధి సేవ సమకూర్చగలదని ఆయన విశ్వాసం. త్యాగరాజు రామభక్తుడు. తనను వరించి వచ్చిన సిరిని త్రోసిరాజని సామాన్యుని జీవితాన్నే ఆయన ఎన్నుకున్నాడు. సామాన్యునిగానే జీవించాడు. కనుక ఈ అంశాన్ని ఆయన అనుభవపూర్వకంగా గ్రహించి ఉండవచ్చు. ఏది ఎలా ఉన్నా, త్యాగరాజు చెప్పినట్లు శాంతం కనుక లేకుంటే సౌఖ్యం లేదన్నది పరమసత్యం!

4

త్యాగయ్య వాడిన పదాలు, పదబంధాలు

తమిళనాడు నడిబొడ్డులో పుట్టి పెరిగినా, మాతృభాషాభిమానం మూర్తీభవించిన స్వభాషాభిమాని త్యాగరాజు. ఆంధ్రేతరులకు సైతం తెలుగుభాషలోని అందచందాలను, తీరుతీయాలను తెలియజేసిన మహనీయుడు ఆయన. తెలుగు సాహిత్యం గురించి ఇరుగుపొరుగు రాష్ట్రాల వారికే సరిగా తెలియని పరిస్థితిలో, తెలుగు భాషా మాధుర్యాన్ని తన దేశీయులే కాక విదేశీయులు కూడా గ్రహించడానికి ఆస్కారం కలిగించిన వాగ్గేయకారుడు ఆయన. ఎక్కడెక్కడి కర్ణాటక సంగీత ప్రియులకు త్యాగరాజు కీర్తనలు రసగుళికలు!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ దృష్టితో చూచినప్పుడు త్యాగరాజువలె తెలుగుభాషా వ్యాప్తికి తోడ్పడిన తెలుగువాడు మరొకడు లేడనడం సత్య సన్నిహితం. త్యాగరాజు కీర్తనలకు అలాంటి విశిష్టత లభించడం మనం ఎంతైనా గర్వించదగిన అంశం.

త్యాగరాజు మాతృభాషాభిమానం అనిర్వచనీయమైనా, ఆయన పాండిత్యం అనల్పమైనా ఆయన వాడిన పదాలు, పదబంధాలు తెలుగువారికి కొంచెం వింతగా కనిపించవచ్చు. ఒక భాషా ప్రాంతానికి సుదూరంగా నివసించే రచయితపై స్థానిక భాషా ప్రభావం ప్రత్యక్షంగానో పరోక్షంగానో పడక తప్పదు. అందులోను అన్యభాషా ప్రాంతంలో కొన్ని తరాలుగా నివసించేవారి విషయంలో ఈ ప్రభావం మరింత స్పష్టంగా గోచరిస్తుంది. ఇక ఆయన కీర్తనలలో కానవచ్చే కొన్ని మాటలను పరిశీలిద్దాము.

దక్షిణాంధ్రులు తమ దైనందిన వ్యవహారంలో ఇచ్చేను (ఇస్తాను), తెచ్చేను (తెస్తాను) అని తరచుగా అంటూ వుంటారు. ఇలాంటి ప్రయోగాలు త్యాగరాజ కీర్తనలలో చుబ్బన చూరలు.

ఒక కీర్తనలో ఆయన 'ఎవరు ఎరుగుదురు లేక ఎవరు తెలుసుకుంటారు' అనే అర్థంతో 'ఎవరు తెలియగ బొయ్యేరు నీ మహిమలు' అంటాడు. 'వివరము లేని పూజలు చేసేరు' అంటాడు మరో కీర్తనలో. ఇక్కడ వివరము అంటే అర్థంలేని లేక వ్యర్థమైనది అని అర్థం చెప్పుకోవాలి. తమిళుల వ్యవహారంలో ఈ వివరం అనే మాట తరచుగా వినవస్తుంది. 'ఆలు బిడ్డలను నమ్మేరు' (నమ్ముతారు) 'నీ పదములు నమ్మేరా' (నమ్ముతారా) అని ఇలా ఆయన చాలా చోట్ల వాడాడు.

"ఇంత తామస మైతే" అని ఒక కీర్తన ఆరంభ మవుతుంది. తామసం అనగానే తెలుగువారికి తమోగుణం గుర్తుకు రావచ్చు. కాని, ఈ దేశ్య శబ్దానికి ఆలస్యం అని అర్థం. ఈ అర్థమే ఇక్కడ ప్రయుక్తం. వాడుక తమిళంలో కూడా ఈ మాట ఈ అర్థంతోనే వాడబడుతోంది. కాగా, "ఇంత జాగు లేక ఆలస్యం చేస్తే ఏమి చేస్తానురా' ' అని త్యాగరాజస్వామి రాముడికి తన బాధను తెలియచేసుకున్నాడు.

"నమ్మక నే మోసబోదునటరా" - అనే కీర్తనలో "నెమ్మది లేని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జనన మరణమ్ముల" అని అంటాడు త్యాగరాజు. నెమ్మది అనగానే స్ఫురించే అర్థాలు నిండుమనస్సు లేక మెల్లని, మందకొడి అనేవి. కాని ఇక్కడ ఆ అర్థా లేవీ పొసగవు. ప్రశాంతత అని ఇక్కడ అర్థం చెప్ప కోవాలి. అనగా శాంతికి దూరమైన చావు పుట్టుకలు అని అర్థం. ఈ నాటికీ దక్షిణాంధ్రులు, తమిళులు మనస్సుకి 'నెమ్మది లేదు' (నిమ్మది - తమిళం) అని వ్యవహరిస్తారు.

'భజరే రఘువీరం' అనే కీర్తనలో త్యాగరాజు, 'తప్ప తంటలను మాని' అని అంటాడు . తప్ప తంటా, కష్టం, యిబ్బంది అనే మాటలు తెలుగువే. కాని తప్ప తంటా అనే పదబంధాన్ని తెలుగు వారు వాడరు. అయితే దక్షిణాంధ్రులు తప్పలు, చిక్కులు, కష్టాలు అనే అర్థంలో ఈ పదబంధాన్ని తరుచుగా ఉపయోగిస్తారు. చివరికి టమిల్ లెక్సికన్ (ప్రామాణికమైన తమిళ నిఘంటువు) ఈ పదబంధాన్ని గుర్తించి, తప్ప, చిక్కులు అనే అర్థాలు సూచించింది. అదే కీర్తనలో 'అన్నియు పని కొదిగేనా' అన్నాడు ఆభక్తకవి. అనగా, అన్నీ పనికివ చ్చేనా అని అర్థం. దక్షిణాంధ్రులు ఒదుగు అనే మాటను ఉపయోగం అనే అర్థంలో వాడతారు.

త్యాగరాజు వాడిన మరొక పదబంధం కన్నతావులు. 'నీవు నన్ను జూడవేళరా, కన్నతావులనే వేడజాలరా' అంటాడు. ఎక్కడపడితే అక్కడ అనీ ఈ కన్నతావులకు అర్థం. కండ యిడత్తిల్ అని తమిళుల వ్యవ హారం. తావు (చోటు) దేశ్య శబ్దం. అయినా, కన్న తావు అనడం తెలుగువారి వ్యవహారం కాదు. కాని కన్న తావుల్లో తినకూడదు అనడం దక్షిణాంధ్రులకు పరిపాటి.

"గతిలేని వారిని కడతేరిచే దైవమని" అంటాడు త్యాగయ్య ఇంకొక కీర్తనలో. కడతేర్చుకి మరణించు, నశించు, పోవు, నెరవేరు మొద లైన అర్థాలెన్నో ఉన్నా, ఇక్కడ దిక్కులేని వాడికి దేవుడే దిక్కు అనే భావాన్ని మనస్సులో ఉంచుకుని, కాపాడేవాడివి నువ్వే అన్నాడు ఆయన, రాముణ్ణి ఉద్దేశించి. కనుక కృతార్థుల్ని చేసే వాడివి నువ్వ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అని ఇక్కడ అర్థం చెప్పుకోవాలి. తమిళంలో కూడా కడైత్తేరు అనే మాటకు ఈడేరు, కాపాడబడు అని అర్థాలు.

యోచన, ఆలోచన సమానార్థకాలే అయినా తెలుగువారు ఆలోచన ఎక్కువగా వాడుతారు. కాని దక్షిణాంధ్రుల వ్యవహారంలో యోచనకే పెద్ద పీట లభించింది. త్యాగరాజు కూడా యోచన శబ్దాన్నే చాలా చోట్ల ఉపయోగించాడు.

"ఇంత యోచనైతే నే నేమి సేయుదురా" అంటాడు ఒకచోట. దర్బారు రాగంలో అందాలు దిద్దుకున్న 'యోచనా కమలలోచన నను బ్రోవ' అనే సుప్రసిద్ధ కీర్తన అందరికీ తెలిసిందే. అలాగే దక్షిణాంధ్రులు తరచుగా ఉపయోగించే దినము (రోజు), కద్దు (కలదు), దొర, మరుగు మొదలైన మాటలు ఎన్నో త్యాగరాజు కీర్తనలలో కనిపిస్తాయి.

ఇలా త్యాగరాజు తన రోజులలో వాడుకలో ఉన్న పదాలను పదబంధాలను సముచితంగా ఉపయోగించాడు. ఇవన్నీ దక్షిణాంధ్రుల వ్యవహారంలో నేటికీ నిలిచి ఉన్నాయి. వీటిని చక్కగా తెలుసుకుంటే ఆ మహనీయుని కీర్తనలలోని సారస్యాన్ని మరింతగా గ్రహించవచ్చు.

5

వాడేరా దైవము......

"పలికెడిది భాగవతమట, పలికించెడు వాడు రామభద్రుండట........." అంటూ తన మహాభాగవతాన్ని రామచంద్రమూర్తికి సభక్తికంగా సమర్పించాడు సహజ పాండిత్య సంపన్నుడైన పోతరాజు.

"ఓ రామ! నీ నామ మేమి రుచిరా, ఎంత రుచిరా!" అంటూ రామనామంలోని ఆ రుచిని చవి చూచి మనకు కూడా రుచి చూపించాడు భక్తాగ్రేసరుడైన గోపరాజు. "నిధి చాల సుఖమా, రాముని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సన్నిధి సేవ సుఖమా?" అంటూ ధనదాన్యాది సిరులవల్ల కలిగే సౌఖ్యం కంటె దశరథ తనయుని సేవించడంవల్ల కలిగే సౌఖ్యమే సౌఖ్యమనీ, అదే నిజమైన సౌఖ్యమనీ తేటతెలుగుమాటలలో తెలియజేశాడు గాయకబ్రహ్మ త్యాగరాజు.

"హితాహిత జ్ఞానమెఱుంగు పండితుడు చారుకవిత్వము నేర్చి జానకీజాని కథల్ రచింపక యసత్కథ లెన్ని రచించె నేనియున్ వాని వివేకమేమిటికి వాని కవిత్వ మహత్వమేటికిన్" అంటూ తరువాతి కవులకు హితోపదేశం చేశాడు కవిరాజు కంకంటి పాపరాజు.

"ఆంధ్ర హృదయమునకు శ్రీరాముడు కులదేవత" అని తమ ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో ఘంటాపథంగా పేర్కొన్నారు దేశోద్ధారకులు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు. ఇలా ఎంద రెందరో మహాపురుషులు ఎన్నెన్నో విధాలుగానో రామప్రశంస చేశారు.

ఈ విషయాదికాన్ని పరిశీలిస్తే స్థూల దృష్టికి కూడా ఒక విషయం స్ఫురించకపోదు. రామనామంలో ఏదో మహత్తు ఉన్నది. అందులో అనిర్వచనీయ మైన ఒక రుచి కూడా ఉన్నది. రామ శబ్దంలోని ఆ రెండక్షరాలు మహాపాతకములను కూడా నశింపజేస్తాయని విశ్వసించారు మన పూర్వులు. ఈ నాటికీ ఇలా విశ్వసించేవారు మనదేశంలో పలువురున్నారు. అందువల్లనే రామవాఙ్మయం ఎంతో వ్యాప్తిలోకి వచ్చింది.

భారతీయ సారస్వతాన్ని రామాయణ వాఙ్మయ మనీ, భారత వాఙ్మయ మనీ విభజించవచ్చు. రామాయణ భారతాలను ఆధారంగా చేసుకుని కావ్యనాటకాదులు చుబ్బనచూరలుగా వెలువడినా, వాటిలో రామాయణానికి సంబంధించిన రచనలే ఎక్కువని నిస్సంశయంగా చెప్పవచ్చు. తింటే గారెలే తినవలె, వింటే భారతమే వినవలె - అనే సామెత వెలసిన తెలుగునాడులో, ఈనాడు కూడా రామకథకు సంబంధించిన రచనలే ఎక్కువగా వ్యాప్తిలోకి రావడం చూస్తే రామకథకు సమాజంలో ఎంత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పలుకుబడి ఉన్నదో మనం ఊహించుకోవచ్చు. రామాయణం రచింపబ డని భాష మనదేశంలో లేదన్నా అతిశయోక్తి కాదు.

మహానుభావు లెందరో మనదేశంలో ప్రభవించారు. కాని సర్వభూత సమదర్శీ, సకల కల్యాణగుణ సమన్వితుడూ అయిన శ్రీరామచంద్రు నిలో కొన్ని విశిష్టలక్షణాలు కానవస్తాయి.

రాముడు దైవమని కొందరి విశ్వాసం. కాదని వాదిస్తారు కొందరు. కొంతసేపు ఇదే నిజ మనుకుందాము. అయినా ఆయన పురుషోత్త ముడు, మహాత్ముడూను. ఉన్నత సత్యం తాత్త్విక రహస్య మైనట్లుగా పురుషోత్తముడు దైవస్వరూపుడుగా కనబడడంలో వింత లేదు.

రాముడు పతిత పావనుడు!

ఎంత చక్కని మాట ఇది. ఈ బిరుదం మరి యితర దైవతాలకు ఉన్నట్లు కనిపించదు. పతితగా పరిగణించబడిన అహల్యను కరుణించిన తర్వాతనే రాముడికి కూడా ఈ బిరుదం లభించింది.

అహల్యావృత్తాంతం గురించి పలువురు పలువిధాలుగా చెపుతారు. కొంద రామెను పతితగా భావించరు. కొంద రామెను ఆ దృష్టితోనే చూస్తారు. ఏది యెలా ఉన్నా, అహల్య భర్తచే శపించబడింది. అతడు ఆమె శీలమును సంశయించాడు. మరి అటువంటి అహల్యను ఆదరించడంలోనే ఉన్నది రాముని గొప్పతనం. ఆ మహనీయుని పవిత్ర చరణద్వయం తగలడం తోనే శిలగా పడిఉన్న అహల్య రమణీయాకృతి దాల్చిందని ఐతిహ్యం. ఆమెను కరుణించవలసిన అగత్యం ఏమున్నది? దయాసముద్రుడైన ఆ పురుషోత్తమునికి ఆమె మీద జాలి కలిగిందేమో! ఏమైతేనేమి పతితను కూడా అనుగ్రహించిన కారుణికుడైనాడు శ్రీరామచంద్రుడు.

మరొక విశేషం కూడా కనబడుతుంది ఆ మహనీయునిలో.

ఆసేతు హిమాచలం దర్శించినవాడు రాముడు. ఎక్కడి సేతువు!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఎక్కడి శీతనగం! రామునికథ ఒక్క భాషవారిది కాదు. ఒక్క ప్రాంతం వారిదీ కాదు. రామగాథతో ముడిపడని ప్రదేశ మంటూ ఒక్కటీ కన బడదు. మనదేశంలో జాతీయైక్యాన్ని సాధించింది రామకథ. అంతేకాదు, భారత సీమావధుల్ని కూడా దాటిపోయింది ఆ రసవత్కథ.

ఆ రోజులలో ప్రజలకు రాజభక్తి అపారం. అసలు ఆ కాలపువారికి రాజభక్తి తప్ప మరొకటి లేదన్నా సాహస మనిపించుకోదు. అలా ఉండగా, పామరు డొకడు రామరాజును విమర్శించాడు. ఆ పామరుడు పరిహాస ధోరణిలో అన్నాడో, లేక కావాలనే అన్నాడో తెలియదు. అతనిని రాజుగా రాముడు శిక్షించి ఉండవచ్చు. కాని ఆ విధంగా జరుగలేదు. పై పెచ్చు రాముడు తన్ను తానే శిక్షించుకున్నాడు. ప్రాణప్రాణ అయిన సీతాదేవిని అడవులకు పంపివేశాడు. ఏకపత్నీవ్రతుడైన ఆ మహారాజుకి ఇంతకంటే కఠిన శిక్ష మరొకటి ఉండదు!

ఈ కథ నుంచి రాముని శీలం ప్రవ్యక్త మవుతుంది. న్యాయాన్యా యములు తెలిసిన రాముడు సీత పట్ల అలా ఎందుకు ప్రవర్తించాలి? అనేది ప్రశ్న. పామరుని పరుషోక్తిని విని సహించలేకపోయాడు రాముడు. పరిహసించినవాడు పామరుడే కావచ్చు. అయినా ధర్మైక దృష్టిగల రాముడు ఆ విమర్శను సహించలేక తన ధర్మం నెరవేర్చుకున్నాడు. అనగా ఊరూ పేరూ లేని వ్యక్తిమాటకు కూడా రామరాజ్యంలో స్థానం ఉన్నదన్న మాట! ఈ దృక్పథంతో చూస్తే రామరాజ్యం నిజమైన ప్రజాస్వామ్యంగా కనబడుతుంది.

త్యాగయ్య ఒక కృతిలో రాముడే దైవ మని సహేతుకంగా నిరూపిం చాడు. ఆ కృతి యిది.

"వాడేరా దైవము, మనసా
ఆడిన మాటలు తప్పడనుచును ఆ చంద్రా
ర్కముగ కీర్తి గలిగిన || వా ||

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దండి రక్కసుల మదమణచను
అఖండలాది సురకోట్లకు భూమండల
సుజనుల పాలించను కోదండపాణి
రూపములో వెలసిన || వా ||
దారి తెలియని యజ్ఞులకు భవనీరధి దాటి
మోక్ష మందుటకు నీరజారిధరుడుపదే
శించెడి తారకనామముతోను వెలసిన||

ఆడిన మాటలు తప్పరాదు. దుష్టుల మద మణచవలెను. శిష్టులను పాలించవలెను. దారి తెలియని వారికి సరియైన దోవ చూపవలెను - మొదలైన లక్షణాలు దేవునిలో ఉండాలని త్యాగయ్య పేర్కొన్నాడు. ఇవన్నీ రామచంద్రమూర్తిలో నెలకొనివున్న కారణం వల్లనే "సీతా పతి యని పేరు గలిగిన వాడేరా దైవము" అని త్యాగయ్య సెలవిచ్చాడు.

ఆడిన మాట తప్పనివాడు రాముడు. దుష్టశిక్షణా, శిష్టరక్షణా రామావతారంలోని ముఖ్యోద్దేశాలు. పండితులనే కాక పామరులనూ, భక్తులనే కాక పతితలనూ సరిసమానంగా చూచిన సర్వభూత సమదర్శి రామచంద్రుడు!

6

ఒక పద చిత్రం

రామకథ అనగానే తమిళులు ప్రీతి పూర్వకంగా కంబకవి చక్రవర్తి వెలయించిన రామాయణాన్ని గుర్తు చేసుకుంటారు. మలయాళీలు భక్తి పురస్సరంగా ఎళుత్తచ్చన్ రచించిన రామాయణాన్ని స్మరిస్తారు. హిందీ భాషాభిజ్ఞులు సభక్తికంగా తులసీదాసు ప్రసాదించిన రామచరిత మాన స్‌ని స్ఫురణకు తెచ్చుకుంటారు. తెలుగువారికైతే రంగనాథ, భాస్కర రామాయణాదులు వెంటనే గుర్తుకు వస్తాయి. కాని వారికి ప్రీతి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పాత్రమైన గ్రంథం కవిత్రయం వారి మహాభారతం. మహాభారతంలా తెలుగువారిని ఆకర్షించిన రచన మరొకటి లేదనడం సత్యసన్నిహితం. రంగనాథ రామాయణాదులు రసవద్రచనలే అయినా, వాటి మీద తెలుగు పాఠక లోకానికి ప్రగాఢమైన అభిమానం ఏర్పడలేదు. బహుశః రామకథాసంబంధి రచనలు తెలుగులో చాలా వెలుగు చూడడం ఇందుకు ఒక కారణం కావచ్చు. తమిళం వంటి భాషల్లో ఒకటో, రెండో సంపూర్ణ రామాయణాలు వెలువడ్డాయి గాని చాలా వెలువడలేదు.

ప్రముఖ వాగ్గేయ కారుడైన త్యాగరాజస్వామి రామాయణ మంటూ ఒక ప్రత్యేక రచన చెయ్యలేదు. అయితే ఆ మహనీయుడు పాడిన కీర్తనల్లో ముక్కాలు మువ్వీసం రామకథకు సంబంధించినవే. ఏ భారతీయ భాషలోగాని త్యాగరాజులా రాముడి మీద అన్ని కీర్తనలు పాడిన వేరొక వాగ్గేయకారుడు లేదు. తెలుగుభాషకు ఆ ప్రత్యేకతను సమకూర్చిన విశిష్టుడు ఆయన. అంతే కాదు. తెలుగులో ఉత్తమ రామాయణం వెలువడలేదన్న అపప్రథను పోగొట్టిన పుణ్యపురుషుడు త్యాగరాజు. ఆయన కీర్తనల్లో రామాయణ రహస్యాలు ఎన్నో కనిపిస్తాయి. రామకథలు వాల్మీకి చెప్పనివి కూడా ఎన్నో దర్శన మిస్తాయి. శ్రద్ధగా పరిశీలించే కొద్దీ, రామకథా మర్మజ్ఞుడుగా ఆయన సాక్షాత్కరిస్తాడు. వివిధ కోణాల్లో ఆయన రాముణ్ణే దర్శించాడు. దర్శించిన ఆ దివ్యానుభూతితో కీర్తనలు వెలయించాడు కనుకనే, అవి రసగుళికలుగా భక్తి గీతాలుగా ప్రసిద్ధి చెందాయి.

ఇక ఆ భక్త కవి రాముడి అందచందాలను అభివర్ణిస్తూ వెలయించిన ఈ రమణీయ పద చిత్రాన్ని పరిశీలిద్దాము.

'అలక లల్లలాడగ గని ఆ రాణ్ముని ఎటు పొంగెనో
చెలువు మీరగను మారీచుని మదమణచే వేళ
ముని కనుసైగ దెలిసి శివధనువును విరిచే సమయ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మున త్యాగరాజు వినుతుని మోమున రంజిల్లు.......'

మధ్యమావతి రాగంలో ఉన్న ఈ కీర్తన చాలా చిన్నదే కాని, ఇందులో చోటు చేసుకున్న ఈ రెండు పదచిత్రాలు పరమ రమణీయాలు! భావుకుడైన వాడే ఇలాంటి కమనీయ చిత్రాలు చిత్రించగలుగుతాడు.

విశ్వామిత్రుడు తలపెట్టిన యాగానికి విఘ్నాలు కల్పించారు మారీచాది రాక్షసులు. కాగా, యాగ రక్షణకోసం ఆ ముని రామలక్ష్మణుల్ని నియోగించాడు. రాక్షసులు ఎపుడెపుడు కనిపిస్తారా అని ఆ రాకుమారులు వెయ్యికళ్ళతో చూడసాగారు. అంతలో మారీచుడు రావడం, అతని గర్వాన్ని అణచివేయడం అంతా క్షణాల మీద జరిగిపోయింది. అప్పుడు రాముడి ముంగురులు - అలకలు - అల్లలాడాయి. అసలే రాముడు పురుషులే చూసి మోహించేటంత అందగాడు. అలకలు అల్లలాడడంతో ఆ అందగాడి ముఖం మరింత అందంగా కనిపించింది. ఆ దివ్యసౌందర్యాన్ని తనివితీరా చూసి ఎంతగానో మురిసిపోయాడు ఆ ముని. కనుకనే ఆ ముని శ్రేష్ఠుడు ఎంత ఉప్పొంగిపోయాడో అన్నాడు త్యాగరాజు. రాముడు 'తన వెంట రాజాచి ఉప్పొంగ కౌశికుడు తపమేమి చేసెనో' అన్నాడు ఆ భక్తకవి మరొక కీర్తనలో. మారీచుని మదమణచడంలో రాముడు ప్రదర్శించిన ఆ శౌర్యం కాదు విశ్వామిత్రుణ్ణే అలరించింది. ఆ సందర్భంగా రాముని అలకలు అల్లలాడగా, తత్ఫలితంగా ఇనుమడించిన ఆ అందచందాలే మునిరాజుని అలరించాయి.

ముని కనుసైగను గ్రహించి రాముడు శివధనుస్సును విరిచే సమయంలో కూడా అతని అలకలు అల్లలాడాయి. రామా! ఈ ధనుస్సుని చూడు - అని వాల్మీకిలా త్యాగరాజు విశ్వామిత్రుడు నోటితో చెప్పలేదు. కనుసైగ చేశాడు. ఒక్కొక్కసారి నోటిమాటల కంటె కనుసైగలే శక్తిమంతంగా ఉంటాయి. ఆ కనుసైగను గ్రహించాడు; ధనుర్భంగం చేశాడు రాముడు. రాముడు ఎలా విరిచాడో విశ్వామిత్రుడు గమనించినట్టు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లేదు. రాముడి ముఖం మీద అల్లలాడుతున్న ఆ ముంగురుల మీదే ముని చూపులు లగ్నమై ఉన్నాయి. అనగా, రాముడు జగన్మోహనా కారుడన్నమాట! ఆ భావాన్ని వాచ్యం చెయ్యకుండా అలక లల్లలాడగ అనే పదచిత్రం ద్వారా వ్యక్తం చేసిన త్యాగరాజులో ఉత్తమ కవి తొంగి చూస్తున్నాడు.

విశ్వామిత్రుణ్ణో విశ్వామిత్రు డనకుండా త్యాగరాజు రాణ్ముని అనడం కూడా భావగర్భితంగా ఉంది. విశ్వామిత్రుడు మామూలు ముని కాదు. ఆయన రాజఋషి. లేదా ఋషిరాజు. ఘోరతపస్సు చేసి బ్రహ్మర్షి పదం అందుకున్న అనఘుడు! సృష్టికి ప్రతిసృష్టి చేసిన ఘనుడు! అలాంటి తప స్సంపన్నుడు రాముడి అందచందాలు చూసి ఎంతగానో మురిసిపోవడం నిజంగానే గొప్పవిషయం, ఆ మునిని రాణ్ముని అని త్యాగరాజు సంబో ధించడం సముచితం.

శివధనుర్భంగ సమయాన రాముడి అలకలు అల్లలాడిన విషయాన్ని వాల్మీకి చెప్పలేదు. ఇతర కవులూ చెప్పలేదు. కాని రంగనాథరా మాయణంలో ఈ ప్రస్తావన కనిపిస్తుంది. శివధనుస్సుని విరిచేందుకు ఆయత్త మయిన రాముణ్ణి రంగనాథరామాయణ కర్త ఇలా అభివర్ణిం చాడు, కళ్ళకు కట్టినట్టుగా.

“అరవింద లోచనుం డసమ సాహసుడు
మొలనూలి ఘంటలు మురువు మించగను
మలగుచు నవరత్న మాలికల్ పొరల
బాహువు ర్లుంగరాల్ పటుకంకణములు
బాహువు లంగుళావళి కాంతు లీన
నమరంగ కర్ణభూషాదుల కాంతి
గొమరారు చెక్కుళ్ళు గుదిగొని మెరయ
నలకలు పెడతల నటు నృత్య మాడి
తళుకొందు బంగారు తనుకాంతు లీన.....”

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

(శ్రీ రంగనాథ రామాయణం, రాయలు అండ్ కో, కడప, పుటలు 64-65)

ఈ వర్ణన సహజ సుందరంగా ఉంది. అయితే రాముడి అలకలు పెడ తలను అంటే, తల వెనుక భాగాన నృత్యం చేసినట్లు కవి చెప్పాడు. కాని, ముంగురులు ముఖం మీద అల్లలాడినప్పుడు ఆ అందం అనిర్వచనీయం. రామకథాసుధారస రక్తుడైన త్యాగరాజు రంగనాథ రామాయణాన్ని కూడా పరిశీలించి ఉండవచ్చు.

త్యాగరాజు వెలయించిన ఈ పదచిత్రం సుప్రసిద్ధ తత్త్వవేత్త అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారిని బహుధా ఆకర్షించింది. అందులోని రామణీయకాన్ని ప్రశంసిస్తూ ఆయన ఇలా అన్నారు. "ఉపనిషత్తులలో, భగవద్గీతలో ఉన్న పరమ సత్యాలను త్యాగరాజు సరళమూ, హృదయాకర్షకమూ అయిన భాషలో వివరిస్తాడు." ఈ ప్రశంస అత్యుక్తి కాదు!

7

జానపద రామాయణాలలో జానకి అపహరణగాథ

పండితులు వ్రాసినా, అపండితులు వ్రాసినా రామకథ రసవత్కథగానే కనిపిస్తుంది. ఇదే ఈ కథలో కొట్టవచ్చినట్లుగా కనిపించే విశేషం. తవ్విన కొద్దీ చెలమలో నీరు ఊరేటట్టు, ఎవరికి వారు ఆ కథలో విశేషాలు దర్శిస్తూ ఉంటారు. రోజులు గడిచినా రామకథ తరగని ఊట!

సీతాపహరణ వృత్తాంతాన్ని సంక్షేప రామాయణకర్త ఇలా తెలియజేశాడు.

'పది తలలు రాక్షసుడు జూపె
పది తలలు జూపగా వడి మూర్ఛబొందె
మూక మామిడి విరిగి వడ్డ చందమున
గోరుచుట్టూ పయిని రోకలీ పోటు
చెవులో పోటుకు తోడు సన్నాయి జోడు
జంకుచు కను మూసి వణుకుచునున్నట్టే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భూమిపై నున్నట్టి భూపుత్రి జూచి
గడ్డ పెల్లాగించి రథముపై బెట్టి
వగ దీరెనని తలచి గగనమున కెగిరి'

పదితలల రాక్షసుని ఆకారం మానవ భామినికి మహాభయంకరంగా కనిపించడంలో ఆశ్చర్యం లేదు. కనుకనే సీత మూర్ఛపోయింది. ఆ తర్వాత తేరుకుంది. అయినా ఎక్కడలేని జంకు, ఒడలంతా వణుకు. ఆ స్థితిలో నేల మీద మూకమామిడి విరిగి పడినట్లుగా ఉన్నా, సీతను దయారహితుడైన రావణుడు అపహరించాడు. అదీ ఎలాగని! సీత పడి ఉన్న ఆ గడ్డను పెల్లగించి, దాన్ని రథంలో ఉంచుకుని గగన వీథికి వెళ్ళిపోయాడు. అనగా నేలమీద పడి ఉన్న సీతను రావణుడు తాకలేదు. ఆమె పడివున్న గడ్డను మాత్రమే పెకలించాడు.

అయితే రావణుడు సీతను తన చేతులతో పైకెత్తి రథంలో కూర్చో బెట్టుకుని ఆకాశ మార్గాన వెళ్ళినట్లు వాల్మీకం తెలియజేస్తున్నది. ఆదిక విని అనుసరించి భాస్కర రామాయణం, 'తనదు భయంకరాకారంబునకు మూర్ఛం బొంది పుడమిం బడియున్న జనక తనయం బొదివి పట్టి రథంబు పయిం బెట్టి,' రావణుడు లంకాభిముఖంగా వెళ్ళినట్లు పేర్కొన్నది. అవాల్మీకాంశాలు ఎన్నో తెలియజేసిన రంగనాథ రామాయణంలోని రావణుడు కూడా సీతను 'అదయుడై యెత్తి తెచ్చి' రథంలో పెట్టినట్లుగా తెలియవస్తున్నది. ఈ సందర్భంలో ఇతర పండిత కవులూ ఇలాగే చెప్పారు.

జానపద కవులు మాత్రం గడ్డ పెల్లగించి రావణుడు సీతాపహరణం కావించినట్లు తెలియజేయడం పేర్కొనదగిన విషయం. ఆమె పట్ల వారికి గల ఆదరమూ, అభిమానమూ అంతు లేనివి!

ఈ విషయం లంకా యాగంలో రెండుచోట్ల పేర్కొనబడింది. 'అదయ శూలము దెచ్చి గెడ్డ పెల్లగించి రథముపయి బెట్టుకొనెనూ' అని ఒక చోట, మరొకచోట "ఆ శూలముతోను పెల్లు పెల్లాగించి రథము పయి పెట్టుకొని" అని పేర్కొనబడింది. 'గెడ్డతో పెల్లగించి యెత్తుకొని పోయెనే తన లంకకు' అని ఊర్మిళాదేవి నిద్రలో తెలుపబడింది. లంకా సారథి గేయంలో ఈ అంశం మరింత స్పష్టంగా పేర్కొనబడింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'అమరు లందరు బెదర అపుడు
శూలము నాటి భూమి పెల్లగించెన్
గడ్డతో నెత్తుకుని గగనంబు
కెనసియు ఘనరథము మీద నునిచి.'

మరొక జానపద గేయ రామాయణం ఈ విషయాన్ని కళ్లకు కట్టి నట్టుగా అభివర్ణించింది. ఈ పంక్తులు పరిశీలించండి.

'గజాశూలమేసి గడ్డ పెలాగించ
గడ్డ పెల్లాగించి రథముపై పెట్టే
పాయెనే ఆ రథము పన్నల మేర.......
(డా. ఎస్. గంగప్పగారి సేకరణ)'

తూమాటి దొణప్పగారు తమ రాయలసీమ పల్లె పాటలు - రామాయణం అనే వ్యాసంలో ఒక విసరు రాతి పాటను ఉదాహరించారు. అందులో ఈ విషయం ఉదాహృతం కావడమే కాక సీతను రావణుడు తాకలేదనే అంశం స్పష్టంగా చెప్పబడింది.

'జంగమేనక మేసి అంగణము కొచ్చి
గజశూలమేసెనే గడ్డ పెకలించే
అంటి ముట్టాకుండ అరదాన నుంచే
తనదైన లంకకూ తరలె రావణుడు'.

ఒక వ్యక్తిని తాకకుండా అపహరించడం అవాస్తవంగా కనిపించవచ్చు. స్తనశల్య పరీక్ష సాగిస్తే కొన్ని కథలు - ఆధునికులవి కూడా - సహేతుకంగా కనిపించవు. కాని కథలో ప్రధానంగా ఉండవలసింది కథా కథనం, పాత్ర పోషణా. ఈ రెండింటి వల్లనే ఏ కథ అయినా సజీవంగా ఉండగ లుగుతుంది. ఈ రెండు లక్షణాలూ ఉండడం వల్లనే జానపదులు చెప్పిన కథలు నేటికీ జీవించి ఉన్నాయి; నలుగురునీ అలరించ గలుగుతున్నాయి.

పతివ్రత అయిన సీతను, పరపురుషుడు, అందులోను వంచనకు పాల్పడ్డ రావణుడు - ఏ సందర్భంలోనూ తాకినట్లు చెప్పడం నచ్చలేదు జానపద కవులకు. కనుకనే గడ్డను పెకలించి సీతను అపహరించినట్లుగా వారు తెలియజేశారు. అనగా, ఆనాటి ప్రజల విశ్వాసానికి అనుగుణంగా తెలి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యజేశారన్న మాట! వాల్మీకానికి భిన్నంగా చెప్పవలెనంటే, అందుకు తగిన ఉపపత్తి ఉండాలి. పండిత కవులు ప్రధానంగా సంప్రదాయ విధేయులు. అందువల్ల వారు మూలాతిక్రమణకు సాహసించరు. జానపద కవులు అలా కాదు. ప్రజల విశ్వాసాలు వారికి పరమ ప్రమాణాలు. అందువల్ల, మూలానికి భిన్నంగా ఉన్నా, ప్రజలు విశ్వసించిన విషయానికి వారు బ్రహ్మరథం పడతారు. అలాంటి అంశాలలో ఒకటి ఈ సీతాపహరణ వృత్తాంతం.

ఈ సందర్భంలో తెలుగు జానపద కవుల వలె, తమిళ మహాకవి కంబ కవిచక్రవర్తి చెప్పడం గమనించదగిన విషయం. మరి, ఆ మహాకవిని అనుసరించి మన జానపద కవులే చెప్పారో లేక ఆ మహాకవే జానపద కవుల్ని అనుసరించి చెప్పాడో - ఈ నాడు మనం ఖచ్చితంగా చెప్పలేము. గడ్డను పెల్లగించి సీతను రావణుడు అపహరించాడన్నది జానపదకవుల విశ్వాసం!

పర్ణశాలా సహితంగా సీతను లంకేశ్వరుడు అపహరించినట్లు కంబకవి పేర్కొన్నాడు. ఆయన కాలం నాటికి సీతారాములు లక్ష్మీనారాయణు లనే నమ్మకం ప్రబలంగా ఉండేది. ఈ అంశాన్ని ఆయన తన రామాయణంలో వీలు దొరికినప్పుడల్లా తెలియజేశాడు. అందువల్ల మలిన మనస్కుడై వచ్చిన రావణుడు సాక్షాత్ లక్ష్మీదేవి అవతారమైన సీతను తాకడం వాంఛనీయం కాదని ఆయన భావించి ఉండవచ్చు. పూర్వ శాపాన్ని గుర్తుకు తెచ్చుకుని రావణుడు సీతను తాకలేదని ఆయన ఒక కారణం కూడా తెలియజేశాడు. బలవంతంగా కనక ఒక స్త్రీని తాకినట్లయితే రావణుని తల వేయి ప్రక్క లవుతుందని ఆ శాప సారాంశం. ఈ దృష్టితో చూసినప్పుడు, ఆయన చేసిన ఈ మార్పు సహేతుకంగానే కనిపిస్తుంది.

సీతను తాకడానికి రావణుడు భయపడి, ఆమె నిలబడిన గడ్డను పెల్లగించి అపహరించినట్లు టిబెటన్ రామాయణంలో కలదనీ, ఇందుకు భారతీయుల విశ్వాసమే కారణమ మనీ వి. రాఘవన్ గారు ఒక చోట పేర్కొన్నారు.

మొత్తంమీద, సీతాపహరణ విషయాన్ని జానపద కవులు తమ కాలపు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విశ్వాసానికి అనుగుణంగా తెలియజేశారని చెప్పవచ్చు. వారు చేసిన ఈ మార్పు కథా గౌరవాన్ని ఇనుమడింపచేసేదిగా ఉంది. కథా గౌరవాన్ని ద్విగుణీకృతం చేసే మార్పు సహేతుకంగా కనిపించడంలో వింత లేదు.

8

త్యాగయ్య దివ్యనామ కీర్తనలు సాంఘిక విశేషాలు

కలియుగంలో భగవన్నామ సంకీర్తనం కంటె ఫలప్రదమయింది మరొకటి లేదని మన తరతరాల విశ్వాసం. భక్తి భావంతో భగవన్నామం ఉచ్చరించడం వల్ల స్వర్లోకప్రాప్తి కలుగుతుందని మన భక్తుల కథలు సాక్ష్యమిస్తున్నాయి. నామ సంకీర్తనానికి అంత ప్రాధాన్యం ఉంది.

కీర్తనలు, ఉత్సవ సంప్రదాయ కీర్తనలు మొదలైన వాటితో పాటు ఆ భక్త శిఖామణి దివ్యనామ కీర్తనలు కూడా ఎన్నో వెలయించాడు. సాధారణంగా దివ్యనామ కీర్తనలలో భగవన్నామానికే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. కాని త్యాగయ్య వెలయించిన వాటిని కనక పరిశీలిస్తే, వాటిలో ఆనాటి సాంఘిక విషయాలు ఎన్నో మనకు కనిపిస్తాయి.

ఐహిక జీవితంలో సుఖం లేదనీ, అది కలగన్న భాగ్యంలా ఉందనీ త్యాగరాజు పెక్కుచోట్ల తెలియజేస్తాడు. కలగన్న భాగ్య మనడంలో సారస్యం ఉంది. కల గంటున్నంత సేపు, అది భాగ్యంలా కనిపిస్తుంది. కాని కల చెదిరిపోగానే ఆ భాగ్యం కూడా తొలగిపోతుంది. అలాగే జీవిత సౌఖ్యం సౌఖ్యప్రదమనే భావన కలుగుతుంది గాని, అందులో నిజమైన సౌఖ్యం లేదని నిశిత దృష్టికి గాని తేటతెల్లం కాదు.

సంసార సుఖం సత్యమని భ్రమలో పడి, రామా! నీ నామరుచిని గ్రహించడం మరిచిపోయానని త్యాగరాజు ఒక కీర్తనలో అంటాడు. ఉదర పోషణార్థం ధనవంతుల్ని ఆశ్రయించాననీ, ఆలు సుతులపై ఉంచిన ప్రేమను నీ మీద ఉంచలేకపోయాననీ ఆయన అంటాడు.

తన కాలపు వారు కాని పనులు కోరి కోరి చేస్తున్నారనీ, కుత్సితపు మాటలు పలుకుతున్నారనీ, ఎదుటివారి పచ్చను చూసి సహించలేక

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పోయినా, పైకిమాత్రం హితవు మాట్లాడుతున్నారనీ త్యాగరాజు బాధ పడ్డాడు. అంతేకాదు. ఎన్నో శాస్త్రాలు చదివిన వారు సైతం ఆశకు దాసులై సంచరిస్తున్నారని ఆయన మొగమోటం లేకుండా సెలవిచ్చాడు. కాసువీసముల కోసం ఆశతో వేషాలు వేసి తుదకు మోసబోని వారే ధన్యులని ఆయన అభిప్రాయం. కలియుగ మనుజులు నీకు మహత్తు కలదో లేదో అని సంశయించే కాలం వచ్చిందని రాముడితో ఆయన విన్నవిస్తాడు. తన కాలపు వారిని గురించి చెప్పడంలో ఆయన మీనమే షాలు లెక్క పెట్టడు.

మనస్సులో ఒకటీ మాటలో ఒకటిగా మెలగుతూ పైకి వినయం నటిస్తూ నేను సంచరించానా? అని రాముణ్ణి ఆ మహనీయుడు సూటిగా అడుగుతాడు. బలం, కులం ఎందుకు? భక్తి ఒక్కటే ముఖ్యమని చెపు తాడు. భక్తి భావంతో ప్రతిభాసించే పనులే చెల్లిన కాసులనీ, మిగిలినవి చెల్లని కాసులనీ ఆయన నిష్కర్షగా సెలవిచ్చాడు. ఈ భావాన్ని ఆయన ఎలా వివరించాడో చూడండి. ప్రతిరోజూ కాకి, చేప నీళ్లలో ముని గినంత మాత్రాన, అది స్నాన మవుతుందా? అరణ్యంలో నివసించే కోతులు చేసేది వనవాస మనిపించుకుంటుందా? ఆకూ అలమూ మేసే మేక ఉపాసన చేస్తున్నట్లా? కొంగ చేసే జపం దేవధ్యాన మవు తుందా? ఈ వివిధ కార్యాలలో భక్తి భావం లేదు కనుక, యివి చెల్లని కాసులని తాత్పర్యం.

కాగా మనుజుడు గోముఖవ్యాఘ్రంలా సంచరించకుండా తప్పతంటలు మాని సత్ కార్యాచరణలో కాలం గడుపుతూ భక్తిమార్గమును తెలిసి నిజ భాగవతుల జత గలసి మాయారహితుని సేవించాలని త్యాగరాజు అభిమతం. అల్పుడని అందరూ పలికినా, సరివారలు నవ్వినా, పరిపరి విధాలుగా బాధలు పెట్టినా, కష్టం వచ్చినా, పాపులు నేరం మోపినా శ్రీపతి చింతన మానరాదని ఆయన నిశ్చితాభిప్రాయం.

త్యాగరాజు రచనలో ఆత్మపరీక్ష కనిపిస్తుంది. అందువల్ల ఆయన కీర్తనలు వింటున్నప్పుడు గాని చదువుతున్నప్పుడు గాని శ్రోతలకూ పఠి తలకూ స్వవిషయాలు గుర్తుకి వస్తాయి. తత్ఫలితంగా అవి మనల్ని ఉద్దేశించినవే అనే భావం కలుగుతుంది. అలా ఆ వాగ్గేయకారుడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తన ఆవేదనను ఇతరుల ఆవేదనగా కూడా మలచగలిగాడు.

'ఇందుకా యీ తనువును పెంచిన.....' అనే కీర్తన యీ సందర్భంలో పరిశీలించదగింది.

నీ సేవకు లేక, నీ చెంతకు రాక, ఆశకు దాసుడై అటునిటు తిరిగేటందుకా యీ తనువును పెంచింది? నిన్ను చూడక పరస్త్రీలను చూసేందుకా యీ కళ్లు? నీ నామస్మరణ చేయకుండా, ఊరి మాటల్ని చెప్ప కునేందుకా నోరు? నిన్ను పూజింకుండ, దుర్దానాలను చూచేందుకా యీ చేతులు? - అని త్యాగయ్య తన మనోవేదనను తెలియజేశాడు. శరీరంలోని వివిధ అవయువాలు దుర్వినియోగము లవుతున్నాయే అన్నదే ఆయన బాధ. ఆ విధంగా ఆయన తనకాలపు సామాజిక విషయాలను పరోక్షంగా తెలియజేశాడు. త్యాగరాజు వస్తుతః భక్త శిఖామణి కావడం వల్ల, ఈ వివిధ విషయాలలోను భక్తి భావానికే పెద్దపీట వెయ్యబడింది.

మాయాజాలం చెయ్యలేను; ధనికుని స్మరిస్తూ తనువు పెంచి స్త్రీలను గురించి చాటుగా మాట్లాడలేను; మహిలో కలి భయమా? మహిమ లేని దైవమా నువ్వు? నశ్వరములైన ధనాశ్వములను నేను ఆశించను, కోటీశ్వరుల నుద్దేశించి సాటిలేని నాపలుకుబోటిని వ్యర్థం చేసుకోను, ఆశాపిశాచానికి వశుణ్ణి గాను - ఇలాంటి పంక్తులు ఎన్నో ఆయన సంతరించిన దివ్యనామకీర్తనల్లో కానవస్తాయి.

త్యాగరాజు రచనల్ని పరిశీలించేకొద్దీ ఆనాటి సామాజిక విషయాలు పరోక్షంగా నైనా ఎన్నో తెలియవస్తాయనడం సత్యసన్నిహితం!

9

ఇద్దరు రామాయణ విద్వాంసులు

1

1979, ఏప్రిలు 5న మనదేశం శ్రద్ధాసక్తులతో శ్రీరామ నవమి జరుపుకుంది. ఆనాటి సాయంకాలం మదరాసులోని సంస్కృత అకాడెమీ ఆధ్వర్యవంలో సంస్కృత కళాశాలలో వాల్మీకి దినోత్సవం వైభవోపేతంగా జరిగింది. సభకు ప్రముఖ రామాయణ విద్వాంసులైన వి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాఘవన్ గారు అధ్యక్షత వహించారు. వక్తల ప్రసంగాలు ముగిసిన తర్వాత అధ్యక్షుని తుదిపలుకులు. జటాయువు మరణం గురించి ప్రస్తావిస్తూ సౌశీల్య సాగరుడైన శ్రీరామచంద్రుడు ఆ పక్షిని పితృసమానంగా భావించి దానికి దహన సంస్కారం జరపడం ఒక గొప్ప విషయమని రాఘవన్ పేర్కొన్నాడు. అప్పు డాయన కళ్లు చెమ్మగిల్లాయి. ఒక్క క్షణం ఆగి కళ్లు తుడుచుకుని, ఆయన తన ప్రసంగం కొనసాగించారు. రాముడు సౌశీల్య సాగరుడైతే, రాఘవన్ సముద్రంలా గంభీరుడు. అంత గంభీరుడుగా కనిపించే ఆయన కళ్లలో నీళ్లు తిరగడం చూసిన ఆనాటి సభికులు ఆశ్చర్యాంబుధిలో మునిగిపోయారు.. ఆ సభికుల్లో నే నొకణ్ణి. ఆ రాత్రి ఆయనకి సుమారు 12 గంటలప్పుడు గుండెపోటు వచ్చింది. తత్ఫలితంగా, పునర్వసు నక్షత్రంలో పుట్టిన రాఘవన్, ప్రసిద్ధ రామాయణ విద్వాంసుడైన రాఘవన్ శాశ్వతంగా కన్ను మూశారు. ఆ మరునాడు ఉదయం 6 గంటలకు నా కీ విషయం తెలిసింది. అప్రయత్నంగా నా నయనాలు అశ్రుపూరితా లయినాయి.

శతాధిక రచనలు కావించిన రాఘవన్ అనగానే కొందరికి ఆయన సంస్కృత విద్వత్తు స్ఫురణకు వస్తుంది. కొందరికి ఆయన రచనల వైశిష్ట్యం గుర్తుకి వస్తుంది. కొందరు ఆయన సంగీత, నాట్యశాస్త్ర వైదుష్యాన్ని తలుచుకుంటారు. వాటికి ఆయన చేసిన పరివస్యను గుర్తు చేసుకుంటారు. పేర్కొనదగిన విషయాలలో ఇదొకటి. ఆయన చాలా కాలం మదరాసులోని ప్రముఖ సంస్థ అయిన మ్యూజిక్ అకాడెమీకి (సంగీత విద్వత్ పరిషత్) కార్యదర్శిగా ఉండి, ఆ పరిషత్తు ఏటేటా నిర్వహించే పండిత సదస్సుల విజయానికి ఎంతగానో కృషి చేశారు. అటు సాహిత్యం ఇటు సంగీతంగా ఆయన సంచరించారు.

నా మనస్సు రాఘవన్ గారి రామాయణ విద్వత్తు మీదికి ప్రసరించింది. ఆశ్చర్యంతోపాటు విషాదం నామనస్సుని ఆక్రమించింది. కేంద్ర సాహిత్య అకాడెమీ ఢిల్లీలో 1975 లో డిసెంబరు 8 నుంచి 12 దాకా అంతర్జాతీయ రామాయణ సదస్సు నిర్వహించింది. ఆ 5 రోజుల సదస్సులో పాల్గొన్న వారందరూ రాఘవన్ రామాయణ విద్వత్తుని కళ్లారా చూసీ, ఆయన గంభీరోక్తులు చెవులారా వినీ సంభ్రమాశ్చర్యాలు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చెందారు. ఆ అదృష్టం పొందిన వాళ్లల్లో నే నొకణ్ణి. ఆ సదస్సులో ఆగ్నేయాసియా దేశాల ప్రతినిధులూ, వివిధ భారతీయ భాషలకి చెందిన ప్రతినిధులూ పాల్గొన్నారు. సునీతికుమార్ చటర్జీ, వి. రాఘవన్, మినోరు హార, జె. తిలక్‌సిరి, ఫాదర్ బుల్కె ప్రభృతులు వివిధ సమావేశాలకు అధ్యక్షత వహించారు.

సంస్కృత సాహిత్యంలో రామాయణం అనే తమ పత్రంలో రాఘవన్ గారు రామాయణ ప్రాశస్త్యాన్ని వివరిస్తూ యిలా పేర్కొన్నారు. భారతీయ సాహిత్య సంప్రదాయం ప్రకారం వాల్మీకి ఆదికవి. రామయణం ఆదికావ్యం. వాల్మీకి రచనతో రామాయణ సాహిత్యం ఆగి పోలేదు. ఇతర రామాయణాలు వెలిశాయి. రామసంబంధి నాటకాలు, కావ్యాలు మొదలైనవి ఎన్నో వెలుగు చూశాయి. రామాయణ వ్యాఖ్యాన గ్రంథాలు వెలువడ్డాయి. అలంకార, నాట్య, ధర్మశాస్త్రాదులలో రామాయణం ఉదాహృత మయింది. రామాయణ ప్రభావం సంస్కృత ప్రాకృత శాసనాలలో కనిపిస్తుంది. రామస్తోత్రాలు, రామ సంహితలు ఎన్నో లభ్య మైనాయి. అధ్యాత్మ, ఆనంద రామాయణాలకు, తులసీదాసు రామచరిత మానస కావ్యానికి మాతృక అనదగిన భుశుండి రామాయణం తప్పక పరిశీలించివలసిన గ్రంథం. రామాయణం అనంతకం.

వాలివధను రాఘవన్ సమర్థించారు. చెట్టు చాటున ఉండి బాణ ప్రయోగం చెయ్యడం వేట పద్ధతులకు అనుగుణ మైనది. బౌద్ధ వాఙ్మయంలో కూడా సాలవృక్ష భంజనం వీరోచిత చర్యగా అభివర్ణిత మయిందని ఆయన అభిప్రాయం.

బహుగ్రంథకర్త అయిన ఆయన రచనలలో 'ది రామాయణ ఇన్‌గ్రేటర్ ఇండియా' తలమానిక మనవచ్చు. 272 పుటల గ్రంథ మిది. దక్షిణ గుజరాత్ విశ్వవిద్యాలయంలో 1973, ఫిబ్రవరిలో రాఘవన్ గారు చేసిన రామాయణోపన్యాసాలే మరి రెండేళ్లకు ప్రస్తుత పుస్తకాకృతి ధరించాయి. శ్రీలంక, టిబెట్, ఖోటాన్, మంగోలియా సైబీరియా, చైనా, జపాన్, లావోస్, చంపా, కంబోడియా, తాయ్‌లాండు (సియాం), ఇండోనేషియా, (జావా, బాలి మొదలైనవి) మలేషియా, ఫిలిప్పైన్స్, బర్మా మొదైన దేశాలలోని రామకథకు సంబంధించిన ఆసక్తికరములైన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అంశాలెన్నో యీ పుస్తకంలో అందాలు దిద్దుకున్నాయి. ఆగ్నేయా సియా దేశాలలో ఆయన పర్యటించి, ఆయాదేశాలలోని రామకథాత్మక సాహిత్యాన్ని సేకరించారు. విభిన్న దేశాలలోని శిల్పాలను పరిశీలించారు. జానపదుల కళారూపాలను పరిశీలించారు. కాగా ఈ పుస్తకం ఆషా మాషీగా వ్రాయబడింది కాదనీ, క్షేత్రపర్యటనా ఫలితంగా వెలసిందనీ భావించడం సమంజసం. కనుకనే విదేశాలలో రామకథను గురించి అధ్య యనం చేయదలచిన వారికి రాఘవన్ గారి యీ అమూల్య రచన పరమ ప్రామాణిక మైనది. శ్రీలంక, తాయ్‌లాండు, ఇండొనేషియా మొదలైన దేశాలను చరిత్రకారులూ కళాభిజ్ఞులూ ఇండియన్ ఏషియా అనీ, గ్రేటర్ ఇండియా అని వ్యవహరిస్తారు. కనుక భారతీయులైన రామాయణ విద్యార్థులకు ఈ పుస్తకం ప్రీతిపాత్ర మయింది.

వివిధ దేశాలు పర్యటించినప్పుడు, రాఘవన్‌గారు గ్రంథాలయాలు వస్తుప్రదర్శన శాలలు, స్తూపాలు మొదలైన వాటిని సందర్శించారు. రామాయణ నాట్యాలను, రామాయణ నృత్యనాటికల్ని చూశారు. విద్వాం సులతో కళాభిజ్ఞులతో చర్చించారు. ఆ విధంగా ఆయన విషయాలు సేకరించారు. రామాయణం పట్ల ఆయనకి గల శ్రద్ధాసక్తులకు ఈ అంశాలు ప్రబల సాక్ష్యాలు. ఆయన నిత్య విద్యార్థి అన్నా సాహసం కాదు.

ఈ పుస్తకంలోని వివిధ విషయాలను సమీక్షిస్తూ, రాఘవన్ గారు పేర్కొన్న యీ కింది విషయాలు పరిశీలించదగినవి.

1. కంబోడియా, చంపాలలో లభ్యమైన శాసనాలను పురస్కరించు కుని చూస్తే సంస్కృతంలోని వాల్మీకి రామాయణం ఆగ్నేయాసియా వారికి పరిచిత మైన గ్రంథమని స్పష్ట మవుతుంది.

2. రామాయణంలోని ప్రధానేతివృత్తంలో మార్పు లేమీ చెయ్యబడ లేదు. చేయబడిన మార్పులన్నీ అదనంగా చేరిన కథలలోనే.

3. ఆ మార్పులు కూడా వాల్మీకి రచనలోని భావాలకు సన్నిహితంగా ఉన్నాయి. ఒక ఉదాహరణం: పుష్పక విమానంలో ముత్తైదువులే (సువాసినులు) ఎక్కగలరని తాయ్ రామాయణంలో చెప్పబడింది. ఈ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విషయాన్నే త్రిజట సీతతో చెప్పినట్లు వాల్మీకంలో ఉన్నది. సీతను భరించింది కనుక రాముడు సజీవుడై ఉన్నాడని త్రిజట ఆమెను ఓదార్చింది.

4. అవాల్మీకాంశాలు ఆగ్నేయాసియా రామాయణాలకే పరిమితమైనవి కావు. వాటికి భారతదేశంలోని వివిధ భాషలలోని రామాయణాలలోనో లేదా యితర సంస్కృత రామాయణాలలోనో మాతృకలు కనిపిస్తాయి. రాముడు ఆరాధ్యదైవం కావడంతో, హనుమంతుడు కూడా ఆరాధ్యుడైనాడు. సీతను శక్తి స్వరూపిణిగా భావించడం జరిగింది. ఈ భావాలు ఆగ్నేయాసియా దేశాలలో కూడా కనిపిస్తున్నాయి.

5. దేశభాషా రామాయణాల ప్రభావం కొద్దిగానో గొప్పగానో తాయ్‌లాండు రామాయణం వంటి కొన్ని రామాయణాల మీద కనిపిస్తుంది. వివాహత్పూర్వమే సీతారాములు ఒకరినొకరు చూసుకున్నారనే అంశం కంబరామాయణం లోనూ తాయ్‌లాండు రామాయణంలోనూ కనిపిస్తున్నది. పూర్వానురాగ మన్నది సంస్కృత నాటకాలలో కనిపించే ఒక లక్షణం. రంగనాథాది భారతీయ రామాయణాలలో వానరుడు (అంగదుడు) మందోదరిని ఈడ్చుకొని వచ్చినట్లుగా చెప్పబడిన వృత్తాంతం ప్రస్తుతం అలభ్యమైన ఒక ప్రాచీన సంస్కృత నాటకంలో ఉన్నట్లు ఆయన తెలియజేశారు.

6. ఇక వ్యక్తి నామాలు గురించి. స్థానికోచ్చారణ, లిపి భేదం, అక్షరాలను తప్పుగా విడదీయడం మొదలైన కారణాలవల్ల వ్యక్తినామాలలో భేదాలు ఏర్పడినవి.

ఉదా: విభీషణ విబుశన
శూర్పణఖ - సురపండకి
పరశురామ - పుష్పరామ

7. భారతీయుల జ్యోతిశ్శాస్త్రానికి ఆగ్నేయాసియా రామాయణాలలో ప్రాధాన్యం లభించింది. ఆగ్నేయాసియా రామాయణాలన్నిటిలోనూ విభీషణుడు జ్యోతిష్కునిగా చిత్రించబడ్డాడు. ఒక్కొక్కసారి జాంబవంతుడీ పాత్రను నిర్వహిస్తాడు. విభీషణునికి ఆశ్రయమిస్తూ, అతడు పండితుడని రాముడు చెప్పినట్లు వాల్మీకంలో ఉన్నది. వాల్మీకంలోనే మరొక

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చోట, విభీషణుడు నిమిత్తములు (శకునములు) చెప్పడంలో ఘటికుడని రాముడు లక్ష్మణునితో చెప్పినట్లుగా పేర్కొనబడింది. కాగా విభీషణుడు జ్యోతిశ్శాస్త్రవేత్తగా ఆగ్నేయాసియా రామాయణాలలో ప్రముఖుడైనట్లు గ్రహించవచ్చు.

8. ఆగ్నేయాసియా రామాయణాలలోనే కాక ఆగ్నేయాసియా దేశీయులలో ఉన్న ఒక విశ్వాసాన్ని రాఘవన్ గారు తెలియజేశారు. సీతా రామలక్ష్మణులు దైవాంశ సంభూతులనీ, వారిచే సంహరించబడిన రాక్షసులు స్వర్గం చేరుకుంటారనీ - అనగా విముక్తి చెందుతారనీ వారి నమ్మకం. ఆగ్నేయాసియాదేశాలలోని కొందరు రాజులు రాముని పేరు పెట్టుకోవడానికి అంతర్యం, రాముడు వారి దృష్టిలో ఆదర్శ ప్రభువని ఆయన తెలియజేశారు.

ఆగ్నేయాసియా దేశాలలో వెలువడిన వివిధ రామాయణాలలో అవాల్మీకాంశాలని భావించబడుతున్న వాటికి మాతృక లనదగినవి వాల్మీకంలోనో ఇతర భారతీయ రామాయణాలలోనో కనిపిస్తున్నవని రాఘవన్ గారు విశ్వసించడమే కాక వాటికి తగిన ఆధారాలు కూడా ఎత్తి చూపారు. రాఘవన్ గారి రామాయణ వైదుష్యం అద్భుతావహం అనక తప్పదు.

త్యాగరాజ కీర్తనలను దేవనాగరి లిపిలో వ్రాసి, వాటికి వచనంలో ఆంగ్లానువాదం చేసి యశశ్శరీరులు సి. రామానుజాచారి గారు సంగీతలోకానికి మహోపకారం చేశారు. ఆ గ్రంథం పేరు 'ది స్పిరిచువల్ హెరిటేజ్ ఆఫ్ త్యాగరాజ'. దానికి రాఘవన్ గారు 206 పుటల బృహత్పీఠిక వెలయించారు. ఆ పీఠికలో త్యాగరాజు జీవితం, నాద యోగం, సాధన, సంస్కర్త ఉత్సాహం, ఇష్టదేవత, భక్తి రూపాలు, భక్తిలోని ఘట్టాలు, భక్తి పారవశ్యం అనే 9 అధ్యాయాలు ఉన్నాయి. త్యాగరాజు కీర్తనలలోని సౌందర్యాన్ని వైశిష్ట్యాన్ని రాఘవన్ గారు సాధికారంగా చర్చించారు. ఆయన రామాయణ వైదుష్యమునకు ఈ పీఠిక నికషోపల మనవచ్చు. ఈ పీఠిక చదివితే, త్యాగరాజు రామాయణ మర్మజ్ఞుడని విశద మవుతుంది. మాజానకి చెట్టబట్టగ మహరాజు వైతివి అనే కీర్తనలో సీత తన నిజరూపాన్ని అగ్నిలో ఉంచి మాయారూపం వహించి దానవుని వెంట వెళ్లినట్లుగా త్యాగరాజు పేర్కొన్నాడు. ఈ సందర్భంగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్రాస్తూ, యిలాంటి అంశాలు అద్భుత రామాయణాదుల నుంచి గ్రహింపబ డినవని రాఘవన్ గారు పేర్కొన్నారు. అద్భుత రామాయణంలో సీతను అద్భుతంగా చిత్రించడం జరిగిందనీ, అలాగే హనుమంతుడు కూడా అద్భు తంగా చిత్రించబడ్డాడనీ పేర్కొన్నారు. త్యాగరాజు తెలియజేసిన కొన్ని అంశాలు వాల్మీకం చదివితే తెలియవనీ, అద్భుత ఆనందాది యితర కృతులను పరిశీలిస్తే తెలియవస్తాయనీ రాఘవన్ ఉదాహరణ పూర్వకంగా పేర్కొన్నారు. ఒక కీర్తనలో త్యాగరాజు రాముణ్ణి యిలా ప్రస్తావించాడు.

'లావణ్య రామ కనులార జూడవె
అతి లావణ్య రామ
నీ మనసు, నీ సొగసు, నీ దినుసు వేరె
త్యాగరాజనుత దివ్య లావణ్య రామ'

త్యాగరాజు వాడిన అతి లావణ్య రామ అన్న పదబంధం వాల్మీకి వాడిన అతీవ ప్రియదర్శనం అన్న పదబంధానికి అతి సన్నిహితంగా ఉన్న దని రాఘవన్ గారి అభిప్రాయం. ఇలా పదబంధాలు మొదలుకొని పెక్కు విషయాలను ఆయన చర్చించారు.

బహువిషయ సంభరితమైన తమ పీఠికను ఆయన క్రింది కీర్తనతో ముగించారు.

చెడే బుద్ధి మానురా
ఇడే పాత్ర మెవరో చూడరా
భూవాసికి దగు ఫలము గల్గునని
బుధులు బల్క వినలేదా? మనసా!
శ్రీ వాసుదేవ సర్వమనుచును
చింతించరా - త్యాగరాజ వినుతుని

సర్వమూ వాసుదేవుడే అనే జ్ఞానం కలవాడే నిజమైన మహాత్ముడనీ, అలాంటి అపూర్వ మహాత్ములలో త్యాగరాజు ఒక్కడనీ రాఘవన్ గారు పేర్కొన్నారు.

అద్భుత రామాయణంలో సంగీతం, తత్త్వ సంగ్రహ రామాయణం మొదలైన వ్యాసాలు రాఘవన్ గారు వ్రాశారు. భుశుండి రామాయ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ణానికి ఆయన వ్రాసిన పీఠిక కూడా ఆయన రామాయణ విద్వత్తుని తెలియజేస్తుంది. సంగ్రహంగా చెప్పాలంటే, సంస్కృతంలో వెలువడిన వివిధ రామాయణాలను, నాటకాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారని నిర్ద్వంద్వంగా పేర్కొనవచ్చు. పైగా ఆయన తులనాత్మక పరిశీలన దృష్టి ప్రశంసార్హం.

సంస్కృత భాష సాహిత్యాలకు సంబంధించి ఆయన చేసిన ప్రసంగాలు, సంతరించిన పరిశోధక పత్రాలు కోకొల్లలు. రాఘవన్ ఎంత పండితుడో, అంత నిత్య విద్యార్థి. పైకి ఎంత గంభీరుడో, అంత నవనీత మనస్కుడు. ఆయనతో సన్నిహితంగా సంచరించిన వారికే యీ విషయం తెలుస్తుంది.

అనంతమైన రామాయణ సాహిత్యాన్ని ఆపోశనం పట్టిన అపర అగస్త్యుడు డాక్టర్ రాఘవన్. ఆయన పాల్గొనని అంతర్జాతీయ సంస్కృత సాహిత్య సదస్సు లేదు. దర్శించని సంస్కృత గ్రంథాలయం లేదు. సంస్కృత భాషా సాహిత్యాల కోసం జీవితం మీదు కట్టిన పండితుడాయన.

కేంద్ర సాహిత్య అకాదెమీ వెలుగులోకి వచ్చినప్పటినుంచీ, ఆ సంస్థతో ఆయనకి సన్నిహిత సంబంధం ఉండేది. కొంతకాలం ఆయన సంస్కృత సలహా సంఘసభ్యులుగాను, కార్య నిర్వాహక వర్గ సభ్యులుగాను ఉండేవారు. అకాదెమీ సంస్కృత పత్రిక అయిన సంస్కృత ప్రతిభకు ఆయనే మొదటి సంపాదకులు. ఆయన్ని సాహిత్య అకాదెమీ ఫెలోగా (విశిష్ట సభ్యుడు) ఎన్నుకుని బహుధా గౌరవించింది. ఆయన వ్రాసిన భోజుని శృంగార ప్రకాశికా వ్యాఖ్యకు అకాదెమీ బహుమతి లభించింది.

సంస్కృత కావ్యనాటక పరిష్కర్తగానే కాక రాఘవన్ గారు సంస్కృతంలో ఒక విశిష్ట రచయితగా కూడా పేరుప్రఖ్యాతులు గడించారు. కవిత లెన్నో వెలయించి కవికోకిల బిరుదవిరాజితులయ్యారు. అనార్కలీ నాటకం సంస్కృతంలో వ్రాసి, రంగస్థలం మీద ప్రదర్శింపజేశారు.

సంగీత సాహిత్య నాట్య శాస్త్ర నిష్ణాతుడు, గరీయః ప్రతిభుడు, శతాధిక గ్రంథకర్త అయిన వేంకటరామ రాఘవన్ గారు తంజావూరు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జిల్లాలోని తిరువారూరులో 1908, ఆగస్టు 22 న జన్మించారు. కాల ధర్మం చెందిన నాటికి ఆయన 71 యేళ్ల జ్ఞాన వయోవృద్ధులు.

2

'భవుని కెయ్యది సేవ్యమై వరగె, వనధి
తనయ నిడువేళ దేని క్షాళనము చేసె,
గంగ కెయ్యది జనకమై క్రాలె, నట్టి
రామ పద పంకజమ్ము తారకము నాకు.'

అని అహల్య నోట పలికింపజేసిన చల్లా లక్ష్మీనారాయణ శాస్త్రిగారు మరొక రామాయణ విద్వాంసులు. శాస్త్రి గారి రచనావళిలో మైథిలి నామాంతరం గల రామాయణం బహుధా పేర్కొనదగింది. వాల్మీకి, తులసీదాసు మొదలైన. మహాకవులు వెలయించిన రామాయణాలు పరిశీలించి ఆయన మైథిలి సంతరించారు. మైథిలి నుంచి పై పద్యం గ్రహించబడింది.

సంస్కృతాంధ్ర హిందీ భాషా కోవిదులైన శాస్త్రిగారు అష్టావధానులు. కవితా విశారద, ప్రబంధ కవి శిరోమణి ఇత్యాది బిరుదాంచితులు. బహుగ్రంథకర్తలు. జగద్విఖ్యాత శతావధానులైన చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి గారి ప్రియ శిష్యులు. చెళ్లపిళ్లవారు తమ శిష్యుని కవితను విని యిచ్చిన అభిప్రాయం లోంచి ఒకటి రెండు వాక్యాలు ఉదాహరించడం అసమంజసం కాదు.

'చి || చల్లా లక్ష్మీ నారాయణ శాస్త్రి కొన్ని సంవత్సరములు నా యొద్ద కావ్యనాటక పాణినీయాదుల నభ్యసించి యున్నాడు. ఇతనికి నా యొద్దకు వచ్చునప్పటికే కవితా రచనా సామర్థ్యము గలదు. ఈ విషయమున నితడు నా యొద్ద చేసిన శుశ్రూష 'కావ్యజ్ఞ శిక్షయాభ్యాసః' అనుదాని క్రిందకు రావచ్చును....'

ఈ అభిప్రాయం ఎందుకు ఉదాహరించానంటే, చెళ్లపిళ్లవారి అమూల్యాభిప్రాయంతో శాస్త్రిగారు ఒక ఉన్నత పాఠశాలలో తెలుగుపండిత పదవి సంపాదించారు. ఆ తర్వాత ఆయన విద్వాన్ పట్టం పొందారు; పండిత పదవి నిలిచింది. అలాంటి గురుదేవుని ఏ శిష్యుడు మాత్రం

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సభక్తికంగా స్మరించకుండా ఉండగలడు? తమ మైథిలిలో శాస్త్రిగారు చేసిన గురుస్తుతి యిలా ఉంది.

'అన్నంబున్ గడుపార బెట్టి, మఱి విద్యన్ ప్రేమతో నేర్పి, నా
కౌన్నత్యం బొనగూర్చినట్టి గురుశాస్త్రార్థ ప్రపంచైక సం
పన్నున్ వేంకటశాస్త్రి జెళ్లపిళ్ల సద్వంశాద్రిరాకేందు, న
చ్ఛిన్నోత్కృష్ట కవిత్వశాలి, మహాలక్ష్మీ నాథునిన్ గొల్చెదన్.'

శాస్త్రిగారు గుంటూరు జిల్లా, తెనాలి తాలూకా దంతలూరు అనే గ్రామంలో మాతామహుల యింట 1903, జనవరి 7న జన్మించారు. తలిదండ్రులు లక్ష్మీనరసాంబ సీతయ్యలు. వివిధ ఉన్నత పాఠశాలల్లో తెలుగు పండితులుగా పనిచేసి 1968, డిసెంబరు 24న మదరాసులో కాలధర్మం చెందారు. పెక్కు చోట్ల అవధానాలు చేసి సమ్మానాలు పొందారు.

శాస్త్రిగారి రచనలలో విరజోపాఖ్యానం (ప్రబంధం, 1932), మైథిలి (1950, 57), రణతిక్కన (1956), విశ్వజ్యోతి (నాటకం, 1948) గీతా సప్తశతి (భగవద్గీతానువాదం, విరివాన (బిహారీసత్‌సఈకి తెలుగుసేత, 1963) మొదలైనవి సుప్రసిద్ధములు. హిందీలో మోతియోంకీ హార్ అనే శతకం వ్రాశారు.

రాధాకృష్ణ భక్తులైన శాస్త్రిగారు ప్రతినిత్యం కాకపోయినా వారాని కొక సారైనా తులసీదాసు రామచరిత మానస్‌లోంచి రసవత్తరములైన భాగాలు కొన్నిటిని భక్తి పారవశ్యంతో గానం చెయ్యడం నే నెరుగుదును. వాల్మీకం అప్పుడప్పుడు చదివినా, రామచరిత మానస్‌ని నియతిగా చదివేవారు. అది ఆయనకి అభిమాన గ్రంథం మన్నా సాహసం కాదు. తులసీదాసు ప్రభావం మైథిలిలో అక్కడక్కడ గోచరిస్తుంది.

సీతకు ప్రాధాన్య మిస్తూ మైథిలి సంతరించబడింది. కనుక ఈ కావ్యనాయిక సీత అనడం చర్వితచర్వణం. భాస, భవభూత్యాది మహాకవుల ననుసరించి, శాస్త్రిగారు కొన్ని పరివర్తనలు చేశారు. రాజ్యశుల్క వృత్తాంతం ముఖ్యమైన మార్పు. తత్ఫలితంగా లోకనింద నుంచి కైకను తప్పించడం జరిగింది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంవాద ధోరణిలో సాగిన కావ్యం మైథిలి: పాత్రల సంవాదముల తోనే కథను శాస్త్రిగారు మనోజ్ఞంగా నడిపారు. ఈ ధోరణి కావ్యానికి జిగినీ బిగినీ ప్రసాదించింది.

ప్రబంధకవి శిరోమణి కనుక శాస్త్రిగారికి వర్ణనముల పట్ల ప్రీతి ఉండడం సహజం. మిథిలా పురవర్ణనం, పద్మాకర వర్ణనం మొదలైనవి పరిశీలించదగినవి.

పాత్రపోషణ విషయంలో శాస్త్రిగారు జాగరూకత వహించారు. ఆయా పాత్రల్ని పరిచయం చేసిన తీరు హృద్యం. ఉదాహరణకి జనక రాజర్షిని గురించి ఆయన యిలా పేర్కొన్నారు.

'ఆత్మ బరమాత్మ యందు లయంబు జేసి
యంటక చరించు తామరపాకులోని
నీటిబొట్టు గతిన్ జగన్నాటకమున
దిగియు దిగకుండునట్టి విదేహు డితడు.'

అలాగే రాముణ్ణి గురించి చెపుతూ, రాముడికి రెండు నాలుకలు లేవనీ, రెండు బాణాలు గైకొనడనీ శాస్త్రిగారు పేర్కొన్నారు. ఈ శీల చిత్రణం ప్రశంసార్హం. ఒక మాట, ఒక బాణం - అని రామ చంద్రుని అభివర్ణించాడు త్యాగయ్య.

మైథిలిని శాస్త్రిగారు 1950లో పూర్తి చేసినా, బాల అయోధ్యాకాండలు మాత్రమే వెలుగు చూశాయి. కడమ కాండలకు ముద్రణ భాగ్యం కలుగలేదు.

'కథనకథా నైపుణిలో శ్రీ శాస్త్రిగారి దండె వేసిన చేయి. గంగా ప్రవాహ సదృశమగు ధారాశుద్ధితో మధుర మధురముగ నీ కావ్యశైలి ప్రవహించినది' - మైథిలి బాలకాండకు పీఠిక వ్రాసిన శ్రీ బులుసు వేంకటేశ్వరులు గారి అభిప్రాయ మిది. ఇందుకు వారు ఉదాహరించిన పద్యం.

'నవనవోన్మేష కాంతి వైభవ మనోజ్ఞ,
మమల మధువారి భరిత పద్మాకరమ్ము
కూజితానేక పిక రమ్య కుంజ పుంజ,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మనుపమ లతాంత సుందరోద్యానవనము.'

10

ఢిల్లీలో అంతర్జాతీయ రామాయణ సదస్సు

సాహిత్య అకాడెమీ ఆధ్వర్యవంలో అంతర్జాతీయ రామాయణ సదస్సు 1975, డిసెంబరు 8 నుంచి 12 దాకా ఢిల్లీలో జరిగింది. ఈ 5 రోజుల సదస్సుకి అప్పటి కేంద్ర విద్యామంత్రివర్యులు ప్రొఫెసర్ నూరుల్ హసన్ గారు ప్రారంభోత్సవం చేశారు. సాహిత్య అకాదెమీ (అప్పటి) అధ్యక్షులూ సుప్రసిద్ధ విద్వాంసులూ అయిన డాక్టర్ సునీతి కుమార్ చటర్జీగారు ప్రారంభోత్సవ సభకు అధ్యక్షత వహించారు. ఆగ్నేయాసియా దేశాల ప్రతినిధులు, వివిధ భారతీయ భాషా ప్రతినిధులు కలిసి సుమారు 50 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీయుతులు సునీతి కుమార్ చటర్జీ, వి. రాఘవన్, మినోరుహర, జె. తిలక్‌సిరి, కమీల్ బుల్కే, సి. శివరామమూర్తి ప్రభృతులు వివిధ సమావేశాలకు అధ్యక్షత వహించారు. ముగింపు సమావేశంతో కలిపి మొత్తం పది సమావేశాలు జరిగాయి. చల్లా రాధకృష్ణశర్మ సంధానకర్తగా వ్యవహరించాడు. సాయం సమయాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

సంస్కృత సాహిత్యంలో రామాయణం అనే పత్రాన్ని రాఘవన్ గారు తొలి సమావేశంలో తొలిపత్రంగా సమర్పించారు. సంస్కృత సాహిత్యంలో రామాయణం గురించి చెప్పడమంటే, సృష్టిలో ఈశ్వరుని సర్వవ్యాపకత్వం గురించి చెప్పినట్లుగా ఉంటుందనీ, వాల్మీకి ఆదికవీ అనీ, రామాయణం ఆది కావ్యమనీ, రామాయణం అలంకార నాట్యశాస్త్రాలలోనే కాక, ధర్మ శాస్త్రంలో సైతం ఉదాహృత మయిందనీ, కావ్యనాటకాలేకాక రామస్తోత్రాలు సంహితలు చాలా ఉన్నాయనీ, అధ్యాత్మాది వివిధ సంస్కృత రామాయణాలకూ తులసీదాసు రామచరిత మానసుకీ మాతృక అనదగిన భుశుండి రామాయణం అవశ్యం పరిశీలించదగిందనీ, రామాయణ సాహిత్యం అనంతకం అనీ ఆయన తమ పత్రంలో విశదీకరించారు.

హరీ యం.బక్ అనే పాశ్చాత్య విద్వాంసుడు రామాయణానికి గల శక్తి, అది నేటికీ సజీవ సంప్రదాయంగా ఉండడమే అని పేర్కొన్నారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తర్వాత జరిగిన చర్చలో ఫాదర్ బుల్కే ప్రసంగిస్తూ, మత విశ్వాసాలన్నవి తరంగాల వంటివనీ, వారివధ మొదట వెలసిన వాల్మీకి రామాయణంలో లేదనీ, రాముడు పురుషోత్తముడనే భావం వాడుకలో ఉన్నదనీ అన్నారు. ఆగ్నేయాసియా రామాయణాలలో ప్రక్షిప్తాలు సర్వ సాధారణములని ఒక ప్రతినిధి అన్నారు. పది శతాబ్దులకు పైగా రామ కథ ఇండొనేషియా ప్రజాహృదయాలలో మసలుతున్నదనీ, వాల్మీకి కృత మని భావించబడుతున్న భట్టికావ్యం జావా రామాయణానికి మాతృక అని చెప్పవచ్చుననీ మరొక పాశ్చాత్య పండితుడు పేర్కొన్నాడు.

ఫాదర్ సి. బుల్కే ఆధునిక యుగానికి రామచరిత మానసం అనే అంశం గురించి పత్రం సమర్పించారు. హిందీ వాఙ్మయంలో తులసీ రామాయణం అతి ప్రధానమైన కావ్యమనీ, అమరకావ్యసృష్టి తులసీదాసు ధ్యేయం కాదనీ భక్తి మార్గ ప్రదర్శనమే ఆయన ధ్యేయ మనీ, దాస్య భక్తియే మోక్షమార్గానికి అనువైనదనీ బుల్కే పేర్కొన్నారు. అనంతరం జరిగిన చర్చలో ప్రాచీన జావా రామాయణం భట్టి కావ్యం కంటె సుంద రమైనదని ఒకరు పేర్కొన్నారు. వాల్మీకి రామాయణపు వ్రాతప్రతులలో అతి ప్రాచీన మైనది నేవారి లిపిలో ఉన్న తాళదళ గ్రంథమే అని (క్రీ.శ. 1020), అది ఖట్మండు (నేపాల్) లోని బీర్ గ్రంథాల యంలో ఉన్నదనీ ఒకరు తెలియజేశారు.

జైన రామాయణాలు వాటి మాతృక అనే అంశం గురించి పత్రం సమర్పించిన వి.యం. కులకర్ణిగారు ఇలా పేర్కొన్నారు. జైన రామాయ ణాలకు మాతృక వాల్మీకి రామాయణమే అయినప్పటికీ జైన రామా యణాలలో పేర్కొనదగిన మార్పులు కనిపిస్తాయి. ఆ తర్వాత జరిగిన చర్చలో పాల్గొంటూ ఒక ప్రతినిధి ఆగ్నేయాసియా రామకథలలో సీత రావణుని చిత్రం వ్రాసిన అంశం ప్రముఖంగా కనిపిస్తుందని తెలియజే శారు. ఈ వృత్తాంతం భారతీయ జానపద గాథలలో కనిపిస్తుందని కొందరు పేర్కొన్నారు. కంబోడియా మొదలుకొని బాలి దాకా గల దేశాలలో రామాయణం ఆగ్నేయాసియా వాసుల్ని బహుధా ఆకర్షించిందనీ, వ్యక్తుల స్థలముల పేర్లలో స్థానికీకరణం చెయ్యబడిందనీ అమిన్ స్వీనీ అనే పండితుడు అన్నారు. తోలుబొమ్మల ప్రదర్శనల్లో రాముడు కాంతా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రియుడుగా వర్ణించబడ్డాడనీ, శూర్పణఖ కోరికను అతడు మన్నించాడనీ, రావణుడు 12 లేక 7 తలలవాడు గానో చిత్రించబడ్డాడనీ, అతడు బల్లిగా మార్పు చెందాడనీ ఆయన పేర్కొన్నారు. అనంతరం జరిగిన చర్చలో పాల్గొన్న పాశ్చాత్య పండితుడు ఒకాయన తాయ్‌లాండు రామ కథలో హనుమంతుడు మందోదరిని వలచినట్లుగా చెప్పబడిందన్నారు. ఇలాంటి విచిత్ర వృత్తాంతాలకు స్థానిక గాథలే మాతృక లని మరొకరు తెలియజేశారు. జానపద గాథలే కావ్యగత గాథలకు ఆధారమని మరొకరు పేర్కొన్నారు.

మలేషియాలో రామాయణం అన్న తమ పత్రంలో ఇస్మాయిల్ హుసేన్ యిలా తెలియజేశారు. కొన్ని శతాబ్దులుగా భారతీయ సాంస్కృతిక సంప్రదాయాలు మలేషియాలో వాడుకలో ఉన్నాయి. రామగాథ రకరకాల మార్పులకు లోనయింది. ప్రక్షిప్తాలు చేరాయి. సీతా రామ లక్ష్మణుల్ని పూర్తిగా మలయావాసులు చేయబడ్డారు. రాముడు అగంగ్ (పరబ్రహ్మ) అని వ్యవహృతు డయ్యాడు. ఈ అగంగ్ లో రామునిలో కానవచ్చే నైతిక భావాలన్నీ కనిపించవు. మలయ్ రామగాథలపై కనిపించే ఇస్లాం ప్రభావం పరిశీలనార్హమని ఒకరు సూచించారు. లావణుడు (రావణుడు) చివరికి ముస్లిం సన్న్యాసి అవుతాడని ఒకరు పేర్కొన్నారు. ఫిలిప్పైన్ రామాయణంలో సీతాపహరణ వృత్తాంతం చాలా ఆకర్షకమైనదని ఒక ప్రతినిధి అన్నారు. పెక్కు ఆగ్నేయాసియాదేశాల రామాయణాలు రావణుని కథతో ప్రారంభ మవుతాయని రాఘవన్ గారు పేర్కొన్నారు.

మలయాళంలో లభ్యమైన తొలి రామాయణాలలో ఒకటైన రామచరితం వాల్మీకంలోని యుద్ధకాండకు అనువాదమనీ, కేరళ రంగస్థలానికి రామకథ చిరపరిచితమైనదనీ యస్.వి. కృష్ణవారియర్ పేర్కొనగా, రామకథ తెలుగువారికి సంబంధించినంతవరకు ఒక నిర్జీవకథ కాదనీ సజీవగాథ అనీ సి. ఆర్. శర్మ తెలియజేశారు. పిమ్మట జరిగిన చర్చలో పాల్గొంటూ సులోచనా వృత్తాంతం మధుసూదన దత్తువంటి ప్రముఖ బెంగాలీకవిని ప్రభావితుణ్ణి చేసిందనీ, రామకథాత్మకములైన కీర్తనలు ఎన్నోపాడిన భక్త - వాగ్గేయకారుడైన త్యాగరాజువలె భారతీయ సాహిత్యంలోనే మరొకరు లేరని ప్రతినిధులు భావించారు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామకియన్ అనే పేరుతో రామాయణం తాయ్‌లాండు ప్రజలకు చిర పరిచిత మయిందనీ, రామకీర్తి నుండి రామకియన్ ఏర్పడిందనీ, తాయ్ ప్రజల విశ్వాసం ప్రకారం 2000 సంవత్సరాల క్రితం రామాయణం రచించబడిందనీ తాయ్‌లాండు నుంచి వచ్చిన ప్రతినిధి తమ పత్రంలో తెలియజేశారు.

లావోస్‌లోని రామాయణం గురించి పత్రం సమర్పించిన కమలారత్నం గారు వాల్మీకి రామాయణంలోని పాత్రలకూ లావా రామాయణపు పాత్రలకూ మధ్య భేదాలు చాలా ఉన్నాయనీ, లావా రామాయణం తాయ్, కంబోడియా రామాయణాలకు సన్నిహితంగా ఉంటుందనీ పేర్కొన్నారు. కంబరామాయణంలోని కుంభకర్ణుని పాత్ర రమణీయ మయిందని ఒకరు పేర్కొనగా, తాయ్ రామాయణం ప్రకారం కుంభకర్ణుడు విశ్వాసపాత్రుడనీ రావణుని పట్ల విధేయత ప్రదర్శించినవాడనీ మరొకరు అన్నారు. భస్మాసురుని కథ తాయ్‌లాండులో బాగా వాడుకలో ఉన్న కథ అని ఒక ప్రతినిధి తెలియజేశారు. లావోస్‌లోని రామాయణం అనుసరించి, రావణుడు పదితలల రాక్షసుడు కాడనీ, ఇంద్రుని వలె సుందరుడనీ, రాముని వలె సజ్జనుడనీ, సీత రావణుని కుమార్తె అనీ, వాల్మీకంలోని రావణునిపాత్రకు భిన్నమైన పాత్ర అనీ ఒక ప్రతినిధి పేర్కొన్నారు. చర్చలో పాల్గొన్న రాఘవన్ గారు వాల్మీకంలోని రావణుడు కూడా గొప్పవాడనీ, కాని అతడు అధర్మపరుడుగా సంచరించడమే అతనిలోని ఏకైక దోష మనీ అన్నారు. జైన రామాయణాలు చిత్రించిన రావణుడు ఒక tragic hero అని ఒకరు భావించారు. ప్రచారంలో ఉన్న రామకథా సంబంధి విషయాలు శిల్పాలలో గోచరిస్తాయని సి. శివ రామమూర్తిగారు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. రావణునిలోని అవివేకాన్ని సూచించడానికి గాను ఒక శిల్పంలో రావణునికి గాడిద తల అమర్చబడిందని ఆయన పేర్కొన్నారు. వివిధ రామాయణాలలోని ప్రక్షిప్తాలు గురించి ప్రస్తావిస్తూ, అవి కావాలని చొప్పించబడినవి కావనీ, సాంస్కృతిక ప్రభావం వల్ల ఏర్పడినవనీ ఒక ప్రతినిధి పేర్కొన్నారు.

2,500 సంవత్సరాల క్రితం రామాయణం వెలుగులోకి వచ్చిందనీ, నాటినుంచీ కథ పెరుగుతూనే వున్నదనీ, సునీతి కుమార్ చటర్జీగారు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పేర్కొన్నారు. రామాయణంలో చెప్పబడిన విషయాల కంటె మనకు వాల్మీకిని గురించి కొత్తగా ఏమీ తెలియరాలేదనీ, సీతారాములకు కుటుంబధర్మాలు ఆపాదించారని ఆయన అన్నారు. రామునికి సంబంధించిన భావన వాల్మీకి కవి సృష్టి అనీ, గ్రీకు ప్రభావవాదాన్ని పూర్తిగా కొట్టివేయకూడదనీ, సీతారామలక్ష్మణుల వనవాసం సీతాపహరణ వృత్తాంతం రాక్షసులు వానరులు - అనే నాలుగు చిన్న కథల సమాహారం రామకథ అనీ ఆయన అన్నారు.

బర్మీస్ సాహిత్యంలో రామకథను గురించి ముచ్చటిస్తూ యు. తీన్ హాన్ ఇలా అన్నారు. బర్మీస్ వర్ణచిత్రాలలోను శిల్పాలలోను రామకథ చిత్రించబడింది. పురుషోత్తమునిగా రాముడు చిత్రించబడ్డాడు. శూర్పణఖే లేడిరూపం ధరిస్తుంది.

వాల్మీకంలోని లంక నేటి శ్రీలంక కావచ్చునని ఒకరు అభిప్రాయపడ్డారు. సింహళీస్ వ్యావహారిక బాషలో అడవిని సూచించడానికి హిమయ్ శబ్దం వాడతారని ఒకరు పేర్కొన్నారు. సింహళ జానపదులకు రామకథ నచ్చిన కథ అనీ, సింహళ వాఙ్మయంలో సేతుప్రస్తావన కనిపించదనీ, సేతు ప్రస్తావన ప్రాచీన కథలలో కనిపిస్తున్నదనీ ఒక ప్రతినిధి అన్నారు. 12వ శతాబ్ది తర్వాత సంస్కృతంలోనూ ప్రాంతీయ భాషలలోనూ వెలువడిన రామాయణ సాహిత్యానికి భుశుండి రామాయణం ఆధార గ్రంథమని భుశుండి రామాయణం గురించి పత్రం సమర్పించిన వారు చెప్పగా, తులసీ రామాయణ విషయంలో అది సంశయాస్పదమని మరొకరు చెప్పగా, తులసీరామాయణపు ఉత్తరకాండలో భుశుండి ప్రభావం ప్రముఖంగా గోచరిస్తున్నదని వేరొకరు అన్నారు.

రామాయణంలోని కథలు నేపాలీ పండుగలు పబ్బాలకు కొత్త స్ఫూర్తినిస్తున్నవనీ, నేటి నేపాలులో రామాయణ సంప్రదాయాలు నిలిచివున్నవనీ శ్రీమతి కమలా సాంకృత్యాయన పేర్కొన్నారు. రామచరిత మానస్ ఉత్తర భారతీయుల సాంఘిక ప్రవర్తన, వారి ఆదర్శాలు మొదలైనవాటిని ప్రభావితం చేసిందనీ, హిందీ మాట్లాడే ప్రాంతాలలో ప్రదర్శించబడుతున్న రామలీలా కార్యక్రమానికి తులసీదాసే కారకుడని ప్రజలు భావిస్తున్నారనీ శ్రీమతి ఇందుజా అవస్థీ పేర్కొన్నారు. పంజాబీలో రామకథ అనే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పత్రం సమర్పించిన శ్రీమతి జార్జిత్ తులసి ఇలా అన్నారు. గురుగోవిందసింగ్ రామాయణం వ్రాశారు. సామాన్యులలో సైతం ధైర్యసాహసాలు నెలకొల్పాలనే ఉద్దేశంతో ఆయన రామాయణం రచించారు. ఆయన రచించిన 'రామావతార్' లో అపూర్వములూ అద్భుతములూ అయిన 71 ఛందోభేదాలు ఉపయుక్తము లైనవి. గుజరాతులో రామాయణ కావ్య ప్రభావం లేకపోయినా, రామకథ ప్రజాబాహుళ్యాన్ని ఆకర్షించిందనీ, జైన, వైష్ణవమతాల ప్రాబల్యమే యిందుకు కారణం కావచ్చుననీ, జైనకృతులు నీత్యుద్బోధకములనీ ఉమాశంకర్ జోషీ పేర్కొన్నారు. రామగాథ కృష్ణ కథ కంటె చాలా ఆలస్యంగా కాశ్మీరం ప్రవేశించిందనీ, అయినా కాశ్మీర సాహిత్యంలో కంటె కాశ్మీర జానపద సాహిత్యంలో రామకథ బహుళంగా కనిపిస్తుందనీ పి. యస్. పుష్ప్ అన్నారు. బెంగాలీ సాహిత్యంలో వెలువడిన తొలి కావ్యాలలో రామాయణం ఒకటనీ, ప్రచారంలో ఉన్న కృత్తివాసుని రామాయణం ఎన్నో మార్పులకు లోనయిందనీ, ఆది, యుద్ధ, ఉత్తరకాండలలో ఈ మార్పులు కొట్టవచ్చినట్టు కనిపిస్తాయనీ భబతోష్ దత్త పేర్కొన్నారు. రామకథకు సంబంధించిన ఏ బెంగాలీ కృతి కూడా అతిప్రశస్త మైనదని బెంగాలీ విద్వాంసులు భావించడం లేదనీ ఆయన అభిప్రాయపడ్డారు.

వాల్మీకి, వాల్మీకేతర కృతుల ననుసరించి ఒరియా రామసాహిత్యం అభివృద్ధి చెందిందనీ, ఒరిస్సాలోని కొన్ని వర్ణాలవారు తాము రాముని వంశీయులమని భావిస్తున్నారనీ, ఒరిస్సా, ఇండోనేషియా రామకథలలోని కొన్ని కథలలో సామ్యం కనిపిస్తున్నదనీ కె.సి. సాహు పేర్కొన్నారు.

మణిపురీ రామాయణం 18వ శతాబ్దిలో బాగా వాడుకలోకి వచ్చి వుండవచ్చుననీ, దాని ప్రాముఖ్యం బెంగాలుకి చెందిన భాగవత సంప్రదాయం ప్రచారంలోకి వచ్చిన తర్వాత తగ్గు ముఖం పట్టిందని నీలకంఠ సింగ్ గారు పేర్కొన్నారు. చర్చలో పాల్గొంటూ ఆదిమ వాసులందరూ తాము రావణుని సంతతి వారమని భావిస్తున్నారని ఫాదర్ బుల్కే అన్నారు.

అస్సాములో రామునికిగాని మారుతికి గాని సంబంధించిన ఒక్క గుడి కూడా లేదనీ, హనుమంతుణ్ణి దైవంగా భావించడం అస్సామీ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంప్రదాయానికి విరుద్ధమనీ బిశ్వనారాయణ శాస్త్రిగారు తమ పత్రంలో పేర్కొన్నారు. 14వ శతాబ్దివాడైన మాధవ కందలి వాల్మీకాన్ని అస్సామీలోకి అనువదించిన వారిలో ఆద్యుడనీ, ఆయన తన కృతిలో మతభావాలకు చోటివ్వలేదనీ, రాముడిలో దైవాంశను ఆపాదించలేదనీ, అస్సామీ జానపద వాఙ్మయంలో రామకథకు శాశ్వతమైన స్థానం లభించిం దనీ ఆయన అన్నారు. ఉత్తరాది భాషలలో వెలువడిన రామాయణాలలో అస్సామీ రామాయమే మొదటిదని బుల్కే అన్నారు. బెంగాలులో మౌఖిక సంప్రదాయాలలో రామాయణం అనే విషయం గురించి ప్రస్తావిస్తూ అశుతోష్ భట్టాచార్య యిలా అన్నారు. పెళ్లి పాటలలో రామాయ ణానికి పెద్ద పీట లభించింది. వివాహసమయంలో వరుడు రాముడనీ, వధువు సీత అనీ భావించడం జరుగుతున్నది, కాని ఏతండ్రి కూడా తన కుమార్తెకు సీత అని నామకరణం చెయ్యడు. రామకథ అంతా మనస్సులోనే పదిలపరచడం జరిగింది. చర్చలో పాల్గొన్న కపిలా వాత్స్యా-యన్ గారు విద్యావిహీనులు రామకథను వికృతం చేశారనీ, అవాల్మీకాంశాలు బహుశః వారి ఊహలకు ప్రతిరూపములనీ అన్నారు. అవాల్మీకాంశాలకు సంబంధించినంతవరకు కంబకవి తులసీదాసుల లక్ష్యం ఇంచుమించు ఒకటే అని ఒక ప్రతినిధి అన్నారు.

శిల్పాలలో అభివర్ణించబడిన రామకథను గురించి సి. శివరామమూర్తిగారు పత్రం సమర్పించారు. ఆ శిల్పాలు దేశ మంతటా ఉన్నాయి. విజయవాడలోని మొగల్రాజపురం శిల్పాలు క్రీ.శ. 6వ శతాబ్ది నాటివి. కుంభకోణంలోని నాగేశ్వరస్వామి వారి ఆలయంలోని రామగాథాశిల్పాలు ముఖ్యమైనవనీ సుందరమైనవనీ ఆయన పేర్కొన్నారు. ఆ తర్వాత ఆర్. నాగస్వామిగారు తమిళనాడులో రామాయణం అనే అంశం గురించి పత్రం సమర్పించారు. సైబీరియా నుంచి ఇండొనిషియా దాకా రామకథ వాడుకలో ఉన్నదనీ, అది ఆసియా ఖండపు ఇతిహాసమనీ లోకేష్ చంద్ర పేర్కొన్నారు. కుమారదాసుని జానకీహరణం నాటకం ఆగ్నేయాసియా దేశాలలో ప్రచారంలో ఉన్నదనీ ఆయన అన్నారు. మంగోలియాలో కూడా రామకథ వాడుకలో ఉన్నదనీ, మంగోలియా రామాయణాలు సంస్కృతానువాదాలు కావనీ, అవి స్వతంత్ర రచనములనీ ఒకరు పేర్కొ న్నారు. ఏడు సముద్రములూ ఏడుకొండలూ దాటి రాముడు లేడిని

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వెంబడించినట్లు మంగోలియన్ల విశ్వాసం. రావణుణ్ణి దశగ్రీవుడని వారు వ్యవహరించారు. వివిధ రామగాథలతో మంగోలియన్ కవులకు పరిచయ మున్నట్లు భావించవచ్చుననీ, మంగోలియన్లు కావించే వానర పూజకు హనుమంతుని కథా ప్రభావం ఉన్నదనీ ఆయన పేర్కొన్నారు. తాయ్‌లాండు శిల్ప వర్ణచిత్రాలలో రామాయణం అనే విషయం గురించి యం.సి. డిస్కుల్ ప్రసంగించారు. వర్ణచిత్రాలు, అలంకరణ వస్తువులు, తోలుబొమ్మలాటలు మొదలైన వాటిలో రాముడు మొదలైన వారు చిత్రించబడ్డారనీ, రామకీర్తి కావ్యం ఇంకా వాడుకలో ఉన్నదనీ, తాయ్‌లాండులో హనుమంతునికి విశేష ప్రచారమున్నదనీ ఆయన వివరించారు.

ఆసియాలోని కళలు అనే తమ పత్రంలో కపిలా వాత్స్యాయన్‌గారు రామకథ సజీవంగా ఉన్నదనీ, సరయూ నదిలో రాముడు అదృశ్యుడైనట్లు చెప్పబడినా అతనికి మరణం లేదనీ తెలియజేశారు.

ముగింపు సమావేశానికి రాఘవన్‌గారు అధ్యక్షత వహించారు. ప్రతినిధులు తమ తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అప్పటి అకాదెమీ కార్యదర్శి ఆర్. యస్. కేల్కర్ గారి వందన సమర్పణతో రామాయణ సదస్సు ముగిసింది.

11

ఆరవ అంతర్జాతీయ రామాయణ సదస్సు

"రామాయణం ఒక్క భారతదేశానికే పరిమితమైన కావ్యం కాదు." ఇది ఒక కంబోడియా విద్వాంసుని అభిప్రాయం.

"మారిషస్‌లో ప్రామాణికమైన హిందీ రూపొందడానికి గోస్వామి తులసీదాసు రచించిన రామచరితమానస్ బహుధా ఉపకరించింది." మారిషస్ పండితుని అభిప్రాయ మిది.

"మారిషస్ తెలుగువారు చేసే రామభజన చూసి తీరవలసిందే. ఆ భజన చూస్తే మాటలకందని అనుభూతి కలుగుతుంది." ఇది మారిషస్ తెలుగు ప్రముఖుడు వెలిబుచ్చిన అభిప్రాయం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"సురినాంలో రామాయణ సంప్రదాయాలు హిందువుల్ని ఏకం చెయ్యడమే కాక, వారి సాంస్కృతిక ఐక్యతకు కూడా దారితీశాయి." సురినాం నుంచి వచ్చిన ఒక పండితుని మాట లివి.

పై అభిప్రాయాలను అలవోకగా పరిశీలించినా, ప్రవాస భారతీయులకు రామాయణం పట్ల ఆదరాభిమానాలు పుష్కలంగా కలవనే సత్యం విదిత మవుతుంది. భారతదేశ సీమా వధులు దాటి విదేశాలలో స్థిర నివాసాలు ఏర్పరచుకున్న భారతీయుల్ని సాంస్కృతికంగా ఏకం చేసిన కావ్యం రామాయణ మనే విషయం కూడా వ్యక్త మవుతుంచె.

మారిషస్‌లో మోకా అనే ప్రాతంలో నెలకొన్న మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్‌లో 1990 ఆగస్టు 5 నుంచి 8 దాకా జరిగిన ఆరవ అంతర్జాతీయ రామాయణ సదస్సులో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధుల ప్రసంగాలు విన్న తర్వాత, వారిలో కొందరితో మాట్లాడిన తర్వాత పై రెండు విషయాలు నాకు కొట్టవచ్చినట్లు తెలిశాయి.

రామాయణం అనగానే వాల్మీకి స్ఫురణకు రావడం పరిపాటి. అధ్యాత్మ, ఆనందాది రామాయణా లెన్నో సంస్కృతంలో వెలసినా కంబర్, గోన బుద్ధారెడ్డి, తులసీదాసు ప్రభృతులు తమ తమ భాషలలో రామకథను రచించినా అందరికీ రామకథాభిక్ష పెట్టిన ఆదరణీయుడు వాల్మీకి. ఆ మహానీయుడు సంతరించిన రామాయణం ఆదికావ్యంగా వినుతి కెక్కింది. కాని ప్రవాస భారతీయులకు వాల్మీకి చెప్పిన రామకథ కంటె, తులసీదాసు చెప్పిన రామకథే సుపరిచిత మన్న విషయం వారి ప్రసంగాలు విన్న నాకు స్పష్టంగా తెలియవచ్చింది. నిజానికి మనదేశంలో కూడా కంబరామాయణాంతర్గత విషయాలు తెలిసినంతగా తమిళులకు వాల్మీకి రామాయణ విశేషాలు తెలియవని చెప్పడం సత్యసన్నిహితం. అలాగే తెలుగువారికి రంగనాథ రామాయణంలో ఉడుతకథ, సులోచనా వృత్తాంతం మొదలైనవి ప్రీతి పాత్రాలు. హిందీ వారికి రామచరిత మానస్ పారాయణ గ్రంథం! దేశభాషా రామాయణాలకు విస్తృతమైన ప్రచారం కలిగేకొద్దీ వాల్మీకి రామాయణానికి ప్రచారం తగ్గు ముఖం పట్టడం అసహజం కాదు. కాని వాల్మీకి అంటే అందరికీ అంతులేని ఆదరభావమే. ఈ పరిస్థితే ప్రవాస భారతీయులలోనూ కనిపిస్తున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మహాసభ చర్చించిన విషయాలలో ప్రవాస భారతీయులలో రామాయణ సంప్రదాయాలు అన్నది ఒకటి. సాహిత్య పరంగా రామాయణ ప్రభావం, రామాయణంలో అభివ్యక్త మవుతున్న రాజనీతి, రామాయణంలోని ఆధ్యాత్మిక మత విషయాలు, జానపద సాహిత్యంలోని రామకథ, రామాయణం - సాహిత్య సంప్రదాయాలు, భారతదేశంలో వివిధ కళా రూపాలలో రామకథ, తెలుగు సాహిత్యంలో రామకథ, రామాయణానికి గల చారిత్రక ప్రాతిపదిక - ఇలా పెక్కు విషయాలు గురించి పత్రాలు సమర్పించడం జరిగింది. పత్ర పఠనానంతరం చర్చకు తగినంత వ్యవధి కల్పించబడివుంటే చాలా బాగుండేది. ఒక్కొక్కసారి పత్రంలోని ప్రధాన విషయాలు చర్చవల్ల సుస్పష్టము లవుతూ వుంటాయి; అలాంటి చర్చకు అవకాశం లేకపోవడం వల్ల ఎవరి సందేహాలు వారిలోనే ఉండిపోయాయి.

వివిధ భాషలలో. రామాయణాలు వెలసినా, తులసీదాసు రచించిన రామచరితమానస్ మారిషస్ హిందువుల్ని ప్రముఖంగా ఆకట్టుకున్నదని రాంయద్ (Ramyead) పేర్కొన్నారు. ఆ నాళ్లలో బీహారులో వాడుకలో వుండిన కైతీ లిపిలోని రామచరితమానస్ వ్రాత ప్రతియే తొలుత మారిషస్‌లో వాడబడేదనీ, తొలినాళ్లలో పాఠశాలల్లో రామచరితమానస్ నియతిగా చెప్పబడేదనీ, నీతి గ్రంథంగా పాఠ్య గ్రంథంగా మానస్ ఎంతగానో తోడ్పడిందనీ, మారిషస్‌లో ప్రామాణికమైన హిందీ రూపొందడానికి మానస్ తోడ్పడిందనీ, ఆ గ్రంథం చదవడం కోసమే మారిషస్‌లో చాలామంది హిందీ నేర్చుకుంటున్నారనీ ఆయన తమ ప్రసంగంలో పేర్కొన్నారు.

రామాయణ సంప్రదాయాలు నేటిదాకా సురినాంలో సజీవంగా ఉన్నాయనీ, అందుకు కారణం- తులసీదాసు రచన, వ్యావహారిక భాషలో రచించబడిన రామకథా సంబంధిత గేయాలనీ మోహన్ కె. గౌతం తమ వ్యాసంలో పేర్కొన్నారు. రామలీలా ప్రదర్శనం కూడా హేతువని ఆయన అన్నారు.

దక్షిణాఫ్రికా హిందువులలో తమిళం, హిందీ, గుజరాతీ, తెలుగు భాషలు మాట్లాడేవారున్నారనీ, హిందీ భాషీయులకు రామచరితమానస్ పరమ ప్రామాణికమైన గ్రంథమనీ, దక్షిణాఫ్రికాలోని రామాయణ సభలు రామక

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

థావ్యాప్తికి ఎంతగానో తోడ్పడ్డాయనీ, హిందీ మాండలికమైన అవధీలో రామచరితమానస్ రచించబడినా ఆ మాండలికం నేటి పాఠకులకు ప్రతి బంధకం కాలేదనీ, మానస్‌లోని విషయాలకే వారు ప్రాధాన్య మిస్తున్నారనీ, వేదోపనిషత్తులలోని విషయాలను మానస్ సామాన్యులకు కూడా తేటతెల్లం చేస్తుందనీ, గంగాజలాలవలె మానస్ అందరికీ హితవు కలిగించే గ్రంథంగా భావించబడుతున్నదనీ శ్రీమతి ఉషాదేవి శుక్లా తమ వ్యాసంలో పేర్కొన్నారు.

18,19 శతాబ్దాలలో భారతదేశం నుంచి యితరదేశాలకు వలస వెళ్లిన వారిలో చాలామందికి తులసీదాసు రామాయణంగా పేరుపెంపులు గడించిన రామచరితమానస్ నీతి పథప్రదర్శక గ్రంథంగా తోడ్పడిందనడంలో సందేహం లేదు. ఆ రోజులలో తమతో పాటు తీసుకువచ్చిన గ్రంథాలలో మానస్ అతి ముఖ్యమైంది. వారు తమ సాంఘిక, సాంస్కృతిక విధానాలను రూపొందించుకోడానికి కూడా ఆ గ్రంథం తోడ్పడింది. కనుకనే మారిషస్‌లో గాని, ఫిజీలో గాని, సురినాంలో గాని నివసించే హిందువుల జీవన విధానంలో రామచరితమానస్ ఒక భాగమై పోయింది. చివరికి 1960 ఆ ప్రాంతాలలో ఉత్తర అమెరికాకు తరలి వెళ్లిన హిందీ మాట్లాడే భారతీయులకు కూడా రామచరిత మానస్ ఒక దారి దివ్వెగా తోడ్పడుతున్నదని ఒక పండితుడు పేర్కొన్నాడు. రామచరిత మానస్‌కి రష్యన్ భాషలో కూడా ఒక అనువాదం (రూపాంతరం) వెలువడడం ప్రశంసార్హం. అనువాదకులు అలెక్సీ బరన్నికోవ్. ఆయన మనుమరాలు శ్రీమతి ఓల్గా బరన్నికోవ్ ఈ విషయం గురించి ఒక పత్రం సమర్పించారు. ఆధునిక భారతీయ భాషలలోని కావ్యాలు చాలా వరకు ప్రాచీన సంస్కృత కావ్యాల అనుసరణలుగా భారతీయ విద్వాంసులేకాక ఐరోపీయ పండితులు కూడా భావించడం జరుగుతున్నదనీ, అయితే బరన్నికోవ్ దీన్ని అంగీకరించలేదనీ, తన అభిప్రాయాన్ని సమర్థించుకునేందుకుగాను ఆయన రామచరితమానస్‌ని రష్యన్‌లోకి అనువదించారనీ ఆమె పేర్కొన్నారు. బరన్నికోవ్ ఎనిమిదేళ్లకు పైగా అనువాదకార్యంలో నిమగ్నులైనారనీ, రెండు వేలకు పైగా అధస్సూచికలు పొందుపరిచారనీ, తన అభిప్రాయాలను వివరిస్తూ ఆయన దీర్ఘమైన ఉపోద్ఘాతం వ్రాశారనీ ఆమె వివరించారు. అనువాదం ఎంత కష్టతరమైన కార్యమో యీ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విషయాదికం వ్యక్తం చేస్తుంది. తులసీదాసు కృతిని ఆంగ్ల వచనంలోకి అనువదించిన ఆర్. సి. ప్రసాద్ కూడా యిటువంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. పద్యానువాదం మరింత కష్టంతో కూడుకున్నదనీ, వచనానువాదాలే శ్రేయస్కరములనీ ఆయన అభిప్రాయం. సింగపూర్‌లోని హిందీ భాషీయులు కూడా రామచరితమానస్‌ను ప్రాణప్రదంగా సమాదరిస్తున్నారనీ, వారి దైనందిన జీవితం మానస్ పఠనంతో ప్రారంభమవుతుందనీ, ఆదివారాలలో వారు ఒకచోట చేరి మానస్‌లోని దోహాలను రాగయుక్తంగా చదువుతారనీ, ప్రస్తుతం సింగపూర్ పాఠశాలల్లో హిందీ బోధించబడుతున్నది కనుక విద్యార్థి లోకంలో కూడా మానస్ పట్ల ఆదరాభిమానాలు పెరుగుతాయనీ, ఇటీవల టి. వి. లో ప్రసారం చేసిన రామాయణాన్ని అర్థం చేసుకునేందుకు యువకులకు ఒక సదవకాశాన్ని కల్పించిందనీ శ్రీనివాస్ రాయ్ తమ పత్రంలో పేర్కొన్నాడు.

ఉపన్యాసకులలో చాలా మంది రామాయణ ప్రియులే కనుక వారు రామాయణ ప్రాశస్త్యాన్ని వివరించేందుకు ప్రయత్నించడం సహజమే. కాని బషీర్ అహమద్ "మయూఖ్" కూడా భక్తి ప్రపత్తులతో రామాయణం గురించి ప్రసంగించినప్పుడు నేను కొంచెం ఆశ్చర్యం చెందాను. సూఫీ వాదమూ - రామభక్తి ఉద్యమము అన్నది ఆయన ప్రసంగం. ఆయన హిందీలో మాట్లాడడం వల్ల ఆయన భావాలన్నిటినీ నేను సరిగా అర్థం చేసుకోలేకపోయాను. కాని ఆయన ప్రకటించిన హావభావాలు చూసి మురిసిపోయాను. ప్రముఖ హిందీ కవిగా పేరు గడించిన "మయూఖ్" క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నవాడు. ఆ తర్వాత సోషలిస్టు పార్టీలో చేరారు. సమైక్య వాదిగా కనిపించిన ఆయన జ్యోతిపథ్ అనే గ్రంథం వ్రాశారు. కురాన్, గీత, ఉపనిషత్తులు. గురుగ్రంథ్ మొదలైన పవిత్ర గ్రంథాలనుంచి కొన్ని భాగాలు ఎన్నుకుని వాటిని హిందీ కవితలుగా మలిచారు. రైతుగా కాలం గడుపుతున్న ఆయన మాట తీరు నన్ను ఆకట్టుకుంది. సగుణ, నిర్గుణ వాదాలు రెండింటినీ చక్కగా సమన్వయించి తులసీదాసు కృతి ప్రపంచంలోని హిందువుల్ని ఏకం చెయ్యడానికి తోడ్పడిందని ఆయన అభిప్రాయం వెలిబుచ్చారు.

మొత్తం మీద రామాయణ సదస్సు జయప్రదంగా జరిగినట్లే చెప్ప

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వచ్చు. ప్రవాస భారతీయులలో రామాయణ సంప్రదాయాలు అన్న ముఖ్య యితివృత్తాన్ని వివిధ దేశాల ప్రతినిధులు సుస్పష్టం చేశారనే నా అభిప్రాయం. మహాసభ సందర్భంగా దేవనాగరిలిపిలో శ్రీ రామ్ అని వ్రాయబడిన చిన్న కాగితం మేము ప్రయాణం చేసిన వ్యాన్లు, కార్లు మొదలైన వాటిలోనే కాక మేము దర్శించిన స్థలాలలో కూడా గోడలకు అంటించారు. రెండు గ్రామాలకు పంచవటి, చిత్రకూట్ అని నామకరణం చేశారు. రామాయణ ప్రదర్శన ఏర్పాటు చేశారు. రామలీలా ప్రదర్శనలు మొదలైనవి నిర్వహించారు. రామాయణ పఠనం వర్ణచిత్రాలు మొదలైన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలియ జేశారు. వివిధ దేశాల నుంచి 200 మంది పైగా ప్రతినిధులు మహాసభలో పాల్గొన్నారు. కాగా, మహాసభ సందర్భంగా మారిషస్‌లో రామాయణ వాతావరణం నెలకొన్నది. ఇలా రామాయణ స్పృహ కలిగించిన ఆరవ అంతర్జాతీయ రామాయణ మహాసభా నిర్వాహకులు ప్రశంసనీయులు. మారిషన్ ప్రభుత్వం వారూ, భారతదేశంలోని విశ్వసాహిత్య సంస్కృతి సంస్థాన్ వారూ నిర్వాహకులు. ఏడవ అంతర్జాతీయ రామాయణ సమ్మేళనం వచ్చే అక్టోబరులో సురినాంలో జరుగుతుందని విశ్వసాహిత్య సంస్కృతి సంస్థాన్ ప్రధాన కార్యదర్శి ప్రకటించారు.

ఆరవ అంతర్జాతీయ మహాసభ జయప్రదంగా జరగడానికి మారిషన్ ప్రముఖులే కాక, గవర్నర్ జనరల్ సర్ వీరాస్వామి రింగడు గారు, ప్రధానమంత్రి సర్ అనిరుథ్ జగన్నాథ్ గారు, విద్య, కళలు సంస్కృతి మంత్రి వర్యులు శ్రీ ఎ. పరశురామన్ గారు ప్రభృతులు కారణభూతులు. గవర్నర్ జనరల్ గారు రామాయణ ప్రదర్శనాన్ని ప్రారంభించగా మహాసభను పరశురామన్‌గారు ప్రారంభించారు.

మారిషన్ దేశానికి ఆ పేరు ఎలా వచ్చిందో తెలియజేసే ఒక కథను సంగ్రహంగా తెలుపుతూ ఈ వ్యాసం ముగిస్తాను. ఈ కథకు మారిషన్ విదుషి శ్రీమతి యస్. రాందిన్ తమ ప్రసంగ వ్యాసంలో పేర్కొన్నారు.

రాముడు వేసిన బాణపు దెబ్బకు మారీచుడు నేలకు ఒరిగాడు. "ప్రభూ, నాకో వరం ప్రసాదించాలి" అని మరణించనున్న మారీచుడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అడిగాడు. "అలాగే" అన్నాడు రాముడు. "నా చెవులలో నీ నామం ఎప్పుడూ ప్రతిధ్వనిస్తూ వుండాలి." ఇదీ మారీచుడు అడిగిన వరం. రాముని కరస్పర్శతో మారీచుని శరీరం ముత్యంగా మారిపోయింది. రాముడా ముత్యం తీసుకుని బలం కొద్దీ సముద్రంలోకి విసిరివేశాడు. అది పడ్డచోట ముత్యాకారంలో ఒక ద్వీపం ఏర్పడింది. ఆ ద్వీపాన్ని భోజ్‌పురి మాట్లాడే భారతీయులు "మారీచ తపు" అని వ్యవహరించసాగారు. భోజ్‌పురీలో మారీచ ద్వీపం అని అర్థం. అదే వారు మారిషస్‌కి పెట్టిన పేరు.

మారిషస్ నుంచి బొంబాయికి బయలుదేరిన నేను మనస్సులో అనుకున్నాను. "దేశాలు వేరయినా మనుషులు ఒకటే. ఎవరి విశ్వాసాలు వారివి. ఎక్కడెక్కడి వారినీ కలుపుతున్న రామకథ నిజానికి ఒక్క భారతదేశానికే పరిమితమయింది కాదు."

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాధాకృష్ణ రచనావళి

తెలుగు :

తెలుగు విందు (వ్యాసాలు)
వ్యాస మంజూష ”
మదరాసు తెలుగు ”
వేమన సూక్తులు ”
దళవాయి రామప్పయ్య (నవల)
రాణి మీనాక్షి ”
జయించిన జనత (కవిత)
శాంతిసూక్తం ”
ఆర్తిగీతాలు ”
శ్రమలో స్వర్గం ”
సి.పి. బ్రౌన్ సాహితీసేవ (విమర్శ)
ఆడపిల్ల తండ్రిని (కథానికలు)
శ్రీ విజయం (నాటికలు)
రాజభక్తి ”
చరిత్రకెక్కిన చరితార్థులు,
3 భాగాలు (జీవిత చరిత్రలు)
చందమామ (పిల్లల గేయాలు)
వాన కురిసింది ”
అనగనగా (పిల్లల కథలు)
దయావీరులు ”
మణి మంజీరము
తమిళ వేదము
తమిళ పంచకావ్య కథలు
తమిళ సాహిత్య చరిత్ర
తరతరాల తమిళ కవిత
తమిళ విందు (వ్యాసాలు)
భారతి కవిత
గరిమెళ్ల సాహిత్యం
సుబ్రహ్మణ్య భారతి
తెలుగు-దాక్షిణాత్య సాహిత్యాలు
ఆధునిక తమిళ సాహిత్య
నిర్మాతలు (జీవిత చరిత్రలు)

అనువాదాలు :

తిరుక్కురళ్
ఆత్మ చింతనము
తమిళ కథానికలు
చిట్టికి చిరుగంట
రంగురంగుల పూలు
దారిచూపిన తాత : గాంధి
మా తాతయ్యకొక యేనుగుండేది
అనంత శయనం
భారతి వచన రచనలు
భారతి మొ||వి

తమిళం :

ఆయిరం తలైనాగం
తెలుంగు ఇలక్కియప్పులకణి
తెలుంగు ఇలక్కియ విరున్దు (వ్యాసాలు)

ఆంగ్లం :

The Ramayana in Telugu and Tamil: A study
Landmarks in Telugu Literature
Tales from Telugu
Ramblings in Telugu Literature
Palkuriki Somanatha
Collected Essays of Prof. C.R. Sarma

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

GURUKUL KANGRI LIBRARY
Acces on 28/5/83
Class on
Cat on
Tag etc.
Checked
Any Other

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఎండిపోవు నదులు, బండలు కావచ్చు
గిరులు, కూల వచ్చు తరులు, కాని
పెరుగుదలయె తప్ప తరుగన్నది తెలియ
నట్టి రామకథ మహాద్భుత కథ!
రామాయణం అనంతకం!

రామాయణం మానవజాతికి చెందిన దస్తావేజు! విశ్వసాహిత్యానికి భారతీయులు ప్రసాదించిన ఉత్తమ రచన రామాయణం! నిజానికి అది ఒక్క భారత దేశానికే పరిమిత మైన కావ్యం కాదు.

అపారమైన రామకథా సాహిత్యాన్ని స్థూలా రుంధతీ న్యాయంగానైనా తెలపడమే ఈ పుస్తక ధ్యేయం!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar